సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 6.50
సంపుటి: 16
సంచిక: 183
సోమవారం 18-3-2024


'గ్రామాల్లో సంపద పెరగాలి. పెరిగిన సంపద గ్రామీణ ప్రజలకే చెందాలి'


చాంపియన్ బెంగళూరు
డబ్ల్యూపీఎల్ ఫైనల్లో 8 వికెట్ల తేడాతో ఢిల్లీ క్యాపిటల్స్‌పై గెలుపు - 12లో


'పేరు' మార్చుకుంటున్నారా..?
అన్ని డాక్యుమెంట్లలోనూ సవరణ తప్పదు.. ముందుచూపుతో వ్యవహరించాలి - 13లో

SIMULTANEOUSLY PRINTED AT BANGALORE | CHENNAI | DELHI | VIJAYAWADA | HYDERABAD | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL


బాండ్ల వివరాలు బహిర్గతం
ఎన్నికల బాండ్లపై రాజకీయ పార్టీలు ఇచ్చిన సమాచారాన్ని ఎన్నికల సంఘం తన వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తీసుకొచ్చింది.
వివరాలు 6లో ▸


అవి లేకుంటే మోదీ నెగ్గలేడు
ఈవీఎంలు, ఈడీ, సీబీఐ, ఐటీ లేకుండా ఎన్నికల్లో నెగ్గడం మోదీ తరం కాదని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ అన్నారు.
వివరాలు 6లో ▸


కేజ్రీవాల్‌కు మరో కేసులో సమన్లు
ఢిల్లీ జల్ బోర్డు(డీజేబీ)లో అవకతవకలపై విచారణకు రావాలంటూ ఈడీ అధికారులు ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌కు సమన్లు జారీ చేశారు.
వివరాలు 6లో ▸



సీఏఏపై స్టే ఇవ్వండి
పౌరసత్వ సవరణ చట్టం(సీఏఏ)అమలుపై స్టే ఇవ్వాలని కోరుతూ కేరళ ప్రభుత్వం మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయించింది.
వివరాలు 6లో ▸

జయహో 'బీసీ'

అసెంబ్లీ, లోక్‌సభ కలిపి 59 స్థానాలను ఆ వర్గాలకు కేటాయించిన సీఎం జగన్

గత ఎన్నికల కంటే ఇప్పుడు 11 స్థానాలు అధికం

- దేశ చరిత్రలో బీసీలకు ఈ స్థాయిలో సీట్లు కేటాయించిన దాఖలాలు లేవంటున్న సామాజికవేత్తలు
- గత 58 నెలల పాలనలో వారిని సమాజానికి వెన్నెముకగా తీర్చిదిద్దిన ముఖ్యమంత్రి
- 2019, ఫిబ్రవరి 17న ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లో చెప్పిన దానికంటే ఆ వర్గాలకు అధికంగా న్యాయం
- మంత్రివర్గం నుంచి నామినేటెడ్ పదవుల వరకూ సమున్నత స్థానం
- డీబీటీ, నాన్ డీబీటీ రూపంలో వారికి రూ.1.73 లక్షల కోట్ల ప్రయోజనం
- ఇలా చెప్పిన దానికంటే అధికంగా న్యాయం చేసిన జగన్ నాయకత్వాన్ని బలపరుస్తున్న బీసీలు
- భీమిలి, దెందులూరు, రాప్తాడు, మేదరమెట్ల సిద్ధం సభల్లో అది తేటతెల్లం
- అదే 2012లో బీసీ డిక్లరేషన్‌లో ఇచ్చిన హామీలన్నింటికీ చంద్రబాబు పాతర



2 లో

- కనీసం కేబినెట్‌లో కూడా ప్రాధాన్యత లేదు.. పైగా ఒక్క బీసీని రాజ్యసభకు పంపని టీడీపీ అధినేత
- బీసీలు న్యాయమూర్తులుగా పనికిరారని.. తోకలు కత్తిరిస్తానంటూ ఆ వర్గాలను హేళన చేసిన బాబు
- ఇప్పుడు కేవలం 24 అసెంబ్లీ స్థానాలు కేటాయించడంతో మరోసారి ఆయన తమను వంచించారంటూ ఫైర్.. తమ వెన్నువిరిచిన చంద్రబాబు నాయకత్వంపై బీసీల్లో ఆగ్రహావేశాలు
- ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదలు వైఎస్సార్‌సీపీ వెంట నడుస్తుండటంతో ఎన్నికల్లో వార్ వన్‌సైడే అంటున్న విశ్లేషకులు

ఫ్యాక్ట్‌చెక్
ఎందుకీ 'తొందరపాటు'?

- ఎగువ సీలేరు పీఎస్పీపై ఈనాడు విషయం లేని కథనం
- నిబంధనల మేరకే ప్రాజెక్టు పనుల అప్పగింత
- 2022 సెప్టెంబరు ధరల ప్రాతిపదికన ఎగువ సీలేరు పీఎస్పీకి డీపీఆర్
- అదీ కేంద్ర ప్రభుత్వ సంస్థ వ్యాప్కోస్ తయారు చేసినది
- ఏటా 6 శాతం ధరల పెరుగుదల ఉంటుంది
- ఈ ప్రాజెక్టు దక్కించుకున్న మేఘా సంస్థ కోట్ చేసింది 9.87 శాతం
- 6% ధరల పెరుగుదల పోను మేఘా కోట్ చేసింది స్వల్పమే
- పకడ్బందీగా ఆన్‌లైన్ టెండర్ల ద్వారా బిడ్ల స్వీకరణ

3 లో

రాష్ట్రంలో జగన్ పార్టీ, కాంగ్రెస్ ఒక్కటే

రెండు పార్టీలనూ ఒకే కుటుంబ సభ్యులు నడుపుతున్నారు
ప్రభుత్వ వ్యతిరేక ఓటు ఎన్డీఏకి పడకుండా ఇద్దరూ కుమ్మక్కయ్యారు

- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి కుంటుపడింది
- 400కు పైగా సీట్లతో ఎన్డీఏను గెలిపించండి.. ఏపీలో డబుల్ ఇంజిన్ సర్కార్ రావాలి
- ఎన్డీఏని గెలిపిస్తే రాష్ట్రాభివృద్ధికి పునాది వేస్తాం.. మహిళలు, యువతకు కొత్త అవకాశాలు
- దేశంలోని ఎన్డీఏ ప్రభుత్వం పేదల కోసమే పని చేస్తుంది
- స్వార్థ ప్రయోజనాల కోసమే ఇండియా కూటమి
- చిలకలూరిపేట శివారు బొప్పూడి ఎన్డీఏ సభలో ప్రధాని మోదీ

10 లో



మరో ఫ్లాప్ షో.. ప్రజాగళం
ప్రధానికి అవమానంతో మొదలైన ఎన్డీఏ తొలి సభ
లక్ష మంది కూడా లేక వెలవెలబోయిన సభ

10 లో

అవకాశవాద కూటమికి ఓటేందుకు వేయాలి?
జెండాలు కలిపింది అధికారం కోసమే
రాష్ట్ర ప్రయోజనాల కోసం కాదని ప్రజాగళం సభతో తేటతెల్లం.. సభ నిర్వహించడమే చేత కాదు.. జగన్‌పై యుద్ధం చేస్తారా?
వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పేర్ని నాని ధ్వజం



అరుణాచల్, సిక్కిం ఓట్ల లెక్కింపు తేదీ మార్పు
జూన్ 4న జరగాల్సిన కౌంటింగ్ జూన్ 2కు మార్పు
ఎన్నికల సంఘం ప్రకటన
- వివరాలు 6లో



నేటి నుంచి పదో తరగతి పరీక్షలు


30వ తేదీ వరకు జరగనున్న ఎగ్జామ్స్
పరీక్షలు రాయనున్న 6,23,092 మంది విద్యార్థులు

వీరిలో 3,17,939 మంది బాలురు, 3,05,153 మంది బాలికలు
విద్యార్థులకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం
3,473 సెంటర్ల ఏర్పాటు.. 'నో ఫోన్ జోన్'గా పరీక్ష కేంద్రాలు
మాస్ కాపీయింగ్ కట్టడికి ప్రత్యేకంగా డిజిటల్ టెక్నాలజీ వినియోగం
31 నుంచి ఏప్రిల్ 8 వరకు స్పాట్ వ్యాల్యూయేషన్.. ఆ తర్వాత ఫలితాలు

14 లో

తేలని సీట్లు.. బాబుకు పాట్లు

ఎటూ తేల్చలేక చంద్రబాబు సతమతం



బలమైన అభ్యర్థులు దొరకకపోవడమే కారణం
ఉత్తరాంధ్ర పెండింగ్ సీట్లపై దోలాయమానం
తేలని మైలవరం, పెనమలూరు పంచాయితీ
ఆలూరు, గుంతకల్లు సీట్లపైనా నాన్చుడే
టికెట్ల ఖరారులో బీజేపీ, జనసేనదీ అదే తీరు

అధికారంకోసం వెంపర్లాడుతున్న చంద్రబాబు అభ్యర్థుల ఎంపికలో అవస్థలు పడుతున్నారు. కూటమిని కూడగట్టడానికి అడ్డదారులు తొక్కి టిక్కెట్ల ఖరారులో విఫలమయ్యారు. ఎన్నికల షెడ్యూల్ విడుదలైనా ఇప్పటికీ 16 స్థానాల్లో సరైన వ్యక్తులు దొరక్క సతమతమవుతున్నారు. ఇప్పటికే తాము గెలవలేమని నిర్ణయించుకున్న స్థానాలు మిత్ర ధర్మం అంటూ జనసేన, బీజేపీకి అప్పగించిన ఆయన సొంత స్థానాలకు వచ్చేసరికి చతికిలబడుతున్నారు. రకరకాల సర్వేల పేరుతో నాన్చుడు ధోరణి అవలంబిస్తూ... ఆశావహులను దోలాయమానంలో పడేస్తున్నారు.

5 లో

ఇకపై బర్త్ సర్టిఫికెట్
తప్పనిసరి



- అక్టోబర్ 1, 2023 తర్వాత పుట్టిన వారికి కేంద్రం కొత్త చట్టం
- వ్యక్తి పుట్టిన తేదీ, ప్రదేశం నిరూపించే ఏకైక పత్రం అదే
- విద్యా సంస్థల్లో ప్రవేశంతో పాటు నియామకాలు సహా దేనికైనా అదే ప్రధానం
- పాస్‌పోర్ట్, ఆధార్, డ్రైవింగ్ లైసెన్స్ జారీ, ఓటరు, వివాహం నమోదుకు అది తప్పనిసరి
- ఆస్పత్రులు, మున్సిపాలిటీలు, పంచాయతీల్లో మొత్తం 14,752 నమోదు యూనిట్లు
- జనన, మరణ ధ్రువీకరణ సర్టిఫికెట్లను వారంలో ఇవ్వాలి
- కలెక్టర్లకు సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశాలు

3 లో

ఉపాధి కూలీకి మడకశిర టికెట్


లక్కప్ప

- ఈర లక్కప్పకు ఊహించని చాన్స్
- టిప్పర్ డ్రైవర్ వీరాంజనేయులుకు సింగనమల నుంచి అవకాశం
- సామాన్యుడు సర్నాల తిరుపతి రావుకు మైలవరం టికెట్
- సామాన్యులను చట్టసభలకు పంపాలన్నదే జగన్ సంకల్పం
- రూ.కోట్ల సంచులు చూపించిన వారికే బాబు టికెట్లు

2 లో

ఇదండీ సంగతి



అన్ని ప్రయత్నాలు చేశాం సార్! చివరి ప్రయత్నాలుగా ఇలాంటివి ఫాలో అవడం బెటర్ !

ఫుడ్ ప్రాసెసింగ్‌కు జీఐఎస్ బూస్ట్

కార్యరూపం దాలుస్తున్న ఒప్పందాలు
ఏడాది తిరక్కుండానే మెజార్టీ పరిశ్రమల ఏర్పాటు



రూ.1,350 కోట్ల విలువైన 4 పరిశ్రమల్లో ఉత్పత్తి ప్రారంభం.. ఏటా 11.90 లక్షల టన్నుల ఉత్పత్తి
5,380 మందికి ఉపాధి, 23 వేల మంది రైతులకు లబ్ధి.. ఉత్పత్తి దిశగా మరో ఆరు పరిశ్రమలు
వీటి ద్వారా మరో 3.38 లక్షల టన్నుల ఉత్పత్తి
2,180 మందికి ఉపాధి
24,100 మంది రైతులకు లబ్ధి

సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్ ఆహార శుద్ధి పరిశ్రమల హబ్‌గా ఆవిర్భవిస్తోంది. ఇప్పటికే పలు రకాల వ్యవసాయ, ఉద్యాన పంటలతోపాటు పాడి, మత్స్య ఉత్పత్తుల్లో అగ్రస్థానంలో ఉన్న ఏపీ ఆహారశుద్ధిలోనూ అగ్రగామిగా నిలుస్తోంది. దీనికోసం రాష్ట్ర ప్రభుత్వం చేసిన కృషి సత్ఫలితాలనిస్తోంది. గతేడాది విశాఖ వేదికగా జరిగిన గ్లోబల్ సమ్మిట్(జీఐఎస్)లో జరిగిన మెజార్టీ ఒప్పందాలు ఏడాది తిరగకుండానే కార్యరూపం దాలుస్తున్నాయి. ఈ సదస్సులో రూ.5,765 కోట్ల విలువైన 33 ఒప్పందాలు జరగ్గా, వీటి ద్వారా ప్రత్యక్షంగా 12,600 మందికి, పరోక్షంగా మరో 20 వేల మందికి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లభించనున్నాయని అంచనా వేశారు. ఇప్పటికే వీటిలో రూ.1,350 కోట్ల పెట్టుబడితో ఏటా 11.90 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో నాలుగు మేజర్ పరిశ్రమలు ఉత్పత్తి ప్రారంభించగా, వీటి ద్వారా పరోక్షంగా 5,380 మందికి

మిగతా 5వ పేజీలో ▶

30 లక్షల మందికి సేవల దిశగా
ఆరోగ్య సురక్ష-2

విజయవంతంగా జగనన్న ఆరోగ్య సురక్ష

రెండో దశలో 7,974 శిబిరాలు పూర్తి
ఒక్కో శిబిరంలో సగటున 362 మందికి వైద్య సేవలు
ఇప్పటి వరకు వైద్య సేవలు అందుకున్న 28.79 లక్షల మంది

సాక్షి, అమరావతి: ప్రజారోగ్య పరిరక్షణకు పెద్దపీట వేస్తూ ప్రతి ఒక్కరి ఆరోగ్య సమస్యను పరిష్కరించే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన 'జగనన్న ఆరోగ్య సురక్ష (జేఏఎస్)' కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా విజయవంతంగా కొనసాగుతోంది. 30 లక్షల మందికి వైద్య సేవల దిశగా రెండో దశ ఆరోగ్య సురక్ష కార్యక్రమం (జేఏఎస్-2) కొనసాగుతోంది. ఈ ఏడాది జనవరిలో ప్రారంభమైన రెండో దశ కార్యక్రమంలో నిర్దేశిత షెడ్యూల్ మేరకు గ్రామాలు, వార్డుల్లో శిబిరాలను ఏర్పాటు చేసి, స్పెషలిస్ట్ వైద్యుల ద్వారా

మిగతా 5వ పేజీలో ▶



ఉపాధి కూలీకి మడకశిర టికెట్

సామాన్యులను చట్టసభలకు పంపాలన్నదే జగన్ సంకల్పం

సామాన్యులు, పేదలు చట్ట సభల ప్రతినిధులైనప్పుడే వ్యవస్థకు మరింత ప్రయోజనం చేకూరుతుందన్నది ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్ నమ్మకం. ఆ లక్ష్యంతోనే ఈ సారి సాధారణ ఎన్నికల్లో సామాన్యులకు టికెట్లు కేటాయించారు. ఈ అభ్యర్థులంతా నిన్న మొన్నటి వరకు నిత్యం ప్రజా సంబంధాల్లో, సేవలో నిమగ్నమైన వారే కావడం విశేషం. ఎన్నికల్లో పోటీ చేయాలంటే రూ.కోట్లకొద్దీ డబ్బుండాలి. కానీ ఇక్కడ సీఎం జగన్ నోట్ల కట్టలు చూడలేదు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకున్నారు. అదే ప్రామాణికంగా సీట్లు కేటాయించారు. రూ.కోట్లు ఇస్తే కానీ సీటు ఇవ్వలేమని టీడీపీ తెగేసి చెబుతుంటే... జగన్ మాత్రం పేదలకే పెద్దపీట వేశారు. ఈసారి ఎస్సీ రిజర్వుడు స్థానాల్లో ఇద్దరు నిరుపేదలకు టికెట్లిచ్చి రికార్డు సృష్టించారు. - సాక్షి, అమరావతి

ఉపాధి కూలీకి, టిప్పర్ డ్రైవర్‌కు టికెట్లు

మడకశిర అభ్యర్థిగా ఎంపిక చేసిన ఈర లక్కప్ప (మాదిగ) ఉపాధి కూలీ. రెండు గదుల పక్కా గృహంలో ఉంటున్న అతనిని పిలిచి మరీ టికెట్ ఇవ్వడం విశేషం.

శింగనమల అభ్యర్థిగా ప్రకటించిన వీరాంజనేయులు కూడా సాధారణ దిగువ మధ్యతరగతి కుటుంబానికి చెందినవారే. టిప్పర్ డ్రైవర్‌గా ఉన్న ఈయనకు ఆస్తులేమీ లేవు.





మైలవరం స్థానానికి ఎంపిక చేసిన సర్నాల తిరుపతిరావు సామాన్య రైతు కుటుంబానికి చెందిన వ్యక్తి. పదో తరగతి వరకు చదువుకున్నారు. తండ్రి సర్నాల చిన్న జమలయ్య సహకార బ్యాంకులో అటెండర్‌గా పని చేస్తున్నారు. రాజకీయాలపై ఆసక్తితో 2014 నుంచి 2019 వరకు వైఎస్సార్‌సీపీ మైలవరం మండల సెక్రటరీగా పని చేశారు. 2021లో మైలవరం జెడ్పీటీసీ అభ్యర్థిగా బరిలోకి దిగి 16 వేల ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

అభాగ్యులకు అండ దండ 'దద్దాల'



కనిగిరి నుంచి వైఎస్సార్‌సీపీ తరఫున టికెట్ దక్కించుకున్న దద్దాల నారాయణ యాదవ్ విద్యార్థి దశ నుంచే వైఎస్సార్ అభిమాని. 2014, 2019 ఎన్నికల్లో కీలకంగా వ్యవహరించారు. 2021 స్థానిక సంస్థల ఎన్నికల్లో హనుమంతునిపాడు జెడ్పీటీసీగా పోటీ చేసి 8,900 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. 2007 నుంచి సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేస్తున్నారు. దద్దాల చారిటబుల్ ట్రస్టును స్థాపించి అభాగ్యులకు అండగా నిలిచి ఎంతో మందికి ఆర్థిక సాయం చేశారు.

సేవాభావం తాటిపర్తి తత్వం



యర్రగొండపాలెం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా పార్టీకి సేవలు అందించారు. 2024లో తొలిసారిగా యర్రగొండపాలెం నియోజకవర్గం నుంచి వైఎస్సార్‌సీపీ తరఫున బరిలోకి దిగుతున్నారు. తాటిపర్తి చారిటబుల్ ట్రస్ట్ పేరుతో వేసవి కాలంలో కొండపి నియోజకవర్గంలోని అనేక ప్రాంతాల్లో మినరల్ వాటర్ క్యాంపులు నిర్వహించారు. రోగగ్రస్తులకు, హెచ్ఐవీ బాధితులు, వితంతువులకు ఆర్థిక సహాయం అందించడంతో పాటు రక్త శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు.

చేతిలో పైసాలేని డాక్టర్ దాసరి సుధ..



బద్వేల్ ఎమ్మెల్యేగా ఉన్న వెంకటసుబ్బయ్య మృతి చెందటంలో ఆయన భార్య డాక్టర్ దాసరి సుధా ఉప ఎన్నికల్లో పోటీ చేసి గెలిచారు. గెలిచిన మరుక్షణం నుంచి ఆమె నిత్యం ప్రజాసేవలో నిమగ్నమై పని చేస్తున్నారు. సాధారణంగా ఎవరైనా ఒక్కసారి ఎమ్మెల్యేగా గెలిస్తే ఐదు తరాలకు సరిపడా డబ్బు సంపాదించి వెనకేసుకుంటారు. కానీ డాక్టర్ సుధా ప్రజాసేవే పరమావధిగా సాగారు. అందుకే ఆమెకే టిక్కెటివ్వాల్సిందిగా బద్వేల్ ప్రజలు వైఎస్సార్‌సీపీ అధినాయకత్వంపై ఒత్తిడి చేశారు. ఆమె నిజాయితీ, కర్తవ్య దీక్ష గమనించిన సీఎం జగన్ ఆమె కుటుంబానికి అన్ని విధాలా అండదండలు అందిస్తున్నారు.

సేవా తత్పరుడు అంబటి



సామాజిక సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చి భజరంగ్ ఫౌండేషన్‌ను అంబటి మురళీకృష్ణ స్థాపించారు. భజరంగ్ ఫౌండేషన్ వారు తలసేమియా రహిత ఆంధ్రప్రదేశ్ కోసం కృషి చేస్తున్నారు. పొన్నూరు నియోజకవర్గంలోని 52 గ్రామాల్లో నేత్ర, గుండె, దివ్యాంగ, ఫిజియోథెరపీ వంటి ఉచిత వైద్యశిబిరాలు నిర్వహించి అనేక వేలమందికి ఉచిత కంటిపరీక్షలు నిర్వహిస్తున్నారు. తద్వారా ఆయన ప్రజల్లో మంచి పేరు తెచ్చుకొన్నారు. ఇప్పుడు పొన్నూరు వైఎస్సార్‌సీపీ అభ్యర్థిగా పోటీ చేస్తున్నారు.

జగన్ గెలుపు బీసీల బాధ్యత

బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య



సాక్షి, అమరావతి: ఆంధ్రప్రదేశ్‌లో బీసీలకు జరుగుతున్న మేలు కొనసాగాలంటే సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డిని మరోసారి గెలుపించుకోవాల్సిన గురుతర బాధ్యత బీసీ వర్గాలపై ఉందని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య అన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, ఎంపీ అభ్యర్థుల జాబితాలో బీసీలకు అగ్రపీఠం వేయడంపై ఆదివారం ఆయన హర్షం వ్యక్తం చేశారు. సార్వత్రిక ఎన్నికల్లో 50 శాతం సీట్లు కేటాయించడం ద్వారా సీఎం వైఎస్ జగన్ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పక్షపాతి అని మరోసారి నిరూపించుకున్నారని అన్నారు. ఒక్క బీసీలకే ఏకంగా 48 ఎమ్మెల్యే, 11 ఎంపీ సీట్లు ఇవ్వడం దేశ చరిత్రలోనే గొప్ప రికార్డు అన్నారు. బీసీ నేతలు ఉన్న బిహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో సైతం ఆంధ్రప్రదేశ్ మాదిరిగా బీసీలకు ఇన్ని సీట్లు ఇవ్వలేదని అన్నారు. ఇప్పటికే బీసీలకు నామినేటెడ్ పదవులు, నామినేషన్ పనుల్లో 50% కేటాయిస్తూ చట్టం తెచ్చిన గొప్ప దార్శనికుడు సీఎం జగన్ అని పేర్కొన్నారు. అధికారంలోకి వచ్చిన తొలి రోజు నుంచి ఇప్పటి వరకు ప్రతి సందర్భంలోనూ సామాజిక న్యాయానికి సరికొత్త నిర్వచనం చెబుతూ సీఎం జగన్ అన్ని విధాలా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు అండగా నిలిచారన్నారు. బీసీల కోసం ఎంతో చేస్తున్న సీఎం జగన్ పాలన కొనసాగేలా అండగా నిలిచి మళ్లీ గెలిపించుకోవాల్సిన బాధ్యత బీసీ వర్గాలపై ఉందన్నారు. జగన్ గెలుపు బీసీల అభివృద్ధి, సంక్షేమానికి గొప్ప మలుపు అని కృష్ణయ్య పిలుపునిచ్చారు.

ఓటమి భయంతో వెలగపూడి తప్పుడు ఫిర్యాదు

తనిఖీ నిర్వహించి తప్పుడు ఫిర్యాదుగా తేల్చిన ఆర్డీవో భాస్కర్‌రెడ్డి

కొమ్మాది (విశాఖ): విశాఖ తూర్పు నియోజకవర్గంలో టీడీపీ అభ్యర్థి వెలగపూడి రామకృష్ణబాబు ఫేక్ ఫిర్యాదులతో తన బుద్ధిని మరోసారి చాటుకున్నారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ ప్రచారంలో దూసుకుపోతూ ప్రజల మన్ననలు పొందుతుండడంతో వెలగపూడి తన వంకర బుద్ధి చూపించారు. ఎండాడలోని ఎంవీవీ గ్రీన్ గార్డెన్ అపార్ట్‌మెంట్‌లో ఓటర్లను ప్రలోభపెట్టడానికి ఎం.వి.వి.సత్యనారాయణ నగదు, క్రికెట్ కిట్లు, డ్రెస్ మెటీరియల్స్ సిద్ధంగా ఉంచారని సీఈఓ కార్యాలయానికి వెలగపూడి ఫిర్యాదు చేశాడు. ఆదివారం సాయంత్రం ఆర్డీవో భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో భీమిలి, ఈస్ట్ పోలీసుల బృందాలు ఈ అపార్ట్‌మెంట్ 5 ఫ్లోర్లలో 65 ఫ్లాట్లను, వాహనాలను సుమారు 5 గంటల పాటు రెవెన్యూ, పోలీస్, జీవీఎంసీ సిబ్బందితో కలిసి తనిఖీలు నిర్వహించాయి. తనిఖీల్లో నగదు, క్రికెట్ కిట్లు, ఇతర సామగ్రి ఎక్కడా లభ్యం కాలేదు. సీఈవో ఆఫీస్‌కు వెలగపూడి రామకృష్ణ ఈ బిల్డింగ్ ఫొటోతో ఫిర్యాదు ఇవ్వడంతో తనిఖీలు నిర్వహించామని, ఎటువంటి సామగ్రి లభ్యం కాలేదని ఆర్డీవో భాస్కర్‌రెడ్డి వెల్లడించారు. కోడ్ వచ్చిన తరువాత తమకు అందిన మొదటి ఫిర్యాదు అని తెలిపారు. ఈ తనిఖీల్లో జోన్-2 జోనల్ కమిషనర్ శైలజవల్లి, జోన్-3 జోనల్ కమిషనర్ విజయలక్ష్మి పాల్గొన్నారు.



తనిఖీలు నిర్వహిస్తున్న ఆర్డీవో భాస్కర్‌రెడ్డి

జయహో బీసీ

అసెంబ్లీ, లోక్‌సభ కలిపి 59 స్థానాలు కేటాయించిన సీఎం జగన్

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో గత 58 నెలలుగా సమాజానికి వెన్నెముకగా బీసీలను తీర్చిదిద్దుతున్న ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రానున్న సార్వత్రిక ఎన్నికల్లో వారికి 48 శాసనసభ, 11 లోక్‌సభ స్థానాలు వెరసి మొత్తం 59 స్థానాలు కేటాయించి వారికి పెద్దపీట వేశారు. తద్వారా తన భవిష్యత్తు ప్రణాళికను కూడా ఆయన సుస్పష్టం చేశారు. ఉమ్మడి రాష్ట్రంలో 294 శాసనసభ, 48 లోక్‌సభ స్థానాలు ఉన్నప్పుడు కూడా ఈ స్థాయిలో బీసీలకు ఎవరూ అవకాశం ఇచ్చిన దాఖలాల్లేవు. ఉత్తరప్రదేశ్‌లో బీసీ నేత అఖిలేష్ యాదవ్ నేతృత్వంలోని సమాజ్‌వాదీ పార్టీ (ఎస్పీ), తమిళనాడులో స్టాలిన్ నేతృత్వంలోని డీఎంకే కూడా సీఎం జగన్ ఇచ్చిన రీతిలో బీసీలకు అవకాశం ఇవ్వలేదని.. దేశ చరిత్రలో ఇదో రికార్డు అని సామాజికవేత్తలు ప్రశంసిస్తున్నారు. నిజానికి.. రాష్ట్ర విభజనకు ముందు 2012, జూలై 9న ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లో చంద్రబాబు ఇచ్చిన హామీల్లో ఏ ఒక్క హామీనీ ఆయన అధికారంలోకి వచ్చాక అమలుచేయకుండా తమను వంచించారని బీసీలు రగలిపోతున్నారు. అదే వైఎస్ జగన్ గత ఎన్నికలకు ముందు 2019, ఫిబ్రవరి 17న ఏలూరులో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌లో తమకు చెప్పిన దానికంటే అధికంగా చేస్తుండడంపై బీసీలు హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు చంద్రబాబును ఛీకొట్టగా.. బీసీలు కూడా తమను రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అక్కున చేర్చుకున్న సీఎం జగన్‌కు జేజేలు పలుకుతున్నారు. భీమిలి, దెందులూరు, రాప్తాడు, మేదరమెట్ల సిద్ధం సభలకు తరలివచ్చిన జనసందోహం ఇందుకు నిదర్శనమని రాజకీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఇలా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, అగ్రవర్ణ పేదలు వైఎస్సార్‌సీపీ వెంట నడుస్తుండటంతో వచ్చే ఎన్నికల్లో వార్ వన్‌సైడేనని వారు స్పష్టంచేస్తున్నారు. మొత్తం మీద శాసనసభ, లోక్‌సభ స్థానాలు కలిపి గత ఎన్నికల కంటే ఇప్పుడు అదనంగా 11 స్థానాలను సీఎం జగన్ తమకు కేటాయించడంపై వారు హర్షం వ్యక్తంచేస్తున్నారు.



అవమానించి, అవహేళన చేసిన బాబు..

నిజానికి.. రాష్ట్ర విభజనకు ముందు 2012, జూలై 9న చంద్రబాబు బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించారు. 2014 ఎన్నికల్లో 100 అసెంబ్లీ స్థానాల్లో టికెట్లు ఇస్తామని.. బీసీ సబ్‌ప్లాన్ ద్వారా ఏటా రూ.పది వేల కోట్లు చొప్పున కేటాయిస్తామని.. చేనేత, పవర్‌లూమ్స్ రుణాలను మాఫీ చేస్తానని అందులో ప్రకటించారు. కానీ.. 2014 ఎన్నికల్లో అభ్యర్థుల ఎంపికలోనే బీసీలకు వెన్నుపోటు పొడిచిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక వారి సబ్‌ప్లాన్‌కు పాతరేశారు. అలాగే, ఐదేళ్లలో బీసీ సబ్‌ప్లాన్ ద్వారా రూ.50 వేల కోట్ల వరకు ఆ వర్గాల సంక్షేమం కోసం ఖర్చు చేస్తానని హామీ ఇచ్చి.. అందులో సగం కూడా ఖర్చుచేయలేదు. పైగా.. మంత్రివర్గంలో వారికి సముచిత స్థానం కల్పించని చంద్రబాబు.. 2014–19 మధ్య ఒక్క బీసీని కూడా రాజ్యసభకు పంపలేదు. అంతేకాక.. న్యాయమూర్తులుగా బీసీలు పనికిరారంటూ వారిని అవహేళన చేశారు. ఇచ్చిన హామీలు అమలుచేయాలని అడిగిన బీసీలను తాట తీస్తా.. తోకలు కత్తిరిస్తానంటూ బెదిరించి వారి ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారు. ఇప్పుడు మళ్లీ ఎన్నికలు వస్తున్న నేపథ్యంలో తమపై వల్లమాలిన ప్రేమను ఒలకబోస్తున్న చంద్రబాబు.. ఇప్పటిదాకా ఖరారు చేసిన 128 అసెంబ్లీ స్థానాల్లో కేవలం 24 స్థానాలనే తమకు కేటాయించడంపై బీసీలు భగ్గుమంటున్నారు.

ఇచ్చిన మాటకంటే అధికంగా..

ఇక గత ఎన్నికలకు ముందు వైఎస్ జగన్ బీసీ డిక్లరేషన్‌ను ప్రకటించారు. అందులో వారికిచ్చిన మాట కంటే గత 58 నెలలుగా అధికంగానే న్యాయం చేశారు. ఉదా..

- గత ఎన్నికల్లో 41 శాసనసభ స్థానాలు, ఏడు లోక్‌సభ స్థానాల్లో బీసీ వర్గాల అభ్యర్థులను బరిలోకి దించిన జగన్.. అధికారంలోకి వచ్చాక కేబినెట్‌లో ఆ వర్గాలకు చెందిన 11 మందికి మంత్రి పదవులిచ్చారు. ఒకరిని డిప్యూటీ సీఎంగా నియమించడంతోపాటు ప్రధానమైన రెవెన్యూ, విద్యా, పౌరసరఫరాలు, వైద్యం, ఆరోగ్యం లాంటి ప్రధానమైన శాఖలను ఆ వర్గాలకే అప్పగించి పరిపాలనలో వారికి సముచిత భాగస్వామ్యం కల్పించారు. శాసనసభ స్పీకర్‌గా బీసీ వర్గానికి చెందిన తమ్మినేని సీతారామ్‌కు అవకాశమిచ్చారు.
- ఈ వర్గాలకే చెందిన నలుగురిని రాజ్యసభకు పంపిన సీఎం జగన్ శాసనమండలిలో సైతం సింహభాగం పదవులు వారికే ఇచ్చారు.
- ఇక స్థానిక సంస్థల్లో వైఎస్సార్‌సీపీకి దక్కిన 13 జెడ్పీ చైర్మన్ పదవులకుగాను ఆరు బీసీలకే ఇచ్చారు.
- 84 మున్సిపల్ చైర్మన్ పదవులకుగానూ 44 వారికే కేటాయించారు. 14 కార్పొరేషన్ల మేయర్ పదవులకుగానూ తొమ్మిది బీసీలకే దక్కేలా చేశారు.
- అలాగే, నామినేటెడ్ పదవులు, పనుల్లో 50 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు, మహిళలకు కేటాయించేలా ఏకంగా చట్టం చేసి మరీ ఇచ్చారు.
- మరోవైపు.. గత 58 నెలలుగా సంక్షేమ పథకాల ద్వారా డీబీటీ రూపంలో రూ.1.23 లక్షల కోట్లు, నాన్ డీబీటీ రూపంలో రూ.50 వేల కోట్లు వెరసి రూ.1.73 లక్షల కోట్ల ప్రయోజనాన్ని బీసీలకు చేకూర్చారు. దీంతో.. రాజకీయ, ఆర్థిక, విద్యా, మహిళా సాధికారత ద్వారా బీసీలు సామాజిక సాధికారతను సాధించారు.

తుస్సుమన్న ప్రజాగళం సభ

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కొరముట్ల



సాక్షి, అమరావతి: చంద్రబాబు నేతృత్వంలో చిలకలూరిపేట సమీపంలో నిర్వహించిన ప్రజాగళం సభ తుస్సుమందని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు విమర్శించారు. విజయవాడలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సభ నిర్వహించుకోవడం కూడా చంద్రబాబుకు చేతకాలేదని దుయ్యబట్టారు. కేసుల నుంచి బయటపడేందుకే ప్రధాని మోదీని రాష్ట్రానికి తెచ్చి సభ నిర్వహించారని చెప్పారు. చంద్రబాబు సీఎం జగన్‌ను విమర్శిస్తూ మాట్లాడారని మోదీ కూడా సీఎం జగన్‌ను టార్గెట్ చేస్తూ మాట్లాడతారని బాబు ఆశించారని, బాబు ఆలోచనను పసిగట్టిన మోదీ తెలివిగా కాంగ్రెస్‌ను మాత్రమే విమర్శించి ప్రసంగం ముగించి వెళ్లిపోయారని చెప్పారు. ఏపీకి ఏం చేయబోతున్నామన్న విషయాన్ని, ప్రత్యేక హోదా విషయాన్ని కూడా చంద్రబాబు, పవన్, పురందేశ్వరిలు ప్రధానితో చెప్పించలేకపోయారని ఎద్దేవా చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ నేతల ప్రసంగాల పట్ల ప్రజల్లో ఏమాత్రం స్పందన లేదన్నారు. సభ జరిగిన తీరు చూస్తే ప్రజలు ఎప్పుడో వైఎస్సార్‌సీపీకి ఓటేయాలని నిర్ణయించుకున్నట్టు కనిపించిందన్నారు.

బాబు, పవన్, పురందేశ్వరి ముఖాల్లో నెత్తురు చుక్కలేదు..

సీఎం జగన్ పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి చెందిందని, ఏపీకి ప్రత్యేకంగా కేంద్రం ఏమీ చేయలేదని, అందుకే ప్రధాని తన ప్రసంగంలో సీఎం జగన్‌పై విమర్శలు చేయలేకపోయారని చెప్పారు. దీంతో చంద్రబాబు, పవన్, పురందేశ్వరి ముఖాల్లో నెత్తురు చుక్క కనిపించలేదన్నారు. బాబు కాళ్ల బేరానికి ప్రధాని కరిగిపోయి కదనలేక ఏదో వచ్చాలే అన్నట్టుగా ఇక్కడికి వచ్చి వెళ్లిపోయినట్టు తెలిపారు.

బీజేపీకి 'మూడొ'చ్చింది

- రాజమహేంద్రవరం ఎంపీ స్థానంపై పట్టు.. అనపర్తిపై ఆశలు వదులుకున్న టీడీపీ
- బీజేపీకి ఆఫర్ చేస్తున్న చంద్రబాబు
- 'నల్లమిల్లి'కి ఎసరుపెట్టే ఎత్తుగడ
- పరిశీలనలో సోము వీర్రాజు పేరు
- పి.గన్నవరం నుంచి అయ్యాజీ వేమా



సోము వీర్రాజు



అయ్యాజీ వేమా



నల్లమిల్లి రామకృష్ణారెడ్డి

సాక్షి ప్రతినిధి, కాకినాడ: బీజేపీకి 'మూడొ'చ్చింది. విపక్ష కూటమిలోకి వచ్చీ రాగానే ఉమ్మడి తూర్పు గోదావరిలోని మూడు జిల్లాల్లో మూడు ఎమ్మెల్యే సీట్ల కోసం ఆ పార్టీ పట్టుపడుతోంది. లోక్‌సభ స్థానాలకు వచ్చేసరికి గతంలో తాము గెలుపొందిన రాజమహేంద్రవరం తమకు ఇవ్వాల్సిందేనని కమలనాథులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. ఇక్కడి నుంచి పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి, పార్టీ సీనియర్ నాయకుడు సోము వీర్రాజు, తణుకు మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ ముళ్లపూడి రేణుక పేర్లు పరిశీలనలో ఉన్నాయని అంటున్నారు. దీంతోపాటు మూడు అసెంబ్లీ స్థానాలు కూడా కావాలనేది బీజేపీ ప్రధాన డిమాండ్‌గా ఉంది.

ఆ మూడు ఏవంటే

కమలనాథుల దృష్టి కాకినాడ సిటీ, అమలాపురం, పి.గన్నవరం, అనపర్తి అసెంబ్లీ స్థానాలపై పడింది. ఈ నాలుగింటిలో మూడింటిని బీజేపీ గట్టిగా డిమాండ్ చేస్తోంది. పట్టణ ఓటర్లు అధికంగా ఉన్న కాకినాడ సిటీ, గతంలో గెలుపొందిన పి.గన్నవరం (ఎస్సీ) స్థానంపై వెనక్కి తగ్గేదే లేదంటున్నారు. పి.గన్నవరం నుంచి టీడీపీ తన అభ్యర్థిగా తొలుత సరిపల్లి రాజేష్‌ను ప్రకటించింది. దీనిపై సొంత పార్టీతోపాటు వివిధ వర్గాల నుంచి పెద్ద ఎత్తున ఆందోళనలు మిన్నంటాయి. ఈ నేపథ్యంలో రాజేష్ తనంత తానుగానే పోటీ నుంచి తప్పుకుంటున్నట్టు సామాజిక మాధ్యమాలలో వీడియో వైరల్ అయింది. ఇక్కడ వివాదాల కారణంగా ఈ సీటును బీజేపీకి విడిచిపెట్టేస్తే ఎలా ఉంటుందని టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబు సహచర నేతలతో ఆలోచిస్తున్నట్టు కనిపిస్తోంది. పి.గన్నవరం నుంచి మాజీ ఎమ్మెల్యే అయ్యాజీ వేమాకు మద్దతుగా బీజేపీ ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా నేతలు ఇప్పటికే పార్టీ పెద్దలకు ప్రతిపాదించారు. అమలాపురం సీటు కోసం టీడీపీ, జనసేనల్లో ఆశావహులు బస్తీ మే సవాల్ అంటూ కాలు దువ్వుతున్నారు. రోడ్డెక్కి రచ్చ రచ్చ చేస్తున్నా ఇరు పార్టీల అగ్ర నాయకత్వాలు మాత్రం నోరు మెదపడం లేదు. దీనిపై ఎటూ తేల్చుకోలేని పరిస్థితుల్లో కూటమి నేతలున్నారు.

ఇంకా తర్జనభర్జనలే

జనసేన తొలుత ఆశించిన కాకినాడ సిటీ విషయంలో కూటమి నుంచి ఇంతవరకూ స్పష్టత రాలేదు. కాకినాడ రూరల్ ఎలాగూ ఆ పార్టీకి ఖరారు చేయడం, పిఠాపురం నుంచి పోటీ చేయనున్నట్టు జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ ప్రకటించడంతో సిటీపై జనసేన ఆశలు వదిలేసుకుంది. పట్టణ ఓటర్లపై దృష్టి పెట్టిన బీజేపీ ఇప్పుడా సీటును ఆశిస్తోంది. సిటీ సీటు కోసం కైట్ విద్యా సంస్థల చైర్మన్ పోతుల విశ్వం, బీజేపీ నాయకుడు డాక్టర్ ముత్తా వంశీ పేర్లు ప్రచారంలో ఉన్నాయి. ఈ రెండింటితోపాటు రాజమహేంద్రవరం సిటీ స్థానాన్ని కూడా బీజేపీ మొదటి నుంచీ కోరుతోంది. ఈ స్థానానికి టీడీపీ నుంచి ఆదిరెడ్డి వాసును టీడీపీ ఉమ్మడి అభ్యర్థిగా ప్రకటించింది. ఈ నేపథ్యంలో రాజమహేంద్రవరం సిటీ కాదన్న చంద్రబాబు..ఇదే జిల్లాలో వైఎస్సార్‌సీపీ బలంగా ఉన్న అనపర్తిని బీజేపీకి వదిలేయాలని ఆలోచిస్తున్నారు. ఈ విషయాన్ని ఆ పార్టీ నేతలే బహిరంగంగా చెబుతున్నారు. దీనిపై టీడీపీ అనుకూల పత్రికల్లో వార్తలు రావడం ఇందుకు బలాన్ని చేకూరుస్తోంది. టీడీపీ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డిని పక్కన పెట్టి బీజేపీకి అనపర్తి సీటుని కేటాయిస్తారంటూ బలమైన ప్రచారమే జరుగుతోంది. బీజేపీ నుంచి సోము వీర్రాజు పేరు ప్రతిపాదిస్తున్నారని కమలనాథులు చెబుతున్నారు. ఇందులో వాస్తవం ఉండబట్టే టీడీపీ ఇన్‌చార్జి నల్లమిల్లి కనుసన్నల్లోనే ఆయన అనుచరులు అనపర్తి ఎస్ఎన్ఆర్ కల్యాణ మండపంలో శనివారం హడావిడిగా మూడు మండలాల పార్టీ నేతలు సమావేశం ఏర్పాటు చేశారు. నల్లమిల్లికి సీటు ఇవ్వాల్సిందేనని తీర్మానించడమే కాకుండా రామవరంలోని ఆయన ఇంటికి ర్యాలీగా వెళ్లి సీటు విషయంలో సంఘీభావం ప్రకటించారు.

టీడీపీలో కొనసాగుతున్న ఆందోళనలు

సాక్షి,కదిరి/మదనపల్లె/పరవాడ/గాంధీనగర్(విజయవాడసెంట్రల్): టీడీపీ టికెట్ల కేటాయింపు అంశంలో చంద్రబాబునాయుడు అనుసరిస్తున్న ధోరణిపై ఆ పార్టీ కార్యకర్తల ఆందోళనలు పలుచోట్ల కొనసాగుతూనే ఉన్నాయి. ఆదివారం పలు చోట్ల ఆశావహుల సమావేశాలు, రెబల్స్‌గా పోటీ చేస్తామంటూ అధిష్టానానికి హెచ్చరికలు, కార్యకర్తల బైక్ ర్యాలీలు, విలేకరుల సమావేశాలు జరిగాయి.

మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా వర్గం ఆగ్రహం

చంద్రబాబుకు ముస్లిం మైనార్టీలంటే గిట్టదని, ముస్లిం ఓటర్లు అధికంగా ఉన్న కదిరి టికెట్ వారికి కేటాయించలేదంటేనే అర్థం చేసుకోవచ్చని శ్రీసత్యసాయి జిల్లా కదిరి మాజీ ఎమ్మెల్యే అత్తార్ చాంద్‌బాషా అనుచరులు మండిపడ్డారు. అత్తార్ చాంద్‌బాషా ఆధ్వర్యంలో వారంతా ఆయన స్వగృహంలో ఆదివారం సమావేశమయ్యారు. కదిరి టీడీపీ టికెట్ కందికుంట యశోదాదేవికి ఇవ్వడాన్ని వ్యతిరేకించారు. కదిరిలో కందికుంట వెంకటప్రసాద్ నాలుగు సార్లు పోటీ చేస్తే ఒక్కసారి మాత్రమే గెలిచారని, వరుసగా ఓడిపోతున్నా మళ్లీ ఈసారి కూడా ఆయన భార్యకు టికెట్ ఇవ్వడమేంటని వారు ప్రశ్నించారు. నాలుగైదు రోజుల్లో మరోసారి సమావేశమై కార్యకర్తల అభిప్రాయం మేరకు భవిష్యత్ నిర్ణయాన్ని ప్రకటిస్తామని అత్తార్ చాంద్‌బాషా తెలిపారు.

టీడీపీ రెబల్ అభ్యర్థిగా దొమ్మలపాటి రమేష్..

టీడీపీ రెబల్ అభ్యర్థిగా అన్నమయ్య జిల్లా మదనపల్లె నియోజకవర్గ ఇన్‌చార్జ్ దొమ్మలపాటి రమేష్ పోటీలో ఉంటారని మదనపల్లె ఐటీడీపీ, ఫేస్‌బుక్, సోషల్‌మీడియా గ్రూపుల్లో వైరల్ అవుతోంది. మదనపల్లె టీడీపీ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే షాజహాన్‌బాషాకు సీటు కేటాయించిన విషయం తెలిసిందే. అయితే పార్టీనే నమ్ముకుని, కష్టకాలంలో కేసులు పెట్టించుకుని, కోట్లు ఖర్చు చేసుకున్నప్పటికీ, తమకు కాకుండా, ఏడాది క్రితం పార్టీలో చేరిన వ్యక్తికి టికెట్ ఎలా కేటాయిస్తారని దొమ్మలపాటి రమేష్ వర్గీయులు అసంతృప్తితో ఉన్నారు. షాజహాన్‌బాషా దొమ్మలపాటి ఇంటికెళ్లి తన గెలుపునకు సహకరించాల్సిందిగా కోరారు. అయితే రమేష్ విముఖత వ్యక్తం చేస్తూ.. ఇన్నాళ్లు తనను నమ్ముకుని ఉన్న కార్యకర్తలకు ఏం సమాధానం చెప్పాలని, వారికి న్యాయం చేయాల్సిన బాధ్యత తనపై ఉందని ముఖం మీదే చెప్పారు. ఆ వెంటనే... ఐటీడీపీ, దొమ్మలపాటి యువసేన, టీడీపీ వాట్సాప్ గ్రూపుల్లో మదనపల్లె బరిలో రెబల్‌గా దిగుతున్న దొమ్మలపాటి..., మదనపల్లె ఎన్నికల్లో తప్పకుండా పోటీలో ఉంటా.. నన్ను ఆశీర్వదించండంటూ పోస్టింగ్‌లు పెట్టారు.



ఐటీడీపీ గ్రూపుల్లో వైరల్ అవుతున్న పోస్టింగ్



పెందుర్తిలో టీడీపీ నాయకులు, కార్యకర్తల ర్యాలీ

బండారుకు మద్దతుగా టీడీపీ నాయకుల నిరసన

అనకాపల్లి జిల్లా పెందుర్తి టీడీపీ టికెట్‌ను మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి కేటాయించాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఉదయం 10 గంటలకు పెందుర్తిలో ప్రారంభమైన బైక్ ర్యాలీ మధ్యాహ్నం 1 గంటకు బండారు స్వగ్రామమైన వెన్నెలపాలేనికి చేరుకుంది. సీనియర్ నాయకుడైన బండారుకు టీడీపీ టికెట్ కేటాయించాలంటూ నినాదాలు చేశారు. బైక్ ర్యాలీలో పెందుర్తి, సబ్బవరం, పరవాడ మండలాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తిరువూరు టీడీపీ టికెట్ జవహర్‌కు కేటాయించాలి

ఎన్టీఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గ టీడీపీ టికెట్ మాజీ మంత్రి కె.ఎస్.జవహర్‌కు కేటాయించాలని మాదిగ చర్మకారులు, డప్పు కళాకారుల దండోరా రాష్ట్ర అధ్యక్షుడు జె.ఆంజనేయులు మాదిగ డిమాండ్ చేశారు. జవహర్‌కు టికెట్ నిరాకరిస్తూ చంద్రబాబు తీసుకున్న నిర్ణయాన్ని వ్యతిరేకిస్తున్నామన్నారు. ఆదివారం ఆయన విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడుతూ.. 24 గంటల్లోగా జవహర్ పేరు ప్రకటించకపోతే చలో టీడీపీ రాష్ట్ర కార్యాలయం కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. చంద్రబాబు మాదిగలను వాడుకొని వారికి అవసరం వచ్చినపుడు ఆదుకోవటం లేదని ఆరోపించారు.

క్లుప్తంగా...

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి



తిరుమల: తిరుమల శ్రీవారిని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శన ఏర్పాట్లు చేశారు. శ్రీవారి దర్శనానంతరం ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనాలు పలుకగా..టీటీడీ అధికారులు లడ్డూ ప్రసాదాలతో ఘనంగా సత్కరించారు.

5 నుంచి శ్రీకోదండ రాముని బ్రహ్మోత్సవాలు

తిరుపతి కల్చరల్: తిరుపతిలోని శ్రీకోదండరామస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు ఏప్రిల్ 5 నుంచి 13వ తేదీ వరకు వైభవంగా జరుగనున్నాయి. ఇందులో భాగంగా 3న కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం, 4న బ్రహ్మోత్సవాలకు అంకురార్పణ నిర్వహిస్తారు. బ్రహ్మోత్సవాల్లో వాహన సేవలు ప్రతి రోజూ ఉదయం 7 నుంచి 8.30 గంటల వరకు, తిరిగి రాత్రి 7 నుంచి 8.30 గంటల వరకు జరుగుతాయి. 5న ఉదయం ధ్వజారోహణం, రాత్రి పెద్ద శేష వాహన సేవ, 6న చిన్న శేష వాహన సేవ, రాత్రి హంస వాహన సేవ, 7న సింహ వాహన సేవ, రాత్రి ముత్యపు పందిరి వాహన సేవలు జరగనున్నాయి. 8న కల్పవృక్ష వాహన సేవ, సర్వ భూపాల వాహన సేవ, 9న ఉదయం పల్లకీ ఉత్సవం, రాత్రి గరుడ వాహనంపై స్వామి వారు విహరిస్తూ భక్తులకు దర్శనమివ్వనున్నారు. అలాగే 10వ తేదీన హనుమంత వాహన సేవ, రాత్రి గజ వాహన సేవ, 11న సూర్యప్రభ, చంద్రప్రభ వాహన సేవలు జరుగనున్నాయి. 12న ఉదయం రథోత్సవం, రాత్రి అశ్వవాహనం, 13న ఉదయం చక్రస్నానం, రాత్రి చేపట్టా ధ్వజావరోహణంతో స్వామి వారి ఉత్సవాలు ముగియనున్నాయి.

ఉపమాకలో 19 నుంచి శ్రీవారి వార్షిక కల్యాణోత్సవాలు



ఉపమాక వెంకన్న ఆలయం

నక్కపల్లి: అనకాపల్లి జిల్లా నక్కపల్లి మండలం ఉపమాకలోని శ్రీవేంకటేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 19 నుంచి 25వ తేదీ వరకు స్వామి వారి వార్షిక కల్యాణోత్సవాలు జరుగనున్నాయి. ఈ ఉత్సవాల నిర్వహణకు టీటీడీ అధికారులు అన్ని ఏర్పాట్లు చేస్తున్నారు. ఆలయం ఎదురుగా భారీ షెడ్లు నిర్మిస్తున్నారు. పుష్పాలతో, విద్యుద్దీపాలతో అలంకరిస్తున్నారు. భక్తులకు ప్రత్యేక వసతులు, క్యూలైన్లు నిర్మిస్తున్నారు. ప్రత్యేక బందోబస్తు ఏర్పాట్లు చేయనున్నారు. కల్యాణోత్సవాలు తిలకించేందుకు రాష్ట్ర నలుమూలల నుంచి లక్షలాది మంది తరలిరానున్నారు.

ఇకపై బర్త్ సర్టిఫికెట్ తప్పనిసరి

అక్టోబర్ 1, 2023 తర్వాత పుట్టిన వారికి కేంద్రం కొత్త చట్టం ● కలెక్టర్లకు సీఎస్ జవహర్‌రెడ్డి ఆదేశాలు



సాక్షి, అమరావతి : గత ఏడాది అక్టోబరు 1 తర్వాత పుట్టిన వారికి కేంద్ర ప్రభుత్వం జనన ధృవీకరణ పత్రాన్ని తప్పనిసరి చేసింది. ఇందుకోసం జనన, మరణాల నమోదుకు కొత్త చట్టాన్ని తీసుకొచ్చింది. దీని ప్రకారం.. జన్మించిన వ్యక్తి పుట్టిన తేదీ, ప్రదేశం నిరూపించే ఏకైక పత్రం బర్త్ సర్టిఫికెట్ మాత్రమేనని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్‌రెడ్డి స్పష్టంచేశారు. ఈ విషయంపై ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించేందుకు పెద్దఎత్తున ప్రచారం నిర్వహించాలని ఆయన జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. విద్యా సంస్థలతో పాటు ప్రభుత్వ నియామకాల్లో ఈ జనన ధృవీకరణ పత్రం తప్పనిసరని తెలిపారు. పాస్‌పోర్టు, ఆధార్ నంబర్, డ్రైవింగ్ లైసెన్స్ జారీతో పాటు ఓటరు, వివాహ నమోదుకు కూడా కేంద్ర ప్రభుత్వం దీనిని తప్పనిసరి చేసిందని సీఎస్ స్పష్టంచేశారు. అలాగే, కేంద్ర ప్రభుత్వం నుంచి ఏదైనా ఇతర ప్రయోజనాలు పొందాలన్నా కూడా జనన ధృవీకరణ పత్రం తప్పనిసరి అని ఆయన తెలిపారు. కొత్త చట్టం ప్రకారం జనన, మరణాల నమోదును కేంద్రం తప్పనిసరి చేసిందని, ఈ విషయంపై క్షేత్రస్థాయి వరకు ప్రజల్లో అవగాహన కలిగించేందుకు కలెక్టర్లు చర్యలు తీసుకోవాల్సిందిగా ఆయన సూచించారు. ఆస్పత్రులు, మున్సిపల్ కార్పొరేషన్లు, మున్సిపాలిటీలు, నగర పంచాయతీలు, పంచాయతీల్లో కలిపి మొత్తం 14,752 జనన, మరణాల నమోదు యూనిట్లు ఉన్నాయన్నారు.

ఏడు రోజుల్లో సర్టిఫికెట్ ఇవ్వాలి..

ఇక కొత్త చట్టం ప్రకారం జనన, మరణాల రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఏడు రోజుల్లో పూర్తిచేసి సర్టిఫికెట్ జారీచేయాల్సి ఉందని సీఎస్ చెప్పారు. కేంద్ర రిజిస్ట్రార్ జనరల్, రాష్ట్రాల చీఫ్ రిజిస్ట్రార్లు, జాతీయ, రాష్ట్రాల స్థాయిలో జనన, మరణాల డేటాను నిర్వహిస్తారన్నారు. ఏ అథారిటీకైనా ఈ డేటా కావాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆమోదం అవసరముంటుందని ఆయన తెలిపారు. జనాభా రిజిస్టర్, ఎలక్టోరల్ రోల్స్, ఆధార్ నంబర్లు, రేషన్ కార్డు, పాస్‌పోర్ట్, డ్రైవింగ్ లైసెన్స్, ఆస్తుల రిజిస్ట్రేషన్ల డేటాబేస్‌లు ఉంటాయని ఆయన వివరించారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో కూడా అన్ని జననాలను హెల్త్ మేనేజ్‌మెంట్ ఇన్ఫర్మేషన్ వ్యవస్థకు నివేదించాల్సి ఉందని, ఇందులో జాప్యంలేకుండా సమీక్షలు నిర్వహించాల్సిందిగా సీఎస్ కలెక్టర్లను కోరారు.

రిజిస్ట్రేషన్ యూనిట్లు ఇలా..

ప్రభుత్వ జనరల్ ఆస్పత్రులు	:	25
జిల్లా, ఏరియా, కమ్యూనిటీ ఆస్పత్రులు	:	243
పీహెచ్‌సీలు	:	1,146
మునిసిపల్ కార్పొరేషన్లు	:	24
మున్సిపాలిటీలు	:	77
నగర పంచాయతీలు	:	29
పంచాయతీలు	:	13,204
ఇతరాలు	:	4

ఉత్తమ పరిశోధన కేంద్రంగా ఆర్‌ఏఆర్‌ఎస్

- జాతీయ స్థాయిలో 3వ స్థానంలో నిలిచిన అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రం
- ఐదేళ్లలో మూడు పరిశోధనలకు పేటెంట్ హక్కులు
- మరో రెండింటి కోసం దరఖాస్తు

సాక్షి, అమరావతి: అనకాపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా కేంద్రానికి (ఆర్‌ఏఆర్‌ఎస్) అరుదైన గౌరవం దక్కింది. పోస్ట్ హార్వెస్టింగ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ విభాగంలో అత్యుత్తమ పరిశోధనలు చేసినందుకు గాను జాతీయ స్థాయిలో ఆర్‌ఏఆర్‌ఎస్ మూడో స్థానంలో నిలిచింది. వరుసగా రెండేళ్లు ఈ అవార్డును సొంతం చేసుకున్న సంస్థగా నిలిచింది. పంజాబ్‌లోని లూథియానాలో జరిగిన 39వ ఐసీఏఆర్ జాతీయ వార్షిక సదస్సులో ఐసీఏఆర్ డిప్యూటీ డైరెక్టర్ జనరల్ (వ్యవసాయ ఇంజినీరింగ్) ఎస్ఎన్ ఝా చేతుల మీదుగా ఆర్‌ఏఆర్‌ఎస్ అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ పీవీకే జగన్నాథరావు, ప్రిన్సిపల్ సైంటిస్ట్ పీ.శ్రీదేవి ఈ అవార్డును అందుకున్నారు. అత్యుత్తమ పరిశోధనలు చేసినందుకు గానూ 2021–22లో రెండో స్థానంలో నిలవగా, 2023–24లో మూడవ స్థానంలో నిలిచింది. ఒకే ఏడాది రెండు పేటెంట్ హక్కుల కోసం దరఖాస్తు చేయడంతో పాటు నాలుగు ప్రాసెస్ టెక్నాలజీలను అభివృద్ధి చేయడం, 2 అత్యాధునిక యంత్ర పరికరాలను అభివృద్ధి చేయడం, ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు వంటి కార్యక్రమాలు చేసినందుకుగానూ ఈ అవార్డు లభించింది. వ్యక్తిగత కేటగిరిలో పీవీకే జగన్నాథరావుకు ఫెలో ఆఫ్ ఇండియన్ సొసైటీ ఆఫ్ అగ్రికల్చర్ ఇంజినీరింగ్ విభాగంలో ఫెలోషిప్ అవార్డు సొంతం చేసుకున్నారు.

ఐదేళ్లలో మూడు పేటెంట్లు

ఐదేళ్లలో వరుసగా బెల్లం పొడి తయారీ విధానంపై 2021లో, బెల్లంపొడి తయారీకి ఉపయోగించే అత్యాధునిక యంత్ర పరికరాల ఆవిష్కరణలపై 2022లో, పూతరేకుల తయారీ యంత్రం రూపకల్పనపై 2023లో వరుసగా మూడుసార్లు పేటెంట్ పొందింది. యూనివర్సిటీ పరిధిలో అత్యధిక పేటెంట్ హక్కులు పొందిన కేంద్రంగా ఆర్ఏఆర్ఎస్ గుర్తింపు పొందింది. కాగా.. రోటరీ వాక్యూమ్ ఎవాపరేటర్ ద్వారా చెరకు రసాన్ని నిల్వ చేయడం, బియ్యాన్ని ఐరన్, ఫోలిక్ యాసిడ్‌తో పోర్టిఫైడ్ చేసే విధానంపైనా పేటెంట్ హక్కుల కోసం దరఖాస్తు చేశారు. మిల్లెట్స్‌తో హెల్త్ మిక్స్, బెల్లంతో కుల్ఫీ తయారీ, చెరకు రసం–యాపిల్‌తో జామ్ తయారీ, పసుపులోని కుర్కుమిన్, మునగాకు రసాన్ని బెల్లం పొడితో పోర్టుఫైడ్ చేయడం వంటి విధానాలను అభివృద్ధి చేశారు. బెల్లంలోని కల్తీని తనిఖీ చేయడానికి స్మార్ట్ పరికరం అభివృద్ధి చేశారు. చెరకు, మినుములు, పనస పండ్ల ప్రాసెసింగ్ కోసం రూ.3.73 కోట్లతో ఉమ్మడి ఇంక్యుబేషన్ సెంటర్‌తో పాటు సాలూరు వద్ద గంగన్న దొరవలస గ్రామం వద్ద అగ్రో ప్రాసెసింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు.

'న్యూరాలజీ' బాధితులకు భరోసా



చికిత్స పొందిన ఆటోడ్రైవర్ మణికంఠ (ఫైల్)

ఈ ఫోటోలో వైద్యుల మధ్య బెడ్‌పై ఉన్న గుంటూరు జిల్లా చేబ్రోలు మండలం గొడవర్రుకు చెందిన దానబోయిన మణికంఠ ఆటోడ్రైవర్. కొంత కాలంగా మూర్ఛ సమస్యతో బాధపడుతున్నాడు. దీంతో ఆటోను సక్రమంగా నడపలేక జీవనం అస్తవ్యస్తంగా మారుతోంది. గతేడాది డిసెంబర్ 29న ఫిట్స్ వచ్చి అపస్మారక స్థితిలోకి వెళ్లడంతో చికిత్స కోసం కుటుంబ సభ్యులు గుంటూరులోని బ్రింద న్యూరో సెంటర్‌కు తీసుకెళ్లారు. మెదడులో కుడి వైపు, కుడిచెయ్యి, గొంతు, నాలుక, దంతాలు, దవడ, మాటలు వచ్చే భాగం, ముఖానికి నరాలు సరఫరా చేసే మెదడులోని భాగంలో ట్యూమర్ ఉన్నట్లు గుర్తించారు. దానిని తొలగించ కుంటే ప్రాణాలు పోయే ప్రమాదం ఉందని వైద్యులు వెల్లడించారు. కాగా, వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకం కింద రూ.5 లక్షల ఖరీదైన అరుదైన ఆపరేషన్‌ను పూర్తి ఉచితంగా ఆస్పత్రిలో నిర్వహించారు. అయోధ్య బాలరాముడి విగ్రహ ప్రతిష్ట కార్యక్రమాన్ని ల్యాప్‌ట్యాప్‌లో చూపిస్తూ డాక్టర్ భవనం శ్రీనివాసరెడ్డి నిర్వహించిన అరుదైన సర్జరీ అప్పట్లో సంచలనమైంది. ప్రస్తుతం మణికంఠ ఆరోగ్యంగా ఉన్నాడు.

ఆరోగ్యశ్రీ కింద 2019 నుంచి న్యూరో, న్యూరో సర్జరీ చికిత్సలిలా..

సంవత్సరం	రోగులు	నిధులు (రూ.కోట్లలో)
2019-2020	26,023	105.00
2020-2021	17,587	74.68
2021-2022	23,983	98.02
2022-2023	40,069	151.49
2023-2024	38,683	143.0

- వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద ఉచితంగా ఖరీదైన వైద్యం
- ఐదేళ్లలో 1.46 లక్షల మందికి చికిత్స
- రు.572 కోట్లు ఖర్చు చేసిన ప్రభుత్వం

సాక్షి, అమరావతి: మణికంఠ, యోగేంద్ర తరహాలో అనారోగ్యం బారినపడిన నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వ్యక్తులకు ఆరోగ్యశ్రీ పథకం అండగా నిలుస్తోంది. చేతి నుంచి చిల్లిగవ్వ ఖర్చు పెట్టే పని లేకుండానే పూర్తి ఉచితంగా ప్రైవేట్, కార్పొరేట్ ఆస్పత్రుల్లో చికిత్సలు పొందుతున్నారు. బ్రెయిన్ ట్యూమర్, బ్రెయిన్ స్ట్రోక్, మెదడులో రక్తం గడ్డకట్టడం వంటి జబ్బుల బాధితులతో పాటు, రోడ్డు ప్రమాదాల్లో క్షతగాత్రులకు న్యూరో, న్యూరో సర్జరీ విభాగాల్లో ఖరీదైన చికిత్సలు ఉచితంగా అందుతున్నాయి.

న్యూరో, న్యూరో సర్జరీ విభాగాల్లో 1.46 లక్షల మందికి మేలు

2019 నుంచి ఇప్పటి వరకూ ఆరోగ్యశ్రీ కింద న్యూరో, న్యూరో సర్జరీ విభాగాల్లో 1,46,345 మంది ఉచితంగా చికిత్సలు పొందారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.572.23 కోట్లు వెచ్చించింది. ఇందులో 77,190 మంది న్యూరాలజీ, 69,155 మంది న్యూరో సర్జరీ విభాగాల్లో చికిత్సలు అందుకున్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక పథకం బలోపేతంలో భాగంగా బెంగళూరు, హైదరాబాద్ వంటి ఇతర రాష్ట్రాల్లోని ప్రముఖ నగరాల్లోని కార్పొరేట్ ఆస్పత్రుల్లోనూ సేవలు అందుబాటులోకొచ్చాయి. దీంతో న్యూరో, న్యూరో సర్జరీ సమస్యల బాధితులు ఆయా నగరాల్లోని కార్పొరేట్ ఆస్పత్రుల్లో ఉచితంగా చికిత్సలు పొందుతున్నారు. మరో వైపు చికిత్స అనంతరం ఆస్పత్రులకు డిశ్చార్జ్ అయిన రోగులకు వైద్యులు సూచించిన విశ్రాంత సమయానికి వైఎస్సార్ ఆరోగ్య ఆసరా కింద భృతిని సైతం ప్రభుత్వం అందిస్తోంది. దీంతో విశ్రాంత సమయంలో రోగులకు ఆర్థిక ఇబ్బందులు తప్పుతున్నాయి. జబ్బుల బారినపడిన నిరుపేద, మధ్యతరగతి కుటుంబాల ప్రజలను ఆరోగ్య శ్రీ సంజీవనిలా ఆదుకుంటోంది. 2019కు ముందు బాబు పాలనలో నీరుగారిపోయిన పథకాన్ని సీఎం జగన్ విప్లవాత్మక సంస్కరణలతో బలోపేతం చేశారు. రూ.25 లక్షలకు వైద్య సేవల పరిమితిని పెంచడంతో పాటు.. 1059 నుంచి 3257కు ప్రొసీజర్లనూ పెంచారు. నెట్‌వర్క్ ఆస్పత్రులను విస్తరించారు. దీంతో 2019 నుంచి ఇప్పటి వరకూ ఏకంగా 44.78 కోట్ల మంది రూ.13,004 కోట్ల విలువ చేసే వైద్య సేవలు పొందారు. 22 లక్షల మందికి పైగా బాధితులకు చికిత్స అనంతరం రూ.1,300 కోట్లకు పైగా ఆసరా సాయాన్ని ప్రభుత్వం అందించింది. 3.67 లక్షల మంది గుండె జబ్బు, 3.03 లక్షల మంది క్యాన్సర్ రోగులు ఉచిత వైద్య సేవలు అందుకున్న వారిలో ఉన్నారు.

ప్రకాశం జిల్లా బేస్తవారిపేట మండలం నారువానిపల్లెకు చెందిన వెంకటరామయ్యది నిరుపేద వ్యవసాయ కుటుంబం. 2021లో రామయ్య దంపతుల ఎనిమిదేళ్ల కుమారుడు యోగేంద్ర ఇంటి వద్ద ఆడుకుంటూ కళ్లు తిరిగిపడిపోయాడు. దగ్గర్లోని ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళితే గుంటూరుకు తీసుకెళ్లాలని చెప్పారు. గుంటూరులోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తీసుకెళ్లగా.. బ్రెయిన్ ఎన్యూరిజం రప్చర్ అనే వ్యాధితో బాధపడుతున్నట్టు వైద్యులు నిర్ధారించారు. ఈ అరుదైన జబ్బుకు ప్రభుత్వం ఉచితంగా చికిత్స చేయించింది.

మే 19న పాడేరు మోదకొండమ్మ జాతర

మూడు రోజుల పాటు నిర్వహణ

సాక్షి, పాడేరు (అల్లూరి సీతారామరాజు): ఉత్తరాంధ్రుల ఆరాధ్యదైవం, గిరిజనుల కల్పవల్లి పాడేరులోని మోదకొండమ్మ (రాష్ట్ర గిరిజన జాతర) జాతరను మే 19, 20, 21 తేదీల్లో ఘనంగా నిర్వహించేందుకు గ్రామ పెద్దలు నిర్ణయించారు. ఆలయ కమిటీ చైర్‌పర్సన్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి సూచనల మేరకు ఆదివారం ఆలయ ప్రాంగణంలో పెద్దలంతా సమావేశమయ్యారు. ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుళ్లి సింహాచలం నాయుడు, పాడేరు సర్పంచ్ కొట్టగుళ్లి ఉషారాణి, ఉప సర్పచ్ బూరెడ్డి రాము నాయుడు, గత ఉత్సవ కమిటీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వర్తన పిన్నయ్యదొర, తమర్బ ప్రసాద్‌నాయుడు, నవర కొండబాబు, గిరిజన ఉపాధ్యాయ సంఘం నేతలు పలాసి కృష్ణారావు, జంపరంగి ప్రసాద్, వర్తక సంఘం నేతలు ఉత్సవాల నిర్వహణ తేదీలను ఖరారు చేశారు. మే 12న అమ్మవారి పుట్టిన రోజు, మే 19, 20, 21 తేదీల్లో ఉత్సవాలు నిర్వహించేందుకు పూజారి సుబ్రహ్మణ్యం ముహూర్తం పెట్టారు. ఏటా మే నెల రెండవ వారంలో ఉత్సవాలు జరుపుకోవడం ఆనవాయితీ. అయితే ఈ ఏడాది సార్వత్రిక ఎన్నికల పోలింగ్ తేదీ మే 13 కావడంతో అమ్మవారి ఉత్సవాలను మే 19వ తేదీకి మార్చారు.



మోదకొండమ్మతల్లి విగ్రహం

ఫ్లెక్సీ తొలగిస్తుండగా విద్యుత్ షాక్‌తో వెల్ఫేర్ అసిస్టెంట్ మృతి

అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలంలో ఘటన



దెక్క చిరంజీవి(ఫైల్)

దేవరాపల్లి(అనకాపల్లి జిల్లా): ఎన్నికల విధుల్లో భాగంగా ఫ్లెక్సీలు తొలగిస్తుండగా కరెంట్ షాక్‌కు గురై సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ మృతి చెందాడు. అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలం కొత్తపెంట గ్రామ సచివాలయం పరిధిలోని ములకలాపల్లిలో ఆదివారం ఉదయం ఈ ఘటన చోటు చేసుకుంది. సార్వత్రిక ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను ఉదయం 10 గంటలలోపు తొలగించాలని రెవెన్యూ అధికారులు గ్రామ సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు కొత్తపెంట గ్రామ సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ దెక్క చిరంజీవి (34) ములకలాపల్లిలో కటౌట్లను తొలగించేందుకు వెళ్లాడు. గ్రామం ఎంట్రన్స్‌లో పాలకేంద్రం వద్ద విద్యుత్ స్తంభానికి కట్టి ఉన్న పొడవాటి ఐరన్ ఫ్రేమ్‌తో ఉన్న కటౌట్‌ను తొలగిస్తుండగా అది పక్కనే ఉన్న విద్యుత్ వైర్లను తాకడంతో చిరంజీవి షాక్‌కు గురయ్యాడు. అతని వెంట ఉన్నవారు, సమీపంలో పొలాల్లో పనిచేస్తున్నవారు అతని ప్రాణాలు కాపాడేందుకు ప్రయత్నించినప్పటికీ ఫలితంలేకుండా పోయింది. వెల్ఫేర్ అసిస్టెంట్ మృతి విషయాన్ని తెలుసుకున్న డిప్యూటీ సీఎం బూడి ముత్యాల నాయుడు హుటాహుటిన ఘటనా స్థలానికి చేరుకున్నారు. చిరంజీవి కుటుంబ సభ్యులను ఓదార్చారు.

ఎందుకీ 'తొందరపాటు'?

ఎగువ సీలేరు పీఎస్పీపై ఈనాడు విషయం లేని కథనం

- నిబంధనల మేరకే ప్రాజెక్టు పనుల అప్పగింత
- 2022 సెప్టెంబరు ధరల ప్రాతిపదికన ఎగువ సీలేరు పీఎస్పీకి డీపీఆర్
- అదీ కేంద్ర ప్రభుత్వ సంస్థ వ్యాప్కోస్ తయారు చేసినది
- ఏటా 6 శాతం ధరల పెరుగుదల ఉంటుంది
- ఈ ప్రాజెక్టు దక్కించుకున్న మేఘా సంస్థ కోట్ చేసింది 9.87 శాతం
- 6 శాతం ధరల పెరుగుదల పోను మేఘా కోట్ చేసింది స్వల్పమే
- గత ఏడాది జూన్‌లోనే టెండర్ల ఆహ్వానం
- అన్ని నిబంధనలు రివర్స్ టెండరింగ్ ద్వారా ఫిబ్రవరిలో ఆమోదం
- సీఈఏ, జ్యుడిషియల్ ప్రివ్యూ కమిటీ ఆమోదం తర్వాతే టెండర్లు
- పకడ్బందీగా ఆన్‌లైన్ టెండర్ల ద్వారా బిడ్ల స్వీకరణ
- 8 నెలలు సాగిన టెండర్ల ప్రక్రియ తొందరపాటు ఎలా అవుతుంది?


'మేఘా'లలో తేలిపోయేలా!



సాక్షి, అమరావతి: ఎగువ సీలేరు పంప్డ్ స్టోరేజి ప్రాజెక్టు (పీఎస్పీ)కు సమగ్ర ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) 2022 సెప్టెంబరులో తయారైంది. అప్పటి ధరల ప్రకారం వ్యాప్కోస్ సంస్థ డీపీఆర్ తయారు చేసింది. అంటే ఈ ప్రాజెక్టు డీపీఆర్ 18 నెలల క్రితం ధరలతో తయారైంది. ఏ ప్రాజెక్టుకైనా ఏటా 6 శాతం ధరల పెరుగుదల ఉంటుంది. ఎగువ సీలేరు పీఎస్పీకి అన్ని నిబంధనలు, మార్గదర్శకాలను అనుసరించి, రివర్స్ టెండరింగ్ ద్వారా నిర్మాణ సంస్థ ఎంపిక జరిగింది. ఇందులో 9.87 శాతం ఎక్కువకు కోట్ చేసిన మేఘా సంస్థ ఎల్–1 (తక్కువ మొత్తానికి కోట్ చేసిన సంస్థ)గా ఎంపికైంది. దానికే ప్రభుత్వం నిర్మాణ బాధ్యతలు అప్పగించింది. ధరల పెరుగుదల 6 శాతం పోగా మేఘా సంస్థ కోట్ చేసిన మొత్తం ఎక్కువేమీ కాదు. ఈ విషయం విష పత్రిక ఈనాడు అధినేత రామోజీకి తెలియనిదీ కాదు. పైగా, గత ఏడాది జూన్‌లో టెండర్లు పిలిచి, అన్ని నిబంధనలను పాటిస్తూ, రివర్స్ టెండరింగ్ ద్వారా ఈ ఏడాది ఫిబ్రవరిలో టెండర్లను ఏపీ జెన్‌కో ఖరారు చేసింది. అంటే 8 నెలలపాటు టెండర్ల ప్రక్రియ సాగింది. ఇందులో తొందరపాటేమీ లేదన్నదీ రామోజీకి తెలుసు. అయినా వైఎస్ జగన్ ప్రభుత్వంపై ఏదోలా విషం చిమ్మి, ప్రజలను మభ్యపెట్టేయాలన్న తొందరపాటులో విషయం లేని ఈ కథనాన్ని అచ్చేశారు. ఈనాడు ప్రచురించిన ఈ అసత్య కథనాన్ని ఏపీ జెన్‌కో, ఇంధన శాఖ ఖండించాయి. ఆ రెండు సంస్థలు అసలు టెండర్లలో పారదర్శకత, నిబంధనలు అమలు తీరును 'సాక్షి'కి వెల్లడించాయి. ఆ వివరాలు..

- ▶ 2022 సెప్టెంబరు ధరల ప్రామాణికంగా ఈ పీఎస్పీకి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ''వ్యాప్కోస్' డీపీఆర్ తయారు చేసింది. డీపీఆర్ తయారై 18 నెలలు గడిచిపోయింది. డీపీఆర్ ఆధారంగా ఈ ప్రాజెక్టుకు టెండరు పిలిచిన మొత్తం రూ. 6,717 కోట్లు కాగా మేఘా రూ.7,380 కోట్లకు (9.87 శాతం ఎక్కువకు) టెండరు పొందింది. ఏడాదిన్నర క్రితం ధరలతో పోల్చితే ఇప్పుడు మేఘా కోట్ చేసిన బిడ్‌లో ఏడాదికి 6 శాతం పెరుగుదలా ఉంది. అందువల్ల ప్రతిపాదిత టెండరు మొత్తంకంటే 9.87 శాతం ఎక్కువనడానికి లేదు. అన్ని అంశాలను విశ్లేషించిన తర్వాతే ప్రభుత్వ ఆమోదంతో ఏపీజెన్‌కో ఈ టెండరును ఆమోదించింది.
- ▶ ఉదయం, సాయంత్రం పీక్ లోడ్ అవసరాలు తీర్చడం ద్వారా గ్రిడ్‌ను స్థిరీకరించడం, అధిక ధరకు మార్కెట్లలో విద్యుత్ కొనుగోళ్లు తగ్గించడం, కర్బన ఉద్గారాల నియంత్రణ లక్ష్యాలుగా ప్రభుత్వ ఆదేశంతో అల్లూరి సీతారామరాజు జిల్లా ఎగువ సీలేరులో 1350 మెగావాట్ల సామర్థ్యంతో పీఎస్పీ నిర్మించాలని ఏపీజెన్‌కో నిర్ణయించింది.
- ▶ కేంద్ర ప్రభుత్వంలోని సంబంధిత విభాగాలకు ఈ ప్రాజెక్టు అనుమతికి సంబంధించిన అన్ని పత్రాలు అందజేసి, త్వరితగతిన వివరణలు ఇవ్వడం ద్వారా ఏపీజెన్‌కో చట్టబద్ధమైన అనుమతులు సాధించింది. సెంట్రల్ ఎలక్ట్రిసిటీ అథారిటీ (సీఈఏ) అనుమతి పొందిన తర్వాత గత ఏడాది జూన్‌లో పీఎస్పీ నిర్మాణానికి టెండర్లు ఆహ్వానించింది. పూర్తిగా నిబంధనలు, విధివిధానాలను అనుసరించి ఈ ఏడాది ఫిబ్రవరిలో టెండరు ఖరారు చేసింది. అన్ని నిబంధనలు పాటించినందునే టెండరు ఖరారుకు ఎనిమిది నెలలు పట్టింది. టెండర్ల ఖరారులో ఎలాంటి తొందరపాటు లేదనడానికి ఇదే నిదర్శనం.
- ▶ ఈ ఏడాది జనవరికల్లా పనులు ప్రారంభించి 2028 డిసెంబరుకల్లా ప్రాజెక్టు పూర్తి చేసి అందుబాటులోకి తేవడం ద్వారా ఐఎన్‌డీసీ, సీటీపీ మార్గదర్శకాల ప్రకారం కర్బన ఉద్గారాలను, భూతాపాన్ని తగ్గించాలని సీఈఏ షెడ్యూలు ఇచ్చింది. కర్బన ఉద్గారాల తగ్గింపు, భూతాపం (వేడి) నియంత్రణకు 2030 నాటికి 500 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి చేయాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్య సాధనకు పీఎస్పీ, బ్యాటరీలే మార్గాలు. ఇంత పెద్ద పరిమాణంలో బ్యాటరీల ఏర్పాటు సాధ్యంకానందున పీఎస్పీల నిర్మాణమే ఉత్తమ మార్గం. అందువల్లే ప్రభుత్వం ఈ దిశగా చర్యలు చేపట్టింది. ఈ పీఎస్పీ నుంచి డిస్కంలు విద్యుత్ తీసుకునేందుకు ఏపీఈఆర్సీ, ఏపీపీసీసీ అనుమతులు కూడా లభించాయి. భూసేకరణ ప్రణాళిక కూడా రూపొందించిన తర్వాత సీఈఏ అనుమతించింది. కేంద్ర అటవీ పర్యావరణ శాఖ మొదటి దశ పర్యావరణ అనుమతి ఇచ్చింది.
- ▶ భూసేకరణ, జీఎస్టీ, ఐడీసీ, ధరల పెరుగుదల వల్ల పెరిగే వ్యయం, చట్టబద్ధమైన అనుమతులు అన్నీ కలిపి 2022 ధరల ప్రాతిపదికన ఈ పీఎస్పీ నిర్మాణానికి రూ. 11,881.50 కోట్లవుతుందన్న అంచనాతో 2022 సెప్టెంబరులో వ్యాప్కోస్ డీపీఆర్ రూపొందించింది. దీని ప్రకారం జీఎస్టీ కాకుండా రూ. 6,717 కోట్ల అంచనా వ్యయంతో టెండర్లు ఆహ్వానించి రూ. 7,380 కోట్లకు (జీఎస్టీ కాకుండా).. అంటే 9.87 శాతం ఎక్కువకు కాంట్రాక్టు ఖరారు చేసింది.

ప్రజల నుంచి వస్తున్న స్పందనే మా ధైర్యం




మేకపాటి రాజమోహన్‌రెడ్డిని కలిసిన విజయసాయిరెడ్డి, కాకాణి గోవర్ధన్‌రెడ్డి తదితరులు

- సామాజికన్యాయమే వైఎస్సార్‌సీపీ విధానం
- రాజకీయ విలువల్లేని వ్యక్తి చంద్రబాబు
- వైఎస్సార్‌సీపీ నెల్లూరు పార్లమెంట్ అభ్యర్థి విజయసాయిరెడ్డి

నెల్లూరు(దర్గామిట్ట): పేద ప్రజలందరూ వైఎస్సార్‌సీపీతోనే ఉన్నారని, 175కు 175 అసెంబ్లీ సీట్లతో పాటు 25కు 25 ఎంపీ సీట్లు గెలుస్తామని వైఎస్సార్ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ నేత, నెల్లూరు పార్లమెంట్ నియోజకవర్గ అభ్యర్థి వి.విజయసాయిరెడ్డి చెప్పారు. వైఎస్సార్‌సీపీకి ప్రజల నుంచి లభిస్తున్న విశేష స్పందనే తమ ధైర్యమని ఆయన తెలిపారు. వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు, మాజీ ఎంపీ మేకపాటి రాజమోహన్‌రెడ్డితో నెల్లూరులోని ఆయన నివాసంలో విజయసాయిరెడ్డి ఆదివారం భేటీ అయ్యారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ ప్రతిపక్ష నేతలకు ఎంత డబ్బు ఉన్నా ప్రజల ప్రేమాభిమానాలను పొందలేరని, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై ప్రజలకు ఉన్న ప్రేమ ఏ మాత్రం చెక్కుచెదరదన్నారు. సీఎం వైఎస్ జగన్ సారథ్యంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతి పేదవాడికి మౌలిక వసతులు కల్పించిందని, తలసరి ఆదాయం పెరిగేందుకు శక్తివంచనలేకుండా కృషి చేసిందని చెప్పారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ముఖ్యమంత్రిని చేసుకోవాలని ప్రజలంతా దృఢసంకల్పంతో ఉన్నారన్నారు. సామాజిక న్యాయమే వైఎస్సార్‌సీపీ విధానమని, బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ వర్గాల అభివృద్ధికి తమ ప్రభుత్వం, పార్టీ విశేషంగా కృషి చేశాయని తెలిపారు. వైఎస్సార్‌సీపీ నెల్లూరు సిటీ నియోజకవర్గ అభ్యర్థిగా ముస్లిం మైనారిటీ వర్గానికి చెందిన ఖలీల్‌అహ్మద్‌కు అవకాశం కల్పించడం ఆయా వర్గాలకు తమ పార్టీ ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమన్నారు. రానున్న ఎన్నికల్లో ఖలీల్‌అహ్మద్ మంచి మెజారిటీతో తప్పక విజయం సాధిస్తారని చెప్పారు.

రాజకీయ విలువల్లేని వ్యక్తి చంద్రబాబు

చంద్రబాబుకు రాజకీయ విలువలు లేవని, అవకాశవాద రాజకీయాలకు ఆయన నిదర్శనమని విజయసాయిరెడ్డి అన్నారు. అధికారం కోసం చంద్రబాబు పొత్తు పెట్టుకోని పార్టీ లేదని, బీజేపీ, కాంగ్రెస్, టీఆర్ఎస్, సీపీఐ.. ఇలా అన్ని పార్టీలతోనూ ఆయన పొత్తులు పెట్టుకున్నారని గుర్తుచేశారు. అధికారమే పరమావధిగా చంద్రబాబు రాజకీయం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు బీద మస్తాన్‌రావు, ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజగోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వ్యక్తుల్లో పిచ్చితనం అనేది అరుదు– కానీ గ్రూపుల్లో, పార్టీల్లో, జనాల్లో, కాలాల్లో అదొక నియమం.

– నీషే

సాక్షి

సోమవారం, 18 మార్చి 2024

నెహ్రూ జాకెట్ సాహిత్యం

నెహ్రూ గారిని నిలదీయడం ఈ మధ్య ఫ్యాషన్ అయిపోయిందిగాని నిజానికి ఆయనను నిలదీయాల్సింది నెహ్రూ జాకెట్‌ను ఎందుకు పాప్యులర్ చేశావయ్యా అని. రచయితలు, కవులు, విమర్శకులు ముమ్ముందు రోజులలో లాల్చీ పైజమా ధరించడమేగాక నెహ్రూ జాకెట్‌ను కూడా తగిలించారంటే గనక చచ్చినట్టు వారు సాహిత్యకారులుగా మన దేశంలో చలామణి అవుతారని ఆయన ఊహించి ఉండడు. ఎరిగిన సాహిత్యకారులు అడపా దడపా ఆ అదనపు వస్త్రాన్ని ధరించినా తాము సాహిత్యకారులమే అని తప్పక నిరూపించుకోవాలనుకునే వారికి మాత్రం నెహ్రూ జాకెట్ కవచ కుండలం.

పూర్వం రోజులలో కొందరు సాహితీ తాపసులు పెన్నును బుగ్గకు పెట్టుకుని, నుదుటిని నింగి వంక ఎత్తి పెట్టి ఫొటో దిగి, పుస్తకం వెనుక వేసుకోవడం వల్ల వారు రచయితలని, కవులని నమ్మాల్సి వచ్చేది. మరికొందరు టెలిఫోన్ రిసీవర్‌ను చెవి దగ్గర పెటుకొన్న ఫొటోను పుస్తకం వెనుక వేయడం వల్ల అమ్మో వీరు రచయితలేస్మీ అనుకోకుండా ఉండలేకపోయేవారం. 'మానవతా... ఎక్కడమ్మా నీ చిరునామా?' అని గూగుల్ మేప్స్ లేని కాలంలో ఎవరు పై అడ్రస్ అడుగుతూ కవిత్వం రాసినా వారు కవులు కాకుండాపోలేదు. ఇక ఏ కాలంలో అయినా ఎల్.ఎస్.వి. శేషాచలం, మునవర్తి సుబ్రహ్మణ్యం, విక్టర్ మనోహర్, ప్రొఫెసర్ చారులత వంటి ప్రముఖ విమర్శకులు ఉంటారు కనుక వారు ముందు మాట రాసి వదిలారంటే– ఎందుకొచ్చిన గొడవ అని నోరు మెదపక అట్టి రచయితలను రచయితలే అనుకోవడమూ కద్దు.

ఏదేని ఒక శాఖ కలిగిన రాష్ట్రమంత్రితో, ఏదేని ప్రాదేశిక ఇన్‌కమ్‌టాక్సు కమిషనర్‌తో, లేదంటే స్థానిక వాకర్స్ క్లబ్ ప్రెసిడెంట్‌తో... ఈ ముగ్గురితో కాని కనీసం వీరిలో ఇద్దరితో కాని ఫొటోలు దిగి, ఫేస్‌బుక్‌లో పెట్టి, ఇక మమ్మల్ని సాహిత్యకారులం కాదు అనంటే తంతాం అనేవారు ఉన్నారంటే నోరు నొక్కుకోవాల్సిన పని లేదు. జీవితంలో అక్షరమ్ముక్క రాయకపోయినా రాసే వాళ్లందరి ఫోన్ నంబర్లు కలిగి ఉండటమే కాదు వారికి కాల్ చేసి 'ఏహోయ్ ఎలా ఉన్నావ్' అనిగానీ, 'నమస్కారమండీ... టిఫినయ్యిందా' అనిగానీ అడగ్గలిగే చనువు ఉన్నందుకు కనీసం డజను మంది తెలుగునాట ప్రముఖ సాహిత్యకారులుగా చలామణి అవుతున్నారంటే గుండె పొంగే సంగతి. 'శుంఠల్లారా... ఇదా మీ ప్రతాపమూ... నన్ను గనక కళ్లకు గంతలు గట్టి ఢిల్లీలో ఏమూల వదిలినా నేరుగా సాహిత్య అకాడెమీ ఆఫీసుకు చేరుకోగలను' అనేవారి ప్రదక్షిణ పటిమ వారికి ఇస్తున్న అతిశయం అంతా ఇంతా కాదు.

'అడుగడుగున నుడి ఉంది', 'అక్షర రశ్మీ జయతు', 'మనమంతా కలం కులం'... వాట్సప్ గ్రూప్‌లను స్థాపించి, ఒక దానిలో నూట పదహారుకు తక్కువ కాకుండా సభ్యులను చేసి, అడ్మిన్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్న ఏకైక హోదా వల్ల సాహిత్య దశా దిశను నిర్దేశించాలని కన్నీళ్లతో తపన పడేవారెందరో మన హృదయాలను చెమ్మగిల్ల చేస్తున్నారు. ఈ యొక్క వాట్సప్ గ్రూప్‌లలో ప్రతి ఒక్క కవిత, వ్యాఖ్యకు మరువక లైక్ కొట్టేవారిని దృష్టిలోకి తీసుకుని మాసాంతంలో వారికో అవార్డు బహూకరించడం మరో విశిష్ట ప్రోత్సాహక ప్రోత్సహితం. జూమ్‌లో స్లాట్ బుక్ చేసి, కార్డు డిజైన్ చేయగల వనరులు కలిగినవారు వారానికి పది మందిని సాహితీ సమాలోచనంలో ముమ్మరం చేయడం చూస్తే ఏమిచ్చి వీరి రుణం తీర్చుకోగలం అనిపిస్తుంది. గుర్తు తెలియని విదేశాలకు వెళ్లి స్థానిక గాంధీనగర్ అసోసియేషన్ స్థాయి సాహితీ సమ్మేళనంలో పాల్గొని రుజువు పత్రంతోనూ, తెల్లవాళ్లతోనూ ఫొటోలు దిగి బెదురు, బెరుకు పుట్టించే వారిది స్వీయ విమానచార్జీలు భరించగలిగే స్థాయి.


సాహిత్యం అంటే అందరికీ ఇష్టం. పాఠకులుగా ఉత్తమ సాహిత్యాన్ని ఇష్టపడేవారూ సృజనకారులుగా ఉత్తమ సాహిత్యసృష్టికి పెనుగులాడేవారూ ఎప్పుడూ ఉంటారు. ఈ ఇద్దరూ ప్రతి ప్రాంతంలో, భాషలో, దేశంలో తమ తమ సాహిత్యాన్ని గౌరవ భంగం కలగకుండా కాపాడుకుంటూ వస్తారు. అలాగే ప్రతి సందర్భంలో, ప్రతి సన్నివేశంలో ఈ సాహిత్యంలో భాగం కావాలని నిజాయితీగా అభిలషించేవారూ ఉంటారు. వీరి ప్రయత్న శుద్ధి, సృజన సామర్థ్యం, విడదీయలేని స్వభావం ఇవ్వవలసిన గుర్తింపు ఇస్తూనే ఉంటాయి. వీరు కాక ఔత్సాహిక పాఠకులు, ఔత్సాహిక సాహితీ సేవకులూ ఉంటారు. వీరు తమను తాము సాహితీకారులుగా భావించుకుని కార్యాచరణలో దిగడమూ, సాహిత్యానికి ప్రతినిధులుగా మారడం నేటి సోషల్ మీడియా కాలంలో విస్తృతమైంది. సాహిత్యం ఇచ్చే గుర్తింపు ఆనందాన్ని, ఆత్మసంతృప్తిని కలిగించడమేగాక ఏదో ఒక ఊతం దొరికింది కదా అనుకునేలా చేయడం ఇందుకు కారణం. ఇవన్నీ ఉండాల్సినవే. ఉండతగ్గవే. కాకుంటే శ్రుతి మించి అసలు కొంత, కొసరు మరింతగా మారడం నేటి దుఃస్థితి.

వాస్తవానికి రెండు రాష్ట్రాలలోని చిన్న ఊళ్లలో ఉంటూ మంచి కవిత్వాన్ని, కథను రాస్తున్న యువతరం ఎందరో ఉన్నారు. అలాగే ఏళ్లకేళ్లు తమ మానాన తాము రాసుకుంటూ పాఠకుల గౌరవం పొందినవారూ ఉన్నారు. వీరంతా పి.ఆర్. చేయకపోవచ్చు. తమను తాము ముందుకు నెట్టుకోకపోవచ్చు. అంతమాత్రాన రాష్ట్ర, జాతీయస్థాయి వేదికల మీద వీరు కనపడాల్సిన పనిలేదు అనుకోరాదు. అదే సమయంలో పరిచయ సామర్థ్యమే సాహితీ సామర్థ్యంగా చెల్లుబాటయ్యే వారు అట్టి వేదికల మీద పదే పదే సాహితీ ముఖాలుగా కనిపించడాన్నీ ఉపేక్షించాల్సిన పని లేదు. 'సత్యముతో పని ఏల, మిడియోకర్‌లతో కలిసి నడిచి ప్రయోజనాలు పొందితే పోలా' అనుకునే నిజ సాహితీకారులదీ ఈ దోషం. కళ్లు మూత.

ఏమైనా మాట్లాడే సందర్భం వస్తుంది. అభినయ సాహిత్యకారులూ కొంచెం నెమ్మదించండి!

ఇదేమీ తేలికైన ప్రశ్న కాదు!

కామెంట్



కరణ్ థాపర్

రాజకీయ పార్టీలకు రహస్యంగా నిధులు అందించటానికి వీలు కల్పించే ఎన్నికల బాండ్ల పథకం రాజ్యాంగ విరుద్ధం అంటూ ఫిబ్రవరి 15న సుప్రీంకోర్టు కీలకమైన తీర్పును వెలువరించింది. ఆ సందర్భంలోనే – భారతీయ స్టేట్ బ్యాంకు ఇంతవరకు తాను కొనుగోలు చేసిన బాండ్ల వివరాలను నిర్ణీత గడువులోపు ఎన్నికల సంఘానికి వెల్లడించాలని ఆదేశించింది. ఆ ఆదేశాలను ఉల్లంఘించడంతో బ్యాంకు పనితీరుపై అసహనం వ్యక్తం చేసిన ధర్మాసనం, కోర్టు ఆదేశాల ప్రకారం బాండ్ల వివరాలను కేంద్ర ఎన్నికల సంఘానికి ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించింది. దాంతో భారతీయ స్టేట్ బ్యాంక్ కొంతమేరకైనా వివరాలు వెల్లడించాల్సి వచ్చింది. అయితే, ప్రశ్నేమిటంటే... ఎంతో ప్రతిష్ఠాత్మకమైన బ్యాంకు చేత ఇంతకాలంగా వివరాలు వెల్లడించనివ్వకుండా చేయిస్తున్నది ఎవరు అని! అయితే ఇదేమీ తేలికైన ప్రశ్న కాదు!

నా తొలి బ్యాంకు ఖాతా ఢిల్లీ పార్లమెంట్ స్ట్రీట్‌లోని భారతీయ స్టేట్ బ్యాంకు శాఖలో ఉండేది. నా పేరిట నాన్న దానిని తెరిచినప్పుడు నా వయసు 16 ఏళ్లు. మా పూర్వీకుల భూములను విక్రయించటం ద్వారా నా వాటాగా వచ్చిన మొత్తాన్ని జమ చేసేందుకు ఉద్దేశించిన ఖాతా అది. ఆ ఖాతాను ప్రతి నెలా వడ్డీ వచ్చేలా ఫిక్స్‌డ్ డిపాజిట్‌కు జత కలిపారు. ఆ వడ్డీ పెద్ద మొత్తమేమీ కాదు కానీ, నేనొక డబ్బు గల ఆసామినన్న భావన నాలో కలిగించింది.

నాన్న సొంత ఖాతా గ్రిండ్లేస్ బ్యాంకులో ఉండేది. ఆ బ్యాంకు ఇప్పుడు ఉనికిలో లేదు. నాన్న నా కోసం ఆ రోజు ఎస్.బి.ఐ. బ్యాంకును ఎందుకు ఎంచుకున్నారో నాకు గుర్తులేదు కానీ, ఆ సంస్థ పట్ల ఆయన ఉన్నతమైన అభిప్రాయాన్ని కలిగి ఉండేవారని అనుకుంటాను.

డెబ్బయ్‌లలో బ్యాంకింగ్ చాలా భిన్నంగా ఉండేది. నగదు లావాదేవీల టెల్లర్ కౌంటర్‌ల వద్ద పొడవైన క్యూలు ఉండేవి. సొంత చెక్కులకు డబ్బు ఇవ్వడానికి కూడా వారి ఖాతాలను తనిఖీ చేసేవారు. అదంతా కూడా అమిత ప్రయాసతో కూడిన దుర్భరమైన తతంగంలా ఉండేది. ఆ దశలో అకస్మాత్తుగా ఎస్.బి.ఐ. మన ఖాతాలో సరిపడా నిధులు ఉన్నాయా, లేవా అన్నది కూడా నిర్ధారణ చేసుకోకుండానే సెల్ఫ్–చెక్కులను ఒక నిర్ణీత పరిమితి వరకు నగదుగా మార్చుకునే అవకాశం కల్పించిన మొదటి బ్యాంకుగా అవతరించింది. ఆ దెబ్బతో, అరగంట పట్టే పని... నిమిషాల్లో అయిపోవడం మొదలైంది.

ఆఖరికి నాగర్‌వాలా నగదు కుంభకోణం కూడా ఎస్.బి.ఐ. దేదీప్యాన్ని చెక్కుచెదర్చలేక పోయింది. ఎగతాళిగా నవ్వినవారు లేకపోలేదు కానీ, బ్యాంకు నుంచి తమ ఖాతాలను ఉపసంహరించుకున్న వారు చాలా తక్కువ. అలాంటి కుంభకోణాలు ఊహించినవే. అయినా అవి నేరారోపణలు వచ్చేంతగా పరిగణన పొందనివి.

ఆ రోజుల్లో మా అమ్మ 50 పైసలు, 1 రూపాయి నాణేలను పొదుపు చేసేవారు. ఒక పాత టప్పర్‌వేర్ బ్రెడ్ బాక్సులో వాటిని ఆమె భద్రంగా దాస్తూ ఉండేవారు. అలా కూడబెట్టిన ఆ అపురూపమైన నాణేలను ఎస్.బి.ఐ.కి తీసుకెళ్లి ఆమె ఖాతాలో జమ చేసి రావడం అనే బాధ్యత నాపై పడుతుండేది. కౌంటర్‌లో ఉండే టెల్లర్ ఆ నాణేలను తూకం వేసి చూసి, మా అమ్మలోని ఇలా పోగేసే గృహిణి నైజాన్ని ప్రశంసించేవారు. "మేరీ బీవీ భీ యహీ కర్తీ హై" (మా ఇంటావిడ కూడా ఇలాగే చేస్తుంటుంది) అనే అతడి మాట నాలోని టీనేజ్ బిడియాన్ని పోగొట్టేది. ఆయన అలా అనేవరకు కూడా నన్ను నేను మురికి నాణేలను సంచిలో మూట కట్టుకుని బ్యాంకుకు వెళ్లే వ్యాపారిలానే భావించుకున్నాను.



దేదీప్యమానం: న్యూఢిల్లీలోని ఒక ఎస్.బి.ఐ. శాఖ భవంతి

స్టో లేదా కేంబ్రిడ్జి నుండి సెలవులకు వచ్చినప్పుడు పార్లమెంటు స్ట్రీట్ బ్రాంచి నిరంతరం నాకు పని కల్పించేది. నాకు మాత్రమే కాదు, ఇంట్లో అందరికీ! ఎందుకు అని నన్నడక్కండి. అనుకోకుండా ఎందుకో వెళ్లేవాళ్లం. వెళ్లిన ప్రతిసారీ ఇలా వెళ్లి అలా వచ్చేయటం అన్నట్లుగా ఉండకపోయే వాళ్లం. కనుక, ఆ ప్రదేశంపై నాకు మక్కువ ఏర్పడటంలో ఆశ్చర్యం ఏమీ లేదు. తరచుగా ఏం జరిగేదంటే, గ్రౌండ్ ఫ్లోర్‌లో నా పని పూర్తి అయినప్పుడు పై అంతస్తులకు కూడా వెళ్లి, నా చిన్న మొత్తాల పొదుపుపై సలహాలు అడుగుతుండేవాడిని. 20 ఏళ్ల యువకుడిలోని ఆ అతిక్రమణను ఐదవ అంతస్తులోని మేనేజర్లు గొప్ప సంసిద్ధతతో క్షమించేసేవారు. నా ప్రశ్నల్ని వారు స్వాగతించారని కూడా నాకు గట్టిగా అనిపించేది.

ఒకటి మాత్రం కచ్చితంగా చెప్పగలను. నాకు తెలిసిన బ్యాంకు ఎప్పుడూ కూడా గత వారం ఎస్.బి.ఐ. వ్యవహరించిన విధంగా అయితే లేదు. సుప్రీంకోర్టు మందలింపుతో బహుశా ఆ బ్యాంకు సిబ్బంది ముడుచుకుపోయి ఉండొచ్చు. మనకున్న అత్యుత్తమ సుప్రీంకోర్టు న్యాయమూర్తులలో ఒకరైన మదన్ లోకూర్, "బ్యాంకుకు ఇది చెంపపెట్టు" అని వ్యాఖ్యానించారు. న్యాయమూర్తిగా ఆయన పని చేసిన ఇన్నేళ్లలోనూ ఇలా ఒక బ్యాంకు మందలింపునకు గురైన సంఘటనను ఆయన గుర్తు చేసుకోలేదు.

గత సోమవారం భారత ప్రధాన న్యాయమూర్తి అడిగిన ఒక ప్రశ్న ఎస్.బి.ఐ.ని నెలల తరబడి, కాదంటే ఏళ్ల తరబడి వేధిస్తుందా అని నా ఆందోళన. "ఆదేశాలను పాటించటం మీకు కష్టంగా ఉందని మీరు చెబుతున్నారా?" అని ఆయన అడిగారు. "గత 26 రోజులలో మీరు తీసుకున్న చర్యలు ఏమిటి? ఆ విషయంలో మీరు నిశ్శబ్దంగా ఉండిపోయారు. ఎస్.బి.ఐ. నుంచి ఒక స్థాయి నిజాయితీని మేము ఆశిస్తున్నాం" అన్నారు.

నా బ్యాంకు ఇంతగా తక్కువ కావటం – ఇప్పటికీ అది నా బ్యాంకులలో ఒకటి కావటం – నాకు బాధను కలిగిస్తోంది. ఎందుకు అలా అనిపిస్తోందని అడక్కండి. బహుశా ఇది అర్ధ శతాబ్దం పాటు సాగిన బాంధవ్య పరిణామం కావచ్చు. లేదా, నాకు అలా అనిపిస్తుండొచ్చు. నన్ను నేను ప్రశ్నించుకున్నాను. ఇది తప్ప వేరొక వివరణ నాకు తోచటం లేదు.

అత్యంత దారుణమైన విషయం ఏమిటంటే – సుప్రీం కోర్టు ఇచ్చిన ఆదేశాన్ని ఎస్.బి.ఐ. ఉద్దేశపూర్వకంగా తనకు అవసరమైన రీతిలో తప్పుగా అన్వయించుకోవటం ద్వారా, కోర్టు ఆదేశించిన ఒక సాధారణమైన పనిని కావాలనే క్లిష్టతరం చేసి, ఆ ఆదేశాన్ని పాటించలేకపోవటానికి తిరిగి ఆ సంక్లిష్టతనే ఒక నెపంగా చూపిందా అన్న అనుమానానికి ఆస్కారం కలగడం. ఒక గౌరవప్రదమైన బ్యాంకు నుంచి మీరు ఇలాంటిది ఊహించలేరు. దీర్ఘకాలంగా మీరు అనుబంధం కలిగి ఉన్న ఒక బ్యాంకు విషయంలో ఇలా జరిగినప్పుడు భ్రమలు తొలిగినట్లుగా అనిపిస్తుంది.

ప్రభుత్వమే వెనుక ఉండి ఇలా జరిపించిందా? ఇదేమీ తేలికైన ప్రశ్న కాదు. అయినప్పటికీ మీలోని లక్షల మందికి, ఆ లక్షల్లో ఎక్కువ మందికి ఈ ప్రశ్నకు సమాధానం తెలుసు. కానీ ఈ ప్రశ్న అడగటం వెనుక ఉన్న వాస్తవం బాధను కలిగిస్తుంది. ఆ బాధ అందరి కంటే ఎక్కువగా ఆ బ్యాంకు ఉన్నతాధికారులలో ఉంటుందని నేను ఆశిస్తున్నాను.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!



సోషల్ మీడియా

నమ్మొచ్చా?



చూస్తుంటే భూమ్మీద ఉన్న మనుషుల్లో భారతీయులే ఎంతమాత్రమూ సంతోషంగా ఉన్నట్టు లేరు (ప్రపంచ హ్యాపీనెస్ ఇండెక్స్‌లో భారత్ 126వ ర్యాంకులో ఉందట!). ఇజ్రాయెల్, పాలస్తీనా, ఉక్రెయిన్, రష్యా, ఆఖరికి పాకిస్తాన్ కన్నా కూడా మనం వెనుకబడి ఉన్నాం. ఈ చెత్త సూచికలు కొన్నిసార్లు నన్ను దిగ్భ్రమకు గురిచేస్తుంటాయి.

– సంజీవ్ సన్యాల్, ఆర్థికవేత్త

ఒకే రోజు చేయలేమా?



ఎన్నికలకు సంబంధించి ఇంత యంత్రాగం ఉన్న దేశం అయినప్పటికీ, భారతీయులందరికీ ఒకే రోజున ఎన్నికలు జరపలేకపోవడం పట్ల నిరాశగా ఉంది. ఎన్నికల తంతు వారాలు సాగుతుంది.

– సుహాసినీ హైదర్, జర్నలిస్ట్

పిరికి దాడి



ఉత్తర వజీరిస్తాన్‌లో రక్షణ బలగాల మీద జరిగిన తీవ్రవాద దాడి హేయమైనది. అది పిరికిపందల హింసాత్మక చర్య. ఈ కష్టకాలంలో బాధితులకు, వారి కుటుంబాలకు నా సానుభూతి. మనం తీవ్రవాదానికి వ్యతిరేకంగా సమష్టిగా నిలబడాలి. శాంతి భద్రతల కోసం కలిసి పనిచేయాలి.

– అన్వర్ ఉల్ హక్ కాకర్, పాకిస్తాన్ మాజీ ఆపద్ధర్మ ప్రధాని

మనమే నయం



మన కంటే ధనవంతులు ఎక్కువగా ఈ (కేంద్ర) ప్రభుత్వపు దౌర్జన్యానికి గురి అవుతున్నారని తెలియడం సంతోషంగా ఉంది.

– వీణా వేణుగోపాల్, రచయిత్రి

మళ్లీ మళ్లీనా?



ఉన్నత విద్యాసంస్థలకు మనల్ని దెబ్బ కొట్టడానికి ప్రత్యేక విధానాలుంటాయి. ఎందుకంటే ప్రతిదానికీ అప్లికేషన్ పెట్టుకోవాలి. పీహెచ్‌డీకి అప్లై చెయ్యి. ఫెలోషిప్‌కు అప్లై చెయ్యి. గ్రాంట్ కోసం అప్లై చెయ్యి. ఉద్యోగం కోసం అప్లై చెయ్యి. ప్రమోషన్ కోసం అప్లై చెయ్యి. పేపర్ పబ్లిష్ కావడానికి అప్లై చెయ్యి. అమ్మో! తిర్పునకు గురికావడం అనేది అందరికీ చేతనయ్యే విషయం కాదు.

– టి.వి.నైనన్, పరిశోధకుడు

సమాన దూరం



మీరా నంద ప్రపంచంలోని గొప్ప సైన్సు హిస్టారియన్లలో ఒకరు. ఆమె హిందూత్వకు తీవ్రమైన విమర్శకురాలు. కానీ ఆమె రోజూ టీవీలో గానీ, సాహిత్య పండుగల్లోగానీ కనబడదు. ఎందుకంటే ఆమె అంతే తీవ్రంగా లెఫ్ట్ ఎకోసిస్టమ్‌ను కూడా వ్యతిరేకిస్తారు. ఆమె నిజమైన ఉదారవాది. ఆమె నా ఐకాన్.

– సంజుక్తా బసు, జర్నలిస్ట్

ఇన్ బాక్స్

ఆసక్తి రేపే జీవితం!

సినిమా హాలు ముందు కిళ్లీలు అమ్మాడు. సోడాలు కొట్టాడు. థియేటర్‌లో పకోడీ పొట్లాలు అమ్మాడు. ఆరో తరగతి తప్పాడు. నలుగురు తమ్ముళ్లు, ఇద్దరు చెల్లెళ్ల కడుపు నింపటానికి చక్కిలాలు, విస్తరాకులు అమ్మాడు. చిన్నాన్న నడిపే హోటల్లో పనికి కుదిరాడు. గిరిజన తండాల నడుమ నాటుసారా కాశాడు. నక్సలైట్లకు టీ కాచి ఇచ్చాడు. మావయ్య నడిపే హోటల్లో టేబుళ్లు తుడిచాడు. క్లీనర్ నుంచీ కుక్ వరకూ తనే సమస్తం.

ఆముదాలవలస వదిలేసి పర్లాకిమిడి చేరుకున్నాడు. పద్నాలుగేళ్ల వయసులో చిన్న ఇల్లు అద్దెకు తీసుకుని హోటల్ ప్రారంభించాడు. పెద్ద తమ్ముడు అంట్లు తోమేవాడు. చెల్లి కూరగాయలు కోసేది. తల్లి వంట చేసేది. కష్టమర్లు పెరిగారు. నాలుగు కాసులు కళ్లజూశాడు. పెద్ద తమ్ముడితో పెట్టించిన ఫాస్ట్ ఫుడ్ సెంటర్, రెండో తమ్ముడితో పెట్టించిన టిఫిన్ సెంటర్ ఘుమఘుమలాడాయి. ముగ్గురూ కలిసి చిన్న తమ్ముళ్లను చదివించారు. చెల్లికి పెళ్లి చేశారు. కమీషన్ బిజినెస్‌తో రెండు వేలు సంపాదించాడు. సంతోషంతో ఉప్పొంగిపోయేలోగానే హోటల్ మంటల్లో కాలిపోయింది. గుండెబలంతో పాటు కండబలం కూడా అవసరమని గుర్తించాడు. పదిహేనేళ్ల వయసులో జిమ్‌లో చేరాడు. 'గ్యాంగ్'లు మంచికీ పనికొస్తాయని నిరూపించాడు.



పదహారో ఏట పుస్తకపఠనం అలవడింది. వామపక్ష భావజాలం పోరాటం నేర్పింది. 'పాతాళ గరుడ' మూలికల్ని సేకరించాడు. నాటుసారా వ్యాపారంలోకి అడుగు పెట్టాడు. రేషన్ షాపు డీలర్‌షిప్ తీసుకున్నాడు.

ఇరవై మూడేళ్ల వయసులో పుష్పాంజలిని పెళ్లి చేసుకున్నాక, వెర్మిసెల్లి పరిశ్రమ స్థాపించాడు. జీడిపిక్కలు కొన్నాడు. చింతపండు అమ్మాడు. వైన్ షాపు నడిపాడు. బార్ అండ్ రెస్టారెంట్లు ప్రారంభించాడు.

ఇదంతా సజావుగా, సాఫీగా జరగలేదు. నక్సలైట్లు ప్రజాకోర్టుకు పిలిచి శిక్షించబోయారు. ఎమ్మెల్యేగా పోటీ చేసి ఓడిపోయాడు. రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరుగా సాగింది. పేరు ప్రతిష్ఠలతో మురిసిపోయేలోపు పోలీసులు అరెస్టు చేశారు. 18 నెలలు జైల్లో గడిపాడు.

అయినా ఎలా నిలదొక్కుకున్నారు? వివిధ రాష్ట్రాలలో వైద్య కళాశాలలు ఎలా స్థాపించారు? 'డాక్టర్' తిరుపతి పాణిగ్రాహి ఎలా అయ్యారు? వేల కోట్ల రూపాయల వ్యాపార సామ్రాజ్యానికి అధిపతి ఎలా అయ్యారు?

ఇవన్నీ తెలియాలంటే ఆయన ఆత్మకథ 'జ్ఞానం చెక్కిన శిల్పం' చదవాల్సిందే. ప్రముఖ రచయిత యండమూరి వీరేంద్రనాథ్ (శ్రీశైలమూర్తి సహ రచయిత) రాసిన ఈ పుస్తకం నేటి తరం యువతకు ఓ విలువైన కానుక.

– ఎమ్వీ రామిరెడ్డి । 9866777870

అబ్బురపరిచిన 'అనంత' భావోద్వేగం

సందర్భం



బి.టి. గోవిందరెడ్డి

కళ్లు చెదిరే ఐశ్వర్యం, దేన్నయినా క్షణాల్లో సాధించగల అధికారం, కుటుంబ విలువల పట్ల అచంచల విశ్వాసం, భగవంతుడిపై అంతులేని భక్తి... ఇవన్నీ ఒకే కుటుంబంలో కలగలిసి వుండటం ఊహాతీతం. కానీ ప్రపంచ కుబేరుల జాబితాలో అగ్రస్థానంలో ఉన్న 'అంబానీ పరివార్' వీటన్నిటి సమ్మేళనం అని మరోసారి రుజువైంది. గుజరాత్‌లోని జామ్‌నగర్‌లో మూడు రోజులపాటు ఈమధ్య జరిగిన ప్రీ వెడ్డింగ్ సంబరాలు దేశంలోనే ఎప్పుడూ కనీవినీ ఎరుగనివి. కానీ వీటన్నిటి కంటే అందరికీ ఆసక్తి కలిగించింది మరొకటుంది. అది జూలైలో పెళ్లికొడుకు కాబోతున్న అనంత్ అంబానీ చేసిన ప్రసంగం! చిన్ననాటి స్నేహితురాలూ, ప్రియురాలూ అయిన రాధికా మర్చంట్‌తో ఆయనకు వివాహం అవుతున్న సందర్భంగా ఈ ప్రీ వెడ్డింగ్ వేడుకలు జరిగాయి. వర్తమాన ప్రపంచాన్ని ప్రభావితం చేస్తున్న వివిధ రంగాల ప్రముఖులు, కార్పొరేట్ కుబేరులు, బాలీవుడ్ అగ్రతారలు, క్రికెటర్లు సకుటుంబ సమేతంగా వచ్చారు. అమెరికా మాజీ అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ కుమార్తె ఇవాంకా హాజరయ్యారు.

అనంత్ అంబానీ చేసిన ప్రసంగం అందరి మనసులనూ మెలిపెట్టింది. కుమారుడి ప్రసంగం వింటూ ముఖేష్ దంపతులైతే కంటతడి పెట్టారు. 2003లో కరణ్ థాపర్ 'బీబీసీ' కోసం ముఖేష్–నీతా దంపతులను ఇంటర్వ్యూ చేసిన సందర్భంగా నీతాను 'మీ దృష్టిలో డబ్బంటే ఏమిటి?' అని అడిగినప్పుడు 'డబ్బు దానికదే అంతిమ లక్ష్యం కాదు... దాన్ని ఎలా వినియోగిస్తామన్నదే ముఖ్యం' అని చెబుతూ ఒక మాటన్నారు. 'డబ్బు సంపాదన, సంపద జీవితం కానే కాదు... కొన్ని అపురూప చిరస్మరణీయ జ్ఞాపకాలను నిర్మించుకోవటమే జీవితం' అని చెప్పారు. అనంత్ హృదయాంతరాళాల్లోంచి పెల్లుబికి వచ్చిన మాటల వెనక ఆ విలువల జీవశక్తి నిండివుందనీ, ఆ దంపతుల పెంపకం అతణ్ణి తీర్చిదిద్దిందనీ అనిపిస్తుంది.

ఏమన్నారూ అనంత్? తన కుటుంబసభ్యులంతా తన కోసం, తన సుఖ సంతోషాల కోసం పడుతున్న శ్రమను వివరించారు. తనకున్న ప్రత్యేక అనారోగ్య సమస్యల నేపథ్యంలో అమ్మానాన్నలిద్దరూ అనుక్షణమూ తనను అపురూపంగా చూసుకున్న వైనాన్ని కళ్లకు కట్టారు. ప్రీ వెడ్డింగ్ వేడుకలు అత్యంత విలక్షణంగా ఉండాలన్న తపనతో గత కొన్ని నెలలుగా రోజుకు కనీసం 20 గంటలు తన కుటుంబసభ్యులంతా పడిన కఠోర శ్రమను గుర్తుకు చేసుకున్నారు. అందరూ అనుకుంటున్నట్టు తన జీవితం పూలపాన్పు కాదనీ, చిన్ననాటినుంచీ భరించలేని బాధల ముళ్లు వేధిస్తూనే ఉన్నాయనీ చెప్పారు. అనారోగ్య సమస్యల నుంచి బయటపడే క్రమంలో వాడక తప్పని స్టెరాయిడ్స్ చివరకు ఊబకాయానికి కారణమైన తీరును తెలిపారు.



రాధికా మర్చంట్, అనంత్ అంబానీ

సాధారణంగా 25–30 ఏళ్ల మధ్యనుండే సంపన్న కుటుంబాల యువతలో చాలా సందర్భాల్లో విచ్చలవిడితనం, బాధ్యతారాహిత్యం కనబడుతూ ఉంటుంది. ఇంగ్లిష్ తప్ప ఏదీ మాట్లాడలేరు.

ఈ వేడుకల సందర్భంగా 'న్యూస్18'కు ఇచ్చిన ఇంటర్వ్యూ అనంత్‌లోని మానవీయతను వెల్లడిస్తుంది. నిలువెల్లా వినమ్రత, పలికే ప్రతి మాటలో నిజాయితీ అతని సొంతం. ఇంగ్లిష్‌లో కాదు... అందరికీ అర్థమయ్యేలా స్వచ్ఛమైన హిందీలో భావ వ్యక్తీకరణ అనంత్ ప్రత్యేకత. గాయపడిన, ఆదరణ కోల్పోయిన వన్యప్రాణులను అక్కున చేర్చుకుని వాటి సంరక్షణ కోసం జామ్‌నగర్‌లో మూడువేల ఎకరాల్లో 'స్టార్ ఆఫ్ ద ఫారెస్ట్ వన్‌తార' అనే ప్రాజెక్టును నిర్వహిస్తున్నారు. చిన్ననాడు తన నాయనమ్మ కోకిలా బెన్ నేర్పిన ప్రేమ, దయ భావనలే ఈ ప్రాజెక్టుకు తనను పురిగొల్పాయని చెప్పారు. తన ఆధ్వర్యంలోనే గుజరాత్ ప్రభుత్వ సహకారంతో ఒక 'జూ' కూడా నిర్వహిస్తున్నారు.

'ఇండియా టుడే' ఛానెల్‌లో వచ్చిన ఇంటర్వ్యూ ఆయనలోని మరో మనిషిని ఆవిష్కరించింది. ఆ యువకుడిలో దాగున్న ఆధ్యాత్మిక భావనలూ, మాతృదేశంపై ఉన్న చెక్కుచెదరని మమకారాన్నీ ఆ ఇంటర్వ్యూ వెలికితీసింది. పెళ్లి వేడుకలు మన దేశంలోనే జరుపుకోవాలన్న ప్రధాని నరేంద్ర మోదీ పిలుపే స్ఫూర్తిగా అందుకోసం జామ్‌నగర్‌ను ఎంచుకున్నానని చెప్పారు. తన ఇంటిల్లిపాదికీ సనాతన ధర్మంపై ఉన్న భక్తి విశ్వాసాలనూ, వాటికి అనుగుణంగా ఆచరిస్తున్న విలువలనూ వివరించారు. ఆసియా ఖండంలోని సంపన్నవంతుల్లో మొట్టమొదటి స్థానంలో, ప్రపంచ కుబేరుల జాబితాలో పదో స్థానంలో ఉన్న కుటుంబంలో ఒక 28 ఏళ్ల కుర్రాడు ఇంత పరిణతితో, ఆధ్యాత్మిక విలువలతో మాట్లాడతాడని బహుశా ఎవరూ అనుకుని ఉండరు.

'లైసెన్స్ రాజ్'గా పేరుబడిన ఆర్థిక సంస్కరణల పూర్వ దశలో అనంత్ తాత ధీరూభాయ్ అంబానీ తనదైన రీతిలో పావులు కదుపుతూ, ఒక్కొక్క మెట్టే అధిరోహిస్తూ తన విశాల కుటుంబ సామ్రాజ్యాన్ని విస్తరించుకుంటూ వెళ్లారు. ఆయన వారసత్వాన్ని ముఖేష్ అప్రతిహతంగా కొనసాగిస్తూ దాన్ని మరింత పెంచుతున్న వైనమూ కళ్లముందే ఉంది. అందుకే ఇవాళ దేశంలో రిలయన్స్ స్పృశించని రంగమంటూ లేదు. ఆ కుటుంబ విలువలు సైతం అందరి హృదయాలనూ తాకుతాయని ప్రీ వెడ్డింగ్ వేడుకలు తెలియజెప్పాయి.

వ్యాస రచయిత సీనియర్ జర్నలిస్టు

జరిగే పని – జరగని పని

ఎప్పుడూ పరిస్థితులు ఒకే రకంగా వుండవు. రోజులు కాస్త ప్రశాంతంగానే గడుస్తున్నాయని అనుకుంటూ ఉండేంతలో కాలంలో ఊహించని మార్పు సంభవించి, ఎక్కడినుంచో అకస్మాత్తుగా పుట్టుకొచ్చిన కారుమబ్బులా అయోమయం అంతరంగాన్ని కమ్మేసి, జరుగుతున్న నష్టానికి కారణం ఏమిటో తెలియకుండా చేస్తుంది. తట్టుకోలేని ఆర్తితో దేవులాడతాం. ఎంత శ్రమపడినా ఏమీ సమాధానం దొరకదు. అప్పుడు ఇక చేసేదేమీ లేక, నిస్సహాయంగా మనసులోనే అనుకుంటాం, 'అయ్యేదేదో అవక మానదు కదా, ఎందుకీ అనవసరపు ఆరాటం' అని! అలా అనుకోగానే అప్పటిదాకా కలతతో నిండివున్న చిత్తానికి కొంత శాంతి చేకూరినట్లౌతుంది. అయ్యేది కాకుండా ఎలాగైతే మానదో, కానిది ఎప్పటికీ కాదు అన్నది కూడా అంతే నిజం అని ఆ వెంటనే ఒకసారి మననం చేసుకుని మరికొంత ప్రశాంతత పొందుతాం. ఈ నిజాన్ని చామర్తి శేషగిరి అనే కవి తాను రచించిన 'నమశ్శివాయ శతకం' లోని ఒక తేటగీతి పద్యంలో ఒక చక్కని ఉదాహరణతో చెప్పాడు.



జ్యోతిర్మయం

కాని కార్యం బదెంతటి వానికైన
కాదు, నీకొడు కెంతటి ఘనుడు కాడె
యేల సేయవు వెనకయ్య కింటితనము
మథితగజదనుజాయ నమశ్శివాయ!

చిన్నది పెద్దది అన్న తేడా లేకుండా, అన్ని కార్యక్రమాల ఆరంభ సమయంలో, ఆ కార్యక్రమాలు అవిఘ్నంగా మొదలై కొనసాగాలన్న ఆకాంక్షతో వాటి యజమానులు విధిగా నిర్వహించే పూజలందుకునే ఘనుడు కదా నీ చిన్నకొడుకైన విఘ్నేశ్వరుడు! అంతటి ఆయనకు, పెళ్ళి చేసి, ఒక ఇంటివాడిని ఎందుకు చెయ్యవు? గజాసురుని సంహరించి లోకాలను రక్షించిన వాడవైన ఓ పరమశివా! అది జరిగే పని కాదని తెలిసినవాడవు కాబట్టే కదా! అందువలన, జరిగేది ఎలాగైతే జరగకుండా మానదో, జరగేపనిగా నిర్దేశింపబడనిది... అది ఎంతటి మహామహుని విషయంలోనైనా సరే, ఎన్నటికీ జరగదన్నది సృష్టి ధర్మం, విధాత నియమం – అని పై పద్యంలో సారాంశంగా చెప్పిన విషయం. ప్రతి వ్యక్తి గ్రహించి మానసిక స్వస్థత పొందాల్సిన సత్యం!

– భట్టు వెంకటరావు

గ్రహం అనుగ్రహం శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు, ఫాల్గుణ మాసం. **తిథి:** శు.నవమి రా.2.16 వరకు, తదుపరి దశమి. **నక్షత్రం:** ఆరుద్ర రా.9.45 వరకు, తదుపరి పునర్వసు. **వర్జ్యం:** లేదు. **దుర్ముహూర్తం:** ప.12.33 నుండి 1.21 వరకు, తదుపరి ప.2.55 నుండి 3.45 వరకు. **అమృత ఘడియలు:** ఉ.11.34 నుండి 12.46 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు; **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు; **సూర్యోదయం:** 6.11; **సూర్యాస్తమయం:** 6.06

క్లుప్తంగా...

చంద్రబాబుకు భంగపాటు తప్పదు

ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్

సాక్షి, అమరావతి: రాష్ట్రానికి 14 ఏళ్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబు గిరిజనులకు ఒరగబెట్టింది ఏమీ లేదని, వారిని మోసం చేసిన ఆయనకు మరోసారి భంగపాటు తప్పదని ఆంధ్రప్రదేశ్ గిరిజన ప్రజా సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రాజు నాయక్ ఆదివారం ఓ ప్రకటనలో ధ్వజమెత్తారు. ఓట్ల కోసం గిరిజనులను వాడుకుని అధికారంలోకి వచ్చిన అనంతరం వారిని అణగదొక్కిన చంద్రబాబు నిజస్వరూపం బట్టబయలైందన్నారు. ఇప్పుడు మళ్లీ పొత్తులతో గిరిజనులను ఏమార్చేందుకు చంద్రబాబు వస్తే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. తమకు ఎంతో మేలు చేసిన వైఎస్సార్‌సీపీకి గిరిజనులు అండగా నిలుస్తున్నారని, ఈ ఎన్నికల్లో వైఎస్ జగన్‌ను మళ్లీ సీఎం చేస్తారని రాజు నాయక్ ధీమా వ్యక్తం చేశారు.

'ఓ ధీరుడి పయనం' పుస్తకం ఆవిష్కరణ



సాక్షి, అమరావతి: ఏపీలో బడుగు, బలహీన వర్గాలను ఆర్థిక, సామాజిక అభివృద్ధి దిశగా నడిపించిన దార్శనిక నాయకుడు సీఎం వైఎస్ జగన్ అని ప్రముఖ సాహితీవేత్త పి.విజయబాబు కొనియాడారు. ఆదివారం విజయవాడలో అంబేద్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం వద్ద వైఎస్సార్ జిల్లాకు చెందిన పరిశోధకుడు, రచయిత తవ్వా వెంకటయ్య రచించిన 'ఓ ధీరుడి పయనం' పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. పుస్తక రచయిత తవ్వా మాట్లాడుతూ అంబేద్కర్ బాటలో పయనిస్తోన్న సీఎం జగన్ జీవితాన్ని గ్రంథస్తం చేయడం గర్వంగా ఉందన్నారు. వైఎస్సార్ ఇంటలెక్చువల్ ఫోరం రాష్ట్ర అధ్యక్షులు శాంతమూర్తి మాట్లాడుతూ ఉత్తమ పాలకుడిగా, సామాజిక అభివృద్ధిని కాంక్షించే వ్యక్తిగా, అభ్యుదయ వాదిగా సీఎం జగన్ రాజకీయ వ్యక్తిత్వాన్ని సమీక్షిస్తూ పుస్తక రూపంలో తీసుకురావడం సంతోషకరమన్నారు. వైఎస్సార్ జిల్లా రచయితల సంఘం అధ్యక్షుడు మల్లికార్జున రెడ్డి, ప్రముఖ సాహితీ వేత్త ఆచార్య రామచంద్ర రెడ్డి, రాయలసీమ టూరిజం అండ్ కల్చర్ సొసైటీ ప్రధాన కార్యదర్శి జనార్దన్ రాజు, గుంటూరు కార్పొరేటర్ రాజలత పాల్గొన్నారు.

ప్రజాభ్యుదయమే పార్టీల అజెండా కావాలి

రాజకీయ పార్టీలకు ఎస్‌జేఎఫ్ లేఖ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలో ప్రజాభ్యుదయమే అన్ని పార్టీల అజెండా కావాలని, అందుకు అనుగుణంగా ఈ ఎన్నికల్లో ప్రత్యేక దృష్టి పెట్టాలని సామాజిక న్యాయ పోరాట వేదిక(ఎస్‌జేఎఫ్) విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు అన్ని రాజకీయ పార్టీలకు రాసిన బహిరంగ లేఖను ఎస్‌జేఎఫ్ రాష్ట్ర చైర్మన్ యర్రాకుల తులసీరామ్ యాదవ్, కన్వీనర్ రావి శ్రీనివాస్ ఆదివారం మీడియాకు విడుదల చేశారు. 'సామాజికవర్గాల వారీగా సమస్యల పరిష్కారానికి రాజకీయ పార్టీలు స్పష్టమైన హామీలు ఇవ్వాలి. సమగ్ర కులగణన ద్వారా జనాభా ప్రాతిపదికగా ఎవరెంతో వారికంత అనే సూత్రాన్ని అనుసరించి అందరికీ విద్య, ఉద్యోగ, ఉపాధి, రాజకీయ అవకాశాలు కల్పిస్తామని, సమన్యాయం ద్వారా సామాజికన్యాయం చేస్తామని రాజకీయ పార్టీలు హామీ ఇవ్వాలి. మహిళలకు విద్య, ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో కూడా 50శాతం రిజర్వేషన్లు కల్పించి సంపూర్ణ మహిళా సాధికారతకు కృషిచేయాలి. ఓసీ కౌలు రైతులకు కూడా రైతు భరోసా పథకాన్ని వర్తింపచేయాలి. ఈడబ్ల్యూఎస్ 10శాతం పరిధిలోకి వచ్చే పేద ఓసీ విద్యార్థులకు, నిరుద్యోగులకు బీసీలతో సమానంగా అన్ని రకాల ఫీజు రాయితీ, అర్హతా మార్కుల మినహాయింపులు ఇవ్వాలి. దళిత క్రైస్తవులు, ముస్లింలు, బీసీలు, కాపు, తెలగ, బలిజ, ఒంటరి సామాజికవర్గాలకు రిజర్వేషన్లలో న్యాయం చేసేలా పారదర్శకమైన హామీలు ఇవ్వాలి' అని ఆ లేఖలో పేర్కొన్నారు.

మాటల గారడీతో మోదీ దగా

సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు

సాక్షి, అమరావతి: ప్రధాని మోదీ మాటలే తప్ప ఈ రాష్ట్ర ప్రజలకు ఏం చేస్తాడో చెప్పలేదని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. ఎన్డీయే కూటమి ప్రజాగళం పేరిట చిలకలూరిపేటలో జరిగిన సభ తీరును తప్పుబడుతూ శ్రీనివాసరావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'వికసిత ఆంధ్రప్రదేశ్' అంటూ డబ్బా కొట్టడం తప్ప ఇప్పటి వరకు ఏం చేశారో, వచ్చే ఐదేళ్లలో ఏం చేస్తారో మోదీ చెప్పలేదని, కనీసం చంద్రబాబు, పవన్ కూడా రాష్ట్రానికి ఏం చేయాలో అడగలేదని తప్పుబట్టారు. హోదా, స్టీల్‌ప్లాంట్, అమరావతి గురించి ఎక్కడా ప్రస్తావించకపోవడం మోదీ విద్రోహాన్ని బట్టబయలు చేసిందన్నారు. బీజేపీతో వినాశకరమైన పొత్తును టీడీపీ శ్రేణులు, ప్రజలు ప్రశ్నించాలని సూచించారు. ఏపీలో అవినీతి ప్రభుత్వం ఉందని మోదీ చేసిన విమర్శలపై సీఎం వైఎస్ జగన్ స్పందించాలని శ్రీనివాసరావు కోరారు.

ఎలక్టోరల్ బాండ్లు అతి పెద్ద స్కాం

ఎలక్టోరల్ బాండ్ల పేరుతో దేశంలో అతి పెద్ద స్కాం జరిగిందని, మొత్తం బాండ్లలో సగం బీజేపీకే వెళ్లడం అధికార దుర్వినియోగానికి అద్దం పడుతోందని శ్రీనివాసరావు విమర్శించారు.

ఫుడ్ ప్రాసెసింగ్‌కు జీఐఎస్ బూస్ట్

▶ మొదటి పేజీ తరువాయి

ఉపాధి లభిస్తుండగా, 23 వేల మంది రైతులకు లబ్ధి చేకూరుతోంది. మరొక వైపు రూ.2,227 కోట్ల విలువైన మరో ఆరు పరిశ్రమలు శంకుస్థాపన పూర్తి చేసుకుని నిర్మాణ దశలో ఉన్నాయి. మిగిలిన ఒప్పందాలు కార్యరూపం దిశగా అడుగులు వేస్తున్నాయి. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో అధికారులు వేగంగా అనుమతులు మంజూరు చేయడం వల్ల జీఐఎస్ ఒప్పందాల్లో 60 శాతం పెట్టుబడులు గ్రౌండ్ అయ్యాయి.

ఉత్పత్తి ప్రారంభించిన పరిశ్రమలివే..

ఏలూరు, తిరుపతి, నెల్లూరు జిల్లాల్లో రూ.1,350 కోట్ల పెట్టుబడితో నాలుగు భారీ పరిశ్రమలు ఉత్పత్తిని ప్రారంభించాయి.

- అనా ఓలీయో ప్రైవేట్ లిమిటెట్ సంస్థ నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం పంటపాలెం వద్ద రూ.650 కోట్ల పెట్టుబడితో ఎడిబుల్ ఆయిల్ మాన్యుఫ్యాక్చరింగ్ పరిశ్రమను ఏర్పాటు చేసింది. రోజుకు 1,000 టన్నుల సామర్థ్యంతో పామ్ ఆయిల్, రోజుకు 400 టన్నుల సామర్థ్యంతో సన్‌ఫ్లవర్ రిఫైనరీ యూనిట్లను ఏర్పాటు చేసింది. ఈ పరిశ్రమ ద్వారా 2,100 మందికి నేరుగా ఉపాధి కల్పిస్తోంది.
- డీపీ కోకోవా ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ తిరుపతిలోని శ్రీసిటీ వద్ద రూ.350 కోట్ల పెట్టుబడితో కోకో బట్టర్, పౌడర్, మాస్ తయారీ యూనిట్‌ను ఏర్పాటు చేసింది. ఏటా 40 వేల టన్నుల సామర్థ్యంతో ఏర్పాటు చేసిన ఈ పరిశ్రమ ద్వారా 1,000 మందికి ఉపాధి కల్పిస్తుండగా, 18వేల మంది రైతులకు లబ్ధి చేకూరుతోంది.
- గోకుల్ అగ్రో రిసోర్సెస్ లిమిటెడ్ సంస్థ ఎస్పీఎస్ఆర్ నెల్లూరు జిల్లా ముత్తుకూరు మండలం దొరువులపాలెం వద్ద రూ.250 కోట్ల పెట్టుబడితో ఎడిబుల్ ఆయిల్ తయారీ పరిశ్రమను ఏర్పాటు చేసింది. ఏడాదికి 4.20 లక్షల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటు చేసిన ఈ పరిశ్రమ ద్వారా 1,150 మందికి ఉపాధి కల్పిస్తోంది.
- గోద్రేజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ కంపెనీ ఏలూరు జిల్లా చింతలపూడి మండలం సీతానగరం వద్ద రూ.100 కోట్లతో ఎడిబుల్ ఆయిల్ రిఫనరీ అండ్ సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్షన్ పరిశ్రమను ఏర్పాటు చేసింది. రోజుకు 400 టన్నుల సామర్థ్యంతో ఎడిబుల్ ఆయిల్ రిఫైనరీ ప్లాంట్‌తో పాటు రోజుకు 200 టన్నుల సామర్థ్యంతో సాల్వెంట్ ఎక్స్‌ట్రాక్షన్ ప్లాంట్స్ ద్వారా 1,130 మందికి ఉపాధి కల్పించగా, 5 వేల మంది రైతులకు లబ్ధి చేకూరుతోంది.

జీఐఎస్‌లో మొత్తం ఒప్పందాలు	
ఒప్పందాలు :	33
పెట్టుబడులు :	రూ.5,765 కోట్లు
ప్రత్యక్షంగా ఉపాధి :	12,600 మంది
పరోక్షంగా ఉపాధి :	20,000 మంది



నిర్మాణ దశలో ఉన్నవి ఇవీ..

తిరుపతి, విశాఖపట్నం, అనకాపల్లి, ఏలూరు, విజయనగరం జిల్లాల్లో రూ.2227 కోట్ల పెట్టుబడితో ఏర్పాటవుతున్న ఆరు పరిశ్రమలకు భూమిపూజ జరగ్గా, నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఏటా 3,39,300 టన్నుల సామర్థ్యంతో ఏర్పాటవుతున్న ఈ పరిశ్రమలతో 2,180 మందికి ఉపాధి లభించనుండగా, 24,100 మంది రైతులకు నేరుగా లబ్ధి చేకూరనుంది.

- మోండెలెజ్ ఇండియా ఫుడ్స్ తిరుపతి శ్రీసిటీ వద్ద రూ.1,600 కోట్ల పెట్టుబడితో చాక్లెట్ ప్రాసెసింగ్ పరిశ్రమను ఏర్పాటు చేస్తోంది. కాడ్బరీ, టాంగ్, బోర్నవిటా, ఒరియో, ఫైవ్‌స్టార్ వంటివి ఈ కంపెనీ ఉత్పత్తులే. ఏటా 2.20 లక్షల టన్నుల కోకోవాను ప్రాసెస్ చేసే సామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్న ఈ పరిశ్రమ ద్వారా 500 మందికి ఉపాధి కల్పించనుండగా, 18వేల మంది రైతులకు లబ్ధి చేకూర్చనుంది.
- సీసీఎల్ ఫుడ్ అండ్ బేవరేజస్ కంపెనీ తిరుపతి జిల్లా వరదాయిపాలెం మండలం కువ్వకొల్లి గ్రామం వద్ద రూ.400 కోట్ల పెట్టుబడితో భారీ ఇన్‌స్టెంట్ కాఫీ యూనిట్‌కు శంకుస్థాపన చేసింది. ఏటా 16వేల టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో ఏర్పాటు కాబోతున్న ఈ పరిశ్రమ ద్వారా 950 మందికి ఉపాధి కల్పించనుండగా, 2,500 మంది రైతులకు లబ్ధి చేకూరనుంది.
- శ్రీ వెంకటేశ్వర బయోటెక్ కంపెనీ ఏలూరు జిల్లా ఆగిరిపల్లి మండలం కొమ్మూరు వద్ద రూ.144 కోట్లతో రోజుకు 400 టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో మొక్కజొన్న పిండి తయారీ యూనిట్ ఏర్పాటుకు శంకుస్థాపన చేసింది. ఈ ప్రాజెక్టు ద్వారా 310 మందికి ఉపాధి కల్పించనుండగా, 1,500 మంది రైతులకు లబ్ధి చేకూరనుంది.
- విశాఖపట్నం జిల్లా పద్మనాభం మండలం మద్ది గ్రామం వద్ద ఒరిల్ ఫుడ్స్ సంస్థ రూ.50 కోట్ల పెట్టుబడితో ఇన్‌స్టంట్ విజిటబుల్ చట్నీస్ యూనిట్‌కు శంకుస్థాపన చేసింది. ఏటా 7,500 టన్నుల కూరగాయలు, సుగంధ ద్రవ్యాలను ప్రాసెస్ చేస్తూ రెడీమేడ్ చట్నీలు తయారు చేసే ఈ సంస్థ ద్వారా ప్రత్యక్షంగా 175 మందికి ఉపాధి కల్పించనుండగా, 1,000 మంది రైతులకు లబ్ధి చేకూరనుంది.
- అరకు కాఫీ ప్రైవేట్ లిమిటెడ్ రూ.20 కోట్లతో అనకాపల్లి జిల్లా కొండవాటిపూడి వద్ద కాఫీ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేస్తోంది. ఏటా వెయ్యి టన్నుల సామర్థ్యంతో ఏర్పాటు చేస్తున్న ఈ యూనిట్ ద్వారా 200 మందికి ఉపాధి కల్పించనుండగా, వెయ్యి మంది రైతులకు లబ్ధి చేకూరనుంది.
- విజయనగరం జిల్లా పూసపాటిరేగ మండలం కొనాడ వద్ద బ్లూఫిన్ ఎంటర్‌ప్రైజెస్ సంస్థ రూ.13 కోట్ల పెట్టుబడితో పొటాటో చిప్స్, పాస్తా, నూడిల్స్ తయారీ పరిశ్రమ ఏర్పాటు చేస్తోంది. ఏటా 3,600 టన్నుల గోధుమలు, 480 టన్నుల మిల్లెట్స్, 720 టన్నుల పొటాటో ప్రాసెస్ చేయనుంది. 45 మందికి ఉపాధి లభించనుండగా, 100 రైతులకు లబ్ధి చేకూరనుంది. కాగా జీఐఎస్‌లో జరిగిన మిగిలిన ఒప్పందాలు కార్యరూపం దాల్చేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది.

తేలని సీట్లు.. బాబుకు పాట్లు

ఎటూ తేల్చలేక చంద్రబాబు సతమతం



కళా వెంకట్రావు, గంటా శ్రీనివాసరావు, దేవినేని ఉమ



వసంత కృష్ణప్రసాద్, బోడె ప్రసాద్, సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

సాక్షి, అమరావతి: పొత్తుల ఎత్తుల్లో తలమునకలైన టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు పెండింగ్‌లో ఉన్న 16 స్థానాల్లో అభ్యర్థుల ఎంపిక విషయంలో చెమటోడుస్తున్నారు. ఇన్నాళ్ల తన రాజకీయ జీవితంలో ఎన్నడూ లేనంత ఎక్సర్‌సైజ్ చేశానంటూ రెండో విడత అభ్యర్థుల ప్రకటన సమయంలో చెప్పుకున్న ఆ పార్టీ ఇండస్ట్రీస్ మిగిలిన స్థానాల ప్రకటనకు మీనమేషాలు లెక్కిస్తున్నారు. పొత్తులో సీట్ల సర్దుబాటుపై స్పష్టత లేకపోవడం, కొన్నిచోట్ల పార్టీ బలహీనంగా ఉండడంతో ఏ నిర్ణయం తీసుకోలేకపోతున్నారు. బీజేపీ, జనసేనకు 31 ఎమ్మెల్యే స్థానాలు కేటాయించిన విషయం తెలిసిందే. మిగిలిన 144 స్థానాలకు 128 చోట్ల మాత్రమే ఇప్పటివరకు అభ్యర్థులను ప్రకటించారు. మిగిలిన 16 సీట్ల విషయంలో ఇంకా సందిగ్ధత కొనసాగుతోంది. ప్రధానంగా శ్రీకాకుళం జిల్లాలో నాలుగు సీట్లపై మల్లగుల్లాలు పడుతున్నారు. పలాస, పాతపట్నం, ఎచ్చెర్ల, శ్రీకాకుళం సీట్లలో టీడీపీ పోటీ చేసేవి ఏవన్న దానిపై ఇంకా సందిగ్ధం నెలకొంది. మిత్రులకు కేటాయించిన స్థానాల్లోనూ అభ్యర్థులు కరువవ్వడంతో ఆపసోపాలు పడుతున్నారు.

సీనియర్లకే దిక్కులేదు

- శ్రీకాకుళం, ఎచ్చెర్లలో ఒక స్థానాన్ని బీజేపీకి ఇవ్వాల్సి రావడంతో అక్కడ అభ్యర్థులను ప్రకటించలేదు. ఎచ్చెర్ల ఇన్‌ఛార్జిగా ఉన్న పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, మాజీ మంత్రి కళా వెంకట్రావుకు సీటు ఖరారు చేయకపోవడంతో తీవ్ర గందరగోళం నెలకొంది. ఆ స్థాయి నాయకుడికే దిక్కు లేకపోతే ఎలాగని పార్టీ శ్రేణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.
- పాతపట్నం, పలాస సీట్లపై అయోమయం రాజ్యమేలుతోంది. పలాస సీటుపై మాజీ ఎమ్మెల్యే గౌతు శిరీష గట్టిగా పట్టుబడుతున్నా ఆమెకు ఖరారు చేయలేదు. పాతపట్నం స్థానాన్ని మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణకు ఇవ్వకుండా పెండింగ్‌లో పెట్టారు. పొత్తుల్లో పోటీ చేసే సీట్లపై పూర్తి స్పష్టత వచ్చే వరకు ఈ సీట్ల సంగతి తేలేలా కనిపించడంలేదు.

జటిలంగా మారిన చీపురుపల్లి

- విజయనగరం జిల్లా చీపురుపల్లి స్థానం టీడీపీకి కత్తిమీద సాములా మారింది. అక్కడ పోటీ చేసేందుకు ఆ పార్టీ తరఫున ఎవరూ ముందుకు రావడంలేదు. ఓడిపోయే సీటు కావడంతో గంటా శ్రీనివాసరావు, కళా వెంకట్రావు వంటి నేతలూ అక్కడకు వెళ్లడానికి ససేమిరా అంటున్నారు.
- ఎస్ కోట సీటు కోసం కోళ్ల లలితకుమారి, ఎన్ఆర్ఐ గొంప కృష్ణ పోటీ పడుతుండగా... పొత్తులో ఆ స్థానాన్ని వదులుకోవాల్సివస్తుందనే ఉద్దేశంతో దాన్ని పెండింగ్‌లో పెట్టారు. భీమిలి స్థానంపై గంటా పట్టుపడుతున్నా... దానిని జనసేనకు కేటాయించాల్సి ఉంటుందేమోనని దానిపైనా నాన్చుతున్నారు.

సందిగ్ధంలో పెనమలూరు, మైలవరం

- ఉమ్మడి కృష్ణా జిల్లాలోని పెనమలూరు, మైలవరం సీట్లపైనా సందిగ్ధం వీడటంలేదు. మైలవరం సీటు కోసం దేవినేని ఉమామహేశ్వరరావు గట్టిగా పట్టు పడుతుండడంతో వలస నేత వసంత కృష్ణప్రసాద్ పరిస్థితి ఇరకాటంగా మారింది. వీరిద్దరిలో ఒకరిని పెనమలూరు పంపుతారనే ప్రచారం జరుగుతుండడంతో అక్కడి ఇన్‌ఛార్జి బోడె ప్రసాద్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.
- నర్సరావుపేట, చీరాల, దర్శి నియోజకవర్గాల్లో సరైన నేతలు దొరకలేదు. ధన బలం ఉన్నవారి కోసం అక్కడ వెదుకులాడుతున్నారు.

వెంటాడుతున్న సోమిరెడ్డి భయం

- ఉమ్మడి నెల్లూరు జిల్లాలో సర్వేపల్లి సీటు విషయం పెండింగ్‌లో ఉంది. మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డికి అక్కడ టికెట్ ఇస్తే ఓడిపోతామన్న భయం ఉంది. ఆ స్థానంలో ఆయన కుటుంబంలో ఎవరికైనా ఇవ్వాలా, బయట వ్యక్తులను చూడాలా అనే దానిపై తర్జనభర్జన పడుతున్నారు.
- ఉమ్మడి కడప జిల్లా జమ్మలమడుగు, బద్వేలు సీట్లలో ఒక సీటును బీజేపీకి ఇచ్చే ఉద్దేశంతో పెండింగ్‌లో పెట్టారు. జమ్మలమడుగు సీటుపై బీజేపీ నేత ఆదినారాయణరెడ్డి, ఆయన కుటుంబానికే చెందిన భూపేష్‌రెడ్డి మధ్య వివాదం నెలకొంది. రైల్వేకోడూరు, రాజంపేట సీట్ల విషయంలోనూ ఏ నిర్ణయం తీసుకోలేకపోతున్నారు. పొత్తులో వీటిలో ఒకదాన్ని వదులుకోవాల్సి వస్తుందని ఒక నిర్ధారణకు రావడం లేదు.
- గుమ్మనూరు జయరాం టీడీపీలోకి మారడంతో ఉమ్మడి అనంతపురం జిల్లాలోని ఆలూరు, గుంతకల్లు సీట్లపై అయోమయం నెలకొంది. ఆయనకు గుంతకల్లు సీటిస్తానని చంద్రబాబు హామీ ఇచ్చినా స్థానిక నేతలు వ్యతిరేకిస్తున్నారు. ఆలూరు అభ్యర్థి విషయంలో సరైన నిర్ణయం తీసుకోలేకపోతున్నారు. అనంతపురం అర్బన్ సీటు పొత్తులో పోతుందనే అంచనాతో ఆ స్థానాన్ని ఖరారు చేయలేదు. దీనిపై అక్కడి నేత ప్రభాకర్ చౌదరి ఇతరులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.

30 లక్షల మందికి సేవల దిశగా

ఆరోగ్య సురక్ష-2

▶ మొదటి పేజీ తరువాయి

ప్రభుత్వం ప్రజలకు సేవలందిస్తోంది. ప్రతి జిల్లాలో సగం మండలాల్లో మంగళవారం, మిగిలిన సగం మండలాల్లో శుక్రవారం శిబిరాలు నిర్వహిస్తున్నారు. పట్టణ, నగరాల్లో బుధవారం శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఒక్కో మండలంలో గ్రామీణంలో వారానికి ఒక గ్రామం చొప్పున, పట్టణాల్లో ఒక వార్డు చొప్పున ఆరు నెలల్లో రాష్ట్రం మొత్తం శిబిరాలను నిర్వహించేలా కార్యాచరణ రూపొందించారు.

ఒక్కో శిబిరంలో సగటున 362 మందికి సేవలు

జేఏఎస్ -2 లో రాష్ట్రవ్యాప్తంగా 13,954 శిబిరాలను నిర్వహించనున్నారు. ఇప్పటివరకూ 7,974 శిబిరాలు నిర్వహించారు. గ్రామీణ ప్రాంతాల్లో 5,929 శిబిరాలు, పట్టణ ప్రాంతాల్లో 2,045 నిబిరాలు నిర్వహించారు. ఒక్కో శిబిరంలో సగటున 362 మంది చొప్పున 28,79,408 మందికి ఇప్పటివరకూ వైద్య సేవలందించారు. అత్యధికంగా అనంతపురం జిల్లాలో 1.63 లక్షలు, నంద్యాలలో 1.51 లక్షలు, వైఎస్సార్ జిల్లాలో 1.44 లక్షల మంది ప్రజలు వైద్యం చేయించుకున్నారు. వైద్య పరీక్షల నిర్వహణకు 7 రకాల కిట్లను, ఈసీజీ, ఇతర పరికరాలను, వందల సంఖ్యలో మందులను శిబిరాల్లో అందుబాటులో ఉంచారు. శిబిరాలకు వద్దకు వచ్చి సేవలు అందుకున్న వ్యక్తుల్లో సుమారు 13 వేల మందికి ఆస్పత్రుల్లో చికిత్సలు అవసరమని వైద్యులు నిర్ధారించి, దగ్గరలోని ఆరోగ్యశ్రీ నెట్‌వర్క్ ఆస్పత్రులకు రెఫర్ చేశారు. వారందరినీ ఆస్పత్రులకు తరలించి వైద్య సేవలందించేలా స్థానిక పీహెచ్‌సీ వైద్యులు పర్యవేక్షిస్తున్నారు. ఇప్పటికే 5 వేల మంది ఆస్పత్రుల్లో వైద్య సేవలు అందుకున్నారు. ప్రజలకు సొంత ఊళ్లలోనే స్పెషలిస్ట్ వైద్య సేవలందించేందుకు 543 మంది జనరల్ మెడిసిన్, 645 మంది గైనకాలజీ, 349 మంది జనరల్ సర్జన్లు, 345 ఆర్థోపెడిక్, 378 మంది ఇతర స్పెషలిస్ట్ వైద్యులు, 3 వేల మంది వరకూ వైద్యులు, కంటి సమస్యల గుర్తింపునకు 562 మంది ఆప్తాల్మిక్ ఆఫీసర్‌లు పనిచేస్తున్నారు.



ఇవిగో నవరత్నాల వెలుగులు



ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్రంలో నిర్విఘ్నంగా అమలు చేస్తున్న నవరత్న పథకాల ద్వారా కోట్లాది మంది జీవితాల్లో వెలుగు నిండింది. ఈ పథకాల వల్లే తాము ఆనందంగా జీవిస్తున్నామని ఊరూరా ప్రజలు సంతోషంగా చెబుతున్నారు. వారంతా ఏ విధంగా అభివృద్ధిపథం వైపు పయనిస్తున్నారో వారి మాటల్లోనే 'సాక్షి' మీ ముందుకు తెస్తోంది.

బ్యూటీగా సాగుతున్న జీవితం



మా ఆయన జేసీబీ డ్రైవర్‌గా చిన్నపాటి ఉద్యోగం చేస్తున్నారు. ఆయన సంపాదనతో మా కుటుంబ పోషణ కష్టమైపోయింది. మాకున్న కుమార్తె చదువుపై కూడా నిరంతరం బెంగగా ఉండేది. నాకు బ్యూటీషియన్‌పై అవగాహన ఉండటంతో సొంతంగా పార్లర్ పెట్టుకుందామంటే గత ప్రభుత్వంనుంచి ఎలాంటి సహకారం అందలేదు. ఇంతలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో బ్యాంకు లింకేజీ ద్వారా రూ.50వేలు, గ్రామ సంఘం ద్వారా రూ.10వేలు, స్త్రీ నిధి ద్వారా 50వేలు రుణం తీసుకుని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం మండలం కొళిగాం గ్రామంలోని ఇంటివద్ద పార్లర్ ప్రారంభించాను. వైఎస్సార్ ఆసరా ద్వారా ఏడాదికి ఐదు వేల రూపాయల వంతున వచ్చింది. ఆ మొత్తం వ్యాపారానికి తోడయింది. అదే విధంగా మా పాప బడికి వెళ్తుండటంతో అమ్మ ఒడి పథకం కింద ఏడాదికి రూ. 15వేలు వంతున అందుతోంది. గ్రామంలో ఏ పెళ్లి జరిగినా, ఏ ఉత్సవం జరిగినా, ఏ శుభ కార్యం జరిగినా మహిళలు నా వద్దకే వస్తుండటంతో వారానికి నాలుగైదు రోజులు చేతి నిండా పని దొరుకుతోంది. ఇప్పుడు మా జీవితం బ్యూటీగా సాగుతోంది. మా లాంటి లక్షలాది కుటుంబాలకు అండగా నిలుస్తున్న జగనన్నకు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– లింకి రుణ, కొళిగాం
(మద్దిలి కేశవరావు, విలేకరి, ఇచ్ఛాపురం రూరల్)

ప్రభుత్వ సాయంతో అప్పులు తీరాయి



మాది పేద కుటుంబం. అల్లూరి సీతారామరాజు జిల్లా గంగవరంలో నేను వ్యవసాయం చేసుకుంటూ నా కుటుంబాన్ని పోషిస్తున్నాను. ముఖ్యమంత్రి జగనన్న అమలుచేస్తున్న పథకాల వల్ల నా కుటుంబానికి ఎంతో మేలు జరిగింది. 2021లో నా భర్త కలుముల పాపారావు ఆకస్మికంగా మృతి చెందారు. ఆయన బతికున్నప్పుడు వైఎస్సార్ పింఛన్, రైతు భరోసా అందుకున్నారు. నా భర్త మరణాంతరం నాకు వితంతు పింఛన్ వస్తోంది. రైతు భరోసా కింద ఏడాదికి రూ.13,500 వంతున వస్తోంది. వైఎస్సార్ చేయూత పథకం ద్వారా ఏడాదికి రూ.18,750 చొప్పున నా ఖాతాలో జమయింది. ఆ సొమ్ముతో మాకున్న అప్పులు తీర్చుకున్నాను. మిగిలిన సొమ్ము వ్యవసాయ పనులతో పాటు కుటుంబ పోషణకు ఉపయోగపడ్డాయి. జగనన్న అందిస్తున్న సాయానికి మా కుటుంబం ఎంతో రుణపడి ఉంది.

– కలుములు కన్నాయమ్మ, గంగవరం
(పి.వి.బి.ఎస్.జె.కె.పట్నాయక్, విలేకరి, గంగవరం)

నా గుండె గట్టిపడింది



మాది పేద కుటుంబం. నేను, నా భార్య పశ్చిమగోదావరి జిల్లా ఆకివీడు మండలం చినకాపవరం గ్రామంలో వ్యవసాయ కూలి పనులు చేసుకుని కుటుంబాన్ని పోషించేవాళ్లం. వచ్చిన ఆదాయం అంతంతమాత్రమే. దాంతోనే సరిపెట్టుకుని ఎలాగోలా నెట్టుకొస్తున్నాం. గత ప్రభుత్వ హయాంలో మాలాంటివారికి ఎలాంటి సాయం అందివ్వలేదు. ఈ ప్రభుత్వం వచ్చాక అనుకోకుండా నాకు గుండెల్లోనొప్పి రావడంతో వైద్యులను సంప్రదించాను. గుండెకు రంధ్రం పడిందన్నారు. చికిత్సకోసం పెద్దమొత్తంలో ఖర్చవుతుందని తెలిసి ఆందోళన చెందాం. అయితే ఆరోగ్యశ్రీ వర్తిస్తుందని చెప్పడంతో ఏలూరు ఆశ్రం ఆస్పత్రికి వెళ్లాను. అక్కడ నా గుండెకు స్టంట్ వేశారు. రూ.65వేల ఖర్చును ప్రభుత్వమే భరించింది. ఒక్క రూపాయి ఖర్చులేకుండా పూర్తి ఆరోగ్యంతో ఇంటికి వచ్చాను. ఆస్పత్రిలో నాతోపాటు ఉన్న నా భార్యకూ ప్రభుత్వమే భోజన వసతి కల్పించింది. నా కుమార్తెకు వివాహం చేసి పంపాం. ఇప్పుడు ఇద్దరమే జీవనం గడుపుతున్నాం. వృద్ధాప్యంవల్ల కూలి పనులకు వెళ్లలేకపోతున్నాను. కానీ వృద్ధాప్య పింఛన్ మమ్ములను ఆదుకుంటోంది. ఉచిత రేషన్, మందులు ఉచితంగా రావడంతో కష్టాలు దాదాపుగా తీరిపోయాయి. మా బతుకుకు భరోసా కల్పించిన సీఎం జగన్‌కు ఎప్పటికీ రుణపడి ఉంటాం.

– వానపల్లి తాతారావు, చినకాపవరం
(బి.ఆర్.కోటేశ్వరరావు, విలేకరి, ఆకివీడు)

గీతాంజలి మృతికి కారకులను శిక్షించాలి

- గీతాంజలికి లండన్‌లో ఘన నివాళి.. కొవ్వొత్తులతో ప్రదర్శన
- ఉగ్రవాద సంస్థలా పనిచేస్తున్న ఐటీడీపీ
- వైఎస్సార్‌సీపీ యూకే సహాయ కన్వీనర్ కిషోర్



సాక్షి, అమరావతి: గుంటూరు జిల్లా తెనాలికి చెందిన గీతాంజలి అనే మహిళ టీడీపీ, జనసేన పార్టీల సోషల్ మీడియా ట్రోల్స్‌కు మానసికంగా కుంగిపోయి ఆత్మహత్యకు పాల్పడటం బాధాకరమని వైఎస్సార్‌సీపీ యూకే సహాయ కన్వీనర్ మలిరెడ్డి కిషోర్ అన్నారు. వైఎస్సార్‌సీపీ యూకే విభాగం ఆధ్వర్యాన లండన్‌లోని ఈస్ట్‌వ్యాలీలో ఆదివారం రాత్రి గీతాంజలి సంతాప సభ నిర్వహించారు. గీతాంజలి మృతికి కారణమైన దోషులను శిక్షించాలని కోరుతూ కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మలిరెడ్డి కిషోర్ మాట్లాడుతూ తెలుగుదేశం, జనసేన పార్టీలు అత్యంత దారుణమైన సోషల్ మీడియా ట్రోల్స్‌తో ఒక నిండు ప్రాణాన్ని బలిగొన్నాయని తెలిసి లండన్‌లోని ప్రతి ఒక్క తెలుగువారి గుండె తరుక్కుపోయిందన్నారు. నారా లోకేశ్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఐటీడీపీ ఒక ఉగ్రవాద సంస్థ చేసే పనుల కంటే ఘోరమైన దుర్మార్గాలకు పాల్పడుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, లోకేశ్, బాలకృష్ణ ఇప్పటికైనా కళ్లు తెరిచి ఆడవారి పట్ల చులకనభావాన్ని తగ్గించుకోవాలని, లేదంటే ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు మహిళలు ఒక్కటై టీడీపీ, జనసేన పార్టీలను శాశ్వత సమాధి చేస్తారని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ప్రవాసాంధ్రులు వజ్రాల రాజశేఖర్ రెడ్డి, కిషోర్ భూక్య, గణేశ్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

ఏపీకి సాయం చేయని నరేంద్ర మోదీ

1,267 రోజు రిలేనిరాహార దీక్షలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు



తాడికొండ: గత ఎన్నికల్లో గెలిపిస్తే ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తామన్న ప్రధాని మోదీ ఐదేళ్లలో రాష్ట్రానికి పీసమంత సాయం చేయకుండా పొత్తుల కోసం వచ్చి ఎన్నికల ఎత్తుగడలు వేయడం సిగ్గుచేటని బహుజన పరిరక్షణ సమితి నాయకులు ధ్వజమెత్తారు. తుళ్లూరు మండలం తాళ్లాయపాలెం సీడ్ యాక్సిస్ రోడ్డు జంక్షన్‌లో మూడు రాజధానులకు మద్దతుగా చేపట్టిన రిలే నిరాహారదీక్షలు ఆదివారం 1,267వ రోజుకు చేరాయి. ఈ శిబిరాన్ని పలువురు నాయకులు సందర్శించి, మాట్లాడారు. ఏపీలో సొంతంగా గెలవలేని చంద్రబాబు, పవన్‌కళ్యాణ్ ఢిల్లీకి వెళ్లి మోదీ కాళ్లు పట్టుకుని పొత్తులతో ఎన్నికల్లో పోటీకి దిగడం రాజకీయ చేతగానితనానికి నిదర్శనమని వారు విమర్శించారు. 40 ఏళ్ల ఇండస్ట్రీ అని చెప్పుకొనే బాబు, తన సీటు తాను గెలవలేని పవన్‌కళ్యాణ్.. పేదలకు మేలు చేసే ఆలోచనలు లేకుండా పెత్తందారీ వ్యవస్థకు కొమ్ము కాయడం సిగ్గుచేటన్నారు. అన్ని ప్రాంతాల సమాన అభివృద్ధితోనే అందరి ఎదుగుదల సాధ్యమని వికేంద్రీకరణకే రాష్ట్ర ప్రజలందరూ మొగ్గుచూపుతున్నారనేది బహిరంగ సత్యమని చెప్పారు. పేదలకు రాజ్యాంగఫలాలు అంది వారు ఉన్నతంగా ఎదిగితే ఆర్థికంగా బలవంతులై తన సామాజికవర్గాన్ని మించిపోతారనే భయం బాబులో ఉన్నందునే ప్యాకేజీ పార్టీలను వెంట బెట్టుకుని ఎన్నికల్లో గెలుపుకోసం నానా తంటాలు పడుతున్నారని మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో బహుజన పరిరక్షణ సమితి నాయకులు మాదిగాని గుర్నాథం, ఈపూరి ఆదాం, పులిదాసు, పలువురు దళిత నాయకులు పాల్గొన్నారు.

అరుణాచల్, సిక్కిం ఓట్ల లెక్కింపు జూన్ 2నే

సాక్షి, న్యూఢిల్లీ: అరుణాచల్ ప్రదేశ్, సిక్కిం రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికల ఓట్ల లెక్కింపు తేదీని మార్చినట్లు ఎన్నికల సంఘం తెలిపింది. శనివారం ప్రకటించిన విధంగా జూన్ 4న జరగాల్సిన కౌంటింగ్‌ను రెండు రోజులు ముందుకు జూన్ 2కు మార్చినట్లు ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొంది. రెండు రాష్ట్రాల శాసనసభల పదవీ కాలం జూన్ 2తో ముగుస్తున్న నేపథ్యంలో అదే రోజు కౌంటింగ్ చేపట్టనున్నట్లు వివరించింది. అరుణాచల్, సిక్కిం రాష్ట్రాల్లో ముందుగా ప్రకటించిన విధంగా ఏప్రిల్ 19వ తేదీనే పోలింగ్ ఉంటుందని స్పష్టం చేసింది.

ఆర్ఎస్ఎస్ ప్రధాన కార్యదర్శిగా మళ్లీ దత్తాత్రేయ హోసబలె

నాగ్‌పూర్: రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్(ఆర్ఎస్ఎస్) ప్రధాన కార్యదర్శి(సర్‌కార్యవాహ)గా దత్తాత్రేయ హోసబలె మరోసారి ఎన్నికయ్యారు. నాగ్‌పూర్‌లో జరుగుతున్న అఖిల భారతీయ ప్రతినిధి సభ సమావేశాల్లో ఆదివారం ఆయన్ను 2024–2027 కాలానికి గాను ఈ పదవికి ఎన్నుకున్నారు. సర్‌కార్యవాహ పదవిలో 2021 నుంచి దత్తాత్రేయ హోసబలె కొనసాగుతున్నారు.

18 మంది హిందూ శరణార్థులకు భారత పౌరసత్వం

అహ్మదాబాద్: పాకిస్తాన్‌లో మతపరమైన వివక్ష, పీడనను తాళలేక సరిహద్దులకు సమీపంలోని గుజరాత్‌లో ఆశ్రయం పొందుతున్న 18 మంది హిందూ శరణార్థులకు భారత పౌరసత్వం లభించింది. అహ్మదాబాద్‌లో ఆదివారం జరిగిన ఓ కార్యక్రమంలో వీరికి రాష్ట్ర హోం శాఖ సహాయ మంత్రి హర్ష్ సంఘవి పౌరసత్వ ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. అహ్మదాబాద్ జిల్లా ఇప్పటి వరకు 1,167 మంది హిందువులకు పౌరసత్వం లభించినట్లు ఆయన తెలిపారు. ఇటీవల కేంద్రం అమల్లోకి తెచ్చిన సీఏఏ చట్టం ప్రకారం ముస్లిమేతర శరణార్థులకు పౌరసత్వం మంజూరు చేసే అధికారం అహ్మదాబాద్, గాంధీనగర్, కచ్ జిల్లాల కలెక్టర్లకు కల్పిస్తూ ప్రభుత్వం గజెట్ జారీ చేసింది.

సీఏఏపై స్టే కోరుతూ సుప్రీంకు కేరళ సర్కారు


న్యూఢిల్లీ: వివక్షాపూరితం, ఏకపక్షం, లౌకికతత్వానికి విరుద్ధంగా ఉన్న పౌరసత్వ సవరణ చట్టం (సీఏఏ)అమలుపై స్టే ఇవ్వాలని కోరుతూ కేరళ ప్రభుత్వం మరోసారి సుప్రీంకోర్టును ఆశ్రయించింది. మన దేశంతో అంతర్జాతీయ సరిహద్దులను పంచుకుంటున్న శ్రీలంక, మయన్మార్, భూటాన్ తదితర దేశాల నుంచి వలస వచ్చిన వారి పట్ల వివక్ష చూపేలా ఉన్న సీఏఏలోని నిబంధనలు, ఉత్తర్వులకు ఏమాత్రం ప్రామాణికత లేదంటూ ఇప్పటికే కేరళ ప్రభుత్వం సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. సీఏఏను సవాల్ చేస్తూ దాఖలైన అన్ని పిటిషన్లనూ కలిపి ఈ నెల 19న విచారించేందుకు సుప్రీంకోర్టు ఇప్పటికే అంగీకరించింది.

నువ్వా నేనా...!

సార్వత్రిక పోరుకు ఎన్డీఏ, ఇండియా కూటములు సై

సొంతంగా 370 సీట్లే లక్ష్యంగా బీజేపీ ● 267 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించి దూకుడు

కూటమికి పార్టీల ఝలక్‌తో కాంగ్రెస్ కుదేలు ● జారుకున్న జేడీ(యూ), చెయ్యిచ్చిన తృణమూల్



సాక్షి, న్యూఢిల్లీ: ఎన్నికల నగారా మోగింది. సార్వత్రిక సమరానికి సర్వం సిద్ధమైంది. లోక్‌సభ ఎన్నికల్లో హోరాహోరీ తలపడేందుకు బీజేపీ నేతృత్వంలోని నేషనల్ డెమక్రటిక్ అలయన్స్ (ఎన్డీఏ), కాంగ్రెస్ సారథ్యంలోని ఇండియన్ నేషనల్ డెవలప్‌మెంటల్ ఇంక్లూజివ్ అలయెన్స్ (ఇండియా) సిద్ధమయ్యాయి. వరుసగా మూడోసారి అధికార పీఠాన్ని దక్కించుకునేందుకు బీజేపీ, ఆ పార్టీని ఈసారి ఎలాగైనా మట్టికరిపించాలని కాంగ్రెస్ కృతనిశ్చయంతో ఉన్నాయి. పేదలు, మహిళలు, రైతులు, యువతను లక్ష్యంగా చేసుకుని హామీల వర్షం కురిపిస్తున్నాయి. సొంతంగా 370కి పైగా స్థానాలు లక్ష్యంగా పెట్టుకున్న అధికార బీజేపీ ఇప్పటికే ఏకంగా 267 స్థానాల్లో అభ్యర్థులను ప్రకటించి దూకుడు మీదుంది. ఇంకా కూటమి లెక్కలు తేలక కాంగ్రెస్ సతమతమవుతోంది. హోరాహోరీ పోరులో ఏ కూటమి నెగ్గేదీ తెలియాలంటే జూన్ 4న వరకు వేచి చూడాల్సిందే...

అయోధ్యలో రామమందిర నిర్మాణం అనంతరం కదనోత్సాహంతో ఉన్న కమలదళం ఈ ఎన్నికల్లో భారీ లక్ష్యాలే నిర్దయించుకుంది. 2014 లోక్‌సభ ఎన్నికల్లో 282 సీట్లు సాధించి 2019లో 303కు ఎగబాకిన బీజేపీ ఇప్పుడు ఏకంగా 370కి పైగా సీట్ల సాధనే లక్ష్యంగా పెట్టుకుంది. ఎన్డీఏ పక్షాలతో కలిపి 400లకు పైగా సీట్లు సాధించాలని భావిస్తోంది. ఎన్డీఏకు ప్రస్తుతం 335 మంది ఎంపీలుండగా వీరిలో బీజేపీ సొంత బలమే 290 (మిగతా ఎంపీలు ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో బరిలో దిగి రాజీనామా చేశారు). ఇక కాంగ్రెస్ 2019 ఎన్నికల్లో కేవలం 52 సీట్లకు పరిమితమైంది. ప్రస్తుతం ఇండియా కూటమిలో ఉన్న పక్షాలన్నీ కలిపి 2019లో 144 సీట్లు మాత్రమే సాధించాయి. ఆ ఎన్నికల్లో ఎన్డీఏకి 40 శాతం, ఇండియా కూటమికి 35 శాతం ఓట్లొచ్చాయి. ఎన్డీఏకు ఈసారి ఏకంగా 50 శాతానికి పైగా ఓట్ల సాధనే బీజేపీ లక్ష్యంగా పెట్టుకుంది. ప్రధాని నరేంద్ర మోదీ ఇప్పటికే ఉత్తరాదిలోని అన్ని రాష్ట్రాలను చుట్టేశారు. దక్షిణాదిన కూడా దాదాపు అన్నిచోట్ల పర్యటించారు.

అసెంబ్లీలవారీగా కూటముల బలాబలాలు...

- దేశవ్యాప్తంగా ప్రస్తుతం ఎన్డీఏ పార్టీలు 18 రాష్ట్రాల్లో, ఇండియా కూటమి పార్టీలు 10 రాష్ట్రాల్లో అధికారంలో ఉన్నాయి.
- మొత్తం 4,123 మంది ఎమ్మెల్యేల్లో 1,791 మంది ఎన్డీయే కూటమికి చెందినవారు కాగా 1,653 మంది ఇండియా కూటమికి చెందినవారున్నారు.
- శాసన మండలి ఉన్న ఆరు రాష్ట్రాల్లోని మొత్తం 426 ఎమ్మెల్సీల్లో 105 మంది ఇండియాకు, 184 మంది ఎన్డీఏకు చెందినవారు.
- ఎమ్మెల్యేలపరంగా ఉత్తరప్రదేశ్, మధ్యప్రదేశ్, గుజరాత్, రాజస్తాన్, మహారాష్ట్రతో సహా అత్యధిక జనాభా ఉన్న చాలా రాష్ట్రాల్లో ఎన్డీఏది ఆధిపత్యం. కాగా పశ్చిమబెంగాల్, కర్నాటక, కేరళ, తమిళనాడు, పంజాబ్‌ల్లో ఇండియా కూటమిది పైచేయి.
- 2023–24 మధ్య తొమ్మిది రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరిగితే ఐదుచోట్ల ప్రభుత్వం మారింది. నాలుగు రాష్ట్రాల్లో బీజేపీ, రెండింట కాంగ్రెస్ నెగ్గాయి. మిగతా మూడు రాష్ట్రాలను ప్రాంతీయ పార్టీలు చేజిక్కించుకున్నాయి.

బీజేపీ లక్ష్యం 370 ప్లస్

ఎన్డీఏ భాగస్వాములతో సీట్ల పంపకాలను బీజేపీ శరవేగంగా తేల్చేస్తోంది...

- అతి పెద్ద రాష్ట్రమైన యూపీలో 80 లోక్‌సభ స్థానాలకు 2019లో 62 సీట్లు బీజేపీ సాధించిన ఈసారి 70 దాటాలని టార్గెట్ పెట్టుకుంది. మిత్రపక్షాల్లో అప్నాదళ్ (ఎస్)కు 5 సీట్లు, నిషాద్ పార్టీకి ఒకట్రెండు కేటాయించవచ్చు. ఎస్‌బీఎస్‌పీ అధ్యక్షుడు ఓం ప్రకాశ్ రాజ్‌భర్ ఐదు సీట్లు డిమాండ్ చేస్తున్నారు.
- మహారాష్ట్రలో 48 స్థానాలకు గాను 26 చోట్ల బీజేపీ పోటీ చేస్తుందని ఉప ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ప్రకటించారు. అయితే సీఎం ఏక్‌నాథ్ షిండే నేతృత్వంలోని శివసేన, ఎన్సీపీ (అజిత్)తో కలిసి పోటీ చేయనున్న నేపథ్యంలో సీట్ల సర్దుబాటు ఇంకా కొలిక్కి రావాల్సి ఉంది.
- 40 స్థానాలున్న బిహార్‌లో కనీసం 25 సీట్లలో పోటీ చేయనుంది. మిగతా స్థానాలను జేడీ(యూ), లోక్ జనశక్తి పార్టీ, ఉపేంద్ర కుష్వాహా రాష్ట్రీయ లోక్ జనతాదళ్, హిందుస్థానీ అవామ్ మోర్చా (సెక్యులర్)లకు కేటాయించే అవకాశముంది.
- 28 లోక్‌సభ స్థానాలున్న కర్ణాటకలో కొత్త మిత్రుడు జేడీ(ఎస్)కు 3 స్థానాలిచ్చేందుకు అంగీకరించినట్టు సమాచారం. అక్కడ 2019 ఎన్నికల్లో 25 స్థానాలు చేజిక్కించుకున్న బీజేపీ ఈసారి వాటిని నిలబెట్టుకోవాలని చూస్తోంది.
- అస్సాంలో 14 స్థానాలకు గాను 11 స్థానాల్లో బీజేపీ, మిగతా చోట్ల మిత్రపక్షాలు అస్సాం గణ పరిషత్ (ఏజీపీ), యునైటెడ్ పీపుల్స్ లిబరేషన్ (యూపీపీఎల్) పోటీ చేస్తారు.

2019లో ఇలా...

2014లో బీజేపీకి సొంతంగా 282 సీట్లు రాగా 2019 నాటికి 303కు పెరిగాయి. 2019 ఎన్నికల్లో హిందీ రాష్ట్రాలను చాలావరకు క్లీన్‌స్వీప్ చేసింది. 2019లో 31 శాతం ఓట్లు సాధించగా 2019లో 37.4కు పెంచుకుంది. 2019లో ప్రభుత్వ ఏర్పాటు సమయంలో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏకు 353 ఎంపీల మద్దతుంది. కూటమి మొత్తం 40 శాతం ఓట్లు సాధించింది.

ఎన్డీఏ కూటమి బలం

బీజేపీ	290
జేడీ(యూ)	16
శివసేన	13
ఆర్ఎల్‌జేపీ	5
ఇతరులు	11

లెక్కలు తేలక 'హస్త'వ్యస్తం...

ఈసారి బీజేపీని ఎట్టి పరిస్థితుల్లోనూ ఓడించే లక్ష్యంతో భాగస్వాములతో కాంగ్రెస్ పొత్తు కసరత్తులు చేస్తోంది. ఒంటరిగా పోటీ చేసే రాష్ట్రాలు, మిత్రపక్షాలతో కలిసి ముందుకు సాగాల్సిన రాష్ట్రాలపై పీసీసీల నుంచి అభిప్రాయాలు సేకరించింది. అంతర్గత నిర్ణయం మేరకు కర్ణాటక (28), గుజరాత్ (26), రాజస్తాన్ (25), ఆంధ్రప్రదేశ్ (25), తెలంగాణ (17), అస్సాం (14), ఛత్తీస్‌గఢ్ (11), హరియాణా (10), అరుణాచల్‌ప్రదేశ్ (2)ల్లో కాంగ్రెస్ ఒంటరి పోటీ చేయనుందని సమాచారం...

- యూపీలో కనీసం 50 స్థానాల్లో పోటీ చేయాలని భావించినా చివరికి 17 స్థానాలకే పరిమితమవుతోంది. మిగతా చోట్ల ఇండియా కూటమి భాగస్వామి సమాజ్‌వాదీ పార్టీ పోటీ చేయనుంది.
- మహారాష్ట్రలో కనీసం 18 సీట్లలో బరిలో దిగాలని కాంగ్రెస్ భావిస్తోంది. మిగతా వాటిని మిత్రపక్షాలు ఎన్సీపీ (శరద్), శివసేన (యూబీటీ)లకు కేటాయించనుంది.
- పశ్చిమబెంగాల్లో తృణమూల్ కాంగ్రెస్‌తో పొత్తు కుదరకపోవడంతో మొత్తం 42 స్థానాల్లోనూ కాంగ్రెస్ ఒంటరిగానే పోటీ చేయనుంది.
- బిహార్‌లో జేడీ(యూ) జారుకోవడంతో కనీసం 25 చోట్ల పోటీ చేయాలని భావిస్తున్నా చివరికి 15 స్థానాలకే పరిమితమయ్యేలా ఉంది. మిత్రపక్షం ఆర్జేడీ మాత్రం 7 నుంచి 9 సీట్ల కంటే ఇచ్చేది లేదంటోంది!
- తమిళనాట డీఎంకేతో పొత్తున్నా కాంగ్రెస్‌కు రెండుకు మించి సీట్లు దక్కడం కష్టమే.
- జార్ఖండ్‌లోని ఏడు చోట్ల పోటీ చేసి జేఎంఎంకు 4, ఇతర పక్షాలకు 3 ఇచ్చేలా చర్చలు జరుగుతున్నాయి.
- కేరళలో 20 స్థానాల్లో 16 చోట్ల పోటీ చేసి వామపక్షాలకు 4 ఇవ్వనుంది.
- పంజాబ్‌లో ఆప్‌తో పొత్తు కుదరకపోవడం, అకాలీదళ్ కూడా దూరమవడంతో మొత్తం 13 సీట్లలోనూ కాంగ్రెస్ పోటీ చేయనుంది.
- ఢిల్లీలో మాత్రం నాలుగు చోట్ల ఆప్, మూడుచోట్ల కాంగ్రెస్ బరిలో దిగనున్నాయి.

2019లో ఇలా...

ప్రస్తుత ఇండియా కూటమి 2009 లోక్‌సభ ఎన్నికల్లో 40 శాతం ఓట్లతో 347 సీట్లు గెలుచుకుంది. 2014 ఎన్నికల్లో ఓట్ల శాతం 42 శాతానికి పెరిగినప్పటికీ 161 సీట్లకే పరిమితమైంది. బీజేపీ, కాంగ్రెస్, ప్రాంతీయ పార్టీల మధ్య త్రిముఖ పోటీయే ఇందుకు ప్రధాన కారణం. ఇక 2019 ఎన్నికల్లో ఇండియా కూటమి 38 శాతం ఓట్లకు, కేవలం 144 సీట్లకు పడిపోయింది.

ఇండియా కూటమి బలం

కాంగ్రెస్	48
డీఎంకే	24
టీఎంసీ	22
శివసేన (యూబీటీ)	6
ఎన్సీపీ (శరద్)	4
ఇతరులు	19

బాండ్లతో బీజేపీకి రూ.6,986 కోట్లు

తృణమూల్‌కు రూ.1,397 కోట్లు ● వెబ్‌సైట్‌లో పొందుపరచిన ఎన్నికల సంఘం

న్యూఢిల్లీ: ఎన్నికల బాండ్లతో అధికార బీజేపీ అత్యధికంగా లబ్ధి పొందినట్లు వెల్లడయ్యింది. కమలం పార్టీకి ఈ బాండ్ల ద్వారా ఏకంగా రూ.6,986.5 కోట్లు అందినట్లు కేంద్ర ఎన్నికల సంఘం తెలియజేసింది. ఎన్నికల బాండ్లపై పార్టీలు గత నవంబర్‌లో ఇచ్చిన సమాచారాన్ని ఆదివారం తన వెబ్‌సైట్‌లో అందుబాటులోకి తెచ్చింది. పశ్చిమ బెంగాల్‌లో అధికార పార్టీ తృణమూల్ కాంగ్రెస్‌కు రూ.1,397 కోట్లు, కాంగ్రెస్‌కు రూ.1,334 కోట్లు, భారత రాష్ట్ర సమితికి రూ.1,322 కోట్లు, బిజూ జనతాదళ్‌కు రూ.944.5 కోట్లు, డీఎంకేకు రూ.656.5 కోట్లు బాండ్ల రూపంలో అందినట్లు ఈసీ డేటాను బట్టి తెలుస్తోంది. బాండ్ల కొనుగోలుదార్లలో ఫ్యూచర్ గేమింగ్, హోటల్ సర్వీసెస్ సంస్థ అధినేత, లాటరీ కింగ్ శాంటియాగో మార్టిన్ అగ్రస్థానంలో నిలిచాడు. రూ.1,368 కోట్ల విలువైన బాండ్లు కొనుగోలు చేశాడు. ఇందులో 37 శాతానికి పైగా, అంటే రూ.509 కోట్లను డీఎంకేకు అందజేశాడు. డీఎంకేకు మేఘా ఇంజనీరింగ్ రూ.105 కోట్లు, ఇండియా సిమెంట్స్ రూ.14 కోట్లు, సన్ టీవీ నెట్‌వర్క్ రూ.100 కోట్లు సమర్పించుకున్నాయి. అన్నాడీఎంకేకు ఇండియా సిమెంట్స్ యాజమాన్యంలోని ఐపీఎల్ టీం చెన్నై సూపర్ కింగ్స్; జేడీ(ఎస్)కు ఆదిత్య బిర్లా గ్రూప్, ఇన్ఫోసిస్, జేఎస్‌డబ్ల్యూ గ్రూప్, మేఘా ఇంజనీరింగ్, ఎంబసీ గ్రూప్; ఆప్‌కు బజాజ్, కేఎంజెడ్ ఇన్వెస్ట్‌మెంట్స్, ఎన్‌జేకే, బీజీ షిర్కే, టొరెంట్ ఫార్మా; జేడీ(యూ)కు భారతీ ఎయిర్‌టెల్, శ్రీ సిమెంట్స్; ఎన్సీపీకి నియోటియా ఫౌండేషన్, భారతీ ఎయిర్‌టెల్, సైరస్‌పూనావాలా, బజాజ్ ఫిన్‌సర్వ్, ఒబెరాయ్ రియాల్టీ తదితర సంస్థలు విరాళాలిచ్చాయి. బాండ్ల రూపంలో తమకు ఏయే సంస్థ/వ్యక్తుల నుంచి ఎంతెంత విరాళాలు వచ్చాయో బీజేపీ, కాంగ్రెస్, తృణమూల్ కాంగ్రెస్ ఈసీకి తెలియజేయలేదు. ఏడీఆర్ గణాంకాల ప్రకారం బీజేపీకి మొత్తం 7,700 కోట్ల విరాళాలు అందాయి. బాండ్ల ద్వారా తమకెలాంటి నిధులూ రాలేదని సీపీఎం, బీఎస్పీ, మజ్లిస్ ప్రకటించాయి.

ఈసీ డేటా ప్రకారం బాండ్ల ద్వారా అత్యధిక నిధులు అందుకున్న పార్టీలు

పార్టీ	నిధులు
బీజేపీ	రూ.6,986.5 కోట్లు
టీఎంసీ	రూ.1,397 కోట్లు
కాంగ్రెస్	రూ.1,334 కోట్లు
బీఆర్ఎస్	రూ.1,322 కోట్లు

తొలి వంద రోజులకు, వచ్చే ఐదేళ్లకు రోడ్‌మ్యాప్

మంత్రివర్గ సమావేశంలో మోదీ

న్యూఢిల్లీ: మరో రెండు నెలల్లో ఏర్పాటు కానున్న కొత్త ప్రభుత్వానికి తొలి వంద రోజుల రోడ్‌మ్యాప్‌తోపాటు రాబోయే ఐదేళ్ల రోడ్‌మ్యాప్ రూపొందించాలని మంత్రివర్గ సహచరులతో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ సూచించారు. మోదీ అధ్యక్షతన ఆదివారం ఉదయం ఢిల్లీలో జరిగిన కేబినెట్ సమావేశంలో కీలక అంశాలపై చర్చించారు. తొలి వంద రోజుల రోడ్‌మ్యాప్, ఐదేళ్ల రోడ్‌మ్యాప్‌ను సమర్థంగా ఎలా అమలు చేయాలన్నదానిపై నిపుణులతో, సంబంధిత శాఖల కార్యదర్శులతో సంప్రదింపులు జరపాలని ప్రధానమంత్రి పేర్కొన్నారు. సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్‌ను ఎన్నికల సంఘం శనివారం ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈసారి ఏడు దశల్లో లోక్‌సభ ఎన్నికలు జరగనున్నాయి. ఎన్నికలు జరిగే తేదీలను నోటిఫై చేసే ప్రక్రియను కేంద్ర కేబినెట్ ప్రారంభించింది. ఎన్నికల సంఘం ప్రతిపాదనలను రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు మంత్రివర్గం పంపించింది. రాష్ట్రపతి ఆమోదంతో తొలి దశ ఎన్నికల నోటిఫికేషన్ ఈ నెల 20న వెలువడనుంది. నోటిఫికేషన్ అనంతరం నామినేషన్ల ప్రక్రియ ప్రారంభమవుతుంది. ఏడు దశల్లో ఎన్నికలు జరుగుతాయి కాబట్టి వేర్వేరు తేదీల్లో ఏడు నోటిఫికేషన్లు జారీ చేయాల్సి ఉంది.

కేజ్రీవాల్‌కు రెండు సమన్లు

న్యూఢిల్లీ: ఎన్నికలు దగ్గర పడుతున్న వేళ ఆప్ చీఫ్, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌ను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఈడీ)అధికారులు వదిలేలా లేరు. ఢిల్లీ మద్యం విధానం కుంభకోణం కేసులో మనీ లాండరింగ్ ఆరోపణలపై ఆదివారం 9వసారి ఆయనకు సమన్లు పంపారు. ఈ నెల 21న విచారణకు రావాలని అందులో పేర్కొన్నారు. అదేవిధంగా, ఢిల్లీ జల్ బోర్డు (డీజేబీ)లో అవకతవకలపై విచారణకు రావాలంటూ మరో నోటీసిచ్చారు. ఈ కేసులో 18న విచారణకు హాజరు కావాలని కోరారు. మద్యం విధానం కేసుకు సంబంధించి సమన్లు అన్యాయంగా పంపుతున్నారంటూ కేజ్రీవాల్ ఈడీ విచారణకు దుమ్మా కొడుతున్నారు. దీంతో, సమన్లకు ఢిల్లీ సీఎం స్పందించడం లేదంటూ ఈడీ అధికారులు ఢిల్లీ కోర్టును ఆశ్రయించడం, కేజ్రీవాల్‌కు కోర్టు శనివారం బెయిలివ్వడం తెలిసిందే. మద్యం కేసులో పలువురు ఆప్ నేతలు ఇప్పటికే జైల్లో ఉండటం తెలిసిందే.

ఈవీఎం, ఈడీ, ఐటీ

ఇవి లేకుండా మోదీ ఎన్నికల్లో నెగ్గలేడు: రాహుల్

అధికారం కోసం అర్రులు చాచే అసమర్థుడు
- భారత్ జోడో న్యాయ్ యాత్ర ముగింపు సభలో నిప్పులు
- విపక్షాల బల ప్రదర్శన
- ఎస్పీ చీఫ్ అఖిలేశ్ దుమ్మా



ఆదివారం ముంబైలో భారత్ జోడో న్యాయ్ యాత్ర ముగింపు సభలో ఫరూక్ అబ్దుల్లా, ఉద్ధవ్ ఠాక్రే, స్టాలిన్, రాహుల్, మల్లికార్జున ఖర్గే, శరద్ పవార్ తదితరులు

ముంబై/లఖ్‌నవూ: బీజేపీ పాలనలో దేశంలో పెచ్చరిల్లిన నిరుద్యోగం, ద్రవ్యోల్బణం, విద్వేషం తదితరాలను ప్రజలకు చాటిచెప్పేందుకు విధిలేని పరిస్థితుల్లో భారత్ జోడో యాత్రలు చేపట్టాల్సి వచ్చిందని కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్‌గాంధీ అన్నారు. జాతుల హింసతో అట్టుడికిన మణిపూర్‌లో జనవరి 14న మొదలు పెట్టిన భారత్ జోడో న్యాయ్ యాత్ర 63 రోజులకు ఆదివారం ముంబైలో ముగిసింది. ఈ సందర్భంగా సెంట్రల్ ముంబైలోని అంబేడ్కర్ స్మారకం చైత్యభూమిని రాహుల్ సందర్శించారు. రాజ్యాంగ ప్రవేశికను చదివి నివాళులర్పించారు. అనంతరం స్థానిక శివాజీ పార్కులో విపక్ష ఇండియా కూటమి ఆధ్వర్యంలో జరిగిన భారీ ర్యాలీలో మాట్లాడారు. మోదీ ఓ అసమర్థ నేత అంటూ దుయ్యబట్టారు. ఈవీఎంలు, ఈడీ, సీబీఐ, ఐటీ లేకుండా లోక్‌సభ ఎన్నికల్లో నెగ్గడం ఆయన తరం కాదన్నారు. ''మోదీ కేవలం అధికారం కోసం అర్రులు చాచే ముసుగు మనిషి. అవినీతిపై మోదీదే గుత్తాధిపత్యం. తనది 56 అంగుళాల ఛాతీ అని ఆయన చెప్పుకునే మాటలన్నీ అబద్ధాలే'' అంటూ తీవ్ర పదజాలంతో దుయ్యబట్టారు. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత కోసం వీవీప్యాట్‌లను కచ్చితంగా లెక్కించాలన్న తమ డిమాండ్‌కు కేంద్ర ఎన్నికల సంఘం అంగీకరించలేదని ఆరోపించారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ మోదీ గ్యారెంటీ సంపన్నుల కోసమైతే ఇండియా కూటమి హామీలు సామాన్యుని కోసమన్నారు. విపక్షాల బల ప్రదర్శనలో భాగంగా జోడో యాత్ర ముగింపులో ఇండియా కూటమి నేతలు పాల్గొన్నారు. డీఎంకే అధినేత, తమిళనాడు సీఎం ఎంకే స్టాలిన్‌తో పాటు శరద్ పవార్ (ఎన్సీపీ–శరద్), తేజస్వీ యాదవ్ (ఆర్జేడీ), ఉద్ధవ్ ఠాక్రే (శివసేన–యూబీటీ), ఫరూఖ్ అబ్దుల్లా (నేషనల్ కాన్ఫరెన్స్), మెహబూబా ముఫ్తీ (పీడీపీ) తదితరులు వీరిలో ఉన్నారు. ఇండియా కూటమిలో కీలక పక్షమైన సమాజ్‌వాదీ అధినేత అఖిలేశ్ యాదవ్ మాత్రం గైర్హాజరయ్యారు. అయితే, యాత్రను రాహుల్ విజయవంతంగా ముగించారని కొనియాడుతూ ఆయనకు లేఖ రాశారు.

వచ్చేది 'ఇండియా' సర్కారే

గాంధీ ముంబై నుంచే క్విట్ ఇండియా నినాదమిచ్చారని శరద్ పవార్ గుర్తు చేశారు. బీజేపీని అధికారం నుంచి దించేందుకు ఇండియా కూటమి కూడా ముంబైలో ప్రతినబూనాలని పిలుపునిచ్చారు. కేంద్రంలో తదుపరి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసేది ఇండియా కూటమేనని స్టాలిన్ అన్నారు. ఎన్నికల బాండ్లను బీజేపీ పాల్పడ్డ వైట్ కాలర్ నేరంగా అభివర్ణించారు. ప్రజలంతా ఒక్కటైనప్పుడే నియంతృత్వానికి తెర పడుతుందని ఉద్ధవ్ అన్నారు. ఈడీ, సీబీఐ సాయంతో రాష్ట్రాల్లో ప్రభుత్వాలను బీజేపీ కూలదోస్తోందని తేజస్వి మండిపడ్డారు. తమ పోరు విద్వేష రాజకీయాలపైనే తప్ప మోదీపైనో, అమిత్ షాపైనో కాదన్నారు.

రాజ్యాంగాన్ని మార్చడం బీజేపీ తరం కాదు

అంతకుముందు ముంబైలో మహాత్మా గాంధీ నివసించిన మణిభవన్‌ను రాహుల్ సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజ్యాంగాన్ని మార్చడం బీజేపీ తరం కాదన్నారు. ఈ విషయంలో పార్టీ ప్రకటనలు ఉత్తి అరుపులు మాత్రమేనన్నారు. ''జ్ఞానం కేవలం ఒక్క వ్యక్తి సొత్తేనన్నది బీజేపీ, ఆరెస్సెస్ భావన. రైతులు, కార్మికులు, నిరుద్యోగ యువతకు ఏమీ తెలియదన్నది వారి దురభిప్రాయం'' అంటూ మండిపడ్డారు. లోక్‌సభ ఎన్నికలను కేంద్రీకృత పాలనే కావాలనే బీజేపీ, అది వికేంద్రీకృత తరహాలో సాగాలనే కాంగ్రెస్ భావజాలాల మధ్య పోరుగా అభివర్ణించారు.

నేను నెగ్గకుంటే రక్తపాతమే

ట్రంప్ వివాదాస్పద వ్యాఖ్యలు

వాషింగ్టన్: ఈసారి జరగబోయే అమెరికా అధ్యక్ష ఎన్నికలు చరిత్రలో నిలిచిపోనున్నాయని రిపబ్లికన్ పార్టీ అభ్యర్థి డొనాల్డ్ ట్రంప్ అన్నారు. అయితే, తాను నెగ్గకపోతే అమెరికాలో రక్తపాతం జరుగుతుందంటూ శనివారం ఒహాయో ఎన్నికల ర్యాలీలో ఆయన వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. వీటిపై విమర్శలు రావడంతో, వాహన పరిశ్రమలో ఆర్థిక రక్తపాతం తప్పదన్నదే ట్రంప్ ఉద్దేశమని ఆయన ప్రచార బృందం పేర్కొంది.

అమెరికాకు 'స్పేస్ ఎక్స్' నిఘా ఉపగ్రహాలు!

వాషింగ్టన్: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ స్థాపించిన 'స్పేస్ ఎక్స్' కంపెనీ కేవలం అంతరిక్ష ప్రయోగాలే కాదు, నిఘా ఉపగ్రహాల తయారీకి సైతం శ్రీకారం చుట్టింది. ఈ మేరకు స్పేస్ ఎక్స్‌తో అమెరికా ఇంటెలిజెన్స్ ఏజెన్సీ 'ఎన్ఆర్ఓ' డీల్ కుదుర్చుకున్నట్లు విశ్వసనీయవర్గాలు వెల్లడించాయి. 2021లోనే ఒప్పందం కుదిరిందని, ఈ కాంట్రాక్టు విలువ 1.8 బిలియన్ డాలర్లు అని తెలియజేశాయి. దీనిప్రకారం ఎలాన్ మస్క్ సంస్థ వందలాది నిఘా ఉపగ్రహాలను తయారు చేసి, ఎన్ఆర్ఓకు అప్పగించాల్సి ఉంటుంది. అమెరికా భద్రతా సంస్థలు, ఎలాన్ మస్క్ కంపెనీ మధ్య బలపడుతున్న బంధానికి ఈ ఒప్పందమే నిదర్శనమని చెబుతున్నారు. ఈ ఉపగ్రహాలు. భూగోళంపై ప్రతి ప్రాంతంపై డేగ కన్నేస్తాయి. అమెరికా సైనిక ఆపరేషన్లకు తోడ్పాటునందిస్తాయి. లక్ష్యాలను కచ్చితంగా గుర్తించడానికి సహకరిస్తాయి. వీటితో అమెరికా ప్రభుత్వానికి, సైన్యానికి చాలా ప్రయోజనాలే ఉంటాయని నిపుణులు పేర్కొంటున్నారు.

జాయింట్ ఆపరేషన్ సూపర్ సక్సెస్

సోమాలియా పైరేట్ల ఆట కట్టించిన భారత వైమానిక దళం, నావికాదళం

న్యూఢిల్లీ: కచ్చితమైన వ్యూహం, సైనిక దళాల మధ్య సరైన సమన్వయం, పటిష్టమైన ప్రణాళిక ఉంటే ఎలాంటి ఆపరేషన్ అయినా విజయవంతం కావాల్సిందే. భారత వైమానిక దళం, నావికాదళం సంయుక్తంగా చేపట్టిన ఆపరేషన్‌తో సోమాలియా సముద్రపు దొంగల ఆట కట్టయ్యింది. సోమాలియా పైరేట్లు మూడు నెలల క్రితం హైజాక్ చేసిన సరుకు రవాణా నౌక 'ఎంవీ రూయెన్'ను భారత వైమానిక దళం, నావికాదళం జాయింట్ ఆపరేషన్ ద్వారా విజయవంతంగా విడిపించాయి. ఈ నౌకలోని 35 మంది సముద్రపు దొంగలను నావికాదళం అధికారులు శనివారం అదుపులోకి తీసుకున్నారు. నౌకలో బందీలుగా ఉన్న 17 మంది సిబ్బందిని విడిపించారు. నౌకలో రూ.8.29 కోట్ల విలువైన 37,800 కోట్ల టన్నుల సరుకు ఉందని, నౌకను ఇండియాకు చేరుస్తున్నామని నావికాదళం వెల్లడించింది. ఎంవీ రూయెన్ షిప్‌ను సముద్రపు దొంగల చెర నుంచి విడిపించడంలో భారత వైమానిక దళానికి(ఐఏఎఫ్)కు చెందిన సి–17 టాక్టికల్ రవాణా విమానం కీలకంగా వ్యవహరించింది. జాయింట్ ఆపరేషన్‌లో భాగంగా రెండు కాంబాట్ రబ్బరైజ్డ్ రైడింగ్ క్రాఫ్ట్(సీఆర్ఆర్‌సీ) బోట్లను, 'మార్కోస్' మెరైన్ కమాండోలను ఈ విమానం ద్వారా భారత తీరానికి 2,600 కిలోమీటర్ల దూరంలో ఆరేబియా సముద్రంపైకి క్షేమంగా జారవిడిచారు. కమాండోలు అపూర్వమైన ధైర్యసాహసాలతో సముద్రపు దొంగలను లొంగదీసుకున్నారు. మొత్తం ఆపరేషన్ 40 గంటలపాటు జరిగింది.

గుజరాత్ వర్సిటీలో విదేశీ విద్యార్థులపై దాడి.. ఇద్దరు అరెస్ట్

అహ్మదాబాద్: గుజరాత్ రాజధాని అహ్మదాబాద్‌లోని గుజరాత్ యూనివర్సిటీలో విదేశీ విద్యార్థులపై కొందరు దాడికి దిగారు. క్యాంపస్‌లోని ఎ–బ్లాక్ హాస్టల్‌లో విదేశీ విద్యార్థులు కొందరు శనివారం రాత్రి నమాజ్ చేస్తుండగా ముగ్గురు విద్యార్థులు అడ్డుకున్నారు. వారికి మరో 200 మంది తోడై విధ్వంసం సృష్టించారు. రాళ్లు రువ్వడంతో శ్రీలంక, తజికిస్తాన్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారు. పోలీసులు 25 మందిపై కేసులు పెట్టి ముగ్గురిని అరెస్ట్ చేశారు. మిగతా వారి కోసం గాలిస్తున్నారు. ఇలాంటి ఘటనలను పునరావృతం కానివ్వబోమని వీసీ నీరజా అరుణ్ గుప్తా స్పష్టం చేశారు. బాధ్యులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంటుందని విదేశాంగ శాఖ పేర్కొంది.

స్నేహితురాలిని పెళ్లాడిన ఆస్ట్రేలియా మహిళా మంత్రి



అడిలైడ్: ఆస్ట్రేలియా విదేశాంగ మంత్రి పెన్నీ వాంగ్ తన చిరకాల భాగస్వామి సోఫీ అల్లొచెను పెళ్లి చేసుకున్నారు. ఆస్ట్రేలియా పార్లమెంట్ సభ్యుల్లో మొట్టమొదటిగా స్వలింగ సంపర్కురాలిగా ప్రకటించుకున్న వాంగ్.. తనతోపాటు పూల బొకేతో పెళ్లి దుస్తుల్లో ఉన్న అల్లొచె ఫొటోను ఆదివారం ఇన్‌స్టాగామ్‌లో షేర్ చేశారు. 'మా కుటుంబసభ్యులు, ఎందరో స్నేహితులు ఈ ప్రత్యేకమైన రోజును మాతో పంచుకున్నందుకు సంతోషిస్తున్నాం'అని వాంగ్ పేర్కొన్నారు. వాంగ్, అల్లొచె దాదాపు రెండు దశాబ్దాలుగా కలిసి ఉంటున్నారు. శనివారం అడిలైడ్‌లోని ఓ ద్రాక్ష తోటలో వారి వివాహ వేడుక జరిగినట్లు 'సిడ్నీ మార్నింగ్ హెరాల్డ్' తెలిపింది. సెనేట్‌లో దక్షిణ ఆస్ట్రేలియా తరఫున వాంగ్ ప్రాతినిధ్యం వహిస్తున్నారు. ఆస్ట్రేలియా కేబినెట్‌లో స్థానం సంపాదించుకున్న ఆసియా(చైనా)లో జన్మించిన మొదటి వ్యక్తి పెన్నీ వాంగ్. ఆస్ట్రేలియాలో 2017 నుంచి స్వలింగ వివాహాలకు చట్టబద్ధత లభించింది.

సాక్షి 24|7 కర్ణాటక
KARNATAKA
సోమవారం ౹ 18 ౹ మార్చి ౹ 2024



మహిళా కండక్టర్ల గోడు

బనశంకరి: కేఎస్ ఆర్టీసీ అధికారులు రాత్రి, పగలు పని చేయాలని వేధిస్తున్నారంటూ మహిళా కండక్టర్లు సీఎం సిద్ధరామయ్య, రవాణామంత్రి రామలింగారెడ్డికి ఫిర్యాదు చేశారు. బెంగళూరు దీపాంజలి నగర డిపో కండక్టర్ నంజమ్మ పై అధికారుల వేధింపుల పట్ల వీడియో తీసి గోడు వెళ్లబోసుకుంది. నెలసరి సమయంలోనూ డ్యూటీ చేయాలని హింస పెడుతున్నారని సీటీఎం ఆంథోణి జార్జ్ దృష్టికి తీసుకురాగా అసభ్య పదజాలంతో దూషించారని ఆమె తెలిపింది. 44 మంది మహిళా కండక్టర్లు సంతకాలు చేసి సీఎం, మంత్రికి లేఖలు పంపారు.

న్యూస్‌రీల్

ఘనంగా కళ్యాణోత్సవం



మండ్య: ప్రఖ్యాత వైరముడి బ్రహ్మోత్సవం సందర్భంగా చెలువ నారాయణ స్వామి కళ్యాణోత్సవం ఆదివారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. ఏడాది ఒకసారి జరిగే కళ్యాణోత్సవాన్ని వేలాది మంది భక్తులు వీక్షించారు. కోనేరు దగ్గర చరిత్ర ప్రసిద్ధ ధార మండపంలో స్వామివారి కళ్యాణాన్ని చూసి భక్తులు పునీతులయ్యారు. తమిళనాడు, ఆంధ్ర, కేరళ రాష్ట్రాల నుంచి భక్తజనం తరలివచ్చారు.

పొలంలో చిరుత కూనలు లభ్యం

మైసూరు: ఓ పొలంలో మూడు చిరుతపులి పిల్లలు కనిపించాయి. నంజనగూడు తాలూకా సిందువళ్ళి గ్రామంలో సంపత్ అనే రైతు పొలంలో కూలీలు పనిచేస్తుండగా చిరుత కూనల అరుపులు విని అటవీ సిబ్బందికి సమాచారమిచ్చారు. వారు వచ్చి మూడు చిరుత కూనలను స్వాధీనం చేసుకొన్నారు. తల్లి చిరుత జాడ లేదు. దాని కోసం బోనును ఏర్పాటు చేశారు.

20న కాంగ్రెస్ 2వ జాబితా

శివాజీనగర: లోక్‌సభ ఎన్నికలకు కాంగ్రెస్ అభ్యర్థుల 2వ జాబితా సిద్ధమవుతోంది. మార్చి 19న అభ్యర్థుల ఎంపిక గురించి తుది భేటీ జరుగుతుందని డీసీఎం డీకే శివకుమార్ అన్నారు. ఆదివారం కేపీసీసీ కార్యాలయంలో మాట్లాడుతూ ఈ నెల 20న అభ్యర్థుల జాబితా ప్రకటితమవుతుందన్నారు. ఆదివారం భారత్ జోడో యాత్ర కోసం నేతలందరూ ముంబయికి వెళ్లారన్నారు. ప్రతి తాలూకాలో గ్యారెంటీ అధ్యక్షులను నియమించి ఎన్నికల పనులను అప్పగిస్తామన్నారు.

బైక్ ప్రమాదంలో ఏఎస్సై మృతి

దొడ్డబళ్లాపురం: రోడ్డు ప్రమాదంలో ఏఎస్సై దుర్మరణం చెందగా, ఎస్సై నిర్లక్ష్యం ఉందంటూ ఆయనను ఎస్పీ సస్పెండ్ చేసిన సంఘటన బెళగావిలో చోటుచేసుకుంది. వివరాలు.. యరగట్టి పట్టణ పరిధిలోని క్రిష్ణ కాలనీ వద్ద స్పీడ్ బ్రేకర్ల వద్ద బైక్‌పై వేగంగా వెళ్లడంతో దొడవాడ పోలీస్‌స్టేషన్ ఏఎస్సై విజయకాంత్ మికలి (51) అదుపు తప్పి కింద పడ్డాడు. హెల్మెట్ ధరించని కారణంగా తలకు తీవ్ర గాయాలై ప్రాణాలు పోయాయి. పోలీసులు బైక్ నడిపేటప్పుడు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఆదేశాలున్నాయి. ఈ విషయంలో నిర్లక్ష్యం వహించారంటూ ఎస్సై నందీష్‌ను ఎస్పీ భీమాశంకర్ గుళేద్ సస్పెండ్ చేశారు.

టీచర్ల నిందలు.. బాలిక ఆత్మహత్య



విద్యార్థిని దివ్య (ఫైల్)

దొడ్డబళ్లాపురం: దొంగతనం నిందను తట్టుకోలేని చిన్నారి బాలిక ఆత్మహత్య చేసుకున్న సంఘటన బాగలకోట తాలూకా కందపురలో చోటుచేసుకుంది. 8వ తరగతి విద్యార్థిని దివ్య (14) మృతురాలు. మార్చి 15న కందపుర గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో టీచర్ జయశ్రీ పర్సులో నుంచి రూ. 2 వేలు మాయమయ్యాయి. దీంతో ఆమె దివ్యపై అనుమానంతో దుస్తులు విప్పించి చెక్ చేసి దుర్భాషలాడింది. తోటి ఉపాధ్యాయులు కూడా దివ్య చేత ప్రమాణం చేయించి అవమానించారు. ఈ బాధను తట్టుకోలేని చిన్నారి ఇంట్లో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. ఆమె తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు బాగలకోట గ్రామీణ పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ ఘోరానికి కారణమైన టీచర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని కుటుంబసభ్యులు డిమాండ్ చేశారు. చదువులో ముందుండే ప్రతిభావంతురాలు టీచర్ల అకృత్యానికి బలైపోయిందని విలపించారు.

రౌడీపై పోలీసు కాల్పులు

దొడ్డబళ్లాపురం: నేరం జరిగిన స్థలానికి తీసికెళ్లి పరిశీలిస్తుండగా పోలీసులపై దాడిచేసి తప్పించుకోవడానికి ప్రయత్నించిన రౌడీపై కాల్పులు జరిపిన సంఘటన బెంగళూరు కగ్గలీపుర పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. జేపీ నగర రౌడీషీటర్ సోమ(50) గత డిసెంబరు 5న చెరువు వద్ద అపరిచిత శవం లభించిన కేసులో నిందితునిగా ఉన్నారు. అతన్ని అరెస్టు చేసి శనివారం రాత్రి ఘటనా స్థలాన్ని పరిశీలనకు తీసుకెళ్లారు. ఆ సమయంలో సోమ.. హెడ్ కానిస్టేబుల్ మడెయప్పపై దాడి చేసి పారిపోసాగాడు. దీంతో ఇన్స్‌పెక్టర్ సుందర్.. గురిపెట్టి కాల్చడంతో రౌడీ కాలికి తూటా తగిలి పడిపోయాడు. వెంటనే ఆస్పత్రికి తరలించారు. ఇతనిపై నగరంలో 15పైగా కేసులు నమోదై ఉన్నాయి.

చుక్క నీటికీ దిక్కులు చూడాలి

- రాష్ట్రంలో డ్యాములు ఎండుముఖం
- 3,685 చెరువులు ఖాళీ
- పల్లెల్లో మరింత దుర్భరం





ఆదివారం మండ్య జిల్లాలోని కేఆర్ఎస్ జలాశయంలో అడుగంటిన కావేరి నది

బనశంకరి: అనుక్షణం అవసరమైన నీటి కోసం దిక్కులు చూడాల్సి వస్తోంది. కన్నడనాట తీవ్ర దుర్భిక్ష పరిస్థితులు నెలకొన్నాయి. వర్షాలు లేక కరువు నెలకొనగా గుక్కెడు నీటి కోసం ప్రజలు అలమటిస్తున్నారు. కేఆర్ఎస్, అలమట్టి, తుంగభద్ర, నారాయణపుర, హారంగి తదితర అన్ని భారీ, మధ్య, చిన్న జలాశయాల్లో నీరు దాదాపు అడుగంటిపోయింది. 3,684 చెరువులు పూర్తిగా ఎండిపోగా, 125 తాలూకాల్లో భూగర్భ జలాలు పాతాళానికి చేరాయి.

పల్లెలు, నగరాల్లోనూ కటకట

23 జిల్లాల్లో 98 తాలూకాల్లో నీటి కొరత పీడిస్తోంది. ప్రజలు భారీగా డబ్బు పెట్టి ప్రైవేటు ట్యాంకర్లు, బోరుబావులను ఆశ్రయిస్తున్నారు. 7,408కి పైగా గ్రామాల్లో నీటి సమస్య తీవ్ర రూపం దాల్చింది. పశువులకు ఉప్పు నీరు సైతం దొరకడం లేదు. బోర్లు ఎండిపోవడంతో ప్రజలకు, పశువులకు నీటి ఎద్దడి ఏర్పడింది. సుదూర ప్రాంతాలకు వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారు. ఇక నగరాల్లో 1,115 వార్డుల్లో తాగునీటికి కటకట ఏర్పడింది. 3,471 ప్రైవేటు బోర్ల నుంచి అధికారులు నీటిని తీసుకుని సరఫరా చేస్తున్నారు.

జలాశయాల్లో అధ్వానం

కావేరి జలాశయం ఇన్‌ఫ్లో శనివారం 4,845 క్యూసెక్కులు ఉండగా ఆదివారం సాయంత్రం నాటికి 1,008 క్యూసెక్కులకు తగ్గిపోయింది. శివ ఆనకట్టలో ప్రస్తుతం 1.5 అడుగుల నీరు ఉండగా డ్యాంలోని 80 గేట్లను మూసివేశారు. 50 గేట్ల ద్వారా నీటిని బయటికి వదులుతున్నారు.

కావేరి జలాల రగడ

బెంగళూరులో తాగునీటి కోసం హాహాకారాలు కొనసాగుతున్నాయి. ఇదే సమయంలో కావేరి డ్యాంల నుంచి తమిళనాడుకు నీటిని విడుదల చేయడంపై బీజేపీ మండిపడుతోంది. మైసూరు, మండ్య ప్రాంతాల్లో రైతులు ధర్నాలు చేశారు. ఇక్కడ నీళ్లు లేక అల్లాడుతుంటే సిద్దరామయ్య ప్రభుత్వం తమిళనాడుకు నీరు విడుదల చేయడం సిగ్గుచేటని బీజేపీ నేతలు ధ్వజమెత్తారు.

జలాశయాలు	పూర్తి సామర్థ్యం	ప్రస్తుతం (మీటర్లలో)
లింగమమక్కి	554.44	38.21
సూప	564.00	57.45
వారాహి	594.36	7.77
హారంగి	871.38	3.77
హేమావతి	890.58	13.27
కృష్ణరాజసాగర	38.04	15.82
కబిని	696.13	11.49
భద్రా	657.73	25.12
తుంగభద్ర	497.71	8.21
ఘటప్రభ	662.91	27.17
మలప్రభ	633.80	11.47
ఆలమట్టి	519.60	48.28
నారాయణపుర	492.25	17.91
వీవీ సాగర	652.24	19.68



కేఆర్ఎస్ జలాశయంలో జీవనదికే ఈ స్థితి ఎదురైతే రాష్ట్రంలో మిగతా నదుల మాటేమిటి?

పార్టీలూ.. హద్దులు దాటొద్దు



ఆదివారం బెంగళూరు వీవీ పురంలో తమ కారులో ఏమీ లేవంటూ దండాలు పెట్టిన వృద్ధుడు

- ఎన్నికల కోడ్‌ను అతిక్రమించరాదు
- సీఈఓ మనోజ్ మీనా ఆదేశం

శివాజీనగర: లోక్‌సభ ఎన్నికలను ప్రకటించిన నేపథ్యంలో రాజకీయ పార్టీల ప్రతినిధులతో రాష్ట్ర ప్రధాన ఎన్నికలాధికారి (సీఈఓ) మనోజ్‌కుమార్ మీనా ఆదివారం నగరంలో తమ ఆఫీసులో సమావేశం జరిపారు. ఎన్నికల నియమావళిని తప్పక పాటించాలని సూచించారు. బీఎస్పీ పార్టీ నాయకుడు ఆర్.మునియప్ప, కాంగ్రెస్, బీజేపీ, జేడీఎస్, ఆప్‌తో పాటు వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు. అన్ని చోట్లా ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చింది. ప్రభుత్వం నిర్దేశించిన కార్యక్రమాలకు నియమావళి అడ్డురాదు. అయితే ప్రజాప్రతినిధులు ప్రభుత్వ కార్యక్రమాల్లో పాల్గొనేందుకు వీలులేదు. రాజకీయ నాయకులు ఏ కార్యక్రమం జరిపినా కూడా దాని ఖర్చు బాధ్యతలను ఆయా పార్టీ గాని, అభ్యర్థి ఎన్నికల ఖర్చులోకి చేర్చబడును. ప్రతి లెక్కను కూడా సకాలంలో తెలియజేయాలి. ప్రభుత్వ భవనం, ధార్మిక క్షేత్రాల్లో ప్రచారం చేయరాదు. ధన బలం, కండబలం తదితరాలను ప్రదర్శించేందుకు లేదు. ఓటర్లను ఆకట్టుకునేలా ఎలాంటి కానుకలను ఇవ్వకూడదు అని తెలిపారు.

రెండు చోట్ల రూ. 20 లక్షలు సీజ్

లోక్‌సభ ఎన్నికల కోడ్ రాగానే అధికారులు, పోలీసులు నిఘా తీవ్రం చేశారు. అన్ని చోట్లా సోదాలను ముమ్మరం చేశారు. నెలమంగలలో తరలిస్తున్న రూ. 7 లక్షలను పోలీసులు స్వాధీనం చేసుకొన్నారు. కారులో ఉన్న తమిళనాడు వ్యాపారి రఘుపతిని అదుపులోకి తీసుకొన్నారు. రఘుపతి బెంగళూరు నుంచి వెళుతున్నారు. అలాగే బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో కారులో తీసుకెళ్తున్న రూ. 13 లక్షల నగదును అశోకనగర పోలీసులు పట్టుకున్నారు. నగరంలో వీవీ పురంలో వాహన తనిఖీలను చేశారు. తమ కారులో ఏమీ లేవంటూ ఓ వ్యక్తి పోలీసులకు చేతులెత్తి దండం పెట్టాడు.



నగరంలో గూడ్స్ వ్యాన్‌లో తనిఖీలు



చిత్రాంజలి

ప్రముఖ నటుడు పునీత్ రాజ్‌కుమార్ జయంతిని ఆదివారం అంతటా ఆచరించారు. మైసూరులో ప్యాలెస్ ముందు బృహత్ చిత్రాన్ని గీసిన అభిమానులు

వలస వ్యాపారుల విషాదం

- కలబుర్గి జిల్లాలో రెండు కార్లు ఢీ. ఇద్దరు మృతి



రెండు దుర్ఘటనల దృశ్యాలు



రాయచూరు రూరల్: రెండు కార్లు ఢీకొన్న దుర్ఘటనలో ఇద్దరు బలైన సంఘటన కలబుర్గి జిల్లాలో చోటు చేసుకుంది. ఆదివారం కలబుర్గి జిల్లా శహబాద్ తాలుకా భంకూర వద్ద ఈ ప్రమాదం జరిగింది. స్విఫ్ట్ కారులో రంజాన్ పండుగ సందర్భంగా బట్టల వ్యాపారాలు చేసుకొని కలబుర్గి నుండి యాదగిరికి వెళ్తున్నారు. ఎదురుగా వచ్చిన స్కార్పియో కారు ఢీకొనడంతో స్విఫ్ట్ కారు నుజ్జయింది. అందులోని జహాద్ పఠాన్ (30), షాకీర్ (20) అనే ఇద్దరు మరణించారు, మరొకరు గాయపడ్డారు. బాధితులందరూ ఉత్తర ప్రదేశ్ నుంచి వచ్చి ఇక్కడ బట్టలు అమ్మేవారని తెలిసింది. స్కార్పియోలోని ఇద్దరికి స్వల్ప గాయాలయ్యాయి.

బైక్– టిప్పర్ ఢీ, ఇద్దరు యువకులు..

ఆదివారం దావణగెరె జిల్లా హనగవాడి వద్ద జాతీయ రహదారి–48లో బైక్, టిప్పర్ లారీ ఢీకొన్న ప్రమాదంలో బాతి గ్రామానికి చెందిన రాకేష్ (22), ఆకాష్ (23) అనే ఇద్దరు యువకులు చనిపోయారు. టిప్పర్ డ్రైవర్ నిర్లక్ష్యం, బైకిస్టుల అతి వేగం కలిసి ప్రమాదానికి కారణమయ్యాయి. యువకులు ఇద్దరూ ఘటనాస్థలంలోనే మరణించారు. హరిహర గ్రామీణ పోలీసులు చేరుకుని మృతదేహాలను ఆస్పత్రికి తరలించారు.

వాంటెడ్ డీఎస్పీ

బనశంకరి: బిట్‌కాయిన్ కేసులో పరారీలో ఉన్న డీఎస్పీ శ్రీధర్ పూజార్ ఆచూకీ తెలిపిన వారికి సిట్ బహుమానం ప్రకటించింది. ఈ స్కాంలో శ్రీధర్ పూజార్ 5 వ నిందితునిగా ఉన్నారు. కేసులో సాక్ష్యాధారాలను కావాలనే నాశనం చేసినట్లు ఆరోపణలున్నాయి. ఆచూకీ తెలిసినవారు 080 22094485, 22094498 నంబర్లకు సమాచారం అందించాలని తెలిపింది.

ఎమ్మెల్యే దౌర్జన్యం!

తుమకూరు: కాంట్రాక్టర్, కాంగ్రెస్ నాయకుడు సంద్ర రవికుమార్ పైన దాడి చేసిన ఆరోపణలతో జిల్లాలోని గుబ్బి కాంగ్రెస్ ఎమ్మెల్యే, కేఎస్ఆర్‌టిసి సంస్థ అధ్యక్షుడు ఎస్ఆర్ శ్రీనివాస్‌పై తిలక్ పార్క్ పోలీసులు కేసు నమోదు చేశారు. టెండర్‌లో అన్యాయం జరిగిందని, న్యాయం చేయాలని ప్రజాపనుల శాఖ ఆఫీసు ముందు రవికుమార్ ధర్నా చేశాడు. అక్కడికి వచ్చిన ఎమ్మెల్యే శ్రీనివాస్.. రవికుమార్‌పై దౌర్జన్యం చేసి కొట్టి దూషించాడు, ఈ దాడిలో గాయపడ్డానని రవికుమార్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఎమ్మెల్యే పైన పోలీసులు కేసు నమోదు చేశారు.

నేడు శివమొగ్గలో ప్రధాని సభ



శివమొగ్గ: శివమొగ్గలో నేడు సోమవారం ప్రధాని నరేంద్ర మోదీ ఎన్నికల బహిరంగ జరుగుతుంది. వేలాది మంది కార్యకర్తలతో పాటు ప్రముఖ నాయకులు హాజరవుతారని శివమొగ్గ బీజేపీ అభ్యర్థి బీ.వై. రాఘవేంద్ర అన్నారు. శివమొగ్గ నగరంలోని అల్లమ ప్రభు మైదానంలో సభా పనులను పరిశీలించారు. ప్రధాని మోదీ సభలో పాల్గొని ప్రసంగిస్తారన్నారు. భారీ వేదిక, ప్రజలు కూర్చునేందుకు ఆసనాలు, పార్కింగ్ పనులు సాగుతున్నాయి. అంతటా కేంద్ర భద్రతా సిబ్బంది మోహరించారు.

ఈశ్వరప్పకు న్యాయం చేస్తారు: యడ్డి

కే.ఎస్.ఈశ్వరప్ప కుమారుడు కాంతేష్‌కు హావేరి ఎంపీ టికెట్ అడిగిందని నిజమేనని, కానీ టికెట్ ఇవ్వడం అనేది తన చేతిలో లేదని మాజీ సీఎం బీఎస్ యడియూరప్ప అన్నారు. ప్రధాని మోదీ సభ ఏర్పాట్లను ఆయన పరిశీలించారు. బీజేపీని నేనొక్కడే బలోపేతం చేయలేదు, ఇందులో ఈశ్వరప్ప కూడా ఉన్నారని చెప్పారు. అలాంటి నాయకుని కుమారునికి టికెట్ రాలేదని కొంత నిరాశలో ఉన్నారని అన్నారు. మోదీ సభలో ఈశ్వరప్ప కూడా పాల్గొంటారని, ఆయనతో పార్టీ పెద్దలు మాట్లాడతారని, న్యాయం చేస్తారని చెప్పారు.

యుద్ధవిద్యలు నేరుద్దాం, ఆకతాయిల పనిపడదాం



శిబిరంలో పాల్గొన్న యువతీ యువకులు



స్టైల్ ఇచ్చిన అమ్మాయిలు

- ఉత్సాహంగా ఆత్మరక్షణ జాగృతి శిబిరం

బనశంకరి: మహిళలు, యువతులు ఆత్మరక్షణ కోసం కరాటే తదితర విద్యలను నేర్చుకోవాలని యూత్ ఫర్ పరివర్తన అధ్యక్షుడు అమిత్‌అమరనాథ్ అన్నారు. పద్మనాభనగరలో వివిధ సంఘాల ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత స్వీయరక్షణ శిబిరం, ప్రపంచమహిళా దినోత్సవం నిర్వహించారు. దాడులు, వేధింపులు, చైన్‌స్నాచింగ్, లైంగిక వేధింపులకు వ్యతిరేకంగా దుష్టశక్తులపై పోరాడటానికి మహిళలకు స్వీయరక్షణ అవసరమని తెలిపారు. మహిళల్లో ఆత్మస్థైర్యం నింపి వారిని శక్తివంతులుగా మార్చి సొంత బలంతో రక్షణ పొందేలా కరాటే, కుంగ్‌ఫూ తదితర యుద్ధవిద్యల్లో శిక్షణ అవసరమని తెలిపారు. ఈ సందర్భంగా పోకిరీలను ఎలా ఎదుర్కోవాలో మెళకువలను బోధించారు.



పోకిరీలను ఇలా పడగొట్టాలి



ఆకతాయిలను ఇలా అడ్డుకోవాలని మెళకువల సాధన

క్లుప్తంగా

సమాజ సేవకు సహకరించాలి



జ్యోతి వెలిగిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: సమాజ సేవకు ప్రతి ఒక్కరూ సహకరించాలని చిక్కసూగురు మఠాధిపతి డా.సిద్ధలింగ స్వామీజీ అన్నారు. ఆదివారం పండిత సిద్దరామ జంబల దిన్ని రంగ మందిరంలో శరణప్ప గోనాళ ప్రతిష్టాన ఆధ్వర్యంలో మహంత శ్రీ అవార్డుల ప్రదానం చేసే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సమాజంలో పేదవారిని మానవతా దృష్టితో చూడాలని చేతనైనంత సహాయం చేయడం మన ధర్మమనే విషయాన్ని ప్రస్తావించారు. సమాజంలో తనదైన సేవలు అందిస్తున్న శరణప్ప సేవలు అనన్యమన్నారు. కార్యక్రమంలో గణపతి సాక్రే,చంద్రశేఖర్, కేశవరెడ్డి, మురళీధర్, శ్రీకాంత్, ప్రతిభా తదితరులు పాల్గొన్నారు.

పార్కులను అభివృద్ధి చేస్తాం

- బుడా అధ్యక్షుడు జేఎస్ ఆంజనేయులు



బుడా అధ్యక్షుడు ఆంజనేయులు (మధ్యలో)

సాక్షి,బళ్లారి: నగరంలోని బుడా పరిధిలో అధ్వానంగా ఉన్న పార్కులను అభివృద్ధి చేస్తామని బుడా నూతన అధ్యక్షుడు జే.ఎస్ ఆంజనేయులు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని రాఘవేంద్ర కాలనీ 2వ క్రాస్‌లో పార్కులో స్థానికులు, ఉద్యానవం సంఘ సభ్యులు తదితరులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ... బుడా అధ్యక్షుడుగా బాధ్యతలు తీసుకున్న తర్వాత పార్కుల స్థితిగతులపై దృష్టి పెట్టి అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నందీష్, వివేక్, (విక్కి), జేడీఎస్ నాయకుడు మీనళ్లి తాయణ్ణ తదితరులు పాల్గొన్నారు.

సంగీతానికి ప్రాణం పోయాలి



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: మరపురాని సంగీతానికి ప్రాణం పోయాలని సీనియర్ కవయిత్రి జయలక్ష్మి మంగళమూర్తి అన్నారు. ఆదివారం నగరంలోని కర్ణాటక సంఘంలో శ్రుతి సాహిత్య మేళా ఉత్సవంలో గాన సంగీతోత్సవ సంభ్రమాలను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో శ్రుతి సాహిత్య మేళా అధ్యక్షులు మురళీధర్ కులకర్ణి, శాంతప్ప, మల్లికార్జున, వెంకటేష్ బెవిన బెంచి, దానప్ప, మారుతి తదితరులు పాల్గొన్నారు.

పునీత్ సేవలు మరువలేనివి

- బళ్లారి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి బీ.శ్రీరాములు



పునీత్ చిత్రపటానికి నివాళులు అర్పించిన దృశ్యం

సాక్షి,బళ్లారి: కర్ణాటక సినీ రంగంలో గొప్ప పేరుతెచ్చుకుని, యువతకు ఆశాకిరణంగా నిలిచిపోయిన దివంగత పునీత్ రాజ్‌కుమార్ సేవలు మరువలేనివని బళ్లారి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి బీ.శ్రీరాములు పేర్కొన్నారు. ఆయన ఆదివారం తన నివాసంలో పునీత్ రాజ్‌కుమార్ జయంతి ఏర్పాటు చేసి అభిమానుల సమక్షంలో కేక్‌కట్ చేసి పావురాలను ఎగరవేసి, ఆయన చిత్ర పటానికి నివాళులు అర్పించారు. అతి చిన్న వయస్సులోనే ఆయన అందనంత ఎత్తుకు ఎదిగారని, ఆయన మన మధ్య లేకపోయినా, ఆయన చేపట్టిన సేవా కార్యక్రమాలు, ఆశయాలు మరవడానికి సాధ్యం కాదన్నారు. నేటి యువతకు ఆయన ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నందిహళ్లి హాలప్ప, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అధ్యక్షుడిగా చిదానందప్ప



చిదానందప్ప

సాక్షి,బళ్లారి: ఐదు గ్యారెంటీ పథకాల సమితి బళ్లారి జిల్లా అధ్యక్షుడిగా కే.ఈ చిదానందప్పను నియమించారు. ఇక ఉపాధ్యక్షులుగా ఎన్ కరిబసప్ప, ఎ.మానయ్య, ఆశాలత సోమప్ప, చాంద్‌భాష, సంగనకల్లు విజయ్ కుమార్‌లను ఖరారు చేశారు. వీరితో పాటు కమిటీలో పలువురు సభ్యులను నియమించారు. చిదానందప్ప మాట్లాడుతూ... అర్హులైన ప్రతి ఒక్కరికి గ్యారెంటీ పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు.

శ్రీవారి బ్రహ్మోత్సవాలకు వేళాయె

- రేపటి నుంచి కదిరి లక్ష్మీ నరసింహ స్వామి బ్రహ్మోత్సవాలు



శ్రీవారి బ్రహ్మ రథం (ఇన్‌సెట్‌లో) ప్రధాన అర్చకులు నరసింహాచార్యులు

కదిరి: వసంత వల్లభుడిగా, కాటమరాయుడిగా, ప్రహ్లాద వరదుడిగా పూజలందుకుంటున్న ఖాద్రీశుడి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈ నెల 19న ప్రారంభం కానున్నాయి. పక్షం రోజులపాటు జరుగుతాయి. శ్రీ మహావిష్ణువు దానవుడైన హిరణ్య కశ్యపుని శిక్షించేందుకు, తన భక్తుడైన ప్రహ్లాదుడిని రక్షించేందుకు 'నర-సింహ' అవతారంలో స్తంభం నుంచి ఉద్భవించాడు. హిరణ్య కశ్యపుని సంహరించిన అనంతరం శ్రీవారు ఆ ఉగ్ర రూపంలోనే కదిరి కొండ వద్ద సంచరించ సాగాడు. స్వామి అలాగే ఉండటం సరికాదని భావించిన మహర్షులు కొండపై నుంచి నారసింహుని వేడుకున్నారు. దీనికి గుర్తుగా ఆ కొండపై నారసింహుని ఆలయం కూడా ఉంది. అదే కొండపై శ్రీవారి పాద ముద్రికలు ఉన్నాయి. అందుకే ఈ ప్రాంతాన్ని 'ఖాద్రి' అని పిలిచారు. 'ఖా' అంటే విష్ణుపాదమని, 'అద్రి' అంటే కొండ అని అర్థం. ఖాద్రి ఇప్పుడు కదిరిగా పిలవబడుతోంది.

మహిమాన్వితుడు

కదిరి ప్రాంతంలో ఒకప్పుడు ఖాదిరి వృక్షాలు (చంద్ర వృక్షాలు) ఎక్కువగా ఉండేవి. ఈ చెట్ల కింద ఒక పుట్టలో నారసింహుడు స్వయంభువుగా వెలిశాడని, అందుకే ఖాద్రీ నారసింహుడని పిలుస్తున్నారని మరో కథనం. ప్రతి నెలా స్వాతి నక్షత్రం రోజు ఇక్కడి మూల విరాట్‌కు అభిషేకం చేస్తారు. అభిషేకానంతరం హృదయ భాగం నుంచి స్వేద బిందువులు చూడచ్చు. ఇది స్వామివారి మహిమ అని అర్చకులు చెబుతారు.

రంగనాయకుడి కల ఈ ఆలయం

పదో శతాబ్దంలో అప్పటి పట్నం పాలేగారైన రంగనాయకుడికి చెందిన గోవులు రోజూ ఖాదిరి వృక్షం కింద ఉన్న పుట్టలో పాలు వదిలేవి. ఆ పాలను నారసింహుడు తాగేవారని భక్తుల నమ్మకం. అందువల్లనే రంగనాయకులు ఆర్థికంగా బాగా ఎదిగారని ఒక కథనం. ఓరోజు ఆయనకు శ్రీవారు కలలో కనిపించి తాను స్వయంభువుగా వెలిశానని, పుట్టలో ఉన్న తన విగ్రహాన్ని వెలికితీసి గుడి కట్టించాలన్న కోరిక మేరకు ఆలయం నిర్మించినట్లు బ్రహ్మాండ పురాణం చెబుతోంది. నాటి ఆలయం కాల గతిలో అదృశ్యం కావడంతో బుక్కరాయలు, ఆ తర్వాత హరిహర రాయలు, చివరిగా శ్రీకృష్ణదేవరాయలు కాలంలో ఈ గుడి సంపూర్ణ నిర్మాణం జరిగినట్లు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి.

దేశంలోనే మూడో అతి పెద్ద బ్రహ్మరథం

స్వామివారి బ్రహ్మ రథం సుమారు 540 టన్నుల బరువు, 37.5 అడుగుల ఎత్తు ఉంది. రథంలోని పీఠం వెడల్పు 16 అడుగులు ఉంది. 130 ఏళ్ల క్రితం ఈ బ్రహ్మరథం తయారు చేశారు. రథంపై సుమారు 256 శిల్ప కళాకృతులను టేకుతో అందంగా తీర్చిదిద్దారు. తమిళనాడులోని ఆండాల్ అమ్మవారి శ్రీవల్లి పుత్తూరు రథం, తంజావూరు జిల్లాలోని తిరువార్ రథం తర్వాత మూడో అతి పెద్దది ఈ ఖాద్రీశుడి బ్రహ్మ రథం.

ఏ రోజు ఏ ఉత్సవం..

మార్చి 19న అంకురార్పణం
20న కళ్యాణోత్సవం
21న హంస వాహనం
22న సింహ వాహనం
23న హనుమంత వాహనం
24న బ్రహ్మ గరుడ సేవ
25న శేష వాహనం
26న సూర్య, చంద్ర ప్రభ
27న మోహినీ ఉత్సవం
28న ప్రజా గరుడ సేవ
29న గజ వాహనం
30న రథోత్సవం (తేరు)
31న అశ్వ వాహనం
ఏప్రిల్ 1న తీర్థవాది ఉత్సవం
ఏప్రిల్ 2న పుష్ప యాగోత్సవం

బ్రహ్మోత్సవాలకు భారీ ఏర్పాట్లు



బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయంలో నిత్యాన్నదానం ఉంటుంది. కల్యాణోత్సవంతో పాటు భక్తులు పెద్ద సంఖ్యలో విచ్చేసే రథోత్సవానికి ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నాం. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటున్నాం. సార్వత్రిక ఎన్నికలకు షెడ్యూల్ వచ్చిన కారణంగా రాజకీయాలకు తావులేకుండా ఆయా ప్రభుత్వ శాఖల అధికారుల సహాయ సహకారాలతో బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తాం.

–ఆలయ ఈఓ శ్రీనివాసరెడ్డి



ఖాద్రీ లక్ష్మీ నరసింహ స్వామి ఆలయం



నాలుగు గోపురాల నడుమ వెలసిన ఆలయం



శ్రీదేవి భూదేవి సమేత నారసింహుడు

పొడిచెత్త నిర్వహణపై జాగృతి



నాటకం ద్వారా ప్రజలను జాగృతం చేస్తున్న దృశ్యం

బనశంకరి: పొడిచెత్త నిర్వహణపై బెంగళూరు దక్షిణ వలయ పరిధిలో అధికారులు ప్రజలను జాగృతి కల్పించారు. తడి, పొడిచెత్త , స్యానిటరీ చెత్త విభజన, ప్లాస్టిక్‌నిషేధం, రోడ్లపై వేయడాన్ని నివారించడంపై ఆదివారం వీధినాటకాల ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేశారు. వారానికి రెండుసార్లు పొడిచెత్త సేకరిస్తున్నామని, ప్రజలందరూ రోడ్లపై చెత్త పడేయవద్దని అధికారులు సూచించారు. నగర స్వచ్ఛతకు పాలికెతో సహకరించాలని కోరారు. మడివాళ, సారక్కి మార్కెట్‌లో బట్టబ్యాగులు పంచి ప్రజలను జాగృతం చేశారు.ప్లాస్టిక్‌ను పారదోలి ప్రతి ఒక్కరూ బట్ట బ్యాగులు వినియోగించి పర్యావరణాన్ని పరిరక్షించాల్నారు. బీబీఎంపీ దక్షిణ వలయ కమిషనర్ వినోత్‌ప్రియా, జాయింట్ కమిషనర్ శివ కుమార్, ఇంజనీర్ రాజేశ్ పాల్గొన్నారు.

ఆదిచుంచనగిరి మఠంలో యదువీర్ పూజలు



యదువీర్‌ను సన్మానించి పండ్లబుట్ట అందజేస్తున్న నిర్మలానంద స్వామీజీ

మండ్య:నాగమంగల తాలూకాలోని ఆదిచుంచనగిరి మహా సంస్థాన మఠాన్ని ఆదివారం మైసూరు– కొడగు లోక్‌సభ బీజేపీ అభ్యర్థి, మైసూరు మహారాజు యదువీర్ సందర్శించారు. ఈ సందర్భంగా మఠం ఆధ్వర్యంలో ఆయనకు మంగళ వాయిద్యాలు, పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మఠం పీఠాధ్యక్షుడు శ్రీనిర్మలానంద నాథ స్వామీజీతో కలిసి క్షేత్ర పాలన కాలభైరవేశ్వర స్వామి ఆలయంలో యదువీర్ పూజలు నిర్వహించారు. తర్వాత నిర్మలానందనాథ స్వామజీ ఆశీర్వాదం తీసుకున్నారు. అనంతరం మఠం సంప్రదాయాల ప్రకారం యదువీర్‌కు శాలువ కప్పి పూలమాల వేసి పండ్ల బుట్టను కానుకగా ఇవ్వడం ద్వారా సన్మానించారు.

గ్వాలియర్‌లో కర్ణాటక పోలీసుల కాల్పులు

- బంగారు నగల దుకాణంలో దోపిడీకి యత్నించిన ముఠా అరెస్ట్

దొడ్డబళ్లాపురం: బెంగళూరు కొడిగేహళ్లిలోని జ్యువెలరీ షాప్‌లో చొరబడి తుపాకులతో బెదిరించి దోపిడీకి ప్రయత్నించి, అడ్డుకున్న ఇద్దరిపై కాల్పులు జరిపి పరారైన నలుగురు అంతర్ రాష్ట్ర దోపిడీ దొంగలను నార్త్ డివిజన్ పోలీసులు అరెస్టు చేశారు. నిందితులు మధ్యప్రదేశ్‌లోని గ్వాలియర్‌లో దాక్కున్నట్లు తెలియడంతో కొడిగేహళ్లి పోలీసులు, నార్త్ డివిజన్ పోలీసులు అక్కడకు వెళ్లారు. అయితే నిందితులు దాడికి దిగడంతో పోలీసులు కాల్పులు జరిపారు. ఖానా పండిత్, అశు పండిత్, మోసె ఆలియాస్ బండి అనే నిందితులను అరెస్టు చేశారు. కాల్పుల్లో గాయపడిన సూరజ్ అనే నిందితుడిని గ్వాలియర్ ఆస్పత్రిలో చేర్పించారు. నిందితులు దేశంలోని ప్రముఖ నగరాల్లో సంచరిస్తూ నగల దుకాణాలను టార్గెట్ చేసేవారని, ఇటీవల ముంబైలో దోపిడీకి పాల్పడి అనంతరం బెంగళూరు వచ్చారని పోలీసులు తెలిపారు.

ట్యాంకర్ల నమోదు 95 శాతం పూర్తి



శ్రీరామనగరలో ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరాను పరిశీలిస్తున్న జలమండలి అధ్యక్షుడు రామ్‌ప్రసాద్ మనోహర్

బనశంకరి: బెంగళూరు నగరంలో ప్రైవేటు నీటి ట్యాంకర్ల నమోదు ప్రక్రియ 95 శాతం పూర్తయ్యిందని, మిగిలినవారు పేర్లు నమోదు చేయించకపోతే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని జలమండలి అధ్యక్షుడు రామ్‌ప్రసాద్‌మనోహర్ తెలిపారు. మురికివాడప్రాంతాలైన భాష్యం పార్కు, దీనబందునగర, శ్రీరామనగర తదితర ప్రాంతాల్లో ఆదివారం ఆయన పర్యటించి ట్యాంకర్లతో జరుగుతున్న నీటి సరఫరాను పరిశీలించారు. తాగునీటి ఎద్దడి తలెత్తకుండా నగరవ్యాప్తంగా ట్యాంకర్ల ద్వారా తాగునీటిని ఉచితంగా సరఫరా చేస్తున్నామని తెలిపారు. కావేరి నీటి కొళాయిలు ఉన్న ప్రాంతాల్లో నీటి సరఫరాను సమర్థంగా చేపట్టాలని అధికారులకు సూచించినట్లు తెలిపారు.

స్టాక్ మార్కెట్ పేరుతో లక్షల వంచన

హుబ్లీ: ఆన్‌లైన్ మోసాల గురించి తరచూ వార్తలు వస్తున్నా అమాయకులు జాగృతం కావడం లేదు. తాజాగా ఓ వ్యక్తి పెద్ద మొత్తంలో నష్టపోయాడు. స్థానిక కేశవపుర చంద్రహాస బాధితుడు. వివరాలు...ఆన్‌లైన్ ట్రేడింగ్ ఇన్వెస్ట్‌మెంట్ పేరుతో చంద్రహాసకు ఒక సందేశం వచ్చింది. సైబర్ కేటుగాళ్లు చంద్రహాసను వారి గ్రూప్‌లో చేర్పించుకున్నారు. అనంతరం షేర్లను కొనుగోలు చేసి విక్రయిస్తే ఎక్కువ లాభాలు వస్తాయంటూ నమ్మించారు. వారు సూచించిన ఖాతాలకు బాధితుడు రూ. 71 లక్షలకు పంపించాడు. అనంతరం మోసగాళ్ల ఫోన్ స్విచాఫ్ కావడంతో వంచన గ్రహించి నగర సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

బలిజ సంఘం అధ్యక్షుడికి సన్మానం



బీఎస్.రాజశేఖర్‌ను సన్మానిస్తున్న సంఘం నేతలు

బనశంకరి: ఉత్తమ సందేశాత్మక చిత్రాన్ని నిర్మించి అంతర్జాతీయ ఫిల్మ్‌ఫెస్టివల్ ఆఫ్ దుబాయి లో ఉత్తమ నిర్మాత అవార్డు అందుకున్న జిగిణి బీఎస్. రాజశేఖర్‌ను బలిజ సంఘాలు ఘనంగా సన్మానించాయి. ఆదివారం జిగిణిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బీఎస్.రాజశేఖర్‌ను చెన్నపట్టణ బలిజ సంఘం అధ్యక్షుడు కిశోర్, కర్ణాటక రాష్ట్ర సమగ్ర బలిజవేదిక రాష్ట్ర అధ్యక్షుడు మునికృష్ణ, కనకపుర బలిజసంఘం అధ్యక్షుడు బాలణ్ణ, కార్యదర్శి కృష్ణణ్ణలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఇట్టిమడుగు బలిజసంఘం అధ్యక్షుడు రాయల్‌గురుమూర్తి, జిల్లా కన్నడ సాహిత్యపరిషత్ చిక్కబళ్లాపుర అధ్యక్షుడు కైవార శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోలారు వార్తలు...

పాత్రికేయులకు డీవీ గుండప్ప ఆదర్శం



గుండప్ప జయంతిని ఆచరించిన దృశ్యం

కోలారు: నేటి పాత్రికేయులకు డివి గుండప్ప ఆదర్శమని పాత్రికేయుల సహకార సంఘం అధ్యక్షుడు కెఎస్ గణేష్ తెలిపారు. ఆదివారం నగరంలోని పాత్రికేయుల భవనంలో నిర్వహించిన గుండప్ప జయంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గుండప్ప పాత్రికేయుల సంఘాన్ని ప్రారంభించడమే కాకుండా పాత్రికేయుడిగా కూడా పని చేశారని, పొట్టకూటి కోసం పాత్రికేయ వృత్తిలోకి వచ్చానని చెప్పుకున్న గుండప్ప ఎన్నడూ నైతిక విలువలను వదులుకోలేదన్నారు. డీవీజీ రచించిన వృత్త పత్రిక అనే రచన నేటికి అజరామరమన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్‌కె చంద్రశేఖర్ మాట్లాడుతూ... సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏటా గుండప్ప జయంతిని నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వి మునిరాజు మాట్లాడుతూ...గుండప్ప చూపించిన మార్గంలో నడుస్తామన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం ఉపాధ్యక్షుడు అబ్బణి శంకర్, సీనియర్ పాత్రికేయుడు ఎంజి ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

దేశ నిర్మాణంలో న్యాయవాదుల పాత్ర మహత్తరం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: సదృఢ భారత దేశ నిర్మాణంలో న్యాయవాదుల పాత్ర ఎంతో మహత్తరమైనదని హైకోర్టు న్యాయమూర్తి ఎస్‌పి సందేష్ తెలిపారు. ఆదివారం నగరంలోని న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో కొత్త చట్టాలపై న్యాయవాదులకు మార్గదర్శనం చేసి మాట్లాడారు. న్యాయవాదులు నిరంతర అధ్యయనం చేసుకోవాలని, అప్పుడే న్యాయవాద వృత్తిలో రాణించడానికి సాధ్యమవుతుందని తెలిపారు. కొత్త చట్టాలు, తీర్పులు వచ్చినప్పుడు వాటిని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. న్యాయవాదుల పరిషత్ సభ్యుడు ఎస్ హరీష్ మాట్లాడుతూ... కోలారు న్యాయవాదుల సంఘం అత్యంత క్రియాశీలంగా ఉండి న్యాయవాదుల ఘనతను పెంచడానికి అవసరమైన కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. దీనిని న్యాయవాదులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సెషన్స్ న్యాయమూర్తి జిఎ మంజునాథ్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎం మునేగౌడ పాల్గొన్నారు.

రైతులు, మహిళల అభివృద్ధే లక్ష్యం



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: రైతులు, మహిళల అభివృద్ధే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ తెలిపారు. శనివారం తాలూకాలోని రివార్డు జలానయన పథకం కింద సుమారు రూ. 6.42 కోట్ల అభివృద్ధికార్యక్రమాలను ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం వివిధ పథకాలను ప్రజలకు అందిస్తోందన్నారు. గ్రామ పంచాయతీలలో అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కొరత లేదన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అనిల్‌కుమార్, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ సుమ తదితరులు పాల్గొన్నారు. ఇదే సమయంలో లబ్ధిదారులకు హక్కు పత్రాలు, వ్యవసాయ పనిముట్లను అందించారు.

19న నగరంలో రక్తదాన కేంద్రం ఏర్పాటు



మాట్లాడుతున్న జోషి

రాయచూరు రూరల్: నగరంలో రోటరీ కాటన్ ఉత్తర వలయం చారిట్రబుల్ ట్రస్ట్, జన సేవా ప్రతిష్టాన ఆధ్వర్యంలో ఈనెల 19న రక్తదాన కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు సేవా ప్రతిష్టాన అధ్యక్షుడు త్రివిక్రం జోషి పేర్కొన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలోమాట్లాడారు. రోటరీకాటన్ ఉత్తర వలయం అధ్యక్షుడు గుంటూరు డా.రవి వడ్లమని రక్తదాన కేంద్రాన్ని ప్రారంభిస్తారన్నారు. నగరంలో ఐఎంఏలో ఉందని, ప్రజలకు అత్యవరం సమయంలో రక్తదానం చేయడానికి జన సేవా ప్రతిష్టాన సిద్ధంగా ఉంటుందన్నారు. రక్తం ప్రతి జీవికి అవసరమనే విషయాన్ని గమనించి రక్తదాన కేంద్రం ప్రారంభించనున్నామన్నారు. సమావేశంలో రంగలింగన గౌడ, శివ గిరిష్, రామ్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

యువ కవులకు మార్గదర్శి శరణయ్య స్వామి



పుస్తకాలను విడుదల చేస్తున్న హనుమాన్

రాయచూరు రూరల్: యువ కవులకు శరణయ్య స్వామి మార్గదర్శి అని సీనియర్ సాహితీవేత్త వీర హనుమాన్ అన్నారు. ఆదివారం కన్నడ భవనంలో జిల్లా, తాలుకా కన్నడ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విచారాలపై రాసిన పుస్తకాలను విడుదల చేసి మాట్లాడారు. కవితలు సమాజహితంతో ఉండాలన్నారు.

అకాడమీ, ప్రాధికార నియామకాల్లో అన్యాయం



మాట్లాడుతున్న మేటి

రాయచూరు రూరల్: ప్రాధికార, అకాడమి నియామకాల్లో కల్యాణ కర్ణాటక ప్రాంత ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందని కళాకారులు అణ్ణప్ప మేటి, మారుతిలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కల్యాణ కర్ణాటక ప్రాంతంలోని కళాకారులను గుర్తించకుండ ఇష్టం వచ్చిన వారికి పదవులు కేటాయించడాన్ని ఖండించారు. పేరుకు మాత్రమే కళ్యాణ కర్ణాటక ప్రాంతంలోని వారిని సభ్యులుగా చేశారని అధ్యక్ష పదవులను దక్షిణ ప్రాంతం వారికి ప్రాధాన్యత ఇవ్వడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

టెంపో - ద్విచక్ర వాహనం ఢీ

- ఇద్దరు యువకుల దుర్మరణం

కోలారు: ద్విచక్ర వాహనాన్ని టెంపో ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన ఆదివారం బంగారుపేట తాలూకా బెంగనూరు గ్రామం వద్ద చోటు చేసుకుంది. బంగారుపేట పట్టణం సిద్దార్థ నగర్‌కు చెందిన ముత్తు (26), మండ్య జిల్లాకు చెందిన రవి (30) మృతులు. వీరిద్దరు బంగారుపేట పట్టణంలోని బెంగనూరు గ్రామం వద్ద ఉన్న గార్మెంట్స్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. పని ముగించుకుని బైక్‌పై తిరిగి వస్తున్న సమయంలో ప్రమాదం చోటు చేసుకుంది. బంగారుపేట పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

లోక్ అదాలత్‌లో 21,972 కేసుల పరిష్కారం



అర్జీలను పరిశీలిస్తున్న న్యాయమూర్తి

కోలారు: జిల్లా కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 21,973 కేసులు రాజీ చేసుకోవడం ద్వారా పరిష్కరించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా సెషన్స్ న్యాయమూర్తి జిఎ మంజునాథ్ మాట్లాడుతూ... జాతీయ లోక్ అదాలత్ అత్యధిక కేసులను పరిష్కరించడం సంతోషంగా ఉందని, ఇందులో 79 క్రిమినల్ కేసులు, 301 చెక్ బౌన్స్ కేసులు, 16 కుటుంబ వ్యాజ్యాలు, ఇతర సివిల్ కేసులు 379 పరిష్కరించారు. లోక్ అదాలత్‌కు సహకారం అందించిన న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎం మునేగౌడ, కార్యదర్శి భైరారెడ్డి, పదాధికారులకు జిల్లా న్యాయ సేవా ప్రాధికార సభ్యుడు సునీల్ ఎస్ మొసమని కృతజ్ఞతలు తెలిపారు.

ఆస్తి వివాదం, సోదరులపై దాడి

హుబ్లీ: ఆస్తి వివాదానికి సంబంధించి సోదరులపై దాడి చేసిన ఘటన స్థానిక ఏపీఎంసీ నవనగర్ పరిధిలో చోటుచేసుకుంది. గోకుల్ రోడ్డు కేహెచ్‌బీ కాలనీ మహమ్మద్ సిద్దికి, మహమ్మద్ అలీలపై వారి సొంత అన్న మైనుద్దీన్ దాడి చేశారు. ఏపీఎంసీ యార్డులోని అంగడిని కబ్జా చేసే ఉద్దేశంతో కావాలనే దాడి చేసినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

క్లుప్తంగా

లక్ష్మీనరసింహ స్వామికి నృత్యసేవ



బహుమతులు స్వీకరిస్తున్న కళాకారులు

గౌరిబిదనూరు: పట్టణంలోని దిక్సూచి నాట్యాలయ కళాకారులు శనివారం కర్నూలు జిల్లా అహోబిలం లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో నృత్య సేవ సమర్పించారు. హరిప్రియ, శృజన, శక్తి, అవికాలు ప్రదర్శించిన ప్రహ్లాద విజయం నృత్య రూపకానికి భక్తులనుంచి ఉత్తమ స్పందన లభించింది. ఆలయ పూజారులు కళాకారులకు బహుమతులు అందించారు. నృత్య కళాకారిణి వేదాల జానకి నృత్య కళాకారులను అభినందించారు. నాట్యాలయ సంస్థాపకురాలు దివ్యాశివనారాయణ ఉత్తమ శిక్షణ ఇచ్చారని కొనియాడారు.

బోనులో చిరుత బందీ

మైసూరు : గడిచిన నెల రోజుల నుంచి మార్హళ్లి ప్రజలకు కంటికి నిద్రలేకుండా చేసిన చిరుత పులి ఎట్టకేలకు బోనులో పడింది. గతనెల 27న మార్హళ్లి గ్రామ పంచాయతీ పరిధిలోని సందనపాళ్య గ్రామంలో పాఠశాల వెనుక కట్టివేసిన గొర్రెలపై చిరుత దాడి చేసి హతమార్చింది. అనంతరం తరచూ గ్రామ పరిసరాల్లో సంచరిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేసింది. అటవీశాఖ అధికారులు గ్రామ సమీపంలో పలుచోట్ల బోనులు ఏర్పాటు చేశారు. శనివారం రాత్రి ఆహారం కోసం వచ్చిన చిరుత బోనులో పడింది. అటవీశాఖ అధికారులు ఆదివారం వచ్చి చిరుతను బంధించి తీసుకెళ్లారు.

23న ఆశీర్వాద ప్రార్థన కూడిక


డాక్టర్ ఎస్.ఎస్.అరుణ్‌కుమార్

శివాజీనగర: అఖిల భారత క్రిస్టియన్ మినిస్ట్రీస్ అసోసియేషన్ కేజీఎఫ్ శాఖ ఆధ్వర్యంలో ఈ నెల 23న ఆశీర్వాద ప్రార్థన కూడికను జరుపనున్నట్లు నిర్వాహకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. కేజీఎఫ్ అశోక్‌నగరలో ఉన్న అగాపే లివింగ్ గాడ్ చర్చిలో జరిగే ప్రార్థనా కూడికలో దైవ వర్తమానికులుగా అఖిల భారత క్రిస్టియన్స్, లీడర్స్ ఫెలోషిప్ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఎస్.అరుణ్‌కుమార్ దైవ సందేశాన్ని వినిపిస్తారన్నారు. బెంగళూరుకు చెందిన దైవ సేవకులు రెవరెండ్ జీ.విజయకుమార్, డాక్టర్ ఎం.ఐజాక్, పాస్టర్ ఈ.మాదవ రావు పాల్గొని ప్రార్థనలు చేస్తారని తెలిపారు. ఈ ఆశీర్వాద ప్రార్థన కూడిక ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని తెలిపారు.

పకడ్బందీగా ఎన్నికల కోడ్ అమలు


వివరాలు వెల్లడిస్తున్న కలెక్టర్ కుమార్

మండ్య : లోక్‌సభ ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించడంతో జిల్లాలో ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని కలెక్టర్ డాక్టర్ కుమార్ ఆదివారం తెలిపారు. ఎన్నికల నియమావళిని పకడ్బందీగా అమలు చేస్తామన్నారు. మండ్య పార్లమెంట్ స్థానంలో 8 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయన్నారు. మొత్తం ఓటర్లు 17,59,175 మంది కాగా ఇందులో 8,67,682 మంది పురుషులు, 8,91,355 మంది మహిళలు, 168 మంది ఇతరులు ఉన్నారని తెలిపారు. కేఆర్ నగర నియోజకవర్గం మండ్య పార్లమెంట్ పరిధిలోకి రాదన్నారు. దీంతో మిగతా ఏడు నియోజకవర్గాల్లో 15,41,856 మంది ఓటర్లు ఉండగా పురుషులు 7,60,248 మంది, 7,81,452 మంది మహిళలు, ఇతరులు 156 మంది ఉన్నారని తెలిపారు.

వ్యక్తి అనుమానాస్పద మృతి

దొడ్డబళ్లాపురం: మద్యపాన ముక్త కేంద్రంలో వ్యక్తి అనుమానాస్పదంగా మృతిచెందాడు.ఈ ఘటన నెలమంగల తాలూకా బూదిహాల్ గ్రామంలో చోటుచేసుకుంది. హుల్లేగౌడనహళ్లి గ్రామ నివాసి హరీష్(33) మద్యానికి బానిసయ్యాడు. దీంతో ఆయన్ను బూదిహాల్‌లోని మద్యపాన ముక్త కేంద్రంలో చేర్చారు. ఏం జరిగిందో ఏమో హరీష్ మృతి చెందాడు. మృతుడి కుటుంబ సభ్యుల ఫిర్యాదుతో నెలమంగల రూరల్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

కోడ్ ఉల్లంఘన జరిగితే ఫిర్యాదు చేయండి

పావగడ: లోక్‌సభ ఎన్నికలకు సంబంధించి కోడ్ ఉల్లంఘన జరిగితే ఫిర్యాదు చేయాలని తహసీల్దార్ సంతోష్‌కుమార్ సూచించారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చిందని, ఎన్నికల సంఘం ఇచ్చిన సూచనలను రాజకీయ పార్టీలు పాటించాలన్నారు. ఎన్నికల నియమావళి జరిగినట్లు తెలిస్తే తాలూకా కార్యాలయంలో ఏర్పాటు చేసిన సహాయవాణి 08136-244242 ఫోన్ నంబరుకు ఫిర్యాదు చేయాలని సూచించారు.

ప్రాచీన చెరువులకు పునరుజ్జీవం



వివిధ చెరువుల్లో జరుగుతున్న పూడికతీత పనులు


బెల్లాల బొమ్మసంద్ర చెరువులో ఐదు అడుగులకే కనబడిన నీరు

- గౌరిబిదనూరు తాలూకాలో యువకుల సేవ

గౌరిబిదనూరు: తాలూకాలో రాజులు నిర్మించిన చెరువులు అనేక శతాబ్దాలుగా నీటి సంరక్షణకు ఎంతగానో తోడ్పడుతున్నాయి. వర్షాకాలంలో నిండిపోయి పశు పక్ష్యాదుల దాహం తీర్చడంతో పాటు భూగర్భ జలాలు నిండడానికి, రైతులకు, ప్రజలకు తాగునీటికి చేయూతగా ఉన్నాయి. కానీ చెరువుల గురించి ప్రభుత్వాలు పట్టించుకోక పోవడంతో గౌరిబిదనూరు ప్రతిష్టాన పేరిట యువకులు సంఘాన్ని చేసుకొని చందాల రూపంలో డబ్బును పోగుచేసి తాలూకాలో ఇప్పటికే 7 చెరువులలో పూడిక పనులు చేయించారు. చెరువులో నుంచి తీసిన మట్టిని రైతులు తమ పొలాలకు వేసుకోవాలని జాగృతి కల్పించడంతో ఎంతో మంది రైతులు ఆ మట్టిని తరలించారు. రసాయనిక ఎరువుల వల్ల నష్టపోయిన భూసారాన్ని మరలా పొంది అధిక దిగుబడిని సాధించడానికి వీలు పడిందని రైతులు చెప్పారు.

వేసవిలోనూ నీరుంది

వీరు పనులు చేపట్టిన చెరువులు.. తాలూకాలోని ముదుగానకుంటె చెరువు మొదట రూ. 31 లక్షల ఖర్చుతో 74 ఎకరాల విస్తీర్ణంలో 84 రోజుల్లో పూడికను తొలగించారు. దీనికి తోడు చెరువు ఆవరణలో 220 వివిధ జాతుల మొక్కలను నాటారు. ప్రస్తుతం ఈ మండు వేసవిలో సైతం భక్తుల స్నానానికి పుష్కలంగా నీరు ఉందని గంగా భాగీరథీ దేవాలయం అధ్యక్షుడు నరసింహారెడ్డి చెప్పారు.

అనేక తటాకాలకు ప్రాణం

ప్రస్తుతం బెల్లాల బొమ్మసంద్ర చెరువు పూడిక పనులు జరుగుతున్నాయి. చెరువులో 5 అడుగుల లోతులోనే నీరు లభించింది. పనులు పూర్తయితే మరింత నీరు లభించవచ్చని రైతులు చెప్పారు. చెరువులను బాగు చేయడం వల్ల ప్రకృతి సమతుల్యత ఏర్పడుతుందని, యువకుల కృషి అభినందనీయమని ప్రశంసించారు. ఇలా తాలూకాలోని సారగొండ్లు, సొనగానహళ్లి, ముదుగెరె, అగ్రహారహొసళ్లి గ్రామ చెరువులను అభివృద్ధి పరచగా రెండు సంవత్సరాల క్రితం వర్షాలు బాగాపడినందున చెరువులన్నీ మరవలు పోయి చుట్టు పక్కల బోరు బావులలో భూగర్భజలాలు పుష్కలంగా లభించింది.


కళకళలాడుతున్న ఓ చెరువు (ఫైల్)

సాహిత్య అకాడమీ సభ్యత్వం తిరస్కరణ

శివాజీనగర: లైంగిక అల్పసంఖ్యాక హక్కుల పోరాట నాయకురాలు అక్కయ్ పద్మశాలి రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన కర్ణాటక సాహిత్య అకాడమీ సభ్యత్వాన్ని తిరస్కరించారు. ముఖ్యమంత్రి సిద్దరామయ్య, ఉప ముఖ్యమంత్రి డీ.కే.శివకుమార్‌కు లేఖ రాసిన అక్కయ్ పద్మశాలి.. కర్ణాటక సాహిత్య అకాడమి సభ్యురాలిగా తనను గుర్తించి ఎంపిక చేసినందుకు ప్రభుత్వానికి అభినందనలు తెలిపారు. అయితే తన సభ్యత్వాన్ని ఉపసంహరించుకోవాలని విన్నవించుకుంటున్నట్లు తెలిపారు. లైంగిక అల్పసంఖ్యాక సముదాయ ప్రజలు సామాజిక, రాజకీయ రంగాల్లో రాణించేందుకు తాము చేపట్టిన పోరాటం ప్రపంచ వ్యాప్తంగా విస్తరించిందన్నారు. తమ సముదాయానికి రాజకీయ ప్రాతినిధ్యం కల్పించేందుకు ఎమ్మెల్సీ లేదా, రాజ్యసభ సభ్యత్వం ఇవ్వాలని కోరారు.

వీధికుక్కల దాడిలో జింక బలి

మైసూరు: ఆహారం కోసం అడవిలో నుంచి పట్టణంలోకి వచ్చిన జింకను వీధి కుక్కలు హతమార్చాయి. ఈ ఘటన జిల్లాలోని హెచ్‌డి కోటె పట్టణంలో జరిగింది. ఆదివారం ఉదయం ఒక జింక పట్టణంలోకి రాగా కుక్కలు చుట్టుముట్టి కరిచాయి. రాజెగౌడ అనే వ్యక్తి జింకను పట్టుకొని పశు వైద్యుని వద్దకు తీసుకెళ్లి చికిత్స చేయించాడు. ఇంతలో అటవీ సిబ్బంది వచ్చి పరిశీలించారు. కొంతసేపటికే జింక చనిపోయింది.

పునీత్ రాజ్‌కుమార్ విగ్రహం ఏర్పాటు చేస్తాం


పునీత్ కటౌట్ వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

మండ్య : కర్ణాటక రత్న పునీత్‌రాజ్ కుమార్ విగ్రహంను మండ్య నగరంలోని డాక్టర్ రాజ్ కుమార్ విగ్రహం వద్ద ఏర్పాటు చేస్తామని అరసు వెనుకబడిన వర్గాల వేదిక అధ్యక్షుడు ఎల్. సందేష్ తెలిపారు. మండ్య నగరంలోని జేసీ సర్కిల్ వద్ద కర్ణాటక రక్షణ వేదిక తాలూకా విభాగం, వివిధ కన్నడ సంఘాల ఆధ్వర్యంలో పునీత్ రాజ్‌కుమార్ జయంతిని నిర్వహించారు. పునీత్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పునీత్ విగ్రహం ఏర్పాటుకు కన్నడ సంఘాలు సహకరించాలన్నారు.

ఓటు హక్కుపై జాగృతి ర్యాలీ



మాట్లాడుతున్న నటి ప్రణిత


సైకిల్ ర్యాలీలో పాల్గొన్న నగరవాసులు

కృష్ణరాజపురం: లోక్‌సభ ఎన్నికల్లో వందశాతం పోలింగ్ నమోదుకు బీబీఎంపీ, కర్ణాటక ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. అందులో భాగంగా ఓటు హక్కుపై ప్రజల్లో చైతన్యం తెచ్చేందుకు మహదేవపుర నియోజకవర్గం పరిధిలోని మారతహళ్లిలో ఆదివారం ఓట్ ఏథాన్ పేరుతో బైక్, సైకిల్ ర్యాలీలు, వాక్‌థాన్ నిర్వహించారు. ర్యాలీని కావేరి ఆస్పత్రి వద్ద నటి ప్రణిత సుభాష్ ప్రారంభించారు. 500 మంది బైకిస్టులు, 1200 మంది సైకిళ్లలో, వేలాది మంది నగరవాసులు ఉత్సాహంగా వాక్‌థాన్‌లో పాల్గొన్నారు. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి మనోజ్‌కుమార్‌మీనా, బీబీఎంపీ చీఫ్ కమిషనర్ తుషార్‌గిరినాథ్ పాల్గొన్నారు.

ట్యాంకర్ మాఫియాను అరికట్టాలి

- సర్కారుకు బీజేపీ నేత అశోక్ డిమాండ్


నగరంలో ఓ వీధిలో ట్యాంకర్ వద్ద రద్దీ

శివాజీనగర: తాగునీటి సమస్య గురించి సీఎం సిద్దరామయ్య సోమవారం ఏర్పాటు చేయనున్న సమావేశం నేపథ్యంలో బీజేపీ పక్ష నేత ఆర్.అశోక్ ఆరు సలహాలు ఇచ్చారు. కరువుకాలం ఉందని తెలిసినాకేడా గత ఆరేడు నెలల నుంచి ఎలాంటి ముందు జాగ్రత్తలు తీసుకోకుండా కాంగ్రెస్ ప్రభుత్వం కాలహరణం చేసిందని ఆయన ఆరోపించారు.

ట్యాంకర్లకు స్టిక్కర్లు, జీపీఎస్ ఉండాలి

బెంగళూరులో 3,500కు పైగా ప్రైవేట్ ట్యాంకర్‌లు ఉన్నాయి. అయితే నమోదైనది కేవలం 1,700 మాత్రమే. ట్యాంకర్ మాఫియా, చోరీకి అడ్డుకట్ట వేయాలంటే తప్పకుండా ఎలాంటి ప్రభావానికి లొంగకుండా అన్ని ట్యాంకర్‌ల నమోదు చేయించాలని అశోక్ కోరారు. అలాగే జలమండలి ద్వారా ఉచితంగా నీరు సరఫరా చేసే ట్యాంకర్‌లపై స్టిక్కర్ అతికించటం లేదు, స్టిక్కర్ లేకపోతే నీరు దుర్వినియోగమయ్యే అవకాశం ఉంది. ట్యాంకర్‌లకు జీపీఎస్ ట్రాకర్ అమర్చాలి. జనసందడి అధికంగా ఉన్న ప్రాంతాల్లో అధిక ట్యాంకర్‌లను పంపాలి. జలమండలి, బీబీఎంపీ సహాయవాణి సరిగా స్పందించటం లేదని ఆరోపణలు ఉన్నాయి. కనుక ప్రైవేట్ కాల్ సెంటర్ ఏర్పాటు చేయాలి. బెంగళూరు నడిబొడ్డు, ప్రముఖ లేఔట్‌లలో మాత్రమే కాకుండా చిట్టచివరి వార్డులు, పాలికెలోని 110 పల్లెల్లో నీటి సమస్యను పరిష్కరించాలని అశోక్ డిమాండ్ చేశారు.

రోడ్డుప్రమాదంలో జేడీఎస్ నేత కుమారుడి మృతి


అభిషేక్ గౌడ

దొడ్డబళ్లాపురం: రోడ్డు ప్రమాదంలో జేడీఎస్ నేత కుమారుడు మృతి చెందిన ఘటన రామనగర శివారులో బెంగళూరు–మైసూరు రహదారిపై చోటుచేసుకుంది. మద్దూరు తాలూకా కెస్తూరు గ్రామానికి చెందిన జేడీఎస్ నేత దాసేగౌడ కుమారుడు అభిషేక్ గౌడ(29) మండ్య నుంచి బెంగళూరుకు కారులో వస్తుండగా రామనగర వద్ద కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని అవతల రోడ్డులోకి పల్టీ కొట్టి వంతెన పైనుంచి పడిపోయింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ అభిషేక్‌ను రామనగర రామక్రిష్ణ ఆస్పత్రికి తరలించినప్పటికీ ఫలితం లేకుండాపోయింది. రామనగర ట్రాఫిక్ పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

మినీ లారీ ఢీకొని ఒకరి మృతి

మైసూరు : మినీ లారీ ఆటోను ఢీకొని యువకుడు మృత్యువాత పడ్డాడు. ఈఘటన చామరాజనగర జిల్లా కొళ్లెగాల తాలూకా దనగెరె గ్రామం మెయిన్ రోడ్డులో జరిగింది. చెరుకులోడుతో ఓ లారీ మలెమహదేశ్వర కొండపైనుంచి వస్తూ ఆటోను ఢీకొంది. దీంతో ఆటోలో ప్రయాణిస్తున్న మండ్యలోని ఆళసహళ్లి గ్రామానికి చెందిన ముత్తు చెతన్(19) మృతి చెందగా అజయ్ కుమార్ అనే యువకుడు గాయపడ్డాడు. వీరిద్దరూ ఇళ్లకు రంగులు వేసే పనులు చేసేవారు.

నీటికుంటలో పడి రైతు...

మైసూరు : కుంటలో పడి వ్యక్తి మృతి చెందిఘటన చామరాజనగర జిల్లా గుండ్లెపేటె తాలూకా నిట్రె గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన రంగరాజు(35)పొలానికి వెళ్లి అనంతరం కుంటలోకి దిగి కాళ్లు, చేతులు శుభ్రం చేసుకుంటుండగా కాలుజారి నీటిలో పడిపోయాడు. ఆయన్ను బయటకు తీసి ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. బేగూరు పోలీసులు కేసు దర్యాప్తు చేపట్టారు.

28 లోక్‌సభ స్థానాల్లో విజయభేరి మోగిద్దాం


బీవై.విజయేంద్రను సన్మానిస్తున్న బీజేపీ నేతలు

బనశంకరి: స్పష్టమైన మెజారిటీతో రాష్ట్రంలో మళ్లీ బీజేపీ అధికారంలోకి వచ్చేవరకు విశ్రమించేదిలేదని రాష్ట్రాధ్యక్షుడు బీవై.విజయేంద్ర తెలిపారు. బెంగళూరు దక్షిణ లోక్‌సభ నియోజకవర్గం హనుమంతనగరలో ఏర్పాటుచేసిన బీజేపీ ఎన్నికల కార్యాలయాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక హైకమాండ్ నిర్ణయమని, 28 లోక్‌సభ స్థానాల్లో బీజేపీ–జేడీఎస్ కూటమి అభ్యర్థుల విజయానికి కార్యకర్తలు శ్రమించాలన్నారు. బీజేపీ మళ్లీ కేంద్రంలో అధికారంలోకి వస్తుందని, మూడో మారు మోదీ ప్రధాని అవుతారన్నారు. కర్ణాటకకు మోదీ ఏంచేశారని సిద్దరామయ్య ప్రశ్నించారని, జూన్ 4న వెలువడే ఎన్నికల ఫలితాలే ఆయనకు సమాధానం చెబుతాయన్నారు. పగలు, రాత్రి తేడాలేకుండా దేశాభివృద్ధికి మోదీ పని చేస్తున్నారన్నారు. మోదీ ఏదేశానికి వెళ్లినా ఎర్రతివాచీతో స్వాగతం పలుకుతారని గుర్తుచేశారు. ఎంపీ తేజస్విసూర్య వాక్‌చాతుర్యం కలిగిన వ్యక్తి అని ఒప్పుకుంటామని యడియూరప్ప కూడా చెబుతారని, అయితే మాటలతో పనిజరగదని చేతల్లో చూపించాలని సలహా ఇచ్చారు. ఎంపీ తేజస్విసూర్య మాట్లాడుతూ ఈసారి బెంగళూరుదక్షిణ లోకసభ స్థానం నుంచి 5 లక్షల బంపర్ మెజార్టీతో గెలువబోతున్నట్లు తెలిపారు.

డ్రగ్స్ పార్సిల్ అని రూ.7 లక్షల వసూలు

హోసూరు: కొరియర్ ద్వారా డ్రగ్స్ పార్సిల్ వచ్చిందని, దీనిపై కేసు నమోదు చేయకుండా ఉండేందుకు డబ్బు చెల్లించాలని బెదిరించి రూ. 7.27 లక్షలను కాజేశారు సైబర్ దొంగలు. వివరాల మేరకు జిల్లా కేంద్రం క్రిష్ణగిరి కో ఆపరేటివ్ కాలనీకి చెందిన ప్రమోద్ (35) అదే ప్రాంతంలో కంప్యూటర్ సెంటర్ నిర్వహిస్తున్నాడు. గత నెల 27వ తేదీ అతనికి దుండగులు కాల్ చేసి, ముంబై పోలీసులం మాట్లాడుతున్నామని చెప్పారు. మీ పేరు మీద భారీఎత్తున మాదక ద్రవ్యాలు కొరియర్ ద్వారా పార్సిల్ వచ్చాయని తెలిపారు. మీపై కేసు నమోదు పెట్టకుండా ఉండాలంటే డబ్బులు ఇవ్వాలన్నారు. అలా అతన్ని ఒత్తిడి చేసి రూ. 7.27 లక్షలను వసూలు చేశారు. తర్వాత దుండగుల నంబర్‌కు కాల్‌చేయగా స్విచాఫ్ అని వచ్చింది. దీంతో ఏదో మోసం జరిగిందని తెలిసి అతను క్రిష్ణగిరి క్రైం బ్రాంచ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

హోసూరు వార్తలు..


దోపిడీ దొంగల అరెస్ట్

క్రిష్ణగిరి: ఊత్తంగేరి ప్రాంతంలో దోపిడీలకు ప్రయత్నిస్తున్న ముగ్గురు దొంగలను పోలీసులు అరెస్ట్ చేశారు. శనివారం ఊత్తంగేరి బస్టాండు ప్రాంతంలో అనుమానాస్పద స్థితిలో తిరుగుతున్న ముగ్గురిని అదుపులోకి తీసుకొని విచారణ జరుపగా పోచ్చంపల్లి సమీపంలోని వేలంబట్టి గ్రామానికి చెందిన వైరాగ్ (23), సంధూరు ప్రాంతానికి చెందిన జన (21), గొల్లహళ్లి ప్రాంతానికి చెందిన దివాకర్ (30) పలు ప్రాంతాల్లో దోపిడీలు చేసినట్లు, బస్టాండు ప్రాంతంలో దోపిడీకి యత్నిస్తున్నట్లు తెలిసింది. అరెస్ట్ చేసి విచారణ జరుపుతున్నారు.

డబ్బు లాక్కెళ్లిన ఇద్దరు అరెస్టు

వ్యక్తిని వెంబడించి నగదు లాక్కెళ్లేందుకు ప్రయత్నించిన ఇద్దరు దొంగలను ఊత్తంగేరి పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాల మేరకు ఊత్తంగేరి నారాయణ నగర్‌కు చెందిన కామత్ (48). శనివారం ఉదయం క్రిష్ణగిరి రోడ్డులోని ఓ బ్యాంకులో డబ్బును జమ చేసేందుకు రూ. 25 వేలు తీసుకెళుతుండగా ఇద్దరు అతన్ని వెనుకే వెళ్లి రూ. వంద నోటు పడిపోయిందని చెప్పారు. అతడు నోటు కోసం చూడగానే చేతిలో ఉన్న నగదు సంచిని లాక్కెళ్లారు. అవాక్కైన కామత్ స్థానికుల సాయంతో నిందితులను పట్టుకొని ఊత్తంగేరి పోలీసులకు అప్పగించారు. చెన్నై విల్లివాకంవాసి విమల్(47), ఏపీలో విధుల పల్లివాసి కుమార్ (48) అని తెలిసింది.

సుమధురంగా గాన కచేరి


సంగీత కార్యక్రమం

హోసూరు: అమర గాయకులు ఘంటసాల వెంకటేశ్వరరావు 50వ వర్ధంతి, ఎస్పీ బాల సుబ్రమణ్యం స్మారక సంగీత స్వరాభిషేకోత్సవం ఆదివారం సాయంత్రం హోసూరు కామరాజ్ కాలనీలోని ఆంధ్రసాంస్కృతిక భవనంలో రంజింపజేసింది. మిత్ర బృందం అధ్యక్షుడు శాంసింగ్, ఆంధ్రసాంస్కృతిక సమితి సంయుక్తంగా ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమాన్ని హోసూరు కార్పొరేషన్ ఉప మేయర్ ఆనందయ్య ప్రారంభించారు. హైదరాబాద్‌కు చెందిన గాయనీ గాయకులు ఘంటసాల, బాలు గీతాలను సుమధురంగా ఆలపించారు.

తుపాకుల అప్పగింత

హోసూరు: పార్లమెంట్ ఎన్నికల నిబంధనలు అమలలోకి రావడంతో అనుమతి పొందిన తుపాకులను పోలీసులకు అప్పగించాలని జిల్లా ఎస్పీ తంగదురై ఆదేశించారు. క్రిష్ణగిరి జిల్లాలో మొత్తం 509 లైసెన్స్ తుపాకులున్నాయి. ఎన్నికల కోడ్ ఉన్నందున యజమానులు వారి తుపాకులను ఆయా పోలీస్‌స్టేషన్లలో అప్పగించాలని తెలిపారు. ఇప్పటివరకు 504 తుపాకులను పోలీసులకు అప్పగించారు. మరో 5 తుపాకులను వెంటనే అందజేయాలని ఎస్పీ తెలిపారు.

పురాణేతిహాస చంద్రచూడేశ్వర ఆలయం



భద్రాద్రి కొండపై వెలసిన చంద్రచూడేశ్వరస్వామి ఆలయం, పచ్చకొలను (ఫైల్)

- నేడు రథోత్సవానికి అంకురార్పణ

హోసూరు: హోసూరు తేరుపేటలో వెలసిన చారిత్రక ప్రసిద్ధ మరకతాంబ సమేత శ్రీ చంద్ర చూడేశ్వరస్వామి ఆలయ రథోత్సవం 25వ తేదీ సోమవారం జరుగనుంది.

పార్వతీ పరమేశ్వర నిలయం

సముద్రానికి 3 వేల అడుగుల ఎత్తులో కర్ణాటక, ఆంధ్ర, తమిళనాడు మధ్య ఉన్న హోసూరు పట్టణం తూర్పు దిశన భద్రాద్రి కొండపై ఋషీశ్వరులు గానము చేసిన పుణ్యభూమి. నారదాది మహర్షులు తపస్సు చేసిన దేవభూమి ఈ పర్వతం. పార్వతీదేవి పరమేశ్వరుని గూర్చి ఇక్కడే తపస్సు చేసినట్లు ప్రతీతి. ధర్మదేవతకు ఈ పర్వతమున నివసిస్తానని వరమిచ్చానని, అందువలన ఇక్కడికి వచ్చినట్లు పరమేశ్వరుడు చెబుతాడు. చెలికత్తెలు తాగుటకు నీరు కోరగా పార్వతీదేవి భూదేవిని ప్రార్థించగా భూమి నుంచి నీరు ఉబికివస్తుంది. అదే నేటి మరకత సరోవరమని (పచ్చకొలను) అని పిలువబడుతుంది. ఈ కొలనులో స్నానమాచరించే వారు అనేక వ్యాధుల నుంచి విముక్తి పొందుతారుని బ్రహ్మాండ పురాణంలో పేర్కొన్నారు.

హొయసళ రాజుల కాలం నుండి ఈ ఆలయాన్ని సంరక్షిస్తున్నారని, కళభ్ర వంశస్థుల పాలనలో రాజపూర్వాధిరాయర్ అత్తిమల్లన్ ప్రభువు ఈ ఆలయాన్ని అభివృద్ధి చేసినట్లు, వివిధ గ్రామాల్లో మాన్యం భూములను అప్పగించినట్లు తెలుస్తోంది. ఆ రాజుచే కట్టబడి అసంపూర్ణంగా మిగిలిన మహాద్వారమును హోసూరు ప్రాంతంలో ఏర్పడిన పరిశ్రమల యజమానులు కోట్లాది రూపాయలను వెచ్చించి పూర్తి చేశారు. నేడు 18వ తేదీ రాత్రి 7 గంటలకు అంకురార్పణ జరుగుతుంది. నిత్యం పూజా కైంకర్యాలు, ఉత్సవాలు నిర్వహిస్తారు.

రౌడీ ప్రతాప్ కోసం గాలింపు

- డీఎంకే నేత హత్య కేసు..

హోసూరు: శుక్రవారం బేరికె ప్రాంతంలో జరిగిన డీఎంకే నాయకుని హత్య కేసులో నింధితులను పట్టుకొనేందుకు మూడు పోలీస్ బృందాలు గాలిస్తున్నాయి. వివరాల మేరకు సూళగిరి తాలూకా బేరికె ప్రాంతానికి చెందిన కార్తీక్ (35). రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుండేవాడు. కర్ణాటక రాష్ట్రం మాలూరు సమీపంలోని అనిగిరిపల్లి ప్రాంతానికి చెందిన ప్రతాప్ (25)తో వ్యాపార గొడవలున్నాయి. బైక్‌పై వెళ్తున్న కార్తీక్‌ను ప్రతాప్, అతని అనుచరులు కారులో వెంటాడి వేటకొడవళ్లతో దాడి చేసి దారుణ హత్య చేసినట్లు పోలీసులు కేసు నమోదు చేశారు. ప్రతాప్ కర్ణాటక రాష్ట్రంలో రౌడీషీటర్ జాబితాలో ఉన్నట్లు, అతనిపై మాస్తి పోలీస్‌స్టేషన్‌లో ఓ హత్య కేసు, మాలూరు పోలీస్‌స్టేషన్‌లో హత్యా ప్రయత్నం కేసుతో పాటు పలు కేసులు నమోదైనట్లు తెలిసింది. పరారీలో ఉన్న నింధితులను పట్టుకొనేందుకు జిల్లా ఎస్పీ తంగదురై నేతృత్వంలో మూడు ప్రత్యేక బృందం పోలీసులు గాలింపు చేపట్టాయి. హతుడు అధికార పార్టీకి చెందినవాడు కావడంతో హత్య సంచలనం సృష్టించింది.

పకడ్బందీగా ఎన్నికలు: కలెక్టర్

హోసూరు: ఎన్నికల ప్రకటన రావడంతో క్రిష్ణగిరి కలెక్టరేట్‌లో ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ శరయు అధ్యక్షతన అఖిల పక్ష పార్టీ నాయకులతో సమావేశమయ్యారు. జిల్లా ఎస్పీ తంగదురై నేతృత్వం వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఊత్తంగేరి, బర్గూరు, క్రిష్ణగిరి, వేపనపల్లి, హోసూరు, తళి ఆరు నియోజక వర్గాల్లో పురుష ఓటర్లు 8,11,375 మంది , స్త్రీలు 8,06,354, ఇతరులు 305తో కలిపి 16,18,034 మంది ఓటర్లున్నారని తెలిపారు. ఎన్నికలను శాంతి భద్రతలతో నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఓటర్లకు డబ్బు, మద్యం, కానుకలను అందజేయడం చట్టవిరుద్ధమని, అలాంటివారిపై కఠిన చర్యలు తప్పవన్నారు. అక్రమాలపై టోల్‌ఫ్రీ నంబర్‌కు 1950కి ఫిర్యాదు చేయవచ్చునని, ఫిర్యాదు చేసిన వంద నిమిషాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్ వస్తుందని తెలిపారు. డీఆర్‌వో సాధనకురల్, హోసూరు కార్పొరేషన్ కమిషనర్ స్నేహ, సబ్‌కలెక్టర్ ప్రియాంక, పుష్ప, బాబు, అఖిల పక్ష పార్టీల నాయకులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా జల్లికట్టు



జల్లికట్టులో వృషభాలను పరుగెత్తిస్తున్న దృశ్యం

కెలమంగలం: డెంకణీకోట తాలూకా కుందుకోట దగ్గర ప్రసిద్ధ శ్రీ మల్లికార్జున దుర్గం జాతర రెండు రోజులుగా ఘనంగా నిర్వహించారు. ఆదివారం జల్లికట్టు ఉత్సాహంగా సాగింది. డెంకణీకోట, కెలమంగలం, రాయకోట, తళి, అంచెట్టి ప్రాంతాల నుంచి సుమారు 200కు పైగా వృషభాలను పరుగెత్తించారు. యువకులు ఎద్దులను నిలువరించారు.

మరో ఫ్లాప్ షో.. ప్రజాగళం

ప్రధానికి అవమానంతో మొదలైన ఎన్డీఏ తొలి సభ

- కనీసం ఓ శాలువా, ఓ పూల బొకే కూడా తీసుకురాని బాబు, పవన్
- మోదీకి సన్మానమంటూ వ్యాఖ్యాత ప్రకటన
- లేచి నిల్చున్న మోదీ.. దిక్కులు చూసిన టీడీపీ, జనసేన అధినేతలు
- తాను తెచ్చిన వినాయకుడి విగ్రహాన్ని ప్రధానికి బహూకరించిన పురందేశ్వరి
- 15 లక్షల మంది ప్రజలు వస్తారని నేతల ప్రకటన
- లక్ష మంది కూడా లేక వెలవెలబోయిన సభ
- వేసిందే 48 వేల కుర్చీలు.. అవీ ఖాళీనే
- జనం లేకపోవడంతో బాబు కవరింగ్
- టీడీపీ కార్యకర్తలతో స్టేజి ముందు హంగామా
- వారి తాకిడికి పని చేయని మైకులు.. మోదీ అసహనం
- పవన్ ప్రసంగం మధ్యలో ఆపి మరీ వారిని కిందికి దించిన ప్రధాని
- కూటమి తొలి సభ అట్టర్ ఫ్లాప్‌తో నైరాశ్యంలో టీడీపీ, జనసేన కార్యకర్తలు


సన్మానం పేరిట ప్రధాని మోదీని నిలబెట్టి శాలువా కోసం ఎదురుచూస్తున్న చంద్రబాబు, పవన్‌కళ్యాణ్


ప్రజాగళం సభలో ఖాళీగా ఉన్న కుర్చీలు

సాక్షి ప్రతినిధి, గుంటూరు/సాక్షి, నరసరావుపేట : ఎన్డీఏలో తెలుగుదేశం, జనసేన చేరిన తర్వాత ఏర్పాటు చేసిన తొలి సభ ప్రధానికి అవమానంతో మొదలై, జనం రాక, మైకులు పనిచేయక చివరకు నవ్వులపాలై ఓ ఫ్లాప్ షోగా మిగిలింది. ప్రధాని మోదీ వస్తుండటంతో 15 లక్షల మందితో భారీ సభ ఏర్పాటు చేస్తున్నామంటూ ప్రచారం చేశారు. ఉమ్మడి మేనిఫెస్టో కూడా ప్రకటిస్తామని చెప్పారు. తీరా చూస్తే సభకు పట్టుమని లక్ష మంది కూడా రాలేదు. మేనిఫెస్టో కూడా లేదు. వైఎస్సార్‌సీపీ సిద్ధం సభలు పది లక్షలు, పదిహేను లక్షల జనంతో విజయవంతమై చరిత్ర సృష్టించాయి. వాటి స్థాయిలో నిర్వహించాలన్న భావనతో టీడీపీ, జనసేన ఏర్పాట్లు చేశాయి. తీరా చూస్తే కనీసం లక్ష మంది కూడా రాలేదు. మరోపక్క జనం లేకపోవడాన్ని కవర్ చేయడానికి చంద్రబాబు తన పార్టీ కార్యకర్తలతో చేయించిన హడావుడి ప్రధాని మోదీని అసహనానికి గురి చేసింది. టీడీపీ కార్యకర్తలు సౌండ్ బాక్సుల పైకి దూసుకురావడంతో చాలాసార్లు మైకులు మొరాయించాయి. కార్యకర్తలు సౌండ్ బాక్సుల టవర్లు, లైటింగ్ టవర్ల పైకి ఎక్కడంతో మోదీ తీవ్రంగా వారిని హెచ్చరించారు.

100 ఎకరాల్లో సభకు 30 ఎకరాలే

బొప్పూడి వద్ద సుమారు దాదాపు 100 ఎకరాల్లో ఈ సభకు ఏర్పాట్లు చేశారు. అందులో పార్కింగ్‌కి పోను కేవలం 40 ఎకరాలను సభ కోసం కేటాయించారు. అందులో వేదిక, హెలీప్యాడ్‌ల కోసం పది ఎకరాలు కేటాయించగా మిగిలిన 30 ఎకరాల్లో మాత్రమే కార్యకర్తల కోసం ఏర్పాట్లు చేశారు. మొత్తం 24 గ్యాలరీలు ఏర్పాటు చేశారు. ఒక్కో గ్యాలరీలో 2 వేల కుర్చీలు వేశారు. అవి కూడా ఒక కుర్చీకి ఇంకో కుర్చీకి మధ్య రెండు అడుగులు గ్యాప్ ఉండేలా వేశారు. మొత్తం 48 వేల కుర్చీలు వేసినట్లు చెబుతున్నారు. వాటిలో 6 వేల కుర్చీలు కూడా నిండలేదు.

మోదీ ప్రసంగం మొదలైన నిమిషానికే మైకు మొరాయించడంతో రెండు నిముషాలు ఆగాల్సి వచ్చింది. ఈ సమయంలోనే ఎక్కువ మంది లేచి వెళ్లిపోవడం మొదలెట్టారు. మోదీ మాట్లాడే సమయంలో మూడుసార్లు అంటే దాదాపు ఏడు నిమిషాలకు పైగా మైకులు ఆగిపోవడంతో సభా ప్రాంగణం ఖాళీ అయిపోయింది.

టీడీపీ ప్రోద్బలంతో టవర్లెక్కిన కార్యకర్తలు.. హెచ్చరించిన ప్రధాని

సభా వేదికపైకి మోదీ వచ్చిన సమయానికి కూడా జనం లేకపోవడంతో చంద్రబాబు, పవన్‌లో ఆందోళన కనిపించింది. మోదీ వేదిక మీదకు వచ్చిన తరువాత పవన్, బాబు ప్రసంగించారు. దీన్ని గమనించిన చంద్రబాబు అండ్ టీం పరువు కాపాడుకోవడానికి తమకు తెలిసిన టక్కుటమార విద్యలను ప్రదర్శించారు. ఖాళీ కుర్చీల నుంచి మోదీ దృష్టి మళ్లించేందుకు సభలో టీడీపీ కార్యకర్తలతో గందరగోళం సృష్టించి జనం భారీగా వచ్చారన్న భ్రమలు కల్పించే ప్రయత్నం చేశారు. ముందు ఉన్న కార్యకర్తలు స్టేజ్ వద్దకు దూసుకువస్తున్నట్టు ప్రయత్నించారు. సౌండ్ బాక్స్ టవర్లను సైతం ఎక్కి హడావుడి చేశారు. పవన్ మాట్లాడుతున్న సమయంలో చాలా మంది మైక్ టవర్స్, లైటింగ్ కోసం కట్టిన టవర్లపై ఎక్కడాన్ని మోదీ గమనించారు. పవన్‌ను ఆపి మోదీ మాట్లాడారు. ఏదైనా జరగరానిది జరిగితే ఇబ్బందులు ఎదురౌతాయని, దయచేసి దిగాలంటూ విజ్ఞప్తి చేశారు. ప్రధాని గట్టిగా హెచ్చరించడంతో టీడీపీ కార్యకర్తలు టవర్ల పైనుంచి కిందికి దిగారు.

మొరాయించిన మైకులు.. ప్రధాని అసహనం

ప్రధాని మోదీ మాట్లాడుతుండగా మైకులు పదే పదే మొరాయించడంతో ఆయన అసహనం వ్యక్తం చేశారు. జనం రాకపోవడాన్ని కవర్ చేయడంలో భాగంగా చంద్రబాబు తన కార్యకర్తలతో చేయిస్తున్న హడావుడిలో భాగంగా వారంతా సౌండ్ సిస్టం వద్దకు దూసుకుపోయారు. వారి తాకిడితో వైర్లు, ఇతర పరికరాలు కదిలిపోయి మైకులు మొరాయించాయి. పవన్, చంద్రబాబు మాట్లాడుతున్న సమయంలో ఒకటి రెండు సార్లు అంతరాయం కలిగింది. ప్రధాని మోదీ మాట్లాడుతున్న సమయంలో తొలుత మూడు నిమిషాలు మైకులు పనిచేయలేదు. తరువాత ప్రసంగాన్ని కొనసాగిస్తుండగా మరోసారి ఐదు నిమిషాల దాకా అంతరాయం కలిగింది. దీంతో మోదీ అసహనానికి గురయ్యారు. 'దయఉంచి అక్కడ ఉన్నవారంతా వెనక్కి వెళ్తే మైక్ పనిచేస్తుంది. సభకు అంతరాయం కలిగించవద్దు. మీ ఉత్సాహం, మీ జోష్ నాకు ఇష్టమే. కానీ మీరు కొంచెం ఎక్కడ ఉన్నారో అక్కడే ఉండండి. దూరంగా ఉన్న వారు ప్రశాంతంగా ఉన్నారు. మీరెందుకు హడావిడి చేస్తున్నారు' అంటూ మోదీ చిరాకు పడ్డారు.

తొలి మీటింగే ఫెయిలవడంతో...

బీజేపీతో పొత్తు కుదరడంతో టీడీపీ నిర్వహించిన తొలి సభ విఫలమవడంతో టీడీపీ, జనసేన కేడర్ నైరాశ్యంలోకి వెళ్లింది. గట్టిగా ఓ మీటింగ్ నిర్వహించలేకపోతున్నాం, ఇదేమి ఖర్మ అంటూ టీడీపీ కార్యకర్తలు అక్కడే వ్యాఖ్యానించారు. మరోవైపు సభలో సామాన్య ప్రజలు కనిపించలేదు. టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల కార్యకర్తలు మాత్రమే ఉన్నారు. చిలకలూరిపేట సమీపంలో టీడీపీ నేతల మిల్లుల్లో పనిచేసే నార్త్ ఇండియా వలస కూలీలు కూడా సభలో అధిక సంఖ్యలో కనిపించారు. మహిళలు ఈ సభకు దూరంగా ఉన్నారు. సభలో స్త్రీల సంఖ్య చాలా తక్కువగా ఉంది. ఆర్టీసీ బస్సులతోపాటు నారాయణ, భాష్యం వంటి టీడీపీ అనుకూల విద్యా సంస్థల నుంచి వందలాది బస్సులు గ్రామాలకు పంపినా జనం లేక ఖాళీగానే వచ్చాయి. కొన్నింటిలో సగం మంది కూడా లేరు. ఒక్కొక్కరికి రూ.500 నుంచి రూ.1,000 దాకా నగదు, మందు బాటిల్, బిర్యానీ పొట్లం ఇచ్చినా సభకు రాలేదని నేతలు చిరాకుపడ్డారు. బొప్పూడి సభతో ప్రజల నాడి అర్థమవుతోందన్న భావన వారిలో నెలకొంది. ప్రజలు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైపు ఉన్నారన్న విషయం ఈ సభ ద్వారా మరోసారి రుజువైందని టీడీపీ కార్యకర్తలే సభ బయట వ్యాఖ్యానించారు.

వైఫల్యాన్ని పుల్లారావుపై నెట్టేశారు

సభ వైఫల్యాన్ని టీడీపీ నేత ప్రత్తిపాటి పుల్లారావు పైకి తోసే ప్రయత్నం మొదలైంది. సభ అట్టర్ ఫ్లాప్ అవడం, ప్రధానికి వేదికపై అవమానం జరగడం, మైకులు పనిచేయకపోవడానికి పుల్లారావే కారణం అంటూ ఎల్లో మీడియా ప్రచారం మొదలు పెట్టింది. మైక్ సిస్టమ్‌కు సరైన రక్షణ ఏర్పాట్లు చేయలేదని, అసలు ఏర్పాట్లను పుల్లారావు పట్టించుకోలేదంటూ ప్రచారం చేస్తున్నారు. వ్యాఖ్యాతను కూడా సరైన వారిని పెట్టలేదంటూ కామెంట్లు మొదలుపెట్టారు. దీంతో పుల్లారావు మీడియా ముందుకు వచ్చి పోలీసుల వైఫల్యం వల్లే ఈ పరిస్థితి వచ్చిందంటూ వివరణ ఇచ్చారు. సభకు ప్రజలు రాకపోవడానికి కారణాన్ని ఎల్లో మీడియా కూడా పోలీసులపై నెట్టేసింది. ట్రాఫిక్ జామ్ అయ్యిందని, పోలీసులు సరిగా పర్యవేక్షించలేదంటూ ఎల్లో మీడియాలో ప్రచారం మొదలుపెట్టారు.

సభా వేదికపై ప్రధానికి అవమానం

రాష్ట్రంలో జరిగిన తొలి ఎన్డీఏ కూటమి సభకు హాజరైన ప్రధాన మంత్రి మోదీకి సభా వేదికపైనే అవమానం జరిగింది. దేశ ప్రధాని కోసం కనీసం ఒక పూల బొకే తీసుకురావాలన్న ఆలోచన 40 ఏళ్ల రాజకీయం అనుభవం, 14 ఏళ్లు సీఎంగా పనిచేసన టీడీపీ అధినేత చంద్రబాబుకు, వందలాది పుస్తకాలు చదివానని చెప్పుకొనే జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు రాలేదు. ప్రధాని హెలికాప్టర్ దిగి వేదిక పైకి రాగానే వట్టి చేతులతోనే ఆహ్వానం పలికారు. ఆయన కూర్చున్న తర్వాత ప్రధాని మంత్రి మోదీని చంద్రబాబునాయుడు సన్మానిస్తారని, పవన్ పూల బొకే ఇస్తారని వ్యాఖ్యాత చెప్పారు. దీంతో మోదీ సహా అందరూ లేచి నిల్చున్నారు. అయితే, అక్కడ శాలువా లేదు, పూల బొకే లేదు. దీంతో చంద్రబాబు, పవన్ దిక్కులు చూస్తూ నిల్చున్నారు. శాలువా కోసం అటూఇటూ చూశారు. విషయం గమనించిన బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి తాను సభ పూర్తి అయిన తర్వాత మోదీని సన్మానించేందుకు తీసుకువచ్చిన వినాయకుడి విగ్రహాన్ని బహూకరించారు. దీంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.

చంద్రబాబుకు మోదీ క్లాస్!

ఏ సభలో అయినా ఉత్సాహంగా ప్రసంగించే ప్రధాని మోదీ ఈ సభలో జనం లేకపోవడం, పదే పదే మైకులు మొరాయించడంతో కొంత కోపంగా ప్రసంగించారని బీజేపీ కార్యకర్తలు అభిప్రాయపడుతున్నారు. ప్రధాని సభా వేదికపై ఉన్నంతసేపూ కోపంగానే ఉన్నారు. చంద్రబాబు, పవన్‌తో అంటీముట్టనట్లుగానే ఉన్నారు. మీటింగ్ జరిగిన తీరుపై ప్రధాని మోదీ చంద్రబాబుపై అసహనం వ్యక్తం చేస్తూ క్లాస్ పీకినట్టు సమాచారం. సభ జరుగుతున్నంత సేపు చంద్రబాబు, పవన్‌ల మొహాల్లోనూ ఏమాత్రం ఆనందం లేదు.

అన్నమో 'నారాయణా'

- ప్రజాగళం సభకు అనేకమందిని తరలించిన మాజీ మంత్రి నారాయణ
- ఒంగోలు వద్ద భోజనం పెడతామని పంపారు.. సాయంత్రం 4 దాటినా భోజనాలు అందని వైనం
- ఆకలితో అలమటించిన మహిళలు
- సభకు వెళ్లకుండానే వెనక్కి వెళ్లిన బస్సులు

మద్దిపాడు: చిలకలూరిపేట సమీపంలో ఆదివారం జరిగిన ప్రజాగళం సభకు బయల్దేరిన జనం ఆకలితో అలమటించి, మధ్యలోనే ఆగిపోయారు. బీజేపీ, టీడీపీ, జనసేన నాయకులు నెల్లూరు చుట్టు పక్కల ప్రాంతాల నుంచి, రాయలసీమ జిల్లాల నుంచి ప్రజలను తరలించారు. నెల్లూరు, చుటుపక్కల ప్రాంతాల నుంచి టీడీపీకి చెందిన మాజీ మంత్రి పొంగూరు నారాయణ ప్రజలను ఈ సభకు తరలించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని నారాయణ విద్యా సంస్థల బస్సులను


ప్రజాగళం సభకు వెళుతూ భోజనం కోసం గుండ్లాపల్లిలో ధాబాల వద్ద ఆగిన బస్సులు

తెప్పించి, మధ్యాహ్నం 12 గంటలకే వాటిలో కార్యకర్తలు, మహిళలను తరలించారు. వారికి మధ్యాహ్నం 2 గంటలకు ఒంగోలు సమీపంలోని సూరారెడ్డిపాలెం వద్ద భోజనాలు అందిస్తారని చెప్పారు. వారు అక్కడికి మధ్యాహ్నం వేళ చేరారు. అక్కడ నారాయణ పంపిన బస్సుల్లోని వారికి భోజనాలు అందలేదు. సాయంత్రం 4 దాటినా భోజనం పెట్టలేదు. బస్సుల్లో ఉన్న మహిళలు ఆకలికి తట్టుకోలేకపోవడంతో వారితో వచ్చిన ద్వితీయ శ్రేణి నేతలు గుండ్లాపల్లి సమీపంలో బస్సులు నిలిపి స్థానికంగా ఉన్న ధాబాల వద్ద వారికి భోజనం పెట్టించి వెనక్కి తీసుకువెళ్లారు. మీటింగ్‌కు వెళ్లరా.. అని ద్వితీయ శ్రేణి నాయకులను అడగ్గా.. మీటింగ్ సంగతి ఎత్తితే మహిళలు కొట్టేలా ఉన్నారని, తెలిపారు. మీటింగ్‌కు వెళ్లడానికి డబ్బులు ఇచ్చారా... అన్న ప్రశ్నకు సమాధానం దాటవేశారు.

రాష్ట్రంలో జగన్ పార్టీ, కాంగ్రెస్ ఒక్కటే

చిలకలూరిపేట శివారు బొప్పూడి ఎన్డీఏ 'పజాగళం' సభలో ప్రధాని మోదీ



సాక్షి ప్రతినిధి, గుంటూరు/సాక్షి, నరసరావుపేట: ఆంధ్రప్రదేశ్‌లో వైఎస్ జగన్ పార్టీ, కాంగ్రెస్ పార్టీ వేర్వేరు కాదని, ఒకటే అని, రెండు పార్టీలను ఒకే కుటుంబ సభ్యులు నడుపుతున్నారని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు ఎన్డీఏ కూటమికి పడకుండా ఇద్దరూ కుమ్మక్కయ్యారని, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేక ఓటును కాంగ్రెస్‌కు మళ్లించాలని చూస్తున్నారని చెప్పారు. ఆదివారం పల్నాడు జిల్లా చిలకలూరిపేట శివారు బొప్పూడి గ్రామంలో జరిగిన ప్రజాగళం సభలో ఆయన మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి కుంటుపడిందని అన్నారు. రాష్ట్ర మంత్రులు ఒకరిని మించి మరొకరు అవినీతి చేయడానికి పోటీ పడుతున్నారని ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌లో కూడా డబుల్ ఇంజిన్ సర్కార్ వస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని చెప్పారు. రాష్ట్ర ప్రజలు ఢిల్లీలో మరోసారి ఎన్డీఏ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని సంకల్పించారని, ఇక్కడ రాష్ట్ర ప్రభుత్వాన్ని గద్దె దించడాన్ని మరో సంకల్పంగా పెట్టుకున్నారని ఆయన అన్నారు. ఎన్డీఏని గెలిపిస్తే రాష్ట్రాభివృద్ధికి పునాది వేస్తామని, మహిళలు, యువతకు కొత్త అవకాశాలు కల్పిస్తామని, రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు కల్పించడం, పోర్టుల అభివృద్ధి, నీలి విప్లవానికి అడుగులు వేస్తామని హామీ ఇచ్చారు. శనివారం లోక్‌సభ ఎన్నికల నగారా మోగితే వెంటనే ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నానని, కోటప్ప కొండ నుంచి త్రిమూర్తుల ఆశీర్వాదం ఎన్డీఏకి దొరుకుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈసారి ఎన్నికల ఫలితాలు జూన్ 4న వస్తున్నాయని, ఎన్డీఏకి నాలుగు వందల పైచిలుకు సీట్లు రావాలని అన్నారు. అభివృద్ధి చెందిన ఏపీ కావాలంటే ఇక్కడ ఎన్డీఏ గెలవాలని, ప్రాంతీయ ఆకాంక్షలు, జాతీయ ప్రగతిని ఎన్డీఏ సమన్వయం చేస్తుందని చెప్పారు. ఇండియా కూటమిలోని పార్టీలు పరస్పరం విరుద్ధంగా పనిచేస్తుంటాయని తెలిపారు. కేరళలో కాంగ్రెస్, లెఫ్ట్ కూటమి, బెంగాల్‌లో టీఎంసీ-లెఫ్ట్, పంజాబ్‌లో కాంగ్రెస్-ఆప్ పరస్పరం పోటీ పడతాయని, ఢిల్లీలో కలిసిపోతాయని విమర్శించారు. ఇండియా కూటమిలోనివారు ఒకరిని ఒకరు తిట్టుకుంటూనే తమ స్వార్థ ప్రయోజనాల కోసం కూటమిగా ఏర్పడ్డారన్నారు. ఏపీలో చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ప్రజల కోసం రాత్రింబవళ్లు కష్టపడుతున్నారన్నారు. చంద్రబాబు, పవన్ చేరికతో ఎన్డీఏ బలపడిందని అన్నారు. దేశంలోని ఎన్డీఏ ప్రభుత్వం పేదల గురించి ఆలోచిస్తుందని, వారి కోసమే పని చేస్తుందని తెలిపారు. పల్నాడు జిల్లాలో ఐదు వేల ఇళ్లు ఇచ్చామని, జల జీవన్ మిషన్ పథకం కింద కోటి ఇళ్లకు నీరు ఇచ్చామని, ఆయుష్మాన్ భారత్‌తో ఏపీలో కోటీ 25 లక్షల మందికి లబ్ధి చేకూరిందని, కిసాన్ సమ్మాన్ నిధితో పల్నాడు ప్రజలకు రూ.700 కోట్లిచ్చామని అన్నారు. ఆంధ్రప్రదేశ్‌ను ఎడ్యుకేషన్ హబ్‌గా మార్చామని, తిరుపతిలో ఐఐటీ, ఐసర్, విశాఖలో ఐఐఎం, ఐఐపీఈ, విజయనగరం జిల్లాలో గిరిజన వర్సిటీ, మంగళగిరిలో ఎయిమ్స్ స్థాపించామన్నారు. కాంగ్రెస్ పార్టీ తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసిందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ వేధింపులకు గురైన ఎన్టీఆర్ శత జయంతి ఉత్సవాల సందర్భంగా వెండి నాణెం విడుదల చేశామని, పీవీ నరసింహారావుకు 'భారతరత్న' ఇచ్చి గౌరవించామని చెప్పారు.

రాష్ట్రంలో ప్రజల జీవితాలు నాశనం అయ్యాయి: చంద్రబాబు

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబునాయుడు మాట్లాడుతూ రాష్ట్రంలో ఐదేళ్లలో విధ్వంస, అహంకార పాలనతో ప్రజల జీవితాలు నాశనం అయ్యాయన్నారు. ప్రజల గుండె చప్పుడు బలంగా వినిపించడానికే మూడు పార్టీలు జట్టు కట్టాయని, రాబోయే ఎన్నికల్లో మీరు ఇచ్చే తీర్పు రాష్ట్ర భవిష్యత్తును నిర్ణయిస్తుందని అన్నారు. మా జెండాలు వేరు అయినా అజెండా ఒక్కటేనని అన్నారు. గడచిన ఐదేళ్లలో బంగారం లాంటి రాష్ట్రాన్ని జగన్ చీకటిమయం చేశారని, గతంలో ఎన్నడూ లేని విధంగా అక్రమ కేసులు పెట్టి రాజకీయాలను కలుషితం చేశారన్నారు. ప్రజాస్వామ్యాన్ని, ప్రశ్నించిన వారిని అణిచివేశారని ఆరోపించారు. జగన్ అధికార దాహానికి బాబాయ్ బలయ్యారని... ఇద్దరు చెల్లెళ్లు రోడ్డెక్కి జగన్‌కు ఓటు వేయొద్దని చెబుతున్నారంటే.. ఏపీ ప్రజలు అర్థం చేసుకోవాలని అన్నారు.

ఎన్డీఏ పునఃకలయిక 5 కోట్ల మందికి ఆనందాన్ని ఇచ్చింది: పవన్

జనసేన పార్టీ అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వాన్ని స్థాపించబోతున్నామని అన్నారు. ఎన్డీఏ పునఃకలయిక ఐదు కోట్ల మందికి ఆనందాన్ని ఇచ్చిందన్నారు. ముఖ్యమంత్రి జగన్ ఒక సారా వ్యాపారిగా మారారని, దేశమంతా డిజిటల్ ట్రాన్సాక్షన్ చేస్తుంటే.. ఏపీలోని మద్యం షాపుల్లో మాత్రమే నగదు చలామణి చేసి దోచుకుంటున్నారని ఆరోపించారు. వేల సంఖ్యలో మహిళలు, యువత కనిపించకుండా పోయినప్పటికీ ఈ ప్రభుత్వం ఏమీ చేయలేకపోయిందన్నారు. గంజాయి, డ్రగ్ క్యాపిటల్‌గా ఏపీ మారిపోయిందన్నారు. అయోధ్యలో రామాలయం కట్టిన మోదీకి రాష్ట్రాన్ని రావణకాష్టం చేసిన చిటికిన వేలంత రావణాసురుడిని తీసేయడం కష్టం కాదని, గుజరాత్‌లోని ద్వారక నుంచి వచ్చిన మోదీ ఎన్నికల కురుక్షేత్రంలో పాంచజన్యం పూరిస్తారని అన్నారు. ఈ సమావేశంలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి, కూటమికి చెందిన పలువురు నేతలు పాల్గొన్నారు.

అన్నింటా 'అతి'బాబు

ఐదేళ్ల క్రితం

మోదీ వల్ల దేశం సర్వ నాశనమైపోయింది. మోదీ ఒక టెర్రరిస్టు. ఆయనకు భార్య లేదు. తల్లిపై గౌరవం లేదు. మోదీ వల్ల దేశంలో ఎవరికీ ఉపయోగం లేదు.

ఆదివారం

మోదీ భారతదేశాన్ని విశ్వగురువుగా మారుస్తున్న ఒక శక్తి. మోదీ అంటే అభివృద్ధి. మోదీ అంటే సంస్కరణ. మోదీ అంటే భవిష్యత్తు.

నాడు తిట్లు.. నేడు పొగడ్తలు

- ఐదేళ్లక్రితం ప్రధాని మోదీని నోటికొచ్చినట్లు తిట్టిన చంద్రబాబు
- ఆయనో టెర్రరిస్టు అని, దేశాన్ని సర్వ నాశనం చేశారని తిట్లు
- నేడు అవసరార్థం మోదీ ఇంద్రుడు, చంద్రుడు అంటూ పొగడ్తలు
- మోదీజీ గారూ.. అంటూ అతి వినయం
- కేవలం కేసుల భయంతోనే మోదీని పొగిడిన బాబు
- వేదికపై చంద్రబాబు, పవన్‌ని పెద్దగా పట్టించుకోని మోదీ
- ఇద్దరినీ ఏకవచనంతో సంబోధించిన ప్రధాని

ఈ మాటలు మాట్లాడిన నాలుక ఒక్కటే. మడతపడిందంతే.. ఇంతలా మడతపడే నాలుక ఉన్నది చంద్రబాబు ఒక్కరికే అని ఆదివారం జరిగిన బొప్పూడి సభలో మరోసారి నిరూపితమైంది.

ఆ నాడు మోదీని నోటికొచ్చినట్లు తిట్టిన చంద్రబాబు.. నేడు తన అవసరార్థం అదే నోటితో మోదీని ఇంద్రుడు, చంద్రుడు.. అంటూ పొగడ్తల్లో ముంచెత్తారు. మోదీజీ అని పిలిస్తే సరిపోయేదానికి మోదీజీ గారూ.. అంటూ గారూ అన్న పదాన్ని అదనంగా చేర్చి చంద్రబాబు ప్రదర్శించిన అతి వినయం, ఆయన్ని పొగిడేందుకు పడిన తాపత్రయాన్ని చూసి ప్రజలతోపాటు టీడీపీ శ్రేణులు కూడా ముక్కున వేలేసుకున్నారు. మోదీ ప్రపంచం మెచ్చిన మేలైన నాయకుడంటూ పొగుడుతూ సాగిలపడిపోవడం చూసి చంద్రబాబుకు ఆస్కార్ అవార్డు ఇవ్వొచ్చనే సెటైర్లు సోషల్ మీడియాలో పేలుతున్నాయి. నోట్ల రద్దు, జీఎస్‌టీ వల్ల ఉపయోగం లేదని గతంలో దుమ్మెత్తి పోసిన విషయాన్ని జనం మరచిపోయారనుకుని, ఇప్పుడు ఆ రెండింటి వల్ల దేశ ఆర్థిక ముఖ చిత్రం మారిపోయిందని, మార్చిన వ్యక్తి మోదీ అంటూ మాట మార్చేశారు. తాను ఏం చెప్పినా ప్రజలు నమ్ముతారనే రీతిలో చంద్రబాబు మాట్లాడారు. మధ్యలో బీజేపీ సబ్ కా సాథ్, సబ్ కా వికాస్ నినాదాన్ని హిందీలో చెప్పి మోదీని ఆకర్షించేందుకు ప్రయత్నించారు. ఇంత వంగిపోయి మరీ ప్రధానిని పొగడటం వెనుక కారణం చంద్రబాబును వెంటాడుతున్న కేసులే. తనపై ఉన్న కేసులను ఎక్కడ తిరగదోడతారో, ఎక్కడ జైల్లో పెడతారో, ఎక్కడ తన అవినీతి చరిత్రను పెకలిస్తారో అనే భయంతోనే మోదీ కరుణ కోసం చంద్రబాబు పాకులాడారు.

పెద్దగా పట్టించుకోని మోదీ.. గౌరవం కోల్పోయిన బాబు

ఎంత భజన చేసినా ప్రధాని మోదీ మాత్రం చంద్రబాబును పెద్దగా పట్టించుకోలేదు. పక్కనే కూర్చున్నా మొక్కుబడి మాటలు తప్ప చిరునవ్వుతో అప్యాయంగా మాట్లాడేందుకు ఆయన ఇష్టపడలేదు. పిలుపులోనూ గతంలో ఇచ్చిన గౌరవాన్ని ప్రధాని మోదీ ఇప్పుడు చంద్రబాబుకు ఇవ్వలేదు. చంద్రబాబునాయుడు జీ అంటూ గతంలో మోదీ ఆయన్ని సభల్లో సంబోధించేవారు. బొప్పూడి సభలో చంద్రబాబునాయుడు అంటూ ఏకవచనంతో సంబోధించడం ద్వారా ఆయనపై తనకున్న భావాన్ని వ్యక్తంచేశారు. దీన్నిబట్టి చంద్రబాబు తన గౌరవాన్ని కోల్పోయినట్లు కనపడింది. రెండు రోజుల క్రితం కేంద్ర హోం మంత్రి అమిత్ షా కూడా చంద్రబాబు గురించి చులకనగా మాట్లాడిన విషయం తెలిసిందే. గతంలో మోదీని టెర్రరిస్టు అని ఎన్డీఏ నుంచి వెళ్లిపోయిన చంద్రబాబు బుద్ధి తెచ్చుకుని మళ్లీ తిరిగి వచ్చారని, స్వాగతించామని అమిత్‌షా ఒక టీవీ ఇంటర్వ్యూలో చెప్పారు. అంటే చంద్రబాబు కాళ్లావేళ్లా పడటం వల్ల కూటమిలోకి రానిచ్చినట్లు చెప్పకనే చెప్పారు. బొప్పూడి సభలో చంద్రబాబు పట్ల మోదీ కూడా అలాగే వ్యవహరించినట్లు స్పష్టంగా కనిపించింది. కేసుల భయం, రాజకీయ అవసరార్థం వచ్చిన బాబుతో ఆయన కూడా అంతే రాజకీయంగా వ్యవహరించి, బాబు పట్ల తమకు ఏమాత్రం గౌరవం లేదని చూపించారు. జనసేన అధ్యక్షుడు పవన్ కళ్యాణ్‌ను కూడా మోదీ అసలు పట్టించుకోలేదు. అందరితో సమానంగా నమస్కారం పెట్టడమే తప్ప ఆయనకు గౌరవం కూడా ఇవ్వలేదు. తన ప్రసంగంలో పవన్ కళ్యాణ్ అని ఏకవచనంతోనే సంబోధించారు. బొప్పూడి సభలో బీజేపీ, జనసేన, టీడీపీ కూటమి కలయిక అంతా మొక్కుబడి తంతుగానే కనిపించింది.


ప్రధాని మోదీ ప్రజలకు నమస్కరిస్తుండగా... మోదీకి నమస్కరిస్తున్న చంద్రబాబు

– సాక్షి, అమరావతి

అవకాశవాద కూటమికి ఓటేందుకు వేయాలి?

- జెండాలు కలిపింది అధికారం కోసమే.. రాష్ట్ర ప్రయోజనాల కోసం కాదని తేటతెల్లం
- టెర్రరిస్టు అని దూషించిన నోటితోనే ప్రధానిని కీర్తించడంలో అంతర్యమేంటి బాబూ?
- చంద్రబాబు పాపాలను ఏ గంగాజలంతో కడిగారు మోదీ?
- అవినీతిపరుడంటూ బాబును అన్న నోటితోనే పొగడ్తలేంటి పవన్?
- వైఎస్సార్‌సీపీ, కాంగ్రెస్ ఒకటేనంటే మీ పార్టీ కార్యకర్తలైనా నమ్ముతారా మోదీ?
- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి పేర్ని నాని ధ్వజం



సాక్షి, అమరావతి: జెండాలు కలిపింది అధికార పీఠంపై కూర్చోవడం కోసం మాత్రమేనని, రాష్ట్ర ప్రయోజనాలు, అభివృద్ధి కోసం కానే కాదని తేటతెల్లం చేసేందుకు ఐదు హెలీకాప్టర్లలో వచ్చి ప్రజాగళం సభ నిర్వహించినందుకు ప్రధాని నరేంద్ర మోదీ, టీడీపీ, జనసేన అధ్యక్షులు చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌ను అభినందిస్తున్నామంటూ మాజీ మంత్రి పేర్ని నాని (వెంకట్రామయ్య) ఎద్దేవా చేశారు. ఆయన ఆదివారం రాత్రి తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ అవకాశవాద కూటమికి ఎందుకు ఓటేయాలని ప్రశ్నించారు. ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వస్తే డబుల్ ఇంజిన్ సర్కార్‌తో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తామని ప్రధాని మోదీ చెప్పారని, 2014–18 మధ్య ఉన్న డబుల్ ఇంజిన్ సర్కారు అప్పట్లో రాష్ట్రంలో సాగించిన పాలననే మళ్లీ తెస్తామని చెప్పగలరా? అని నిలదీశారు.

పోలవరం ప్రస్తావనేది?

పోలవరం ప్రాజెక్టుకు రూ.15 వేల కోట్లివ్వాలని, 41.15 మీటర్ల కాంటూర్ వరకూ పూర్తి చేసి తొలి దశలో నీళ్లందిస్తామని ప్రధాని నరేంద్ర మోదీని మూడేళ్ల క్రితమే సీఎం జగన్ కోరారని, కావాలంటే నిర్వాసితుల ఖాతాల్లో నేరుగా పరిహారం జమ చేయండంటూ ఆ వివరాలు కూడా ఇచ్చారన్నారు. ఇప్పటిదాకా అతీగతీ లేదని, ప్రజాగళం సభలోనైనా నిధులిస్తామని ఎందుకు చెప్పలేదని మోదీని ప్రశ్నించారు. మిగతా రాష్ట్రాలకు ఇచ్చినట్లే రాష్ట్రానికి ఐఐఎం, ఐఐటీ వంటి సంస్థలు ఇచ్చారని, రాష్ట్రానికి ప్రత్యేకంగా ఇచ్చినవి ఏవైనా ఉన్నాయా అంటూ ప్రధానిని ప్రశ్నించారు. విశాఖ రైల్వే జోన్ ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. నీలి విప్లవాన్ని సృష్టిస్తానని ప్రధాని మోదీ చెప్పారని, సీఎం జగన్ ఇప్పటికే నాలుగు పోర్టుల నిర్మాణాన్ని చేపట్టి, ఒక పోర్టును పూర్తి చేశారని గుర్తు చేశారు. విభజన చట్టంలో ఒక పోర్టును నిర్మించి ఇస్తామని హామీ ఇచ్చారని, ఒక్క పోర్టు నిర్మాణానికైనా సహాయం చేయకుండా ఇప్పుడు ఎండమావుల్లా హామీలు ఇస్తారా అంటూ ప్రధానిని నిలదీశారు. వైఎస్సార్‌సీపీ, కాంగ్రెస్ రెండు ఒకేటనని మీరు అన్న మాటలను కనీసం బీజేపీ కార్యకర్తలైనా నమ్ముతారా అంటూ మోదీని నిలదీశారు.

ఎవరి కోసం ఈ పొత్తులు?

పాచిపోయిన లడ్డూలు ఇచ్చారంటూ ప్రధాని మోదీని 2019లో దూషించారని పవన్‌కు ఇప్పుడా లడ్డూలు తాజావి అయ్యాయా అని అన్నారు. 2014లో తిరుపతి సభలో ప్రత్యేక హోదాను 5 ఏళ్లు కాదు పదేళ్లు ఇస్తానని హామీ ఇచ్చి మోసం చేశారని, నియంత, టెర్రరిస్టు అంటూ ప్రధాని మోదీని దూషించిన చంద్రబాబు ఇప్పుడు అదే మోదీని ప్రశంసించడంపై ఆశ్చర్యం వ్యక్తం చేశారు. సీఎం జగన్ ప్రభంజనం నుంచి తనను రక్షించడం పవన్ వల్ల కాలేదని, నువ్వైనా కాపాడు అంటూ మోదీని కాళ్లావేళ్లా పడినట్లు చంద్రబాబు ప్రసంగం సాగిందన్నారు. గత ఎన్నికల్లో గుంటూరు గడ్డపై నుంచే చంద్రబాబు అవినీతిలో కూరుకుపోయాడని, పోలవరాన్ని ఏటీఎంగా మార్చుకున్నారని ప్రధాని మోదీ విమర్శించారని, చంద్రబాబు దోపిడీకి హద్దే లేదని పవవ్ కూడా దూషించారని అన్నారు. ఇప్పుడు మళ్లీ ఎవరి కోసం పొత్తు పెట్టుకున్నారో ప్రజలకు చెప్పాలని నిలదీశారు. చెల్లెళ్లే జగన్‌కు ఓటేయొద్దని చెబుతున్నారని చంద్రబాబు అనడంపై తీవ్రంగా ధ్వజమెత్తారు. 'నీ మామ ఎన్టీఆరే నీకు ఓటేయద్దు, నువ్వో దగాకోరువి అని చెప్పారు. నీ తమ్ముడు రామూర్తి నాయుడు మా అన్నకు ఓటేయొద్దని రాష్ట్రమంతా చెప్పారు. నీ బావమరిది హరికృష్ణ, తోడల్లుడు దగ్గుబాటి వెంకటేశ్వరరావు, వదిన పురందేశ్వరి నిన్ను మోసగాడు, వెన్నుపోటుదారుడిగా అభివర్ణిస్తూ ఓట్లేయొద్దని రాష్ట్రం మొత్తంతిరిగారా లేదా' అంటూ చంద్రబాబును దెప్పిపొడిచారు. సభ జరుపుకోవడమే చేతకాని మీరా జగన్‌పై యుద్ధం చేసేది అంటూ మండిపడ్డారు. మీ సభలో మైక్ పని చేయక సాక్షాత్తు ప్రధాని మోదీ పావు గంటపాటు బొమ్మలా నిలబడ్డారని ఎద్దేవా చేశారు.

అమరావతి రియల్ ఎస్టేట్ స్కాంపై విచారణ ఏమైంది?

అధికారంలోకి వస్తే అమరావతి రియల్ ఎస్టేట్ స్కామ్‌పైన, పోలవరంలో చంద్రబాబు అడ్డగోలు దోపిడీపైనా విచారణ జరిపి కఠినంగా శిక్షిస్తామన్న బీజేపీ.. ఆ కుంభకోణాలపై విచారణను ఏమి చేసిందని ప్రధాని మోదీని నిలదీశారు. ఏ గంగా జలం చల్లి చంద్రబాబు పాపాలను కడిగారని ప్రశ్నించారు. విజయవాడలో 40 దేవాలయాలను కూల్చి, విగ్రహాలను చెత్తకుప్పలో పడేసిన చంద్రబాబు పక్కన కూర్చుంటే ప్రధాని మోదీని హిందువులు ఎలా నమ్ముతారని నిలదీశారు. ప్రజాగళం సభలో సీఎం జగన్‌ను దూషించడం తప్ప.. విభజన హామీలు అమలు చేయాలని ఒక్క మాటైనా మోదీని అడిగారా అంటూ చంద్రబాబు, పవన్‌ను నిలదీశారు.


మోదీజీ.. చంద్రబాబుతో జాగ్రత్త

మీ పక్కన ఉన్న చంద్రబాబు, పవన్ కళ్యాణ్ గజదొంగలని, ఏఐసీసీ అంటే ఆల్ ఇండియా చంద్రబాబు కాంగ్రెస్ అన్నది గుర్తించుకోవాలని ప్రధానికి సూచించారు. పగలు మీతో రాత్రి రాహుల్ గాంధీతో చేతులు కలిపే చంద్రబాబుతో జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

సన్నిధి

మంచిమాట

భక్తి అంటే ఏమిటి? వేదాంత గ్రంథాలిచ్చే నిర్వచనాల జోలికి వెళ్లవద్దు మనం. మామూలు మాటల్లో అర్థం కావటానికి భక్తి అంటే ఏమిటి? చాలామంది అభిప్రాయంలో ఫోటో పెట్టి, దండలు వేసి, పూలు, అగరొత్తులు, దీపాలు పెట్టి నివేదన చెయ్యటం, దణ్ణం పెట్టటం అనుకుంటారు. అది భక్తా? ఒకరకంగా తను మారకుండా ఉండటాన్ని సమర్థించుకునే ప్రయత్నం. "ఆయన మహానుభావుడు కనుక అట్లా చేయగలిగాడు. మన వంటి సామాన్యులకి సాధ్యమా?" అని తప్పించుకునే మార్గం. అట్లా పూజ చెయ్యటం తప్పు అని కాని, చెయ్య కూడదని కాని చెప్పటం లేదు. అది ఒకరకం. దానివల్ల ఒరిగేది ప్రత్యేకంగా ఏమీ లేదు. అది ఒక క్రమశిక్షణ. చిత్త శుద్ధిని కలిగిస్తుంది. ఇది మొదటిమెట్టు అని చెప్పవచ్చు. కానీ చాలా మంది ఇదే పరమార్థం అనుకుంటారు.



భక్తి అంటే..?

కొంత మంది అనుకరించటమే భక్తి అనే భ్రమలో ఉంటారు. అనుకరించటానికి, అనుసరించటానికి చాలా వ్యత్యాసం ఉంది. వారిలాగా ఉండే ప్రయత్నం అనుకరణ. ఇది భౌతికంగా తమ ఆదర్శమూర్తుల లాగా ఉండేట్టు చేస్తుంది. చూడగానే ఫలానా వారి అభిమానులని తెలియ చేస్తుంది. కాని వారిస్థాయికి చేర్చదు. అయితే అనుకరణ పనికి రానిదని చెప్పటానికి వీలు లేదు. అది రెండవ మెట్టు.

ఒకరిపట్ల భక్తి ఉన్నది అంటే వారు చెప్పిన దానిని చెప్పినట్టు అనుసరించటమే. భక్తిలో ప్రశ్నలకు, సందేహాలకు, వాదోపవాదాలకు తావుండదు. నోటితోనే చెప్పనక్కర లేదు. వారి ప్రవర్తనను చూసి అనుసరించవలసి ఉంటుంది. ''మీ బొమ్మకి పూజ చేస్తాం, కాని, మీరు చెప్పినట్టు చెయ్యటం మావల్ల కాదు, మీరు ఉన్నట్టు ఉండటం అసాధ్యం'' అంటే అది భక్తి అనిపించుకోదు. భగవంతుడివిషయంలోనైనా అంతే! దేవుణ్ణి గదికే పరిమితం చేసి, పూజచేసిన కొద్దిసేపు మాత్రం ఆయన్ని తలచుకొని, తరువాత దుర్మార్గంగా లోకకంటకంగా ప్రవర్తిస్తే అది భక్తి అనిపించుకోదు. పరమాత్మ నిర్దేశించిన విధంగా, ఆయన మెప్పు వడసే పద్ధతిలో ప్రవర్తిస్తే అది నిజమైన భక్తి.

సాటిమనిషి మీద సానుభూతి, జాలి చూపించలేని వాడు, ప్రతిఫలాపేక్ష లేకుండా ప్రేమించ లేని వాడు, తనకి హాని చేసిన శత్రువుని కాక పోయినా కనీసం ఎదుటివాడిని క్షమించలేని వాడు విశ్వాసి ఎలా అవుతాడు? పొరుగువారిని తనవలే ప్రేమించమని చెప్పిన ఏసు క్రీస్తు అంటే భక్తి ఉంటే ఆయన చెప్పిన మాటలని పాటించాలి, ఆయనలాగా ప్రవర్తించాలి. ఆయన మార్గాన్ని అనుసరించాలి.

> శ్రీరాముడు పితృభక్తి కలవాడు అని చెపుతాం. అంటే అర్థం తండ్రి చెప్పిన విధంగా జీవించాడు అని. ఆయన మాట జవదాటలేదు. ఆయన తనతోచెప్పిన మాటనే కాదు ఆయన ఎవరికిచ్చిన మాటనైనా పాటించాడు. రాముడి పితృభక్తి, గురుభక్తి విశ్వామిత్రుడు తాటకను సంహరించమన్నప్పుడు మారు మాటాడక సంహరించటంలో వ్యక్తమౌతాయి. తల్లితండ్రులని వృద్ధాశ్రమాలలో ఉంచి "మేము రామభక్తులం" అంటే రాముడిపట్ల అపచారం చేసినట్టే. ఆయనలో ఉన్న కొన్నిగుణాలనైనా అలవరచుకుంటే రామభక్తులు అనిపించుకోగలుగుతారు.

ఎక్కువసేపు వాళ్ళతో ఉండటం వల్లనో, పోలికలు రావటం వల్లనో మనవలు, మనవరాళ్ళు తరచుగా తాతానాయనమ్మల్లాగా ప్రవర్తిస్తూ ఉంటారు. తాతలకి నాయనమ్మలకి, అమ్మమ్మలకి మనవలు, మనవరాళ్ళు అంటే ఇష్టం ఉండటానికి కూడా ఇదే కారణం.

మనుషుల విషయంలోనే ఇలా ఉంటే భగవంతుడి విషయంలో ఆయన చెప్పినట్టు ప్రవర్తిస్తే ఫలితం ఎలా ఉంటుందో అర్థం చేసుకోవచ్చు. భగవంతుడికి, భక్తుడికి ఉండే సంబంధాన్ని భ్రమర కీట న్యాయంగా చెప్పటం ఈ కాణంగానే. తన చుట్టూ తిరుగుతున్న భ్రమరం చేసే ఝుమ్మనే నాదం విని గూటిలో సుప్తావస్థలో ఉన్న కీటకం దానిని అనుసరిస్తూ తాను కూడాఅటువంటి నాదం చేసే ప్రయత్నంలో భ్రమరం లాగా రూపాంతరం చెందుతుంది. ఈ అనుసరణ అన్నది తానే లక్ష్య వస్తువు అయ్యేట్టు చెయ్యగలదు.

ఒక గురువునో, నాయకుణ్ణో అనుకరించేవారు వారి వలె తయారౌతారే కాని, వారుగా అయిపోరు. వారుగా, కనీసం వారంతటి వారుగా అయిపోవటానికి కావలసినది అనుసరణ మాత్రమే. భగవత్తత్వాన్ని అందుకోవాలంటే కూడా అంతే!

– డా. ఎన్. అనంత లక్ష్మి

ఆధ్యాత్మికథ

అంతయు నీవే...



ఉత్తర భారత దేశంలో స్థిరపడిన ఓ వైద్యుడు తిరుమల పుణ్యక్షేత్ర విశిష్టతను తెలుసుకోమని పదహారేళ్ళ కొడుకును తన స్వంత పల్లెకు పంపాడు. తోడుగా వెళ్ళమని తండ్రిని కోరాడు. అందులో భాగంగా మనవడిని తీసుకుని తాత తిరుమల ప్రయాణం ప్రారంభించాడు.

అలిపిరినుండి ఆనంద నిలయం వరకు కాలి నడకన వెళ్దామని అనుకున్నారు. అలిపిరి పాదాల మండపం చేరారు. అక్కడ స్వామి వారిని సేవించారు. అలిపిరి పాదాలమండపం విశిష్టత తెలియజేస్తూ తాత ''అలిపిరి అంటే 'అల్ప శరీరి' అని కూడా అర్థంగా చెబుతారు. శ్రీ వేంకటేశ్వర స్వామి సూక్ష్మ శరీరంతో ఇక్కడ భక్తులను అనుగ్రహిస్తుంటారని భక్తుల నమ్మకం'' అన్నాడు.

ఆ తర్వాత శ్రీవారి లోహ పాదుకలను భక్తి ప్రపత్తులతో నెత్తిన పెట్టుకుని గర్భగుడి ప్రదక్షిణ చేయమని మనవడికి చెప్పాడు తాత.

ఆశ్చర్యంగా మనవడు ''పాదుకలను నెత్తిన పెట్టుకోవడంలో అర్థమేమిటి?'' అని అడిగాడు. ''సనాతన భారతీయ తాత్విక ఆరాధనలో పాదాల ఔన్నత్యానికి ఇదో మచ్చు తునక. ఇత్తడి, వెండితో చేసిన పాదుకలను చాలామంది భక్తులు ఇక్కడ స్వామివారికి మొక్కుగా చెల్లించుకుంటారు!'' అని బదులిచ్చాడు తాత. తాత సమాధానానికి సంతృప్తి చెందిన మనవడు గోవింద నామస్మరణలు చేస్తూ గుడి ప్రదక్షిణం చేశాడు. కొండపైకి వెళ్ళడానికి చిన్నగా నడక ప్రారంభించారు. గాలి గోపురం చేరి కొద్దిసేపు అక్కడ కూర్చున్నారు.

అంతసేపూ వారు మెట్లెక్కుతూ పడిన శ్రమంతా, అక్కడ వీస్తున్న చల్లని గాలులకు పటాపంచలయ్యాయి. మెట్ల మహిమలు, మార్మిక సంగతులు, కొండ దోవ కతలు... అనేకం చెప్పాడు తాత.

మళ్ళీ నడక ప్రారంభించి మోకాలి మిట్ట చేరారు. శేషాచలం కొండల్ని చూస్తూ తాత ''నేటి యుగానికి మహర్షులు అందించిన మూడు ఆణిముత్యాలు రామాయణ-భారత-భాగవత గ్రంథాలు'' అన్నాడు. మనవడు ఆసక్తిగా వినడం చూసి ''రామాయణం చదివితే రాములవారి గొప్పతనం, మహాభారతం చదివితే విజ్ఞాన సర్వస్వం, భాగవతం చదివితే శ్రీకృష్ణుడి లీలలు అవగతం అవుతాయి'' అన్నాడు.

''మరి వేంకటేశ్వర స్వామి వారి వైభవం తెలుసుకోవాలంటే ఏ గ్రంథం చదవాలి?'' అని అడిగాడు మనవడు. తాత చిరునవ్వు నవ్వుతూ ''తాళ్ళపాక అన్నమాచార్య కీర్తనలు చదివినా, విన్నా అర్థమవుతుంది స్వామివారి వైభవం, వైభోగం'' అని బదులిచ్చాడు.

''అలాగా...'' అన్న మనవడు గబగబా కొండెక్కి నేరుగా పుస్తక విక్రయశాలకు వెళ్ళి, దొరికిన అన్నమయ్య కీర్తనల పుస్తకాలు, ఆడియోలు కొనుక్కున్నాడు.


ఇద్దరూ స్వామివారి దర్శనం చేసుకుని కొండ దిగారు.

– ఆర్.సి.కృష్ణస్వామి రాజు

వాగ్గేయకార వైభవం

గంగాస్నానం ఎంత గొప్పదంటే...

గంగేమాం పాహి... అంటూ ముత్తుస్వామి దీక్షితార్ వారు చేసిన కీర్తన చివరి చరణాల్లో. ''..సకల తీర్థమూలే సద్గురు గుహలీలే/వరజహ్నుబాలే వ్యాసాది కృపాలే'' అంటారు. దీక్షితార్ వారి కీర్తికి ప్రధాన కారణం గంగమ్మ ప్రసాదంగా లభించిన వీణకాగా మరొకటి తిరుత్తణి సుబ్రహ్మణ్యేశ్వరుని అనుగ్రహం. సద్గురువు అయిన గుహుడు.. సుబ్రహ్మణ్యుడు గంగానది ఒడ్డున ఆడుకునేవాడని అన్నారు. అక్కడ ఆడుకునేవాడని చెప్పడం వెనుక సుబ్రహ్మణ్య జననం గురించి గుర్తు చేస్తున్నాడు. శివవీర్యం తేజస్సు భరించలేని దేవతలు దానిని అగ్నిహోత్రుని వద్ద ఉంచారు. ఆయన ఒక నాడు గంగమ్మ దగ్గరకు వెళ్ళి...''ఇది దేవతాకార్యం. దీనిని నీవు ఉంచుకుని గర్భం ధరించు'' అన్నాడు. గంగ అంగీకరించింది. అయితే శివ తేజస్సు శరీరం అంతటా ప్రవహించేసరికి తట్టుకోలేక..'నేను వదిలిపెట్టేస్తాను.. ఎక్కడ వదిలిపెట్టేయను' అనడిగింది. ''రెల్లుగడ్డి పొదలో వదిలిపెట్టు'' అని అగ్నిహోత్రుడు సలహా ఇచ్చాడు. అదే శరవణ భవ.. మంత్రం. అక్కడ సుబ్రహ్మణ్య జననం జరిగింది. అందువల్ల బాల సుబ్రహ్మణ్యుడు గంగానదీ ప్రవాహ తీరంలో ఆడుకునేవాడు. అదే సద్గురు గుహలీలే... అన్న చరణం.



బ్రహ్మ, విష్ణు స్పర్శ పొందిన గంగ... సగరుల భస్మరాశిమీదుగా ప్రవహించడానికి పాతాళానికి భాగీరథుడి రథం వెంట పరుగెడుతూన్నది. మార్గమధ్యంలో జహ్నుమహర్షి యజ్ఞవాటికను ముంచెత్తడంతో ఆయన ఆగ్రహించి మొత్తం గంగను తపశ్శక్తితో లోపలకు పుచ్చేసుకున్నాడు. భగీరథుడి అభ్యర్థన మేరకు మళ్ళీ విడిచిపెట్టాడు. అలా గంగ రుషి పుత్రిక జాహ్నవి అయింది. వ్యాసాది కృపాలే... అని కూడా అన్నాడు.. వ్యాసమహర్షికి గంగానది అంటే ఎంత వ్యామోహమో! పరమశివుడు శపిస్తే... గంగను, కాశీని వదిలిపెట్టి పోవడానికి వ్యాసుడు క్షోభిల్లాడు.

గంగకు ఒకగొప్పదనం ఉంది. గంగావతరణమ్ గురించిగానీ, గంగను గురించిగానీ వింటే చాలు... అంటారు భీష్ముడు అనుశాసనిక పర్వంలో అంపశయ్య మీద పడుకుని ధర్మరాజుతో మాట్లాడుతూ –' 'గంగానది పేరు తలచుకోవడం గానీ, గంగలో స్నానం చేయడం గానీ, ఒక చుక్క గంగనీటిని నాలుకమీద వేసుకోవడం గానీ చేయాలి. ఆచరించవలసినవే అయినప్పటికీ యజ్ఞయాగాదులకన్నా, బ్రహ్మచర్యం కన్నా, తపస్సుకన్నా, దానం కన్నా, గంగాస్నానం గొప్పది'' అంటాడు. కాశీఖండంలో శ్రీనాథుడు...''గౌరియొక్కతె యాకాశగంగ యొకతె/ కాశియొక్కతె దక్షిణకాశి యొకతె/నలుగురును శంభునకు లోకనాయకునకు/రాణి వాసంబులనురాగరసమ పేర్మి?'' అని అంటాడు భీమేశ్వర పురాణంలో. అంటే గౌరిని ఎంతగా ప్రేమిస్తాడో శంకరుడికి గంగ, కాశి, దక్షిణ కాశి అన్నా కూడా అంతే అనురాగమట.

ఎవరయితే భక్తితో గంగానది పేరు తలచుకుని ఒక్క గంగనీటి చుక్కను నాలుకమీద వేసుకుంటారో వారికి యమధర్మరాజుతో సంవాదం లేదన్నారు. అంటే వారికి యమదూతల దర్శనం ఉండే అవకాశం లేదు. అంతగొప్పగా గంగానదీ వైభవాన్ని కీర్తించిన ముత్తుస్వామి దీక్షితార్ వారి నోట కీర్తనల రూపంలో ప్రవహించిన శాబ్దికగంగను కూడా మనం నిత్యం వింటూ ఉండాలి.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

సినిమా

సెట్ వర్క్ స్టార్ట్



మహేశ్‌బాబు హీరోగా రాజమౌళి దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న సంగతి తెలిసిందే. ఫారెస్ట్ అడ్వెంచరస్ యాక్షన్ డ్రామాగా తెరకెక్కనున్న ఈ సినిమాను కేఎల్ నారాయణ నిర్మిస్తారు. ఈ సినిమా కథను ఆల్రెడీ రచయిత విజయేంద్ర ప్రసాద్ పూర్తి చేశారు. ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ పూర్తి కావొచ్చాయట. కాగా ఈ సినిమా ప్రారంభోత్సవం ఈ ఉగాదికి జరుగుతుందనే టాక్ ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తోంది. తాజాగా ఈ సినిమాకు సంబంధించిన సెట్ వర్క్ హైదరాబాద్ శివార్లలోని ప్రాంతాల్లో మొదలైందని, మే కల్లా ఈ భారీ సెట్ వర్క్ పూర్తయ్యేలా టీమ్ టార్గెట్‌గా పెట్టుకున్నారని ఫిల్మ్‌నగర్ భోగట్టా. జూన్ చివర్లో లేదా జులై మొదటివారంలో ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ మొదలయ్యేలా రాజమౌళి అండ్ కో సన్నాహాలు చేస్తున్నారని సమాచారం. ఈ సినిమాకు ఎమ్ఎమ్ కీరవాణి సంగీతం అందించనున్నారు.

● మహేశ్ బాబు

కల నిజమైంది

హీరో విశాల్ దర్శకుడిగా మారారు. 2017లో విశాల్ హీరోగా నటించి, నిర్మించిన చిత్రం 'తుప్పరివాలన్' (తెలుగులో 'డిటెక్టివ్'). మిస్కిన్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం అప్పట్లో బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. ఈ సినిమాకు సీక్వెల్‌గా 'డిటెక్టివ్ 2'ను ప్లాన్ చేశారు విశాల్. అయితే కొంతకాలం క్రితం క్రియేటివ్ డిఫరెన్సెస్ వల్ల ఈ ప్రాజెక్ట్ నుంచి మిస్కిన్ తప్పుకున్నారు. దీంతో 'డిటెక్టివ్ 2' కోసం విశాల్ దర్శకుడిగా మారారు. ''డైరెక్టర్ కావాలన్న నా కల నిజమైంది. నా దర్శకత్వంలో రానున్న తొలి సినిమా 'తుప్పరివాలన్ 2'. ఈ సినిమా కోసం లండన్ వెళ్తున్నాను. అజర్‌బైజాన్, మల్టా లొకేషన్స్‌లో చిత్రీకరణ జరుగుతుంది. నా కలను నాకు మరింత చేరువ చేసిన మిస్కిన్‌గారికి ధన్యవాదాలు'' అంటూ 'ఎక్స్'లో షేర్ చేశారు విశాల్. ఇక విశాల్ నటించిన లేటెస్ట్ మూవీ 'రత్నం' ఏప్రిల్ 26న విడుదల కానుంది. హరి దర్శకత్వం వహించిన ఈ సినిమాకు దేవిశ్రీ ప్రసాద్ మ్యూజిక్ డైరెక్టర్.



● విశాల్

చలో గోవా

గోవాకు వెళ్లనున్నారట దేవర. ఎన్టీఆర్ హీరోగా కొరటాల శివ దర్శకత్వంలో తెరకెక్కుతున్న యాక్షన్ చిత్రం 'దేవర'. ఇందులో జాన్వీకపూర్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. కల్యాణ్‌రామ్, కె.హరికృష్ణ, మిక్కిలినేని సుధాకర్ నిర్మిస్తున్న ఈ సినిమా రెండు భాగాలుగా విడుదలకానుంది. తొలి భాగం ఈ ఏడాది అక్టోబరు 10న విడుదల కానుంది. కాగా 'దేవర' సినిమా యూనిట్ పాటల చిత్రీకరణ కోసం గోవా వెళ్లనున్నారని ఫిల్మ్‌నగర్ సమాచారం. అతి త్వరలో ఈ షెడ్యూల్ ప్రారంభం కానుంది తెలిసింది. గోవా షెడ్యూల్‌లో ఎన్టీఆర్, జాన్వీలపై కొన్ని కీలక సన్నివేశాలతో పాటు ఓ పాట చిత్రీకరిస్తారట మేకర్స్. ఈ సినిమాకు అనిరుధ్ రవిచంద్రన్ మ్యూజిక్ డైరెక్టర్.



● ఎన్టీఆర్

స్నేహానికి హద్దు లేదురా!



● ఆశిష్ గాంధీ, ఎస్తేర్

''ఏ దర్శకుడికైనా ఫస్ట్ మూవీ బర్త్ లాంటిది. నా తొలి చిత్రం 'డాన్ శ్రీను' ని ఇప్పటికీ మర్చిపోలేను. మనమేంటో ఇండస్ట్రీకి తెలియజేసేదే తొలి సినిమా. 'హద్దు లేదురా' చిత్రం ట్రైలర్ చూస్తుంటే రాజశేఖర్ తొలిసారి దర్శకత్వం వహించినట్లు అనిపించడం లేదు. ఈ మూవీ మంచి విజయం సాధిస్తుందనే నమ్మకం ఉంది'' అని డైరెక్టర్ గోపీచంద్ మలినేని అన్నారు. ఆశిష్ గాంధీ, అశోక్ హీరోలుగా, వర్ష, ప్రాతిక హీరోయిన్లుగా, ఎస్తేర్ అతిథి పాత్రలో నటించిన చిత్రం 'హద్దు లేదురా'. రాజశేఖర్ రావి దర్శకత్వంలో వీరేష్ గాజుల బళ్లారి నిర్మించారు. రావి మోహన్‌రావు సహ నిర్మాతగా వ్యవహరించిన ఈ మూవీ ఈ నెల 21న విడుదల కానుంది. ఈ చిత్రం ట్రైలర్ లాంచ్ ఈవెంట్‌కి గోపీచంద్ మలినేని ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ''స్నేహం నేపథ్యంలో రూపొందిన చిత్రమిది'' అన్నారు రాజశేఖర్ రావి. ''సినిమా చాలా బాగా వచ్చింది. ప్రేక్షకులు మా యూనిట్‌ని ప్రోత్సహించాలి'' అన్నారు వీరేష్ గాజుల బళ్లారి. నటీనటులు ఆశిష్ గాంధీ, తనికెళ్ల భరణి, రాధా మనోహర్ దాస్, ఎస్తేర్ మాట్లాడారు.

ముచ్చటగా మూడోసారి

● నిఖిల్



హీరో నిఖిల్ సిద్ధార్థ్, దర్శకుడు చందూ మొండేటిలది హిట్ కాంబినేషన్. వీరిద్దరి కలయికలో వచ్చిన తొలి చిత్రం 'కార్తికేయ'(2014) సూపర్ హిట్‌గా నిలిచింది. అలాగే వీరి కాంబోలో వచ్చిన ద్వితీయ సినిమా 'కార్తికేయ 2' (2022) పాన్ ఇండియా స్థాయిలో బ్లాక్ బస్టర్ అయింది. దీంతో 'కార్తికేయ 3' సినిమాకి సంబంధించిన అప్‌డేట్స్ కోసం ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు.. తాజాగా వారి ఎదురుచూపులకు ఫుల్‌స్టాప్ పడింది. నిఖిల్, చందూ కలయిక ముచ్చటగా మూడోసారి రిపీట్ అవుతోంది. 'కార్తికేయ 3' సినిమా రూపొందనున్నట్లు స్పష్టత ఇచ్చారు నిఖిల్. ''దర్శకుడు చందూ మొండేటి అడ్వెంచరస్ థ్రిల్లర్ మూడవ ఫ్రాంచైజీకి (కార్తికేయ 3) సంబంధించిన స్క్రిప్ట్ వర్క్‌పై పని చేస్తున్నారు. 'కార్తికేయ 3' స్పాన్, స్కేల్ పరంగా చాలా పెద్దగా ఉండబోతోంది. డా.కార్తికేయ సరికొత్త సాహసం త్వరలోనే ప్రారంభం కానుంది'' అన్నారు మేకర్స్. కాగా ప్రస్తుతం నిఖిల్ హీరోగా నటిస్తున్న 'స్వయంభూ' సినిమా చిత్రీకరణ శరవేగంగా జరుపుకుంటోంది. మరోవైపు నాగచైతన్య హీరోగా 'తండేల్' సినిమాతో బిజీగా ఉన్నారు చందూ మొంటేటి.



ఆ ఇమేజ్ అంటే భయం

– ప్రియదర్శి

''నటుడిగా ఉంటే విభిన్నరకాలైన పాత్రలు చేయవచ్చు. అవకాశాలు కూడా ఎక్కువగా వస్తాయి. ఇలా కాకుండా నన్ను నేను ఓ హీరోగా అనుకుంటే ఓ డిఫరెంట్ ఇమేజ్‌లోకి వెళ్లాల్సి ఉంటుంది. ఆ ఇమేజ్ అంటే నాకు భయం. 'మల్లేశం' సినిమా తర్వాత నేను దాదాపు 40 కథలు విన్నాను. ఈ కథల్లో ఓ నటుడిగా నన్ను నేను ఊహించుకోలేకపోయాను. దీంతో 'జాతి రత్నాలు' సినిమాలో నటించాను. 'మంగళవారం' సినిమాలో కూడా నాది హీరో రోల్ అనుకోవడం లేదు. దర్శక-నిర్మాతలు డిఫరెంట్ రోల్స్ ఇస్తున్నారంటే నా అదృష్టంగా భావిస్తున్నాను'' అని ప్రియదర్శి అన్నారు. శ్రీ విష్ణు, ప్రియదర్శి, రాహుల్ రామకృష్ణ ప్రధాన పాత్రల్లో హర్ష కొనుగంటి దర్శకత్వంలో రూపొందిన సినిమా 'ఓం భీమ్ బుష్'. యూవీ క్రియేషన్స్ సమర్పణలో వీ సెల్యులాయిడ్, సునీల్ బలుసు నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 22న విడుదల కానుంది. ప్రియదర్శి మాట్లాడుతూ– ''ముగ్గురు పీహెచ్‌డీ స్కాలర్స్ కథే ఈ చిత్రం. ఓ మంచి పాయింట్‌ను టచ్ చేశాం. ప్రస్తుతం'గేమ్ చేంజర్' మూవీలో ఓ పాత్ర చేస్తున్నాను. నేను, నభానటేష్ లీడ్స్‌గా ఓ మూవీ చేస్తున్నాం'' అన్నారు.

ప్రజాకవి కాళోజీకి మరో అవార్డు

ప్రముఖ కవి, పద్మవిభూషణ్ కాళోజీ నారాయణరావు బయోపిక్‌గా రూపొందించిన చిత్రం 'ప్రజాకవి కాళోజీ'. మూలవిరాట్ (అశోక్ రెడ్డి) టైటిల్ రోల్‌లో నటించారు. డాక్టర్ ప్రభాకర్ జైనీ దర్శకత్వంలో జైనీ క్రియేషన్స్‌పై విజయలక్ష్మీ జైనీ నిర్మించిన ఈ సినిమా గత ఏడాది విడుదలైంది. ఇప్పటికే పలు అవార్డులు సాధించిన ఈ మూవీ తాజాగా ఇండియన్ వరల్డ్ ఫిలిం ఫెస్టివల్ 2024లో ఫీచర్ ఫిక్షన్ కేటగిరీలో స్పెషల్ జ్యూరీ అవార్డు సొంతం చేసుకుంది. ఈ అవార్డును ప్రభాకర్ జైనీ స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ–''కాళోజీ నారాయణరావుగారి జీవిత విశేషాలతో 'ప్రజాకవి కాళోజీ' మూవీ తీసినందుకు చిత్రసీమకు చెందిన అనేక మంది ప్రముఖులు నన్ను ప్రశంసించారు. ఒక కవి మీద సినిమా తీయడం చాలా సాహసమని కొనియాడారు. మా సినిమాకి మొత్తం 8 అవార్డులు రావడం హ్యాపీ'' అన్నారు.



● అవార్డు అందుకుంటున్న ప్రభాకర్ జైనీ

భయ్యాజీ వస్తున్నాడు



● మనోజ్

బాలీవుడ్ నటుడు మనోజ్ బాజ్‌పేయి హీరోగా నటిస్తున్న తాజా హిందీ చిత్రానికి 'భయ్యాజీ' అనే టైటిల్ ఖరారైంది. 'సిర్ఫ్ ఏక్ బందా కాఫీ హై' (2023) సినిమా తర్వాత మనోజ్ బాజ్‌పేయి, దర్శకుడు అపూర్వ్‌సింగ్ కర్కీ కాంబినేషన్‌లో వస్తున్న సినిమా ఇది. ఈ సినిమా షూటింగ్ పూర్తయిందని బాలీవుడ్ సమాచారం. కాగా ఇటీవల ఈ సినిమా ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు మేకర్స్. అలాగే ఈ సినిమా టీజర్‌ను ఈ నెల 20న, సినిమాను మే 24న విడుదల చేయనున్నట్లుగా మేకర్స్ ప్రకటించారు. కాగా 'భయ్యాజీ' చిత్రం మనోజ్ బాజ్‌పేయి కెరీర్‌లో వందో చిత్రం కావడం విశేషం.



భారత ఆర్చరీ జట్టులో ధీరజ్, జ్యోతి సురేఖ

ఈ ఏడాది జరిగే మూడు ప్రపంచకప్ టోర్నీలలో పాల్గొనే భారత ఆర్చరీ జట్లను ఆదివారం ఎంపిక చేశారు. భారత ఆర్చరీ సంఘం (ఏఏఐ) ఆధ్వర్యంలో హరియాణాలోని సోనిపట్‌లో సెలెక్షన్ ట్రయల్స్ నిర్వహించారు. పురుషుల రికర్వ్ విభాగంలో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన బొమ్మదేవర ధీరజ్ ట్రయల్స్‌లో అగ్రస్థానంలో నిలిచి జాతీయ జట్టులో తన స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. విజయవాడకు చెందిన ధీరజ్ ఇప్పటికే పారిస్ ఒలింపిక్స్ బెర్త్ కూడా దక్కించుకున్నాడు. ధీరజ్‌తోపాటు తరుణ్‌దీప్ రాయ్, ప్రవీణ్ జాదవ్, మృణాల్ చౌహాన్ భారత రికర్వ్ జట్టులో చోటు సంపాదించారు. భారత మహిళల రికర్వ్ జట్టులో 'ట్రిపుల్ ఒలింపియన్' దీపిక కుమారి, భజన్ కౌర్, అంకిత, కోమలిక ఎంపికయ్యారు. మరోవైపు ఒలింపిక్ ఈవెంట్‌కాని కాంపౌండ్ విభాగంలో భారత మహిళల జట్టులో ఆంధ్రప్రదేశ్ అమ్మాయి వెన్నం జ్యోతి సురేఖతోపాటు అదితి స్వామి, పర్ణీత్ కౌర్, అవనీత్ కౌర్ చోటు సంపాదించారు. పురుషుల కాంపౌండ్ జట్టులో ప్రథమేశ్, అభిషేక్ వర్మ, రజత్ చౌహాన్, ప్రియాంశ్ ఎంపికయ్యారు. ప్రపంచకప్ తొలి టోర్నీకి ఏప్రిల్ 23 నుంచి 28 వరకు షాంఘై ఆతిథ్యమిస్తుంది. ప్రపంచకప్ రెండో టోర్నీ మే 21 నుంచి 26 వరకు యోచోన్‌లో, ప్రపంచకప్ మూడో టోర్నీ జూన్ 18 నుంచి 24 వరకు అంటాల్యాలో జరుగుతాయి.



16 ఏళ్ల రికార్డు బద్దలు

పురుషుల 10,000 మీటర్ల విభాగంలో గుల్‌వీర్ ఘనత



న్యూఢిల్లీ: ఆసియా క్రీడల కాంస్య పతక విజేత, భారత అథ్లెట్ గుల్‌వీర్ సింగ్ పురుషుల 10,000 మీటర్ల విభాగంలో కొత్త జాతీయ రికార్డు నెలకొల్పాడు. అమెరికాలోని కాలిఫోర్నియాలో జరిగిన 'ద టెన్' అథ్లెటిక్స్ మీట్‌లో 25 ఏళ్ల గుల్‌వీర్ ఈ ఘనత సాధించాడు. గుల్‌వీర్ తాను పాల్గొన్న హీట్స్‌లో 10,000 మీటర్లను 27 నిమిషాల 41.81 సెకన్లలో పూర్తి చేసి రెండో స్థానంలో నిలిచాడు. ఈ క్రమంలో 16 ఏళ్లుగా సురేందర్ సింగ్ (28ని:02.89 సెకన్లు) పేరిట ఉన్న జాతీయ రికార్డును గుల్‌వీర్ తిరగరాశాడు. గుల్‌వీర్ కొత్త జాతీయ రికార్డు సృష్టించినా పారిస్ ఒలింపిక్స్ (27 నిమిషాలు) అర్హత ప్రమాణ సమయాన్ని అధిగమించలేకపోయాడు.

రన్నరప్ రష్మిక



ఇండోర్: అంతర్జాతీయ టెన్నిస్ సమాఖ్య (ఐటీఎఫ్) సర్క్యూట్‌లో రెండో సింగిల్స్ టైటిల్ సాధించాలని ఆశించిన హైదరాబాద్ యువ తార భమిడిపాటి శ్రీవల్లి రష్మికకు నిరాశ ఎదురైంది. ఆదివారం ముగిసిన డబ్ల్యూ35 ఐటీఎఫ్ టోర్నీలో 22 ఏళ్ల రన్నరప్‌గా నిలిచింది. రెండో సీడ్ దలీలా జకుపోవిచ్ (స్లొవేనియా)తో జరిగిన మహిళల సింగిల్స్ ఫైనల్లో రష్మిక 3–6, 2–6తో ఓడిపోయింది. 67 నిమిషాలపాటు జరిగిన తుది పోరులో రష్మికకు ప్రత్యర్థి సర్వీస్‌ను బ్రేక్ చేసేందుకు తొమ్మిదిసార్లు అవకాశం వచ్చినా ఆమె ఒకసారి మాత్రమే సద్వినియోగం చేసుకుంది. మరోవైపు రష్మిక తన సర్వీస్‌ను నాలుగుసార్లు కోల్పోయింది. ఫైనల్ చేరే క్రమంలో రష్మిక టాప్ సీడ్, ఐదో సీడ్, ఏడో సీడ్ క్రీడాకారిణులను ఓడించడం విశేషం. ఈ టోర్నీ ప్రదర్శనతో రష్మిక నేడు విడుదల చేసే మహిళల టెన్నిస్ సంఘం (డబ్ల్యూటీఏ) సింగిల్స్ ర్యాంకింగ్స్‌లో కెరీర్ బెస్ట్ 428వ ర్యాంక్‌కు చేరుకుంటుంది.

బెంగళూరు మురిసింది

డబ్ల్యూపీఎల్ చాంపియన్ ఆర్‌సీబీ

- ఫైనల్లో ఢిల్లీపై ఘనవిజయం
- శ్రేయాంక, మోలినెక్స్ మాయాజాలం



రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) ఫ్రాంచైజీ 2008 నుంచి ఇండియన్ ప్రీమియర్ లీగ్ (ఐపీఎల్)లో ఆడుతోంది. మూడుసార్లు ఫైనల్లోకి వచ్చినా... మూడుసార్లూ తుదిపోరులో ఓడిపోయి టైటిల్‌ను అందుకోలేకపోయింది. ఇదే ఆర్‌సీబీ ఫ్రాంచైజీ గత ఏడాది మొదలైన మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్)లో అడుగు పెట్టింది. తొలి సీజన్‌లో నాలుగో స్థానంతో నిరాశపరిచింది. అయితే ఏడాది తిరిగేలోపు బెంగళూరు మహిళల జట్టు అద్భుతం చేసింది. ఐపీఎల్‌లో పురుషుల జట్టుకు అందని ద్రాక్షగా ఊరిస్తున్న టైటిల్‌ను డబ్ల్యూపీఎల్‌లో మెరిపించే ఆటతీరుతో బెంగళూరు టైటిల్‌ను సొంతం చేసుకుంది. తమ ఫ్రాంచైజీకి డబ్ల్యూపీఎల్ టైటిల్ దక్కడంతో ఐపీఎల్ ఆర్‌సీబీ స్టార్స్ విరాట్ కోహ్లి, గ్లెన్ మ్యాక్స్‌వెల్, మాజీ సభ్యులు క్రిస్ గేల్, ఏబీ డివిలియర్స్, మాజీ యాజమాని విజయ్ మాల్యా తదితరులు అభినందనలు తెలిపారు.

న్యూఢిల్లీ: మహిళల ప్రీమియర్ లీగ్ (డబ్ల్యూపీఎల్) రెండో సీజన్‌లో రాయల్ చాలెంజర్స్ బెంగళూరు (ఆర్‌సీబీ) జట్టు విజేతగా నిలిచింది. ఫైనల్లో ఢిల్లీ క్యాపిటల్స్‌ను మొదట స్పిన్‌తో కట్టడి చేసి... ఆ తర్వాత జాగ్రత్తగా లక్ష్యాన్ని ఛేదించేసి 8 వికెట్లతో బెంగళూరు గెలిచింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్ ఎంచుకున్న ఢిల్లీ క్యాపిటల్స్ 18.3 ఓవర్లలో 113 పరుగులకే కుప్పకూలింది. ఓపెనర్లలో షఫాలీ వర్మ (27 బంతుల్లో 44; 2 ఫోర్లు, 3 సిక్స్‌లు) దంచేయగా... కెప్టెన్ మెగ్ లానింగ్ (23 బంతుల్లో 23; 3 ఫోర్లు) కాస్త మెరుగ్గా ఆడింది. తర్వాత ఇంకెవరూ 12 పరుగులకు మించి చేయలేకపోయారు. స్పిన్నర్లు శ్రేయాంక పాటిల్ (3.3–0–12–4), సోఫీ మోలినెక్స్ (3/20), ఆశ శోభన (2/14) ఢిల్లీని దెబ్బ కొట్టారు. అనంతరం బెంగళూరు 19.3 ఓవర్లలో రెండే వికెట్లు కోల్పోయి 115 పరుగులు చేసి గెలిచింది. టాపార్డర్ బ్యాటర్లు స్మృతి మంధాన (39 బంతుల్లో 31; 3 ఫోర్లు), సోఫీ డివైన్ (27 బంతుల్లో 32; 5 ఫోర్లు, 1 సిక్స్), ఎలీస్ పెరీ (37 బంతుల్లో 35 నాటౌట్; 4 ఫోర్లు) రాణించారు. 'ప్లేయర్ ఆఫ్ ద ఫైనల్' పురస్కారం సోఫీ మోలినెక్స్‌కు దక్కింది. విజేతగా నిలిచిన బెంగళూరు జట్టుకు రూ. 6 కోట్లు ప్రైజ్‌మనీ లభించింది. గత సీజన్ మాదిరిగానే ఈసారీ ఢిల్లీ క్యాపిటల్స్ పాయింట్ల పట్టికలో అగ్రస్థానంలో నిలిచి, ఆ తర్వాత ఫైనల్లో ఓడిపోయి రన్నరప్‌తో సరిపెట్టుకోవడం గమనార్హం.

ధనాధన్... ఫటాఫట్!

ఢిల్లీ ఓపెనర్లు షఫాలీ వర్మ, మెగ్‌లానింగ్ ఆరంభంలో ధాటిగా చెలరేగిపోయారు. ముఖ్యంగా పవర్‌ప్లేలో షఫాలీ భారీ సిక్సర్లతో విరుచుకుపడింది. కెప్టెన్ లానింగ్ ఫోర్లతో వేగాన్ని పెంచింది. 6 ఓవర్లలో ఢిల్లీ 61/0 స్కోరు చేసింది. బ్యాటింగ్ పవర్‌ప్లే తర్వాత బౌలింగ్ పవర్‌ప్లే మొదలైనట్లుగా ఢిల్లీ వికెట్లు ఫటాఫట్ కూలాయి. 8వ ఓవర్ వేసిన స్పిన్నర్ సోఫీ మోలినెక్స్ 4 బంతుల్లో 3 వికెట్లు తీసింది. షఫాలీ, కీలకమైన వన్‌డౌన్ బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ (0), క్యాప్సీ (0) వికెట్లను సోఫీ పడగొట్టింది. 64 పరుగుల వద్దే ఈ మూడు వికెట్లు పడ్డాయి. 11వ ఓవర్ నుంచి శ్రేయాంక, ఆశ శోభన తిప్పేయడంతో లానింగ్, మరిజన్ కాప్ (8), జెస్ జొనాసెన్ (3), మిన్ను మణి (5) స్వల్ప వ్యవధిలోనే పెవిలియన్ చేరారు. రాధా యాదవ్ (12; 2 ఫోర్లు) బౌండరీలతో జట్టు స్కోరు 100 దాటాక... మోలినెక్స్ డైరెక్ట్ త్రోకు రాధ రనౌటైంది. 19వ ఓవర్ వేసిన శ్రేయాంక రెండో బంతికి అరుంధతి రెడ్డిని (10), మూడో బంతికి తానియా (0)ను అవుట్ చేయడంతో క్యాపిటల్స్ ఆలౌటైంది. పవర్‌ప్లే తర్వాత ఢిల్లీకి ఏకంగా 47 బంతుల పాటు బౌండరీ గగనమైంది.

రాణించిన పెరీ, సోఫీ డివైన్

లక్ష్యం చిన్నదే అయినా... టైటిల్ పోరులో బెంగళూరు ఓపెనర్లు సోఫీ డివైన్, స్మృతి మంధాన అనవసర షాట్లకు వెళ్లకుండా జాగ్రత్తగా పరుగుల్ని రాబట్టారు. దీంతో 6 ఓవర్లలో బెంగళూరు 25/0 స్కోరే చేసింది. అడపాదడపా బౌండరీలతో వేగం పెంచిన సోఫీ డివైన్ జట్టు స్కోరు 49 పరుగుల వద్ద శిఖా పాండే బౌలింగ్‌లో అవుటైంది. కెప్టెన్ స్మృతికి పెరీ జతవ్వగా ఈ జోడీ కూడా నింపాదిగానే పరుగుల్ని చక్కబెట్టింది. స్వభావానికి విరుద్ధంగా నెమ్మదిగా ఆడిన స్మృతికి మిన్ను మణి చెక్ పెట్టింది. అయితే అప్పటికే బెంగళూరు 82/2 స్కోరుకు చేరింది. మిగతా పరుగుల్ని పెరీ, రిచా ఘోష్ (17 నాటౌట్, 2 ఫోర్లు) పూర్తిచేయడంతో బెంగళూరు 3 బంతులు మిగిలుండగానే ట్రోఫీ గెలిచింది.

స్కోరు వివరాలు

ఢిల్లీ క్యాపిటల్స్ ఇన్నింగ్స్: మెగ్ లానింగ్ (ఎల్బీడబ్ల్యూ) (బి) శ్రేయాంక 23; షఫాలీ వర్మ (సి) వేర్‌హమ్ (బి) సోఫీ మోలినెక్స్ 44; జెమీమా (బి) సోఫీ మోలినెక్స్ 0; క్యాప్సీ (బి) సోఫీ మోలినెక్స్ 0; మరిజన్ కాప్ (సి) సోఫీ డివైన్ (బి) ఆశ 8; జెస్ జొనాసెన్ (సి) స్మృతి (బి) ఆశ 3; రాధా యాదవ్ (రనౌట్) 12; మిన్ను మణి (ఎల్బీడబ్ల్యూ) (బి) శ్రేయాంక 5; అరుంధతి (బి) శ్రేయాంక 10, శిఖా పాండే (నాటౌట్) 5; తానియా భాటియా (సి) రిచా ఘోష్ (బి) శ్రేయాంక 0; ఎక్స్‌ట్రాలు 3; **మొత్తం (18.3 ఓవర్లలో ఆలౌట్) 113. వికెట్ల పతనం:** 1–64, 2–64, 3–64, 4–74, 5–80, 6–81, 7–87, 8–101, 9–113, 10–113. **బౌలింగ్:** రేణుక సింగ్ 2–0–28–0, సోఫీ మోలినెక్స్ 4–0–20–3, ఎలీస్ పెరీ 2–0–14–0, సోఫీ డివైన్ 1–0–9–0, వేర్‌హమ్ 3–0–16–0, శ్రేయాంక పాటిల్ 3.3–0–12–4, ఆశ శోభన 3–0–14–2.

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు ఇన్నింగ్స్: స్మృతి (సి) అరుంధతి (బి) మిన్ను మణి 31; సోఫీ డివైన్ (ఎల్బీడబ్ల్యూ) (బి) శిఖా పాండే 32; ఎలీస్ పెరీ (నాటౌట్) 35; రిచా ఘోష్ (నాటౌట్) 17; ఎక్స్‌ట్రాలు 0; **మొత్తం (19.3 ఓవర్లలో 2 వికెట్లకు) 115. వికెట్ల పతనం:** 1–49, 2–82. **బౌలింగ్:** మరిజన్ కాప్ 4–0–20–0, క్యాప్సీ 3–0–13–0, శిఖా పాండే 4–0–11–1, రాధ 1–0–18–0, అరుంధతి 3.3–0–26–0, జొనాసెన్ 2–0–15–0, మిన్ను మణి 2–0–12–1.

డబ్ల్యూపీఎల్-2024 అవార్డులు

ఎమర్జింగ్ ప్లేయర్
శ్రేయాంక పాటిల్ (బెంగళూరు)

మోస్ట్ వాల్యూబుల్ ప్లేయర్
దీప్తి శర్మ (యూపీ)

బెస్ట్ క్యాచ్ ఆఫ్ ద టోర్నీ
సజన సజీవన్ (ముంబై)

ఫెయిర్ ప్లే టీమ్
రాయల్ చాలెంజర్స్ బెంగళూరు

ఆరెంజ్ క్యాప్ (లీగ్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్)
ఎలీస్ పెరీ (బెంగళూరు) 347 పరుగులు

పర్పుల్ క్యాప్ (లీగ్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్)
శ్రేయాంక పాటిల్ (బెంగళూరు) 13 వికెట్లు

66 లీగ్‌లో కొట్టిన సిక్స్‌లు

295 లీగ్‌లో కొట్టిన ఫోర్లు

రూ. 6 కోట్లు విజేత బెంగళూరు జట్టుకు లభించిన ప్రైజ్‌మనీ

స్వదేశానికి కోహ్లి



న్యూఢిల్లీ: భారత స్టార్ క్రికెటర్ విరాట్ కోహ్లి ఆదివారం స్వదేశానికి చేరుకున్నాడు. లండన్ నుంచి ముంబైకి వచ్చిన క్రికెటర్ ఒకట్రెండు రోజుల్లో ఐపీఎల్ 17వ సీజన్ కోసం రాయల్ చాలెంజర్స్ బెంగళూరు శిబిరంలో పాల్గొంటాడు. వ్యక్తిగత కారణాలతో 'కింగ్ కోహ్లి' సొంతగడ్డపై ఇంగ్లండ్‌తో ఐదు టెస్టుల సిరీస్‌కు దూరంగా ఉన్నాడు.

శ్రీనిధి డెక్కన్ జట్టును గెలిపించిన ఒలివేరా



కొడుమన్ (కేరళ): ఐ–లీగ్ జాతీయ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌లో హైదరాబాద్‌కు చెందిన శ్రీనిధి డెక్కన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఎఫ్‌సీ) జట్టు ఖాతాలో 12వ విజయం చేరింది. గోకులం కేరళ ఎఫ్‌సీ జట్టుతో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో శ్రీనిధి డెక్కన్ జట్టు 2–1 గోల్స్ తేడాతో గెలిచింది. ఆట 44వ నిమిషంలో నికోలా స్టొజనోవిచ్ గోల్‌తో గోకులం కేరళ జట్టు 1–0తో ఆధిక్యంలోకి వెళ్లింది. అయితే శ్రీనిధి తరఫున విలియమ్ అల్వెస్ డి ఒలివేరా (47వ ని.లో, 71వ ని.లో) రెండు గోల్స్ సాధించి తమ జట్టును విజయతీరాలకు చేర్చాడు. ప్రస్తుతం శ్రీనిధి జట్టు 39 పాయింట్లతో రెండో స్థానంలో ఉంది.

భవిత

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

విద్య, ఉద్యోగ సమాచారం

శ్రేష్ట(ఎన్ఈటీఎస్) పరీక్ష-2024

నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ).. నేషనల్ ఎంట్రన్స్ టెస్ట్ ఫర్ శ్రేష్ట-నెట్స్ 2024 పథకానికి ఎస్సీ బాల బాలికలు నుంచి దరఖాస్తులు కోరుతోంది. శ్రేష్ట(రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ ఫర్ స్టూడెంట్స్ ఇన్ హైస్కూల్ ఇన్ టార్గెటెడ్ ఏరియాస్)-2024 పరీక్షలో ఉత్తీర్ణులైన విద్యార్థులు సీబీఎస్ఈ అనుబంధ ప్రైవేట్ విద్యా సంస్థల్లో తొమ్మిది, పదకొండు తరగతుల్లో ప్రవేశాలు పొందవచ్చు. శ్రేష్ట పథకం ద్వారా దేశవ్యాప్తంగా 3000సీట్లు భర్తీ కానున్నాయి.

» **అర్హత:** 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఎనిమిదో, పదో తరగతి చదువుతున్న బాలబాలికలు అర్హులు. తల్లిదండ్రుల వార్షికాదాయం రూ.2.5 లక్షలకు మించకూడదు.
» **పరీక్ష విధానం:** పెన్ అండ్ పేపర్(ఆఫ్‌లైన్) విధానంలో పరీక్ష జరుగుతుంది. మొత్తం 100 మార్కులకు పరీక్ష ఉంటుంది. మ్యాథమేటిక్స్(30 మార్కులు), సైన్స్ (20 మార్కులు), సోషల్ సైన్స్(25 మార్కులు), జనరల్ అవేర్‌నెస్/నాలెడ్జ్(25 మార్కులు) సబ్జెక్ట్‌ల నుంచి ప్రశ్నలుంటాయి. పరీక్ష ప్రశ్నాపత్రం హిందీ, ఇంగ్లిష్ మాధ్యమంలో ఉంటుంది.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 04.04.2024
» **దరఖాస్తు సవరణ తేదీలు:** 06.04.2024 నుంచి 08.04.2024.
» **అడ్మిట్ కార్డ్స్ డౌన్‌లోడ్ ప్రారంభం:**12.05.2024
» **పరీక్ష తేది:** 24.05.2024 (మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు).
» **వెబ్‌సైట్:** https://exams.nta.ac.in/SHRESHTA

ఓఐసీఎల్, న్యూఢిల్లీలో 100 అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టులు

ది ఓరియంటల్ ఇన్సూరెన్స్ కంపెనీ లిమిటెడ్(ఓఐసీఎల్).. డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్(స్కేల్-1) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 100
» **విభాగాలు:** అకౌంట్స్,అక్చూరియల్,ఇంజనీరింగ్, ఇంజనీరింగ్(ఐటీ),మెడికల్ ఆఫీసర్,లీగల్.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్/బీడీఎస్, డిగ్రీ(లా), ఐసీఏఐ/ఐసీడబ్ల్యూఏఐ/బీకాం, ఎంబీఏ(ఫైనాన్స్), బీఈ/బీటెక్,ఎంఈ/ఎంటెక్ ఉత్తీర్ణులై ఉండాలి
» **వయసు:** 31.12.2023 నాటికి 21 నుంచి 30 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీ అభ్యర్థులకు గరిష్టంగా ఐదేళ్లు,ఓబీసీ అభ్యర్థులకు మూడేళ్లు, దివ్యాంగులకు పదేళ్ల సడలింపు ఉంటుంది.
» **వేతనం:** నెలకు రూ.50,925 నుంచి 96,765.
» **ఎంపిక విధానం:** ప్రిలిమినరీ టెస్ట్, మెయిన్ టెస్ట్, ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 21.03.2024.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 12.04.2024
» **వెబ్‌సైట్:** https://orientalinsurance.org.in

రైల్ కోచ్ ఫ్యాక్టరీ, కపుర్తలాలో 550 యాక్ట్ అప్రెంటిస్‌లు

కపుర్తలా(పంజాబ్)లోని రైల్ కోచ్ ఫ్యాక్టరీ(ఆర్‌సీఎఫ్).. యాక్ట్ అప్రెంటిస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 550
» **ట్రేడులు:** ఫిట్టర్, వెల్డర్, మెషినిస్ట్, పెయింటర్, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్, ఏసీ అండ్ రిఫ్రిజిరేటర్ మెకానిక్.
» **అర్హత:** మెట్రిక్యులేషన్, సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 31.03.2024 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్ల వయో సడలింపు ఉంటుంది.
» **ఎంపిక విధానం:** మెట్రిక్యులేషన్, ఐటీఐలో సాధించిన మార్కులు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 09.04.2024
» **వెబ్‌సైట్:** https://rcf.indianrailways.gov.in

తెలంగాణ టెట్-2024

తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ తెలంగాణ ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)–2024 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. అర్హులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

» **అర్హత:** డీఈఐఈడీ/డీఈడీ/బీఈడీ/లాంగ్వేజ్ పండిట్ ఉత్తీర్ణులైన అభ్యర్థులు అర్హులు. ప్రస్తుతం చివరి సంవత్సరం చదువుతున్నవారు కూడా అర్హులే.
» **పరీక్ష విధానం:** ఆన్‌లైన్‌లో కంప్యూటర్ ఆధారిత పరీక్ష(సీబీటీ) జరుగుతుంది. టెట్ పరీక్షలో పేపర్–1, పేపర్–2 ఉంటాయి. పేపర్–1 ఒకటి నుంచి ఐదో తరగతులకు బోధించే ఉపాధ్యాయులకు, పేపర్–2 ఆరు నుంచి పదో తరగతులకు బోధించే ఉపాధ్యాయులకు పరీక్ష నిర్వహిస్తారు. ఒక్కో పేపర్‌కు 150 మార్కులు. పరీక్ష సమయం 2 1/2 గంటలు.
» **అర్హతా మార్కులు:** అభ్యర్థులు జనరల్ కేటగిరీలో 90మార్కులు, బీసీలు 75 మార్కులు, ఎస్సీ/ఎస్టీ/దివ్యాంగులు 60 మార్కులు సాధిస్తే టీఆర్‌టీ–డీఎస్సీ రాసేందుకు అర్హత సాధిస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 27.03.2024
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 10.04.2024
» **పరీక్ష తేది:** 20.05.2024 నుంచి 03.06.2024 వరకు పరీక్షలు జరుగుతాయి.
» **వెబ్‌సైట్:** https://schooledu.telangana.gov.in/ISMS

సాయుధ బలగాల్లో ఎస్ఐ కొలువు

పోలీస్ జాబ్స్.. నేటి యువత క్రేజీ కెరీర్! ముఖ్యంగా సమాజంలోని క్షేత్రస్థాయిలో గుర్తింపు, గౌరవం లభించే సబ్ ఇన్‌స్పెక్టర్(ఎస్ఐ) పోస్టుల్లో చేరాలని ఎక్కువ మంది కోరుకుంటున్నారు. అలాంటి వారికి చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది!! దేశ అంతర్గత భద్రతలో కీలకమైన కేంద్ర సాయుధ దళాలు, ఢిల్లీ పోలీస్ విభాగంలో ఎస్ఐ పోస్టుల భర్తీకి.. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ) నోటిఫికేషన్ విడుదల చేసింది!! ఈ నేపథ్యంలో.. ఎస్ఎస్‌సీ తాజా నోటిఫికేషన్ సమాచారం, అర్హతలు, ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, ప్రిపరేషన్ తదితర వివరాలు...

» 4,187 ఎస్ఐ పోస్టుల భర్తీకి ఎస్ఎస్‌సీ నోటిఫికేషన్
» ఢిల్లీ పోలీస్, సాయుధ దళాల్లో పోస్టుల భర్తీ
» రాత పరీక్ష, ఫిజికల్ టెస్టుల ద్వారా ఎంపిక
» వేతన శ్రేణి: రూ.35,400 -రూ.1,12,400



మొత్తం 4,187 పోస్టులు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ తాజా నోటిఫికేషన్ ద్వారా ఢిల్లీ పోలీస్, కేంద్ర సాయుధ భద్రత బలగాలు (సీఏపీఎఫ్)కు సంబంధించి మొత్తం 4,187 పోస్టులను భర్తీ చేయనుంది. వీటిల్లో ఢిల్లీ పోలీస్ విభాగంలో ఎస్ఐ(ఎగ్జిక్యూటివ్)–పురుషులు– 125, ఎస్ఐ(ఎగ్జిక్యూటివ్)–మహిళలు–61 పోస్టులు ఉన్నాయి. అదేవిధంగా బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్–892(మహిళలకు 45) పోస్టులు, సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్–1,597(మహిళలకు 160), సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్–1,172 (మహిళలకు 59), ఇండో–టిబెటిన్ బోర్డర్ పోలీస్–278 (మహిళలకు 41), సశస్త్ర సీమాబల్: 62 (మహిళలకు 3) ఎస్ఐ పోస్టులు భర్తీ చేయనున్నారు.

అర్హతలు

- ఆగస్ట్ 1, 2024 నాటికి బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- **వయసు:** ఆగస్ట్ 1, 2024 నాటికి 20 నుంచి 25 ఏళ్ల మధ్యలో ఉండాలి. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు అయిదేళ్లు, ఓబీసీ వర్గాలకు మూడేళ్లు చొప్పున గరిష్ట వయో పరిమితిలో సడలింపు లభిస్తుంది.

నిర్దేశిత శారీరక ప్రమాణాలు

- ఢిల్లీ పోలీస్, సీఏపీఎఫ్ సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్ట్‌లకు దరఖాస్తు చేసుకునే అభ్యర్థులకు విద్యార్హతలు, వయో పరిమితితోపాటు నిర్దేశిత శారీరక ప్రమాణాలు కూడా ఉండాలి.
- పురుష అభ్యర్థులు కనీసం 170 సెంటీ మీటర్లు; మహిళా అభ్యర్థులు 157 సెంటీ మీటర్ల ఎత్తు ఉండాలి. పురుష అభ్యర్థులు 80 సెం.మీ; 85 సెం.మీ (శ్వాస పీల్చినప్పుడు) ఛాతి కొలత కలిగుండాలి. ఈ శారీరక ప్రమాణాలు కలిగున్న వారికే ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్ నిర్వహిస్తారు.

ప్రారంభ వేతన శ్రేణి

ఎస్ఎస్‌సీ ఢిల్లీ పోలీస్, సీఏపీఎఫ్ ఎస్ఐ ఉద్యోగాలకు ఎంపికైన వారికి పే లెవల్–6తో ప్రారంభ వేతన శ్రేణి లభిస్తుంది. నెలకు రూ.35,400–రూ.1,12,400తో ప్రారంభ వేతన శ్రేణి అందుతుంది. అదే విధంగా.. సీఏపీఎఫ్ ఎస్ఐ పోస్ట్‌లకు గ్రూప్–బి, ఢిల్లీ పోలీస్ ఎస్ఐ పోస్ట్‌లకు గ్రూప్–సి హోదా కల్పించారు. ఎస్ఐగా కొలువుదీరిన వారు సర్వీస్ నిబంధనలు, ప్రతిభ ఆధారంగా కమాండెంట్ స్థాయికి చేరుకునే అవకాశం ఉంది.

మూడంచెల ఎంపిక ప్రక్రియ

స్టాఫ్ సెలక్షన్ కమిషన్.. ఢిల్లీ పోలీస్, సీఏపీఎఫ్ విభాగాల్లోని ఎస్ఐ పోస్ట్‌లకు మూడు దశల్లో ఎంపిక ప్రక్రియ నిర్వహించనుంది. తొలుత పేపర్–1 రాత పరీక్ష ఉంటుంది. ఆ తర్వాత ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్ పేరిట దేహదారుఢ్య పరీక్షలు నిర్వహిస్తారు. అనంతరం పేపర్–2 రాత పరీక్ష నిర్వహిస్తారు. ఈ మూడు దశల్లోనూ విజయం సాధించి మెరిట్ జాబితాలో నిలిచిన వారికి.. చివరగా మెడికల్ ఎగ్జామినేషన్ నిర్వహించి నియామకాలు ఖరారు చేస్తారు.

200 మార్కులకు పేపర్-1

ఎంపిక ప్రక్రియలో తొలిదశ రాత పరీక్ష పేపర్–1ను నాలుగు విభాగాల్లో 200 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ (50 ప్రశ్నలు–50 మార్కులు), జనరల్ నాలెడ్జ్ అండ్ జనరల్ అవేర్‌నెస్ (50 ప్రశ్నలు–50 మార్కులు), క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ (50 ప్రశ్నలు–50 మార్కులు), ఇంగ్లిష్ కాంప్రహెన్షన్ (50 ప్రశ్నలు–50 మార్కులు) ఉంటాయి. మొత్తం 200 మార్కులకు పరీక్ష ఉంటుంది. ప్రశ్నలన్నీ ఆబ్జెక్టివ్ విధానంలోనే ఉంటాయి. రాత పరీక్ష ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కులు తగ్గిస్తారు. పరీక్షకు కేటాయించిన సమయం రెండు గంటలు.

ఫిజికల్ ఎండ్యూరెన్స్ సర్టిఫికెట్

పేపర్–1లో నిర్దిష్ట కటాఫ్ మార్కులు సాధించిన వారితో మెరిట్ జాబితా రూపొందించి.. నిర్దిష్ట నిష్పత్తిలో అభ్యర్థులను ఎంపిక చేసి.. రెండో దశలో దేహ దారుఢ్య పరీక్షలు నిర్వహిస్తారు. పలు ఫిజికల్ ఈవెంట్లలో అభ్యర్థులు తమ ప్రతిభ చూపాల్సి ఉంటుంది.

పేపర్-2 ఇలా

ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్‌లో భాగంగా ఫిజికల్ ఈవెంట్లలో విజయం సాధించిన వారికి తదుపరి దశలో పేపర్–2 పేరుతో మరో రాత పరీక్ష నిర్వహిస్తారు. ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్ అనే ఒకే విభాగంలో 200 ప్రశ్నలు–200 మార్కులకు ఈ పరీక్ష ఉంటుంది. దీనికి కూడా రెండు గంటల సమయం కేటాయిస్తారు. పేపర్–1, పేపర్–2 రెండూ ఆబ్జెక్టివ్ విధానంలోనే బహుళైచ్ఛిక ప్రశ్నలతో ఉంటాయి.

ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలి.
- **ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2024, మార్చి 28
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ అవకాశం:** మార్చి 30, 31 తేదీల్లో
- **ఆన్‌లైన్ పరీక్ష తేదీలు:** మే 9, 10, 13 తేదీల్లో
- **వెబ్‌సైట్:** https://ssc.gov.in

రాత పరీక్షలో రాణించేలా

జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్

ఈ విభాగంలో రాణించేందుకు వెర్బల్, నాన్–వెర్బల్ రీజనింగ్ అంశాలపై పట్టు సాధించాలి. స్పేస్ విజువలైజేషన్, సిమిలారిటీస్ అండ్ డిఫరెన్సెస్, అనాలజీస్, ప్రాబ్లమ్ సాల్వింగ్ అనాలిసిస్, విజువల్ మెమొరీ, అబ్జర్వేషన్, క్లాసిఫికేషన్స్, నంబర్ సిరీస్, కోడింగ్–డీకోడింగ్, నంబర్ అనాలజీ, ఫిగరల్ అనాలజీ, వర్డ్ బిల్డింగ్, వెన్ డయాగ్రమ్స్ వంటి అంశాలపై దృష్టి పెట్టాలి.

జనరల్ నాలెడ్జ్ అండ్ జనరల్ అవేర్‌నెస్

సామాజిక అవగాహనను పరీక్షించే విధంగా ప్రశ్నలు అడిగే ఈ విభాగంలో రాణించాలంటే.. భారతదేశ చరిత్ర, జాగ్రఫీ, ఎకానమీ, పాలిటీ, రాజ్యాంగం, శాస్త్రీయ పరిశోధనలు వంటి అంశాలపై దృష్టి పెట్టాలి. అదే విధంగా ఇటీవల కాలంలో ప్రాధాన్యం సంతరించుకుంటున్న సమకాలీన అంశాలపై అవగాహన ఏర్పరచుకోవాలి.

క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్

ఈ విభాగంలో బెస్ట్ స్కోర్ కోసం ప్యూర్ మ్యాథ్స్‌తోపాటు అర్థ గణిత అంశాలపై దృష్టి పెట్టాలి. డెసిమల్స్, ఫ్రాక్షన్స్, నంబర్స్, పర్సంటేజెస్, రేషియోస్, ప్రపోర్షన్స్, స్క్వేర్ రూట్స్, యావరేజస్, ప్రాఫిట్ అండ్ లాస్, ఆల్జీబ్రా, లీనియర్ ఈక్వేషన్స్, ట్రయాంగిల్స్, సర్కిల్స్, టాంజెంట్స్, ట్రిగ్నోమెట్రీలపై పట్టు సాధించాలి.

ఇంగ్లిష్ కాంప్రహెన్షన్ అండ్ లాంగ్వేజ్

పేపర్–1లో మాత్రమే ఉండే ఇంగ్లిష్ లాంగ్వేజ్‌లో రాణించడానికి అభ్యర్థులు.. బేసిక్ గ్రామర్‌పై అవగాహన ఏర్పరచుకోవాలి. అదే విధంగా యాంటానిమ్స్, సినానిమ్స్, మిస్–స్పెల్ట్ వర్డ్స్, ఇడియమ్స్, ఫ్రేజెస్, యాక్టివ్/ప్యాసివ్ వాయిస్, డైరెక్ట్ అండ్ ఇన్‌డైరెక్ట్ స్పీచ్, వన్‌వర్డ్ సబ్‌స్టిట్యూషన్స్, ప్యాసేజ్ కాంప్రహెన్షన్‌లను ప్రాక్టీస్ చేయాలి.

200 మార్కులతో ఇంగ్లిష్ కాంప్రహెన్షన్ అండ్ లాంగ్వేజ్ పేరుతో నిర్వహించే పేపర్–2లో రాణించడానికి అభ్యర్థులు.. ఫ్రేజెస్, సెంటెన్స్ ఫార్మేషన్, సెంటెన్స్ కంప్లీషన్, ప్రెసిస్ రైటింగ్, వొకాబ్యులరీలపై పట్టు సాధించాలి.

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▽	నిఫ్టీ ▽
454	123
72,643	22,024

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు

నాస్‌డాక్	15,973	▽	155
డోజోన్స్	38,715	▽	191
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,727	▽	16
డాక్స్	17,923	▽	14
షాంఘై	3,054	△	16
నికాయ్	38,738	▽	130

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ధాయమేనలు	81.19	84.48
£	బ్రిటన్ పౌండ్	ధాయమేనలు	103.88	108.12
€	యూరో	ధాయమేనలు	88.12	91.90
¥	జపాన్ ఎన్ (100)	ధాయమేనలు	47.00	64.00
AU$	ఆస్ట్రేలియా డాలర్	ధాయమేనలు	52.07	56.58
S$	సింగపూర్ డాలర్	ధాయమేనలు	60.13	64.88
SAR	సౌదీ రియాల్	ధాయమేనలు	21.21	22.74
UAE D	యూఏఈ దిర్హామ్	ధాయమేనలు	21.65	23.43
¥	చైనా యువాన్	ధాయమేనలు	10.28	12.29

ఇంటి పేరు మార్చుకుంటున్నారా..?

వివాహానంతరం మహిళల ఇంటి పేరులో మార్పు చూస్తుంటాం. ఆమెకు, ఆమె సంతానానికి సహజంగానే భర్త ఇంటి పేరు వర్తిస్తుంది. అప్పటి వరకు తండ్రి ఇంటి పేరును వారసత్వంగా మోసిన ఆమె, తన విద్యార్హతలు, ఇతర ధ్రువీకరణ, గుర్తింపు పత్రాల్లో అదే పేరును కలిగి ఉంటుంది. మరి పెళ్లి తర్వాత ముఖ్యమైన పత్రాల్లో భర్త ఇంటి పేరును చేర్చుకోవాలా..? వద్దా..? ఇదొక పెద్ద సందేహం. చాలా మంది ఈ విషయంలో దోలాయమాన స్థితిని ఎదుర్కొంటూ ఉంటారు. వివాహానంతరం తండ్రి ఇంటి పేరుతో కొనసాగేందుకు అందరూ అంగీకరించకపోవచ్చు. భర్త అంగీకరించినా, మార్చుకోవడం సులభమేమీ కాదు. ఇందులోని సాధక బాధకాలను పూర్తిగా తెలుసుకుంటే అప్పుడు ఏం చేయాలో సులభంగా తేల్చుకోవచ్చు.

వైవాహిక జీవితంలోకి అడుగు పెట్టిన తర్వాత కేవలం ఆధార్‌లో మాత్రమే ఇంటి పేరును మార్చుకుని వదిలివేయడం సరైనది కాదు. విద్యార్హతలు సహా చట్టబద్ధమైన అన్ని పత్రాలు, పెట్టుబడుల డాక్యుమెంట్లలో ఇంటి పేరును మార్చుకోవాలి. అప్పుడే ఎలాంటి సమస్యలు ఎదురుకావు. కేవలం పాన్, ఆధార్‌లోనే ఇంటి పేరు మార్చుకుంటే, అది ఎన్నో ఇక్కట్లకు దారితీయవచ్చు. ఈపీఎఫ్, బ్యాంక్ ఖాతాల్లోని పేర్లకు, పాన్, ఆధార్‌లోని పేర్ల మధ్య అంతరం ఏర్పడుతుంది. ఆయా ఖాతాల నుంచి నిధులను వెనక్కి తీసుకోవాలంటే.. పేరును అప్‌డేట్ చేసుకోవాల్సి వస్తుంది. ఇందుకోసం మరోసారి కేవైసీ (నో యువర్ కస్టమర్) ప్రక్రియ పూర్తి చేయక తప్పదు. పేర్ల అప్‌డేట్ కోసం అఫిడవిట్, ఇతర డాక్యుమెంట్లను సమర్పించాల్సి రావచ్చు. ''వివాహం తర్వాత ఇంటి పేరును మార్చుకోవడం అన్నది పూర్తిగా వ్యక్తిగత నిర్ణయమే. కానీ ఈ విషయంలో లాభ, నష్టాలు రెండింటినీ పరిశీలించుకోవాలి. పేరును మార్చుకోవడం వల్ల వచ్చే ప్రయోజనం ఏమిటంటే కుటుంబం అంతటికీ ఒకే విధమైన గుర్తింపు, ఏకరూపత ఉంటుంది. అన్ని రకాల డాక్యుమెంట్లలోనూ పేరు ఒకే విధంగా ఉండేందుకు శ్రమ పడాల్సి రావడమే ప్రతికూలం''అని ఫిన్‌ఎడ్జ్ అసిస్టెంట్ వైస్ ప్రెసిడెంట్ దీపికా భారతి వివరించారు. పెళ్లయిన తర్వాత ఇంటి పేరును మార్చుకోవడం వల్ల ఎన్నో చట్టపరమైన సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుందని 'అలగ్ అండ్ కపూర్ లా ఆఫీసెస్' (న్యాయ సేవల సంస్థ) పార్ట్‌నర్ సోనాల్ అలఘ్ పేర్కొన్నారు. గతంలోని పేరుకు, ప్రస్తుత పేరుకు మధ్య మార్పు నేపథ్యంలో అంతర్జాతీయ ప్రయాణాల సమయంలో ఎన్నో పరిశీలనలకు తోడు వృత్తిపరమైన ధ్రువీకరణలు అవసరం పడతాయన్నారు.



ముందుచూపుతో వ్యవహరించాల్సిందే

- అన్ని డాక్యుమెంట్లలోనూ సవరణ తప్పదు
- విద్యార్హతల పత్రాల్లోనూ ఆ మేరకు మార్పు
- మ్యారేజ్ సర్టిఫికెట్, అఫిడవిట్‌ల అవసరం
- భర్త ఇంటి పేరుకు మారితే ఏకరూపత
- కుటుంబం అంతా ఒక్కటేనన్న గుర్తింపు

భర్త ఇంటి పేరు



అప్పటి వరకు ఉన్న ఇంటి పేరు స్థానంలో భర్త ఇంటి పేరును చేర్చుకుంటున్నట్టు అయితే చట్టబద్ధంగా గుర్తింపును మారుస్తున్నట్టు అర్థం చేసుకోవాలి. అధికారిక రికార్డుల్లో పేర్లు మార్చుకోవడం అన్నది పరిపాలనాపరమైన పెద్ద చిక్కుగా, సవాలుతో కూడుకున్నదిగా అభివర్ణించారు సోనాల్ అలఘ్. ''దీనికి తోడు విద్యా, ప్రభుత్వ సంస్థల్లో పేరు మార్పునకు సంబంధించిన కఠిన ప్రక్రియ కష్టాలను మరింత పెంచుతుంది. దీంతో గుర్తింపు సమస్యలు ఎదురుకావచ్చు''అని ఆమె పేర్కొన్నారు. మహిళ ఇంటి పేరును మార్చుకుంటుంటే, అన్ని ముఖ్యమైన డాక్యుమెంట్లలోనూ ఆ మేరకు మార్పులు చేసుకోవాలని దీపికా భారతి సూచించారు. కేవలం కొన్నింటిలోనే మార్పు చేసుకుని వదిలేస్తే, విదేశాలకు వెళ్లే సందర్భాల్లో, పెట్టుబడుల సమయంలో, లేదంటే నామినీగా ఉండి పెట్టుబడులను క్లెయిమ్ చేసుకోవాల్సిన సందర్భాల్లో సమస్యలు ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. ఆస్తులు తదితర చట్టబద్ధమైన డాక్యుమెంట్లు, బీమా పాలసీల్లో పేరులో మార్పు చేయకపోతే, గుర్తింపును నిరూపించుకునేందుకు లేదా ఆయా ఆస్తులను సొంతం చేసుకునేందుకు ఇబ్బంది పడాల్సి వస్తుందని కరంజ్‌వాలా అండ్ కో పార్ట్‌నర్ మేఘనా మిశ్రా పేర్కొన్నారు.

ఆస్తి పత్రాల్లో

అధికారిక డాక్యుమెంట్లలో ఇంటి పేరును మార్చుకున్న ప్రతి ఒక్కరూ.. తమ పేరిట ఉన్న భౌతిక, ఆర్థిక ఆస్తులు అన్నింటిలోనూ ఆ మేరకు సవరణ చేసుకోవడం మర్చిపోవద్దు. ఒక్కసారి ఆధార్, పాన్‌లో కొత్త ఇంటి పేరు ఆధారంగా సవరణ చేసుకుంటే, ఆ తర్వాత మ్యూచువల్ ఫండ్స్, డీమ్యాట్, ట్రేడింగ్ ఖాతాల్లో మార్చుకోవడం సులభతరం అవుతుందని భారతి తెలిపారు. ఉద్యోగం చేసే చోట అధికారిక రికార్డుల్లోనూ ఇంటి పేరులో మార్పు చేసుకోవడం ద్వారా ఇబ్బందులను అధిగమించొచ్చు.



మార్చుకోవడం వల్ల ప్రయోజనం ఉందా?



నేటి రోజుల్లో దాదాపు అధిక శాతం మహిళలు పెళ్లయిన తర్వాత తమ ఇంటి పేరును మార్చుకుంటున్నారు. భర్త ఇంటి పేరుకు మారిపోవడం వల్ల గుర్తింపు సులభంగా ఉంటుందని మిశ్రా తెలిపారు. సామాజికంగా ఒకే కుటుంబం అన్న భావన, కుటుంబంలో ఐక్యతకు ఇది అనుకూలిస్తుందన్నారు.

పదో తరగతి మెమో

చాలా వాటికి పదో తరగతి విద్యార్హత సర్టిఫికెట్ కీలకంగా పనిచేస్తుంది. ఇందులో పేరు మార్చుకోవడం కష్టమేనంటున్నారు మేఘన మిశ్రా. ''సీబీఎస్ఈ వంటి బోర్డులు సాధారణంగా సర్టిఫికెట్లలో పేర్ల మార్పునకు అనుమతించడం లేదు. పాన్, పాస్‌పోర్ట్‌కు టెన్త్ సర్టిఫికెట్ కీలకంగా పనిచేస్తుంది. పాన్/ఆధార్‌కు, సీబీఎస్ఈ పదో తరగతి సర్టిఫికెట్‌లో పేరుకు వ్యత్యాసం ఉంటే బ్యాంక్ ఖాతా లేదా పాస్‌పోర్ట్ తీసుకునే విషయంలో ధ్రువీకరణ కోసం అదనపు డాక్యుమెంట్లు అవసరం అవుతాయి. వివాహానంతరం వృత్తిపరమైన విద్యార్హతల డాక్యుమెంట్లు, కోర్సుల్లో ప్రవేశాలకు నమోదు చేసే పేరు, అంతకుముందు డాక్యుమెంట్లలో మాదిరే ఉండాలి''అని మిశ్రా వివరించారు. ఢిల్లీ హైకోర్టు న్యాయవాది ఏక్తా రాయ్ అభిప్రాయం భిన్నంగా ఉంది. స్కూల్ సర్టిఫికెట్లు అన్నవి ఒక నిర్ణీత కాలం వరకు పుట్టిన తేదీకి ధ్రువీకరణలుగా కొనసాగుతాయి. ఇతర కీలక డాక్యుమెంట్లు అయిన పాన్, ఆధార్ తదితర ముఖ్యమైన డాక్యుమెంట్లలో ఇంటి పేరును అప్‌డేట్ చేసుకున్న తర్వాత, స్కూల్ సర్టిఫికెట్లకు అంత ప్రాధాన్యం ఉండదు. అయినప్పటికీ వివాహానంతరం మహిళ పాన్ లేదా ఆధార్‌లో పేరు మార్చుకునేట్టు అయితే లేదా ఉన్నత కోర్సులకు దరఖాస్తు చేసుకుంటున్నట్టు అయితే తన వివాహాన్ని రిజిస్టర్ చేసుకుని, వివాహ రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్‌ను సిద్ధంగా ఉంచుకోవాలి. జిల్లా మేజిస్ట్రేట్ నుంచి పాఠశాల సర్టిఫికెట్లలో ఇంటి పేరు మార్పును ధ్రువీకరిస్తున్నట్టు అటెస్టేషన్ తీసుకున్నా అది కూడా పరిగణనలోకి వస్తుంది'' అని ఏక్తా రాయ్ తెలిపారు.

ఆస్తుల క్లెయిమ్



కుటుంబ పెద్దలు కొందరు వీలునామా రాస్తుంటారు. కుమార్తెలకు సంబంధించి వివరాలు నమోదు చేస్తున్నప్పుడు తమ ఇంటి పేరునే పేర్కొంటారు. వీలునామా రాసిన వ్యక్తి మరణానంతరమే అది అమల్లోకి వస్తుంది. అలా అమల్లోకి వచ్చే నాటికి మహిళలు వివాహాలు చేసుకుని, భర్త ఇంటి పేరుకు మారి ఉండొచ్చు. అటువంటి సందర్భాల్లో వీలునామాలోని వివరాల మేరకు తమ హక్కులను క్లెయిమ్ చేసుకునే సందర్భంలో చిక్కులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ప్రాపర్టీ, యాజమాన్యం లేదా వారసత్వ వివాదాల్లో ఇంటి పేరు, చట్టబద్ధమైన డాక్యుమెంట్లలోని ఇంటి పేరు ఒకే మాదిరిగా ఉండకపోతే సవాళ్లు ఎదురవుతాయని ఏక్తారాయ్ అంటున్నారు. వీలునామాలోని పేరుకు, ప్రస్తుతం మహిళ పేరుకు మధ్య వ్యత్యాసం ఉంటే, అదనపు రుజువులు, డాక్యుమెంట్లను సమర్పించాల్సి ఉంటుందని సోనాల్ అలఘ్ తెలిపారు. మహిళ ఇంటి పేరు మార్పు వెనుకనున్న అంశాలను కోర్టులు, అధికారులు పరిగణనలోకి తీసుకోవచ్చని చెప్పారు. ఏవైనా వ్యత్యాసాలు ఉంటే అందుకు సంబంధించి సహేతుక ఆధారాలు దగ్గర ఉంచుకోవాలని, దాంతో ఆస్తుల బదిలీ సాఫీగా పూర్తవుతుందని సూచించారు.

వీసాకు దరఖాస్తు


''వీసాలో పేరు అప్‌డేట్ చేసుకోవడం లేదంటే భాగస్వామి వీసా కోసం దరఖాస్తు చేసుకునే వారు ఒక విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలి. అంతర్జాతీయంగా ఉన్న భిన్నమైన కుటుంబ నిర్మాణాల నేపథ్యంలో ఇంటి పేరులో వ్యత్యాసాన్ని ఆయా దేశాల్లో గుర్తించేందుకు ఎన్నో రకాల రుజువులు సమర్పించాల్సి రావచ్చు. వీసా కోసం దరఖాస్తు చేసుకునే వారు.. మారిన పేరుకు అనుగుణంగా అప్‌డేట్ చేసుకోవాలని భావించే వారికి ఈ సవాలు ఎదురవుతుంది''అని అలఘ్ అంటున్నారు. పెళ్లి తర్వాత ఇంటి పేరు మార్చుకుని వీసా కోసం దరఖాస్తు చేసుకుంటే, అప్పుడు వివాహ స్థితిని తెలిపే డాక్యుమెంట్లు అవసరం అవుతాయి. ఇది వీసా జారీని ఆలస్యం చేయవచ్చు. అందుకే పెళ్లి తర్వాత పాస్‌పోర్ట్‌లో భర్త ఇంటి పేరు ప్రతిఫలించేలా మార్పు చేసుకోవాలని మిశ్రా సూచించారు. దీనివల్ల ధ్రువీకరణ సమస్యలు తక్కువగా ఉంటాయన్నారు.

పాన్, ఆధార్, ఇతర డాక్యుమెంట్లు

కీలక పత్రాల్లో ఇంటి పేరు మార్చుకునేందుకు మ్యారేజ్ సర్టిఫికెట్ (వివాహ ధ్రువీకరణ) సమర్పించాల్సి వస్తుంది. పాస్ పోర్ట్ ఆఫీస్, ఆధార్ నమోదు కేంద్రాలకు వెళ్లి నిర్దేశిత దరఖాస్తుకు అనుబంధంగా వివాహ ధ్రువీకరణ పత్రం, ఇతర డాక్యుమెంట్లను ఇవ్వాలి. మ్యారేజ్ సర్టిఫికెట్‌తోపాటు గుర్తింపు, చిరునామా ధ్రువీకరణ, పేరు మార్పునకు సంబంధించి అఫడవిట్ అవసరమవుతాయని మిశ్రా తెలిపారు. ''నిర్దేశిత మార్పునకు సంబంధించి చటబద్ధమైన ప్రక్రియలకు కట్టుబడి ఉండడం కీలకం. ఇక్కడ చెప్పినవన్నీ ప్రాథమికంగా సమర్పించాల్సినవి. విడిగా ఆయా డాక్యుమెంట్లలో మార్పులకుగాను సమర్పించాల్సినవి వేరేవి కూడా ఉండొచ్చు'' అని మిశ్రా పేర్కొన్నారు.

పేరు మార్చుకోకపోతే..?

వివాహం తర్వాత కూడా తన ఇంటి పేరునే కొనసాగించే మహిళలూ కొందరు ఉన్నారు. అలాంటప్పుడు సదరు మహిళ భర్త పేరును పేర్కొనే సమయంలో ఇద్దరి ఇంటి పేరు వేర్వేరుగా ఉంటుంది. కనుక తనకు, తన భర్తకు మధ్య బంధానికి నిదర్శనంగా మ్యారేజ్ సర్టిఫికెట్ ఒక్కటి దగ్గర ఉంచుకుంటే సరిపోతుంది. ''వివాహం తర్వాత మహిళ ఇంటి పేరు మార్చుకోకపోతే అప్పుడు వారి బంధాన్ని నిరూపించుకునేందుకు మ్యారేజ్ సర్టిఫికెట్ ఉండాల్సిందే. ఆదాయపన్ను రిటర్నుల దాఖలు, ఇన్సూరెన్స్ క్లెయిమ్, ఆస్తుల లావాదేవీల సమయంలో ఇది అవసరపడుతుంది. మ్యారేజ్ సర్టిఫికెట్ లేకపోతే భర్త పేరుతో అప్‌డేట్ చేసిన ఆధార్, పాస్‌పోర్ట్, బ్యాంక్ జాయింట్ అకౌంట్ పాస్‌బుక్ లేదా స్టేట్‌మెంట్, ఒకే ఇంట్లో నివసిస్తున్నట్టు రుజువులు, అఫిడవిట్ సాయపడతాయి''అని మిశ్రా తెలిపారు.



పిల్లల బర్త్ సర్టిఫికెట్

వివాహానంతరం మహిళల ఇంటి పేరులో మార్పు లేనప్పుడు.. ఆ దంపతులకు జన్మించే పిల్లల బర్త్ సర్టిఫికెట్‌లో తల్లి, తండ్రి ఇంటి పేరు వేర్వేరుగా ఉంటుంది. ఇదేమైనా సమస్యలు కలిగిస్తుందా.? అన్న సందేహం రావచ్చు. పిల్లల పేరిట పీపీఎఫ్, సుకన్య సమృద్ధి యోజన తదితర సాధనాల్లో ఇన్వెస్ట్ చేయాలనుకుంటే ఈ బర్త్ సర్టిఫికెట్ అవసరం పడు తుంది. అంతేకానీ, అందులో తల్లి, తండ్రి ఇంటి పేర్లు వేర్వేరుగా ఉంటే ఎలాంటి సమస్య రాదని మిశ్రా పేర్కొన్నారు.

మొత్తం పేరే మారితే?

కొన్ని వర్గాల ప్రజల్లో పెళ్లి తర్వాత మహిళ ఇంటి పేరే కాకుండా, మొదటి పేరులోనూ మార్పు చోటు చేసుకుంటుంది. ఇది సమస్యలకు దారితీస్తుందని మిశ్రా చెప్పారు. అధికారిక రికార్డులతో పోలిస్తే పేర్ల మధ్య పోలిక లేకపోవడం వల్ల సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. పేరు మార్చుకునే విషయంలో చట్టబద్ధమైన నిబంధనలను పాటించడం వల్ల సవాళ్లను అధిగమించొచ్చని సూచించారు.

హెచ్‌డీఎఫ్‌సీ ఎంఎఫ్ నుంచి నిఫ్టీ రియల్టీ ఇండెక్స్ ఫండ్



హెచ్‌డీఎఫ్‌సీ మ్యుచువల్ ఫండ్ సంస్థ తాజాగా హెచ్‌డీఎఫ్‌సీ రియల్టీ ఇండెక్స్ ఫండ్‌ను ఆవిష్కరించింది. ఈ ఎన్‌ఎఫ్‌వో మార్చి 21తో ముగుస్తుంది. గత 6–7 ఏళ్లుగా లిస్టెడ్ రియల్టీ కంపెనీల ఫండమెంటల్స్, లాభదాయకత మెరుగుపడ్డాయి. రెసిడెన్షియల్, కమర్షియల్, రిటైల్, హాస్పిటాలిటీ, సెజ్ ప్రాజెక్టుల వ్యాప్తంగా దీర్ఘకాలిక వృద్ధికి రియల్టీ రంగానికి గణనీయంగా అవకాశాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే నిఫ్టీ రియల్టీ ఇండెక్స్‌ను ప్రతిబింబించే ఈ ఓపెన్ ఎండెడ్ స్కీములో ఇన్వెస్ట్ చేయడం ద్వారా మరింత మెరుగైన రాబడులు అందుకోవడానికి ఆస్కారం ఉండగలదని హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ ఎండీ నవనీత్ మునోత్ తెలిపారు.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

18-3-2024	
విశాఖ	425-00
చిత్తూరు	463-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	420-00
విజయవాడ	420-00
రిటైల్ ధర (డజను)	72.00
17-3-2024 ఫామ్ ధర...	
హైదరాబాద్	405-00
వరంగల్	407-00
రిటైల్ ధర	4.65

స్మాల్ కంటే... మిడ్ క్యాప్ ఫండ్స్ నయమా?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రిసెర్చ్





నేను ఆదాయపన్ను 30 శాతం శ్లాబు పరిధిలోకి వస్తాను. దీంతో అత్యవసర నిధిని ఎక్కడ ఇన్వెస్ట్ చేసుకోవాలి? – శివ్ గణేశన్

మీ అత్యవసర నిధిలో కొంత భాగాన్ని డెట్ మ్యూచువల్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేసుకోవచ్చు. రాబడులకు మార్గం అవుతుంది. అత్యవసర నిధి ఎప్పుడూ మూడు భాగాలుగా వర్గీకరించుకుని ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. మొదటి భాగాన్ని నగదు రూపంలోనే ఉంచుకోవాలి. రెండో భాగాన్ని బ్యాంకు ఖాతా లేదంటే ఫిక్స్‌డ్ డిపాజిట్‌లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. మూడో భాగాన్ని లిక్విడ్ ఫండ్ లేదా అల్ట్రా షార్ట్ డ్యురేషన్ ఫండ్‌లో ఇన్వెస్ట్ చేసుకోవాలి. దీనివల్ల రాబడులు సానుకూలంగా ఉంటాయి. డెట్ ఫండ్స్‌లో పెట్టుబడులను వెనక్కి తీసుకున్నప్పుడే రాబడులపై పన్ను వర్తిస్తుంది. ఫిక్స్‌డ్ డిపాజిట్ అయితే ఏటేటా వడ్డీ ఆదాయం పన్ను చెల్లింపుదారు ఆదాయానికి కలుస్తుంది. వారి శ్లాబు రేటు ప్రకారం పన్ను ఆధారపడి ఉంటుంది. అధిక పన్ను శ్లాబు పరిధిలోకి వచ్చే వారు ఫిక్స్‌డ్ డిపాజిట్ నుంచి వచ్చే వడ్డీ ఆదాయంపైనా 30 శాతం పన్ను చెల్లించాల్సి వస్తుంది. అలాగే, మ్యూచువల్ ఫండ్స్ పెట్టుబడులను విక్రయించినప్పుడు కూడా నమోదయ్యే లాభంపై ఇంతే మేర పన్ను చెల్లించాల్సి వస్తుంది. అయితే, ఎఫ్‌డీలతో పోలిస్తే డెట్ ఫండ్స్ కాస్త మెరుగైన రాబడులను ఇస్తాయి. కానీ, డెట్ ఫండ్స్‌లో రాబడులకు హామీ ఉండదు. ఫిక్స్‌డ్ డిపాజిట్స్ మాదిరి పెట్టుబడులకు రక్షణ హామీ కూడా ఉండదు. అయినా కానీ, లిక్విడ్ ఫండ్స్, అల్ట్రా షార్ట్ డ్యురేషన్ ఫండ్స్ తక్కువ రిస్క్ విభాగంలోకి వస్తాయి. నాణ్యమైన డెట్ పేపర్లలో ఇన్వెస్ట్ చేసిన పథకాన్నే ఎంపిక చేసుకోవాలి. లేదంటే రిస్క్ తీసుకున్నట్టు అవుతుంది.

స్మాల్ క్యాప్ కంటే మిడ్‌క్యాప్ ఫండ్స్‌లో ఇన్వెస్ట్ చేయడం చేయడం మంచిదా? – వరుణ్

మిడ్‌క్యాప్‌లో ఉండే రాబడులు, సవాళ్లు అనేవి స్మాల్‌క్యాప్ మాదిరే ఉంటాయి. పేరుకు తగినట్టుగా ఈ పథకాల పెట్టుబడులు ఉండటాన్ని గమనించొచ్చు. మిడ్‌క్యాప్ పథకాలు ఎక్కువ మొత్తాన్ని మిడ్‌క్యాప్ కంపెనీల్లో ఇన్వెస్ట్ చేస్తాయి. అదే విధంగా స్మాల్‌క్యాప్, లార్జ్‌క్యాప్ స్టాక్స్‌లోనూ చెప్పుకోతగ్గ పెట్టుబడులు కలిగి ఉంటాయి. అదే స్మాల్‌క్యాప్ ఫండ్ అయితే ఎక్కువగా స్మాల్‌క్యాప్ స్టాక్స్‌కు పెట్టుబడులు కేటాయిస్తుంది. అలాగే, మిడ్‌క్యాప్ కంపెనీల్లో ఎక్స్‌పోజర్ తీసుకుంటుంది. మార్కెట్ విలువ పరంగా టాప్ -100 కంపెనీలను లార్జ్‌క్యాప్‌గా, తదుపరి 150 కంపెనీలను మిడ్‌క్యాప్‌గా, మిగిలిన కంపెనీలను స్మాల్‌క్యాప్ కంపెనీలుగా సెబీ నిర్వచించింది. ఈ నిర్వచనాన్నే పథకాలు కూడా అనుసరిస్తుంటాయి. మార్కెట్ విలువ ఆధారంగా ఒక కంపెనీని మిడ్‌క్యాప్, స్మాల్‌క్యాప్ అని చెప్పడమే. ఒకవేళ అది చిన్న కంపెనీయే అయినప్పటికీ గొప్పది అయి ఉండొచ్చు. చక్కని నిర్వహణతో, ఎంతో వేగంగా వృద్ధి చెందుతున్న వ్యాపారంతో, భరోసానిస్తూ ఉండొచ్చు. ఇలాంటి అంశాలున్న కంపెనీల విషయంలో అది మిడ్ లేదా స్మాల్ క్యాప్ అన్న నిర్వచనం జోలికి వెళ్లక్కర్లేదు. ఉదాహరణకు ఒక మిడ్‌క్యాప్ ఫండ్ పథకంలో ఇన్వెస్ట్ చేస్తున్నారు. కొంత కాలానికి నిర్వహణ ఆస్తుల పరంగా అది పెద్ద పథకంగా మారొచ్చు. అప్పుడు అది పేరుకు మిడ్‌క్యాప్ అయినప్పటికీ లార్జ్‌క్యాప్ కంపెనీల్లో ఎక్కువగా పెట్టుబడులు కలిగి ఉంటుంది. పేరుకు మిడ్‌క్యాప్ కంపెనీలుగా ఉన్నప్పటికీ, పోర్ట్‌ఫోలియోలని చాలా కంపెనీలు భవిష్యత్తులో లార్జ్‌క్యాప్‌గా మారే అవకాశాలు ఉంటాయి.

సంవర్ధన మదర్‌సన్

ఎలారా సెక్యూరిటీస్ | **కొనొచ్చు**

స్టాక్స్ వ్యూ

ప్రస్తుత ధర: రూ. 112 **టార్గెట్:** రూ. 141

ఎందుకంటే: ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికం(అక్టోబర్–డిసెంబర్)లో సంవర్ధన మదర్‌సన్ ఇంటర్నేషనల్ నిర్వహణ లాభం(ఇబిటా) 47 శాతం జంప్‌చేసింది. త్రైమాసికవారీగా సైతం 27 శాతం ఎగసి రూ. 2,370 కోట్లను తాకింది. ఇబిటా మార్జిన్ వార్షికంగా 1.25 శాతం బలపడి 9.2 శాతానికి చేరింది. అర్జెంటీనాలో అధిక ద్రవ్యోల్బణ వాతావరణం కారణంగా తలెత్తిన వన్ టైమ్ వ్యయాలతో ఇబిటా సర్దుబాటుకులోనై 9.5 శాతంగా నమోదైంది. ఇక కన్సాలిడేటెడ్ ఆదాయం 27 శాతం పురోగమించి రూ. 25,690 కోట్లను తాకింది. అధిక ద్రవ్యోల్బణ పరిస్థితుల ప్రభావంతో సర్దుబాటు తదుపరి నికర లాభం 161 శాతం దూసుకెళ్లి రూ. 733 కోట్లకు చేరింది. కంపెనీ చేపట్టిన కొనుగోళ్లలో యషియో, క్రైమా ఎంటర్‌ప్రైజ్, లుమెన్ గ్రూప్, ఏడీఐ గ్రూప్ కీలకమైనవికాగా.. పూర్తిగా సొంతం చేసుకోవలసి ఉంది. దీంతో వచ్చే ఆర్థిక సంవత్సరం(2024–25) నుంచి 1.1–1.2 బిలియన్ డాలర్లస్థాయిలో ఆదాయం సమకూరే వీలుంది. ఎర్రసముద్రంలో ఇటీవల తలెత్తిన ఆందోళనకర పరిస్థితులు కంపెనీ ఉత్పాదకత, ఇదే ప్రాంతంలోని కస్టమర్లపై ఎలాంటి ప్రభావం చూపలేదు. అయితే అర్జెంటీనాలోని అధిక ద్రవ్యోల్బణ పరిస్థితులు మాత్రం తాత్కాలికంగా కార్యకలాపాలు, లాభదాయకతను దెబ్బతీశాయి. గతంలో కొనుగోలు చేసిన ఇతర కంపెనీలను కలుపుకోవడం ద్వారా వచ్చే రెండేళ్ల(2025, 2026)లో కన్సాలిడేటెడ్ ఇబిటా మార్జిన్ 10 శాతంస్థాయిలో నమోదయ్యే వీలుంది. ఇకపై సొంతం చేసుకోనున్న సంస్థల ద్వారా ఆదాయంలో మరో 10 శాతంమేర లబ్ధిని పొందనుంది.



దిలీప్ బిల్డ్‌కాన్

ఐడీబీఐ క్యాపిటల్ | **కొనొచ్చు**

ప్రస్తుత ధర: రూ. 406 **టార్గెట్:** రూ. 492

ఎందుకంటే: మౌలిక సదుపాయాల దిగ్గజం దిలీప్ బిల్డ్‌కాన్ ఈ ఆర్థిక సంవత్సరం(2023–24) మూడో త్రైమాసికం(అక్టోబర్–డిసెంబర్)లో అంచనాలకు అనుగుణమైన పనితీరును ప్రదర్శించింది. స్టాండెలోన్ నిర్వహణ లాభం(ఇబిటా) నిపుణుల అంచనాలను అందుకోగా.. నికర లాభం అనుకోని(వన్ టైమ్) ఆదాయంతో జంప్‌చేసింది. ఈ ఏడాది క్యూ1(ఏప్రిల్–జూన్)లో బలహీన ఫలితాలు వెలువరించాక కంపెనీ ఆదాయం వార్షికంగా 7–8% మేర పుంజుకుంది. వెరసి పూర్తిఏడాదికి మొత్తం ఆదాయం 5 శాతం బలపడే వీలుంది. రుణభారం తగ్గుతుండటం సానుకూల అంశంకాగా.. దీర్ఘకాలానికి అసెట్ ఓనర్‌షిప్ బిజినెస్ లక్ష్యంగా సాగుతుండటంతో రుణ పరిస్థితులను గమనించవలసి ఉంటుంది. పీఈ అల్ఫా ఆల్టర్నేటివ్ డీల్ ద్వారా రెండేళ్ల కాలం(2024, 2025)లో ఏడాదికి రూ. 650 కోట్లు చొప్పున పెట్టుబడులను అందుకోనుంది. వెరసి ఈ డీల్ రుణభారం తగ్గించుకునేందుకు కీలక వనరుగా ఉపయోగపడనుంది. ఈ ఏడాది క్యూ3లో ఎలాంటి ఆర్డర్లనూ పొందలేదు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో క్యూ4(జనవరి–మార్చి)లోనూ కాంట్రాక్టులు లభించకపోవచ్చు. అయితే వచ్చే ఏడాది (2024–25) నుంచి తిరిగి ఆర్డర్‌బుక్ జోరందుకునే అవకాశముంది. కంపెనీకి ఈపీసీ కాంట్రాక్టులు స్వల్పకాలిక బిజినెస్‌కాగా.. దీర్ఘకాలంలో అసెట్ ఓనర్‌షిప్ విభాగం(కోల్ మైనింగ్, హెచ్‌ఏఎం ప్రాజెక్టులు) కీలకంగా నిలవనుంది. ఇవి 15ఏళ్లపాటు నగదు ఆర్జనకు భరోసా కల్పించనున్నాయి.



గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజ్ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

క్లుప్తంగా...

మళ్లీ జగనే సీఎం కావాలి..

- బిడ్డలు పట్టించుకోకున్నా జగనే బిడ్డనుకుని బతుకుతున్నా..
- ఆంజనేయస్వామికి ఓ పింఛన్‌దారుడి పూజలు



పలమనేరు(చిత్తూరు జిల్లా): మళ్లీ జగనే సీఎం కావాలి.. అంటూ ఓ పింఛన్‌దారుడు ఆంజనేయస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశాడు. చిత్తూరు జిల్లా పలమనేరు నియోజకవర్గంలోని ఆరిమాకులపల్లికి చెందిన గోపాల్‌రెడ్డి వీకోటలోని ఆంజనేయస్వామి ఆలయంలో ఆదివారం పూజలు చేశాడు. నెలనెలా అందే పింఛన్ సొమ్ముతో తన బిడ్డలపై ఆధారపడకుండా తన బిడ్డే జగన్ అనుకుని ధైర్యంగా బతుకుతున్నట్టు చెప్పాడు. టీడీపీ గెలిస్తే ఈ పింఛన్ రాదని భయపడి మళ్లీ జగనే రావాలని ఈ పూజలు చేసినట్టు తెలిపారు. తన కోర్కెల చీటీని స్వామి వారి హుండీలోనూ వేశానన్నారు. తనకు మూడెకరాల పొలం, పక్కా ఇల్లు ఉన్నా పిల్లలు, భార్య పట్టించుకోకుండా ఇంటి నుంచి బయటకు గెంటేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎలా బతకాలో తెలియక వీకోటలో ఉంటున్నానని, ఆ సమయంలో తమ సచివాలయ సిబ్బంది వలంటీర్ ద్వారా తన వివరాలు తీసుకుని వృద్ధాప్య పింఛన్ ఇస్తున్నారని సంతోషంతో చెప్పాడు. అనారోగ్యంగా ఉన్న తనకు 104 సేవలతో పాటు ఆరోగ్య సిబ్బంది ఉచితంగానే వైద్యం అందించి మందులిస్తున్నారని వివరించాడు.

త్వరలో విశాఖకు ట్రాన్సేసియా

మెడ్‌టెక్ జోన్‌లో కంపెనీ నిర్మాణం

సాక్షి, విశాఖపట్నం: వైద్య ఉపకరణాల తయారీలో ప్రపంచ గుర్తింపు పొందిన విశాఖలోని ఏపీ మెడ్‌టెక్ జోన్‌లో మరో మణిహారం చేరబోతోంది. దుబాయ్‌కు చెందిన ప్రపంచ ప్రసిద్ధ ట్రాన్సేసియా కంపెనీ నిర్మాణం త్వరలోనే మెడ్‌టెక్ జోన్‌లో జరగనుంది. డయాగ్నోస్టిక్ పరికరాల తయారీలో నంబర్‌వన్‌గా ఉన్న ఈ సంస్థ ఇప్పటికే ఏపీ మెడ్‌టెక్ జోన్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. ఇకపై విశాఖలోనే రీసెర్చ్, డయాగ్నోస్టిక్ పరికరాల తయారీని చేపట్టాలని ట్రాన్సేసియా సంస్థ నిర్ణయించింది. ఇప్పటికే 100కి పైగా దేశాల్లో విస్తరించిన ట్రాన్సేసియా.. బ్లడ్ బ్యాంకింగ్, క్లినికల్ కెమిస్ట్రీ, క్రిటికల్ కేర్, డయాబెటిక్, హెమటాలజీ, ఇమ్యునాలజీ తదితర అంశాలపై పరిశోధనలు చేస్తూ వైద్య ఉపకరణాలు ఉత్పత్తి చేస్తుంటుంది.

నైపుణ్య శిక్షణతో హస్తకళలకు జీవం

పీఎం విశ్వకర్మ కార్యక్రమం కింద తొలి దశలో 3 జిల్లాల కళాకారులకు శిక్షణ

సాక్షి, అమరావతి: రాష్ట్రంలోని హస్తకళలకు జీవం పోసి.. భావితరాలకు అందించే విధంగా ప్రభుత్వం అడుగులు ముందుకు వేస్తోంది. ఇందుకోసం పీఎం విశ్వకర్మ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం అందిపుచ్చుకుంది. వోకల్ ఫర్ లోకల్ నినాదంలో భాగంగా స్థానిక ఉత్పత్తులకు అంతర్జాతీయ అవకాశాలు కల్పించే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా హస్తకళల్లో నైపుణ్య శిక్షణ అందిస్తున్నాయి. తద్వారా కొండపల్లి, ఏటికొప్పాక బొమ్మలు, బొబ్బిలి వీణ, పెడన కలంకారీ, నర్సాపురం అల్లికలు తదితర కళలను ప్రోత్సహించనున్నాయి. రాష్ట్రవ్యాప్తంగా 1,96,242 మంది హస్తకళాకారులు ఉన్నట్లు ప్రభుత్వం గుర్తించింది. వారికి నైపుణ్య శిక్షణ అందించడంపై దృష్టిసారించింది. తొలి దశ నైపుణ్య శిక్షణ కోసం ఉమ్మడి పశ్చిమ గోదావరి, నెల్లూరు, తిరుపతి జిల్లాలను ఎంపిక చేసింది. ఇప్పటివరకు ఈ మూడు జిల్లాల నుంచి 49,198 మంది దరఖాస్తు చేసుకోగా.. అందులో 21,328 మంది కళాకారులు శిక్షణకు అర్హత సాధించారని అధికారులు తెలిపారు. శిక్షణ ఇచ్చేందుకు 286 మంది కళాకారులను గుర్తించినట్లు చెప్పారు. ఈ మూడు జిల్లాల్లో 27 శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేసి.. నెలకు 6,480 మంది చొప్పున శిక్షణ అందించనున్నట్లు అధికారులు తెలిపారు. డిమాండ్ పెరిగితే ఈ సంఖ్యను మరింత పెంచుతామన్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత వారికి రుణాలు అందించడం ద్వారా స్వయం ఉపాధి పొందే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది.

నృసింహస్వామి పెళ్లికొడుకాయెనే..

యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఆదివారం రాత్రి శ్రీస్వామి వారి ఎదుర్కోలు మహోత్సవాన్ని ఆలయ ఆచార్యులు పాంచరాత్ర ఆగమ శాస్త్రం ప్రకారం వైభవంగా జరిపించారు. ఉదయం ప్రధానాలయ మాడ వీధుల్లో శ్రీస్వామి వారు జగన్మోహిని అలంకార సేవలో భక్తులకు దర్శనమిచ్చారు. ఇక సాయంత్రం శ్రీస్వామి వారు అశ్వవాహనంపై పెండ్లి కొడుకుగా, ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిపై అమ్మవారిని సేవోత్సవంగా ఆలయ మాడవీధిలో ఊరేగించారు. అనంతరం ఆచార్యులు, అధికారులు స్వామి వారి పక్షాన, అమ్మవారి పక్షాన చేరి గుణగణాలను చర్చించుకున్నారు.

నేటి నుంచి 'పది' పరీక్షలు

పరీక్షలు రాయనున్న 6,23,092 మంది

సాక్షి, అమరావతి: పదో తరగతి పబ్లిక్ పరీక్షలు నేటి (సోమవారం) నుంచి ప్రారంభం కానున్నాయి. ఈ నెల 30 వరకు జరిగే పరీక్షల కోసం రాష్ట్రవ్యాప్తంగా 3,473 సెంటర్లను సిద్ధం చేశారు. ప్రధాన పరీక్షలు మార్చి 28తో ముగుస్తాయి. కాగా మరో రెండు రోజులు అంటే మార్చి 30 వరకు ఓరియంటల్, ఒకేషనల్ పరీక్షలుంటాయి. అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను పాఠశాల విద్యాశాఖ పూర్తి చేసింది. 2023–24లో మొత్తం 6,23,092 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో 3,17,939 మంది బాలురు కాగా 3,05,153 మంది బాలికలు. కాగా, గతేడాది ఉత్తీర్ణులు కాకపోవడంతో తిరిగి ప్రవేశం పొందినవారు మరో 1,02,528 మంది కూడా పరీక్షలు రాయనున్నారు. అలాగే ఓరియంటల్ విద్యార్థులు 1,562 మంది ఉన్నారు. పరీక్షలు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.15 గంటల వరకు నిర్వహిస్తారు. విద్యార్థులను ఉదయం 8.45 గంటల నుంచి పరీక్ష కేంద్రాల్లోకి అనుమతిస్తారు. ప్రత్యేక సందర్భాల్లో మరో 30 నిమిషాల వరకు అవకాశం కల్పించారు. పరీక్షల పర్యవేక్షణకు 3,473 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 3,473 మంది డిపార్ట్‌మెంటల్ అధికారులు, 35,119 మంది ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బందిని నియమించారు. పరీక్షలు నిర్వహించే రోజుల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఇందుకోసం 156 ఫ్లయింగ్ స్క్వాడ్స్, 682 సిట్టింగ్ స్క్వాడ్స్‌ను నియమించారు. సమస్యాత్మక పరీక్ష కేంద్రాల్లో అదనంగా సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాశాఖ అధికారులను



ప్రభుత్వం ఆదేశించింది. 130కి పైగా కేంద్రాల్లో సీసీ కెమెరాలను సైతం ఏర్పాటు చేశారు.

పేపర్ లీకులకు 'క్యూఆర్' కోడ్‌తో చెక్

మాల్ ప్రాక్టీస్‌కు అవకాశం లేకుండా ఈ ఏడాది పరీక్షలకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేసినట్టు పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేష్ కుమార్ తెలిపారు. ఇన్విజిలేటర్లు, విద్యాశాఖ అధికారులు, పోలీసులు, నాన్–టీచింగ్ సిబ్బంది, ఏఎన్‌ఎంలు, చీఫ్ ఇన్విజిలేటర్లు ఇలా ఎవరైనా సరే సెల్‌ఫోన్లతో పరీక్ష కేంద్రాల్లోకి రావడాన్ని నిషేధించామన్నారు. ఎలాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను తేవద్దన్నారు. గతేడాదిలాగే ఈసారి కూడా పదో తగరతి పరీక్ష పేపర్లపైనా, ప్రతి ప్రశ్నకు 'క్యూఆర్' కోడ్‌ను ముద్రించారు. మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడ్డా, పేపర్ లీక్ చేసినా.. ఏ సెంటర్‌లో ఏ విద్యార్థి పేపర్ లీక్ అయిందో ప్రత్యేక టెక్నాలజీ ద్వారా తెలుసుకోనున్నారు. పరీక్షలు పూర్తయ్యాక ఈ నెల 31 నుంచి ఏప్రిల్ 8 వరకు స్పాట్ వ్యాల్యూయేషన్ చేపట్టనున్నారు. ఆ తర్వాత వెంటనే ఫలితాలను వెల్లడించేందుకు పాఠశాల విద్యాశాఖ ప్రణాళిక సిద్ధం చేసింది.

పదో తరగతి పరీక్షల షెడ్యూల్

18-3-2024 - ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్ (గ్రూప్-ఎ), ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-1 (కాంపోజిట్ కోర్సు)
19-3-2024 - సెకండ్ లాంగ్వేజ్
20-3-2024 - ఇంగ్లిష్
22-3-2024 - మ్యాథమెటిక్స్
23-3-2024 - ఫిజికల్ సైన్స్
26-3-2024 - బయోలాజికల్ సైన్స్
27-3-2024 - సోషల్ స్టడీస్
28-3-2024 - ఫస్ట్ లాంగ్వేజ్ పేపర్-2 (కాంపోజిట్ కోర్సు)
28-3-2024 - ఓఎస్సెస్సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-1 (సంస్కృతం, అరబిక్, పర్షియన్)
30-3-2024 - ఓఎస్సెస్సీ మెయిన్ లాంగ్వేజ్ పేపర్-2 (సంస్కృతం, అరబిక్, పర్షియన్)
30-3-2024-ఎస్సెస్సీ ఒకేషనల్ (థియరీ)

హాల్‌టికెట్ చూపిస్తే ఉచిత బస్సు ప్రయాణం..

పదో తరగతి పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఆర్టీసీ ఉచిత రవాణా సదుపాయం కల్పించింది. పదో తరగతి హాల్‌టికెట్‌ను చూపించి ఇంటి నుంచి పరీక్ష కేంద్రాలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా వెళ్లొచ్చు. అల్ట్రా పల్లె వెలుగు, పల్లెవెలుగు, సిటీ ఆర్డినరీ బస్సుల్లో విద్యార్థులు ఉచితంగా వెళ్లి రావొచ్చని విద్యాశాఖ ప్రకటించింది.

ఉత్తరాంధ్ర అభివృద్ధి సీఎం జగన్‌తోనే సాధ్యం

- రాష్ట్ర భవిష్యత్ కోసం వైఎస్సార్‌సీపీ మళ్లీ అధికారం చేపట్టాలి
- ఇందుకు న్యాయవాదులు కీలక పాత్ర పోషించాలి
- ఉత్తరాంధ్ర న్యాయవాదుల సర్వసభ్య సమావేశంలో వైవీ సుబ్బారెడ్డి, మంత్రి బొత్స



మాట్లాడుతున్న వైవీ సుబ్బారెడ్డి. చిత్రంలో మనోహర్‌రెడ్డి, బొత్స ఝాన్సీ తదితరులు

సాక్షి, విశాఖపట్నం: ఉత్తరాంధ్ర అభివృద్ధికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కట్టుబడి ఉన్నారని వైఎస్సార్‌సీపీ రీజనల్ కో–ఆర్డినేటర్, రాజ్యసభ సభ్యుడు వైవీ సుబ్బారెడ్డి అన్నారు. యువతకు భవిష్యత్‌లో ఉద్యోగ అవకాశాల కల్పనతోపాటు రాష్ట్ర భవిష్యత్‌ను కాపాడుకునే బాధ్యత ప్రతి న్యాయవాదిపై ఉందని పేర్కొన్నారు. ఆదివారం వీఎంఆర్‌డీఏ చిల్డ్రన్ ఎరీనాలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉత్తరాంధ్ర న్యాయవాదుల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ, ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ, విశాఖ పార్లమెంటరీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, విశాఖ ఉత్తర సమన్వయకర్త కేకే రాజు, వీఎంఆర్‌డీఏ చైర్మన్ సనపల చంద్రమౌళి హాజరయ్యారు. ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి వందలాది మంది వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ సభ్యులు, ఇతర న్యాయవాదులు హాజరయ్యారు. సమావేశంలో సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. టీడీపీ హయాంలో న్యాయవాదులను మోసం చేస్తే.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో లా నేస్తం పేరిట వృత్తిలో ప్రాక్టీస్ చేసే యువ న్యాయవాదులకు ఆర్థిక భరోసా కల్పించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదని కొనియాడారు. న్యాయవాదుల సంక్షేమానికి రూ.100 కోట్లతో సంక్షేమ నిధి ఏర్పాటు చేసిన విషయాన్ని గుర్తు చేశారు.

విశాఖ పరిపాలన రాజధాని అయితేనే అభివృద్ధి

మంత్రి బొత్స సత్యనారాయణ మాట్లాడుతూ.. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల కారణంగా తక్కువ ఖర్చుతో విశాఖ పరిపాలన రాజధాని అయితే ముంబై, చెన్నై లాంటి నగరాలకు దీటుగా అభివృద్ధి చేసుకోవచ్చన్నారు. చంద్రబాబు తన కుటుంబం, తన బంధువులు, తన పార్టీ నేతల భూముల ధరల కోసం అమరావతి రాజధాని కావాలంటున్నారే తప్ప రాష్ట్ర ప్రయోజనాల కోసం కాదన్నారు. న్యాయవాదులంతా ఏకమై ఉత్తరాంధ్రలో వైఎస్సార్‌సీపీని గెలిపించుకుని పరిపాలన రాజధాని తెచ్చుకుందామని పిలుపునిచ్చారు. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర లీగల్ సెల్ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ.. న్యాయవాదులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలనే విషయాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లినట్టు చెప్పారు. వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కాళిదాస్ రెడ్డి, విశాఖ జోనల్ లీగల్ సెల్ అధ్యక్షుడు జీఎం రెడ్డి, విశాఖ, అనకాపల్లి, అల్లూరి, విజయనగరం, పార్వతీపురం, శ్రీకాకుళం జిల్లాల వైఎస్సార్‌సీపీ లీగల్ సెల్ అధ్యక్షులు, ప్రతినిధులు, న్యాయవాదులు హాజరయ్యారు.

గ్రూప్‌–1 ప్రిలిమ్స్ ప్రశాంతం

రాష్ట్రవ్యాప్తంగా 72.55% మంది హాజరు



పరీక్ష కేంద్రాల వద్ద నిరీక్షిస్తున్న విద్యార్థులు

సాక్షి, అమరావతి/ఒంగోలు అర్బన్: ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) ఆదివారం నిర్వహించిన గ్రూప్–1 ప్రిలిమినరీ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. ఈ పరీక్ష కోసం 1,48,881 మంది దరఖాస్తు చేసుకోగా 1,26,068 మంది హాల్ టికెట్లు డౌన్‌లోడ్ చేసుకున్నారు. 18 జిల్లాల్లో ఉదయం, మధ్యాహ్నం జరిగిన (రెండు పేపర్లు) పరీక్షకు 91,463 మంది (72.55 శాతం) హాజరైనట్లు సర్వీస్ కమిషన్ తెలిపింది.

సెల్‌ఫోన్‌తో పట్టుబడిన అభ్యర్థి

గ్రూప్–1 ప్రిలిమ్స్ పరీక్షకు హాజరైన ఓ విద్యార్థి సెల్‌ఫోన్‌తో ప్రశ్నపత్రాన్ని ఫొటో తీస్తుండగా ఇన్విజిలేటర్ పట్టుకున్న ఘటన ఒంగోలులో జరిగింది. స్థానిక క్విస్ కాలేజిలోని 121701 వెన్యూకోడ్‌లో హాల్ టికెట్ నంబర్ 121100538 ఉన్న ఒక అభ్యర్థి ఐఫోన్‌తో ప్రశ్న పత్రాన్ని ఫొటో తీస్తుండగా ఇన్విజిలేటర్ పట్టుకున్నాడు. ఈ క్రమంలో ఫోన్ తీసుకునేందుకు ఇన్విజిలేటర్ ప్రయత్నించగా ఆ అభ్యర్థి వాదనకు దిగాడు. దీంతో చీఫ్ సూపరింటెండెంట్‌కు తెలపగా ఆయన వచ్చి ఫోన్ తీసుకునేందుకు ప్రయత్నించడంతో కొద్దిపాటి వాగ్వాదం జరిగింది. అదే సమయానికి పరీక్ష కేంద్రాల తనిఖీకి జాయింట్ కలెక్టర్ ఆర్ గోపాలకృష్ణ వచ్చారు. దీంతో ఆ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి అభ్యర్థిని పోలీసులకు అప్పగించారు. సీసీ టీవీ ఫుటేజీను సేకరించారు. పరీక్ష కేంద్రంలో భద్రతా వైఫల్యంపై కలెక్టర్ విచారణకు ఆదేశించారు.

నాలుగు కాళ్ల కోడిపిల్ల



వైఎస్సార్ జిల్లా పులివెందుల మండలం ఎర్రబల్లె పంచాయతీ పరిధిలోని మల్లికార్జున పురంలో నాలుగు కాళ్లతో జన్మించిన ఓ కోడి పిల్ల అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. గ్రామానికి చెందిన దామోదర్ మూడు రోజుల కిందట ఓ కోడి పెట్టిన గుడ్లను పొదిగేశారు. అందులో ఒక కోడి పిల్ల నాలుగు కాళ్లతో పుట్టింది. ఆరోగ్యంగా ఉంది. దీంతో ఈ కోడి పిల్లను చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు తరలివస్తున్నారు.

– పులివెందుల రూరల్

విశాఖలో 41 అంతస్తుల 'నేవీ' భవనం

సాక్షి, విశాఖపట్నం: భారత నౌకాదళం విశాఖలో ఎత్తయిన భవనం నిర్మించనుంది. ఈ మేరకు నౌసన్ బాగ్‌లో 41 అంతస్తుల భవన నిర్మాణానికి ఈస్ట్రన్ నేవల్ కమాండ్ చీఫ్ వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్‌తో పాటు ఉన్నతాధికారులు ఆదివారం శంకుస్థాపన చేశారు. ఇప్పటి వరకూ 35 అంతస్తుల ఆక్సిజన్ టవర్స్ విశాఖలో అతి పొడవైన నిర్మాణం కాగా.. దానికంటే పెద్దదిగా నిర్మిస్తున్న ఈ భవనం.. విశాఖలో అతి ఎత్తయిన భవనంగా నిలవనుంది. తూర్పు నౌకాదళం పరిధిలో విధులు నిర్వర్తిస్తున్న సెయిలర్స్ కుటుంబాలు నివసించేందుకు ఈ భారీ భవనాన్ని నిర్మిస్తున్నారు.

అనుమతుల్లేని రాజకీయ ప్రకటనలను తొలగించండి

- ఎన్నికల ప్రవర్తన నియమావళిని పటిష్టంగా అమలుచేయాలి
- ఇంకా విధుల్లో చేరని ఎన్నికల అధికారులపై క్రమశిక్షణ చర్యలు
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్ కుమార్ మీనా



మాట్లాడుతున్న ముఖేష్ కుమార్ మీనా

సాక్షి, అమరావతి: ఎన్నికల నియమావళి అమల్లోకి వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వ కార్యాలయాలు, బహిరంగ స్థలాల్లో రాజకీయ ప్రకటనలతో ఉన్న హోర్డింగ్‌లు, పోస్టర్లు, కటౌట్లను తక్షణమే తొలగించాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా జిల్లా ఎన్నికల అధికారులను ఆదేశించారు. ప్రత్యేకించి రాష్ట్ర సచివాలయం పరిసర ప్రాంతాల్లో, కరకట్ట మార్గంలోనూ అనుమతి లేకుండా ఉన్న హోర్డింగులను తక్షణమే తొలగించాలని గుంటూరు జిల్లా కలెక్టర్‌ని ఆదేశించారు. ఇంకా విధుల్లో చేరని ఎన్నికల అధికారులపై తక్షణమే క్రమశిక్షణ చర్యలు చేపట్టాలన్నారు. శనివారం సాయంత్రం ఎన్నికల షెడ్యూలు ప్రకటించిన వెంటనే రాష్ట్రవ్యాప్తంగా అమల్లోకి వచ్చిన ఎన్నికల ప్రవర్తన నియమావళిని పటిష్టంగా అమలు పరిచేందుకు జిల్లా ఎన్నికల అధికారులు తీసుకుంటున్న చర్యలను ఆదివారం రాష్ట్ర సచివాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ఆయన సమీక్షించారు. ఫ్లయింగ్ స్క్వాడ్లు క్షేత్రస్థాయిలో విస్తృతంగా పర్యటిస్తూ నిబంధనలు అమలుపరిచేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. కొన్ని జిల్లాలకు సంబంధించి జిల్లా ఎన్నికల నిర్వహణ ప్రణాళికలు ఇప్పటి వరకూ అందకపోవడం వల్ల రాష్ట్ర ఎన్నికల నిర్వహణ ప్రణాళికను సమగ్ర స్థాయిలో రూపొందించలేకపోయామని, ఇక ఆలస్యం చేయకుండా ఎన్నికల నిర్వహణ ప్రణాళికలను పంపాలని ఆదేశించారు. సి-విజిల్‌లో అందే ఫిర్యాదులపై 100 నిమిషాల్లోపు, ఎన్నికల సంఘం నుంచి అందే ఫిర్యాదులపై అదే రోజు, మీడియాలో ప్రచురితమయ్యే ఫిర్యాదులపై, ఇతర ఫిర్యాదులపై 24 గంటల్లో చర్యలు చేపట్టాలని ఆదేశించారు. హైకోర్టులో దాఖలైన పలు కేసులపై తీసుకున్న చర్యలను ఆయన సమీక్షిస్తూ కేసులకు సంబంధించి వాస్తవ నివేదికను తమకు వెంటనే అందజేస్తే తదుపరి చర్యలు తీసుకుంటామని ముఖేష్‌కుమార్ మీనా చెప్పారు. ఈ సమావేశంలో అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు, అదనపు సీఈవోలు పాల్గొన్నారు.

తప్పుడు రాతల రామోజీపై సివిల్, క్రిమినల్ చర్యలు

ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి



కడప సెవెన్‌రోడ్స్ : ఇటీవల తనపై నిరాధారమైన ఆరోపణలతో ఈనాడులో తప్పుడు రాతలు రాయించిన రామోజీరావుపై సివిల్, క్రిమినల్ చర్యలు చేపడతానని కమలాపురం శాసనసభ్యుడు పి.రవీంద్రనాథరెడ్డి హెచ్చరించారు. కడప వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడారు. వెంచర్లు ఎంతో మంది వేస్తుంటారని, అయితే అవి తాను వేశానంటూ కథనాన్ని వండి వార్చారని ధ్వజమెత్తారు. కనీసం తన వివరణ కూడా తీసుకోలేదన్నారు. బుద్ధి, విజ్ఞత లేకుండా ఇష్టమొచ్చినట్టు రాతలు రాస్తే సహించేది లేదన్నారు. అడుగుపెట్టిన ప్రతిచోటా ఆక్రమించే కార్యక్రమాలు చేపట్టే రామోజీది గురివింద సామెత అని దుయ్యబట్టారు. తాను అబద్ధమాడనని, ఎవరి వద్ద ఒక రూపాయి ఆశించనని, తన జీవితం తెరిచిన పుస్తకమని ఎమ్మెల్యే అన్నారు. డబ్బులు ఉన్నప్పుడు రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తే తప్పేంటని ప్రశ్నించారు. తాను అందరి వద్ద కమీషన్లు తీసుకుంటున్నానని ఈనాడులో రాయడం దుర్మార్గమన్నారు. ఆయనతో వార్త రాయించిన వ్యక్తులే మట్టి, ఇసుక వంటివి అమ్ముకుంటున్నారని, రామోజీకి దమ్ముంటే వారి గురించి రాయాలని చెప్పారు. చంద్రబాబును పొగుడుతూ ఎదుటి వారిపై నిందలు మోపడం రామోజీకి రివాజుగా మారిందని విమర్శించారు. 2014, 2019 ఎన్నికల సమయంలోనూ తప్పుడు ఆరోపణలతో ఇలాంటి వార్తలే రాశారని, అప్పుడు తాను గెలుపొందినట్టు చెప్పారు. ఇప్పుడు కూడా తనపై వార్తలు రాస్తున్నారని, మళ్లీ గెలిచి హ్యాట్రిక్ విజయం సాధిస్తానని ధీమా వ్యక్తం చేశారు. సమావేశంలో డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, సోషల్ వెల్ఫేర్ బోర్డు రాష్ట్ర చైర్మన్ పులి సునీల్‌కుమార్, రాజేంద్రనాథ్‌రెడ్డి, చీర్ల సురేష్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

ఎండల వేళ.. ఉరుముల వాన

- నాలుగు రోజులపాటు రాష్ట్రంలో భిన్న వాతావరణం
- ఉష్ణతాపం, ఉక్కపోతతోపాటు తేలికపాటి వర్షాలు
- 20న కోస్తాంధ్రలో భారీ వర్షాలకు ఆస్కారం
- సాధారణం కంటే 2–4 డిగ్రీలు అధిక ఉష్ణోగ్రతలు

సాక్షి, విశాఖపట్నం: రాష్ట్రంలో ఎండలు ఉధృతమవుతున్నాయి. ఉష్ణోగ్రతలు ఊపందుకుంటూ ఉష్ణ తీవ్రతను పెంచుతున్నాయి. మార్చిలోనే ఏప్రిల్ నాటి ఎండలను తలపిస్తున్నాయి. ఈ తరుణంలో చల్లని జల్లులను కురిపించే వాతావరణం నెలకొంటోంది. ఒకపక్క ఉష్ణతాపం కొనసాగుతుంటే.. మరోపక్క ఉరుములు, మెరుపులతో కూడిన వర్షాలకు ఆస్కారం ఏర్పడుతోంది. ప్రస్తుతం పశ్చిమ విదర్భ నుంచి ఉత్తర కేరళ వరకు మరఠ్వాడా, కర్ణాటక వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. అదే సమయంలో రాష్ట్రంపైకి దక్షిణ, నైరుతి దిశ నుంచి గాలులు వీస్తున్నాయి. వీటన్నిటి ఫలితంగా రానున్న నాలుగు రోజులు కోస్తాంధ్ర, రాయలసీమల్లో ఉష్ణోగ్రతలు పెరుగుతూనే ఉరుములు, మెరుపులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు అక్కడక్కడా కురుస్తాయని భారత వాతావరణ శాఖ ఆదివారం నాటి నివేదికలో వెల్లడించింది. ఒకట్రెండు చోట్ల పిడుగులు పడే అవకాశం కూడా ఉందని పేర్కొంది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణకంటే 2–4 డిగ్రీలు అధికంగా నమోదయ్యే అవకాశం ఉందని తెలిపింది. రాష్ట్రంలో వేడి, ఉక్కపోతతో కూడిన అసౌకర్య వాతావరణం నెలకొంటుంది. మరోవైపు ఈ నెల 20 నాటికి దక్షిణ ఛత్తీస్‌గఢ్‌కు చేరువలో ఉపరితల ఆవర్తనం ఏర్పడనుంది. దాని ప్రభావంతో 20న ఉత్తర, దక్షిణ కోస్తాంధ్రల్లో అక్కడక్కడా భారీ వర్షాలు కురవవచ్చని వివరించింది. మార్చి నెలలో ఇలాంటి వాతావరణం అరుదుగా ఏర్పడుతుందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు.

కువైట్‌లో మళ్లీ క్షమాభిక్ష అమలు

జూన్ 17 వరకు 90 రోజుల పాటు చాన్స్

మోర్తాడ్(బాల్కొండ): తమ దేశానికి వచ్చి వీసా గడువు ముగిసిపోయినా చట్టవిరుద్ధంగా ఉంటున్న వలసదారులు వారి సొంత గడ్డకు వెళ్లడానికి కువైట్ ప్రభుత్వం ఆమ్నెస్టీ (క్షమాభిక్ష)ని ప్రకటించింది. ఆదివారం మొదలైన క్షమాభిక్ష.. జూన్ 17వ తేదీ వరకు కొనసాగనుంది. చట్టవిరుద్ధంగా ఉంటున్న వలసదారులు తమ దేశాలకు వెళ్లిపోవడానికి కువైట్‌లోని ఎంబసీల్లో దరఖాస్తులను సమర్పించాల్సి ఉంటుంది. కరోనా విపత్కర సమయంలో క్షమాభిక్ష అమలు చేయగా, నాలుగేళ్ల విరామం తర్వాత మరోసారి ఆమ్నెస్టీని ప్రకటిస్తూ కువైట్ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులను జారీ చేసింది. కువైట్‌లో వివిధ దేశాలకు చెందిన వలసదారులు దాదాపు 1.65 లక్షల మంది ఉన్నారని అంచనా. ఇందులో తెలుగు రాష్ట్రాల కార్మికులు సుమారు 15 వేల మంది వరకు ఉంటారని కార్మిక సంఘాల నాయకులు వెల్లడించారు. కరోనా సమయంలో 2020లో అమలు చేసిన ఆమ్నెస్టీతో భారీ సంఖ్యలో కార్మికులు ఇంటిబాట పట్టారు. ఇప్పుడు మరోసారి క్షమాభిక్ష అమలు చేస్తుండటంతో పెద్ద సంఖ్యలోనే వలస కార్మికులు సొంతగడ్డకు చేరుకునే అవకాశం ఉంది. క్షమాభిక్ష అమలు చేసిన సమయంలో వీసా గడువు ముగిసినవారు ఎలాంటి జరిమానా చెల్లించకుండా, జైలు శిక్ష అనుభవించకుండానే ఇంటికి వెళ్లొచ్చు.

వైఎస్సార్‌సీపీలోకి భారీగా చేరికలు



ఎమ్మెల్యే వాసుబాబు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ, ఇతర పార్టీల నాయకులు



ముస్కేపాలెంలో జనసేన కార్యకర్తలను వైఎస్సార్‌సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ప్రసాదరాజు

నరసాపురం రూరల్/భీమడోలు: ప్రజల సంక్షేమం, అభివృద్ధికి పెద్దపీట వేస్తున్న సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంపై ఉన్న నమ్మకంతోనే టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున వైఎస్సార్‌సీపీలో చేరుతున్నారని ప్రభుత్వ చీఫ్ విప్, నరసాపురం ఎమ్మెల్యే ముదునూరి ప్రసాదరాజు అన్నారు. పశ్చిమ గోదావరి జిల్లా నరసాపురం మండలంలోని లక్ష్మణేశ్వరం గ్రామం ముస్కేపాలెంలో కొప్పాడ శ్రీనివాస్ (దుబాయ్ శ్రీను) ఆధ్వర్యాన 50 మందికిపైగా జనసేన పార్టీ నాయకులు, కార్యకర్తలు ఆదివారం వైఎస్సార్‌సీపీలో చేరారు. వారికి ప్రసాదరాజు వైఎస్సార్‌సీపీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ప్రజలు పట్టం కట్టాలని, వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు అండ్రాజు చల్లారావు, తిరమాని నాగరాజు, తిరుమాని కృష్ణంరాజు, మత్తే సువర్ణరాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి...

ఏలూరు జిల్లా భీమడోలు మండలం పూళ్లలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో ఉంగుటూరు ఎమ్మెల్యే పుప్పాల వాసుబాబు సమక్షంలో టీడీపీతోపాటు ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు, మహిళలు పెద్ద సంఖ్యలో వైఎస్సార్‌సీపీలో చేరారు. బీసీ చైతన్య సంక్షేమ సంఘం ఏలూరు జిల్లా అధ్యక్షుడు పాకిన సత్యనారాయణ, భీమడోలు బీసీ కాలనీ, అర్జావారిగూడెం, లింగంపాడు, వడ్లపట్ల, పోలసానిపల్లి గ్రామాలకు చెందిన టీడీపీ, ఇతర పార్టీల నాయకులు శానం నాగేశ్వరరావు, రెడ్డి వీర్రాజు, బెజవాడ రమేష్, ఉయ్యాల కృష్ణ, కురమా రాజు, రత్తయ్య, ముంద్రు రత్తయ్య, లాజర్‌లతోపాటు అధిక సంఖ్యలో యువకులు, మహిళలు వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా వాసుబాబు మాట్లాడుతూ సంక్షేమ రాజ్యం సీఎం జగనన్నతోనే సాధ్యమని అన్నారు.

ఒకే కార్డుతో దేశవ్యాప్తంగా మెట్రో జర్నీ

- అందుబాటులోకి రానున్న ఎన్‌సీఎంసీ
- ఇదే కార్డుపైన బస్సులు, క్యాబ్‌లు, ఆటోల్లో కూడా ప్రయాణం

సాక్షి,హైదరాబాద్: ఇకపై దేశవ్యాప్తంగా ఏ మెట్రోరైలులోనైనా ఒకే కార్డుపై ప్రయాణం చేయవచ్చు. అంతేకాదు ఈ కార్డును మెట్రోతోపాటు బస్సులు, ఆటోలు, క్యాబ్‌లు తదితర ప్రజారవాణా సేవలకు కూడా వినియోగించుకోవచ్చు. ప్రయాణ సదుపాయాలను మరింత సులభతరం చేసేందుకు నేషనల్ కామన్ మొబిలిటీ కార్డు (ఎన్‌సీఎంసీ) త్వరలో అందుబాటులోకి రానుంది. ఢిల్లీ, చెన్నై, బెంగళూరు, కోల్‌కత్తా నగరాల్లో మెట్రో రైళ్ల కామన్ మొబిలిటీ కార్డు ద్వారా సేవలు అందించేందుకు ఇప్పటికే ముందుకొచ్చాయి. త్వరలో హైదరాబాద్ మెట్రో రైల్ సేవలు కూడా ఎన్‌సీఎంసీతో అనుసంధానం చేస్తామని అధికారులు చెప్పారు.ఈ కార్డును ప్రయాణికులకు అందుబాటులోకి తెచ్చేందుకు ప్రణాళికలు సిద్ధం చేసినట్టు పేర్కొన్నారు. 'ప్రయాణికులు ఒకసారి ఈ కార్డును కొనుగోలు చేస్తే దేశంలోని వివిధ నగరాల్లో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ఈజీగా జర్నీ చేయవచ్చు. రవాణా అవసరాల మేరకు ఆన్‌లైన్‌లోనే కార్డు రీచార్జ్ చేసుకోవచ్చు' అని చెప్పారు. కామన్ మొబిలిటీ కార్డుపైన ప్రయాణం చేసే సమయంలో ప్రస్తుతం మెట్రో స్టేషన్లలో మెట్రోకార్డు స్వైప్ చేస్తున్నట్టుగానే చేయాల్సి ఉంటుంది. దీంతో ఆయా రవాణా సంస్థలు విధించే చార్జీలు ప్రయాణికుడి ఖాతాలోంచి ఆయా మెట్రో సంస్థల ఖాతాలోకి వెళతాయి.

ఒకే కార్డు..ప్రయోజనాలెన్నో

కామన్ మొబిలిటీ కార్డును మెట్రో రైళ్లతో అనుసంధానం చేసే ప్రక్రియ తుదిదశకు చేరుకుంది. ఆపై ఉబర్, ఓలా తదితర యాప్ ఆధారిత రవాణా సేవలు అందజేసే సంస్థలను కూడా అనుసంధానం చేస్తారు. దీంతో ప్రయాణికులు మెట్రో నుంచి క్యాబ్‌లోకి, ఆటోలోకి మారవచ్చు. కామన్ కార్డు ద్వారా చార్జీలు చెల్లించవచ్చు. కామన్ మొబిలిటీ కార్డు సేవలను రవాణా సంస్థల్లో మొదట ప్రవేశపెట్టిన తర్వాత దశలవారీగా అన్ని రకాల వస్తుసేవల వినియోగంలోకి విస్తరించే అవకాశం ఉందని హైదరాబాద్ మెట్రో రైల్ ఎల్‌అండ్‌టీ సంస్థ ప్రతినిధి ఒకరు తెలిపారు. ప్రస్తుతం నగరంలోని మెట్రో రైళ్లలో ప్రతి రోజు సుమారు 4.8 లక్షల మంది ప్రయాణికులు మెట్రో సేవలు వినియోగించుకుంటున్నారు.

Published and printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published from Vishnu Motor Plaza, 2nd Floor, 31-A, Jawaharlal Nehru Road, Ekkattuthangal, Chennai -600 032 and Printed Jagati Publications Limited, Survey No.172, Vegata Village, Jadigenalhalli, Hoskote Taluk,Bangaluru Rural Dist, MNS Printers Private Limited, Survey no. 76/1, Noombal Village, Velappanchavadi, Poonamallee High Road, Chennai - 600 077. Impression Printing & Packaging Limited, C-18-19-20, Sector -59, Noida, Uttar Pradesh-201 301, Dangat Media Pvt Ltd.,22 Dighe MIDC, Navi Mumbai, Maharashtra- 400708.
Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) RNI No:TNTEL/2008/25943

బళ్లారిలో 18,65,341 మంది ఓటర్లు

- పురుషులు 9,20,022
- మహిళలు 9,45,053
- పోలింగ్ కేంద్రాలు 1972


విలేకరులతో మాట్లాడుతున్న జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్‌కుమార్ మిశ్రా

సాక్షి,బళ్లారి: కర్ణాటకలో రెండు దశల్లో పోలింగ్ నిర్వహించేందుకు తేదీలు ఖరారు చేశారు. ఇందులో బళ్లారి లోక్‌సభ నియోజకవర్గానికి మే 7న ఎన్నికల జరిపేందుకు ఆదేశాలు జారీ చేశారు. దీంతో ఆదివారం జిల్లాధికారి కార్యాలయంలో జిల్లా ఎన్నికల అధికారి ప్రశాంత్ కుమార్ మిశ్రా విలేకరులతో మాట్లాడారు. బళ్లారి లోక్‌సభ పరిధిలో 18,65,341 మంది ఓటర్లు ఉన్నారని, ఇందులో మహిళలు 9,45,053 మంది, పురుషులు 9,20,022 మంది ఉన్నారని, ఇతరులు 266 మంది ఉన్నారని, నూతనంగా ఓటు హక్కు నమోదుకు ఏప్రిల్ 9 వరకు గడువు ఉందన్నారు. జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిందని, బళ్లారి లోక్‌సభకు మే 7న ఎన్నికలు జరుగుతాయని, జూన్ 4న ఓట్లు లెక్కింపు నిర్వహిస్తామన్నారు. బళ్లారి పరిధిలో 8 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయని, ఉమ్మడి బళ్లారి జిల్లాలో 1972 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. ఎన్నికలను పకడ్బందీగా నిర్వహించేందుకు గట్టి చర్యలు తీసుకున్నామన్నారు. లోక్‌సభ పరిధిలో 35 చెక్‌పోస్టులు ఏర్పాటు చేశామని చెప్పారు. కార్యక్రమంలో ఎన్నికల అధికారులు రాహుల్ శరణప్ప, మహమ్మద్ జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించాలి :

లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ నేపథ్యంలో జిల్లా ఎన్నికల అధికారి అఖిల పక్ష బృందంతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసుకుని ఎన్నికల నియమావళి గురించి తెలియజేశారు. మార్చి 16న భారత ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ విడుదల చేసిందని, ఈ నేపథ్యంలో ఎన్నికలు ముగిసి, ఓట్ల లెక్కింపు జరిగే వరకు జిల్లాలో ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుందని, రాజకీయ పార్టీ నాయకులు, అభ్యర్థులు ఎన్నికల నియమావళిని ఉల్లంఘిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. సభలు, సమావేశాలు జరిపేటప్పుడు అనుమతి తీసుకోవాలని, వాహనాలు, హెలికాప్టర్లు వాడేటప్పుడు కూడా వారి ఎన్నికల ఖర్చులోకి వస్తుందన్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఫ్లెక్సీలు, బ్యానర్లు తదితర ప్రచారం సంబంధించి ఎన్నికల నియమావళి ప్రకారం నడుచుకోవాలన్నారు. కార్యక్రమంలో బీజేపీ, కాంగ్రెస్ తదితర అన్ని రాజకీయ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

రాయాచూరు ఓటర్లు 19,93,755

రాయచూరు రూరల్: రాయాచూరు, యాదగిరి లోక్‌సభ పరిధిలో 19,93,755 ఓటర్లు ఉన్నారని జిల్లా అధికారి చంద్రశేఖర్ నాయక్ తెలిపారు. రాయచూరు, యాదగిరి జిల్లాలో ఎనిమిది నియోజక వర్గాలు వస్తాయని, 2203 పోలింగ్ కేంద్రాలున్నాయని, 10,336 మంది అధికారులు, సిబ్బందిలను నియమించామన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు

క్లుప్తంగా

సమాజ సేవకు సహకరించాలి


జ్యోతి వెలిగిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: సమాజ సేవకు ప్రతి ఒక్కరూ సహకరించాలని చిక్కసూగురు మఠాధిపతి డా.సిద్దలింగ స్వామీజీ అన్నారు. ఆదివారం పండిత సిద్దరామ జంబల దిన్ని రంగ మందిరంలో శరణప్ప గోనాళ ప్రతిష్టాన ఆధ్వర్యంలో మహంత శ్రీ అవార్డుల ప్రదానం చేసే కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. సమాజంలో పేదవారిని మానవతా దృష్టితో చూడాలని చేతనైనంత సహాయం చేయడం మన ధర్మమనే విషయాన్ని ప్రస్తావించారు. సమాజంలో తనదైన సేవలు అందిస్తున్న శరణప్ప సేవలు అనన్యమన్నారు. కార్యక్రమంలో గణపతి సాక్రే,చంద్రశేఖర్, కేశవరెడ్డి, మురళీధర్, శ్రీకాంత్, ప్రతిభా తదితరులు పాల్గొన్నారు.

పార్కులను అభివృద్ధి చేస్తాం

- బుడా అధ్యక్షుడు జేఎస్ ఆంజనేయులు


బుడా అధ్యక్షుడు ఆంజనేయులు (మధ్యలో)

సాక్షి,బళ్లారి: నగరంలోని బుడా పరిధిలో అధ్వానంగా ఉన్న పార్కులను అభివృద్ధి చేస్తామని బుడా నూతన అధ్యక్షుడు జే.ఎస్ ఆంజనేయులు పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని రాఘవేంద్ర కాలనీ 2వ క్రాస్‌లో పార్కులో స్థానికులు, ఉద్యానవం సంఘ సభ్యులు తదితరులు ఆయన్ను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ... బుడా అధ్యక్షుడుగా బాధ్యతలు తీసుకున్న తర్వాత పార్కుల స్థితిగతులపై దృష్టి పెట్టి అభివృద్ధి చేస్తామన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు నందీష్, వివేక్, (విక్కీ), జేడీఎస్ నాయకుడు మీనళ్లి తాయణ్ణ తదితరులు పాల్గొన్నారు.

సంగీతానికి ప్రాణం పోయాలి


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

రాయచూరు రూరల్: మరపురాని సంగీతానికి ప్రాణం పోయాలని సీనియర్ కవయిత్రి జయలక్ష్మి మంగళమూర్తి అన్నారు. ఆదివారం నగరంలోని కర్ణాటక సంఘంలో శ్రుతి సాహిత్య మేళా ఉత్సవంలో గాన సంగీతోత్సవ సంభ్రమాలను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో శ్రుతి సాహిత్య మేళా అధ్యక్షులు మురళీధర్ కులకర్ణి, శాంతప్ప, మల్లికార్జున, వెంకటేష్ బెవిన బెంచి, దానప్ప, మారుతి తదితరులు పాల్గొన్నారు.

పునీత్ సేవలు మరువలేనివి

- బళ్లారి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి జీ.శ్రీరాములు


పునీత్ చిత్రపటానికి నివాళులు అర్పించిన దృశ్యం

సాక్షి,బళ్లారి: కర్ణాటక సినీ రంగంలో గొప్ప పేరుతెచ్చుకుని, యువతకు ఆశాకిరణంగా నిలిచిపోయిన దివంగత పునీత్ రాజ్‌కుమార్ సేవలు మరువలేనివని బళ్లారి లోక్‌సభ బీజేపీ అభ్యర్థి బీ.శ్రీరాములు పేర్కొన్నారు. ఆయన ఆదివారం తన నివాసంలో పునీత్ రాజ్‌కుమార్ జయంతి ఏర్పాటు చేసి అభిమానుల సమక్షంలో కేక్‌కట్ చేసి పావురాలను ఎగరవేసి, ఆయన చిత్ర పటానికి నివాళులు అర్పించారు. అతి చిన్న వయస్సులోనే ఆయన అందనంత ఎత్తుకు ఎదిగారని, ఆయన మన మధ్య లేకపోయినా, ఆయన చేపట్టిన సేవా కార్యక్రమాలు, ఆశయాలు మరవడానికి సాధ్యం కాదన్నారు. నేటి యువతకు ఆయన ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే నందిహళ్లి హాలప్ప, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


అధ్యక్షుడిగా చిదానందప్ప


చిదానందప్ప

సాక్షి,బళ్లారి: ఐదు గ్యారెంటీ పథకాల సమితి బళ్లారి జిల్లా అధ్యక్షుడిగా కే.ఈ చిదానందప్పను నియమించారు. ఇక ఉపాధ్యక్షులుగా ఎన్ కరిబసప్ప, ఎ.మానయ్య, ఆశాలత సోమప్ప, చాంద్‌భాష, సంగనకల్లు విజయ్ కుమార్‌లను ఖరారు చేశారు. వీరితో పాటు కమిటీలో పలువురు సభ్యులను నియమించారు. చిదానందప్ప మాట్లాడుతూ... అర్హులైన ప్రతి ఒక్కరికి గ్యారెంటీ పథకాలు అందేలా కృషి చేస్తామన్నారు.

బళ్లారి కాంగ్రెస్ అభ్యర్థి ఎవరో?

- తమవారి కోసం ప్రముఖుల ప్రయత్నాలు
- గెలుపుపై అధికార పార్టీ కన్ను



సాక్షి,బళ్లారి: లోక్‌సభ ఎన్నికల నోటిఫికేషన్ విడుదలైన ఇంకా కాంగ్రెస్ అభ్యర్థి ఎవరన్నది తేల్చలేకపోతున్నారు. ఇప్పటికే బళ్లారి లోక్‌సభ నుంచి బీజేపీ తరుపున పోటీ చేసేందుకు శ్రీరాములు పేరు ఖరారు చేయడంతో పాటు ఆయన ఉమ్మడి బళ్లారి జిల్లాలో విస్తృతంగా సభలు, సమావేశాలు జరిపి ముందుకెళ్లుతున్నారు. కాంగ్రెస్ నుంచి ఎవరు పోటీ చేస్తారన్న దానిపై ఉత్కంఠత వీడకపోవడంతో కాంగ్రెస్ కార్యకర్తల్లో టెన్షన్..టెన్షన్ నెలకొంది.

1999 లోక్‌సభ ఎన్నికల్లో మాజీ కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియాగాంధీ,బీజేపీ తరుపున దివంగత సుష్మాస్వరాజ్ పోటీ చేయడంతో రాజకీయంగా దేశ వ్యాప్తంగా బళ్లారి గురించి తెలియని వారు ఉండరంటే అతిశయోక్తి కాదు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉండటంతో పాటు, బళ్లారి లోక్‌సభ పరిధిలో 9 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 7 నియోజకవర్గాల్లో కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎమ్మెల్యేలు ఉన్నారు. దీంతో సహజంగానే కాంగ్రెస్ పార్టీకి మంచి పట్టు ఏర్పడిందని చెప్పవచ్చు. కాంగ్రెస్ వర్గాల్లో ముగ్గురు పేర్లపై పరిశీలన చేస్తున్నట్లు సమాచారం. ఇందులో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాగేంద్ర సోదరుడు వెంకటేశ్ ప్రసాద్ ఈయన ముందు నుంచి టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. సొంత అన్నకు టికెట్ ఇప్పించాలన్న ఉద్దేశ్యంతో జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి నాగేంద్ర గట్టి ప్రయత్నాలు చేస్తుండగా, సండూరు ఎమ్మెల్యే తుకారం తన కుమార్తె చైతన్య అలియాస్ సౌపర్ణిక టికెట్ ఇప్పించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. మాజీ లోక్‌సభ సభ్యుడు ఉగ్రప్ప కూడా ముమ్మర ప్రయత్నాలు చేస్తున్నారు. వీరి ముగ్గురు పేర్లను పరిశీలిస్తున్న పార్టీ హైకమాండ్ అనూహ్య రీతిలో కాంగ్రెస్ తరపున పోటీ చేసేందుకు మంత్రి బీ.నాగేంద్రనే రంగంలోకి దింపితే మంచి ఆదరణ లభిస్తుందని, ఆ దిశగా అడుగులు వేస్తారన్న దానిపై ప్రచారం సాగుతోంది.

ప్రశాంతంగా వీవీ సంఘం ఎన్నికలు


ఓటు వినియోగించుకోవడానికి వచ్చిన సభ్యులు

సాక్షి,బళ్లారి: వీరశైవ విద్యావర్ధక సంఘం ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయి. ఆదివారం నగరంలోని ఆర్‌వైఎంసీ కళాశాలలో సంఘం సభ్యులు పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. మూడేళ్లకొకసారి జరిగే వీరశైవ విద్యావర్ధక సంఘం ఎన్నికలను సంఘం సభ్యులు ఉత్సాహం పాల్గొన్నారు. ఈ ఎన్నికల్లో 2480 ఓటర్లు ఉండగా, 85 శాతం ఓటు హక్కు వినియోగించుకున్నారు. గ్రామీణ భాగం నుంచి 14, సిటీ భాగం నుంచి 16 మంది సభ్యులను ఎన్నుకోవాల్సి ఉండగా, ఇందులో 74 మంది పోటీ పడ్డారు. ప్రస్తుతం జరిగిన ఎన్నికల్లో గెలుపొందిన 30 మంది సభ్యుల్లో ఆయా కళాశాలలకు అధ్యక్షులుగా నియమిస్తారు. ప్రస్తుత అధ్యక్షుడుగా కొనసాగుతున్న రామనగౌడ పదవీ కాలం ముగిసింది. ప్రశాంతం ఎన్నికలు ముగియడంతో నేడు (సోమవారం) ఓట్ల లెక్కింపు ఉంటుంది. ఓటు వినియోగించుకున్న ప్రముఖుల్లో మాజీ మంత్రి అల్లం వీరభద్రప్ప, విధాన పరిషత్ సభ్యుడు, వై.ఎం.సతీష్, మాజీ రాష్ట్ర బోర్డు చైర్మన్, జిల్లా బీజేపీ మాజీ అధ్యక్షుడు విరుపాక్షిగౌడ, వీరశైవ మహాసభ రాష్ట్ర అధ్యక్షుడు తిప్పణ్ణ తదితరులు పాల్గొన్నారు.

పకడ్బందీగా ఎన్నికలు

- అధికారులతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్


మాట్లాడుతున్న జిల్లాధికారి దివాకర్

హొసపేటి: లోక్‌సభ ఎన్నికలు పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఎంఎస్ దివాకర్ జిల్లా, తాలూకా స్థాయి అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల సంఘం ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించిన అనంతరం కలెక్టరేట్‌లో ఆయన జిల్లా, తాలూకా స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అధికారులు, సిబ్బంది కచ్చితంగా విధులు నిర్వహించాలన్నారు. జిల్లా వ్యాప్తంగా అన్ని బదిలీలు, సెలవులు నిషేధించామన్నారు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. విలేకరుల సమావేశంలో సీఈఓ సదాశివ ప్రభు, డెప్యూటీ కలెక్టర్ అనురాధ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా వ్యాప్తంగా భారీ బందోబస్తు

లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ హరిబాబు తెలిపారు. కలెక్టరేట్ ఆయన మాట్లాడుతూ... పట్టణ పరిధిలో 365, గ్రామీణ ప్రాంతాల్లో 869 కలిపి మొత్తం 1234 పోలింగ్ కేంద్రా ఏర్పాటు చేసినట్లు చెప్పారు. సున్నిత పోలింగ్ కేంద్రాలపై నిఘా ఉంచుతామన్నారు.

ఘనంగా పునీత్ జయంతి


రక్తదానం చేస్తున్న హుండేకర్ రాజేష్ తదితరులు

బళ్లారి అర్బన్: కేవలం నటనతోనే కాకుండా సమాజ సేవలో తనదైన శైలిలో కృషి చేసిన యువత స్ఫూర్తిదాత, కన్నడ చిత్రసీమ ముద్దుబిడ్డ డాక్టర్.పునీత్‌రాజ్‌కుమార్ జయంతిని బళ్లారిలో ఘనంగా నిర్వహించారు. పెద్ద మార్కెట్ సమీపంలోని అప్పు సేవ సమితి కార్యాలయం ఎదుట రక్తదాన శిబిరం నిర్వహించారు. రాజ్ అభిమానులు రక్తదానం చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ హనుమంత గుడిగంటే, సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జేపీ మంజునాథ్, అధ్యక్షులు రవికుమార్, ప్రధాన కార్యదర్శి హుండేకర్ రాజేష్ తదితరులు రక్తదానం చేసి తన అభిమానాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో సమితి ప్రముఖులు చలపతి, విబూతి నాగరాజ్, శరణ, మిథున్‌కుమార్, లింబురాజేష్, లక్ష్మీరెడ్డి, బసవ, శ్రీధర్, వస్నూర, యశోధర, సురేష్ తదితరుల పాల్గొన్నారు.

టీబీ రహిత జిల్లాగా బళ్లారి


జాతా ప్రారంభిస్తున్న డీహెచ్‌ఓ డాక్టర్.వై రమేష్‌బాబు

బళ్లారి అర్బన్: టీబీ రహిత జిల్లాగా బళ్లారిని తీర్చిదిద్దుదామని డీహెచ్‌ఓ డాక్టర్.వై రమేష్‌బాబు తెలిపారు. వివిధ శాఖల ఆధ్వర్యంలో విమ్స్ నుంచి జిల్లా ఆస్పత్రి వరకు ఏర్పాటు చేసిన మారథాన్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. ముందస్తు జాగ్రత్తలతో క్షయవ్యాధిని నిర్మూలించవచ్చన్నారు. అనంతరం మారథాన్ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో విమ్స్ డాక్టర్.మల్లికార్జున, డాక్టర్.రఘువీర, డాక్టర్. అనిల్ కుమార జోసఫ్, జిల్లా ఆరోగ్య విద్యాధికారి ఈశ్వర దాసప్పనవర, వైద్య విద్యార్థి సంఘం డాక్టర్ లోకేష్, డాక్టర్.గౌరి, ప్రసన్న, డాక్టర్.సంతోష హావేరి తదితరులతో పాటు పెద్ద ఎత్తున వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

ఉత్తమ సమాజ నిర్మాణానికి తోడ్పడాలి


జ్యోతి వెలిగిస్తున్న స్వామీజీ

రాయచూరు రూరల్: ఉత్తమ సమాజ నిర్మాణానికి మహిళలు ముందుకు రావాలని కిల్లే బృహన్మఠాధిపతి శాంతమల్ల శివాచార్యులు పేర్కొన్నారు. శనివారం రాత్రి పండిత సిద్ద రామ జంబలదిన్ని రంగ మందిరంలో జనసేవ చారిటబుల్ ట్రస్ట్ ఏర్పాటు చేసిన అంతర్జాతీయ మహిళ దినోత్సవంలో జ్యోతి వెలిగించి మాట్లాడారు. మహిళలు విద్యా, సామాజిక, ఆర్థిక రంగాల్లో అభివృద్ధి సాధించాలన్నారు. సమావేశంలో దేవన్న నాయక్, శ్రీదేవి నాయక్, గాయత్రి, ఈరమ్మ, సరస్వతి, శివమ్మ, నాగవేణి తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవలో పునీతుడు



పునీత్ చిత్రపటానికి నివాళి

రాయచూరు రూరల్: కోట్లాది మంది ఆత్మీయుడు, కన్నడ చిత్రసీమ ముద్దుబిడ్డ పునీత్ రాజ్‌కుమార్ సమాజ సేవలో పునీతుడని డాక్టర్ పునీత్ రాజ్‌కుమార్ సంఘం జిల్లా అధ్యక్షుడు సాదిక్ పేర్కొన్నారు. ఆదివారం నగరంలోని నిరాశ్రిత కేంద్రంలో పునీత్ రాజ్‌కుమార్ జయంతి ఉత్సవంలో పాల్గొన్నారు. అంతకు ముందు ఆయన పునీత్ చిత్రపటానికి పూలహారం వేసి నివాళి అర్పించారు. అనంతరం పేదలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

వాహనాల తనిఖీ షురూ

హొసపేటి: లోక్‌సభ ఎన్నికల కోడ్ అమల్లోకి రావడంతో ఆదివారం తహసీల్దార్ శ్రుతి వాహనాల తనిఖీలను కట్టుదిట్టుగా నిర్వహించారు. నగరం శివార్లలో సరిహద్దు ప్రాంతాల్లో ఆమె సిబ్బందితో తనిఖీలు చేశారు. మొత్తం 14 చోట్ల చెక్ పోస్టులకు ఏర్పాటు చేశారు.

పునీత్‌కు ఘన నివాళి


అప్పు విగ్రహానికి నివాళి

హొసపేటి: డాక్టర్.పునీత్ రాజ్‌కుమార్ జయంతి సందర్భంగా ఆదివారం నగరంలో ఉన్న పునీత్ విగ్రహానికి ఆయన అభిమానులు నివాళి అర్పించారు. నృత్య అకాడమి కుర్రాళ్ల కేక్‌కట్ చేసి, అప్పు అప్పు అంటూ నినాదాలు చేశారు. కిచ్చడి విశ్వ, జోగి తాయప్ప సహా వందలాది మంది అభిమానులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో మహిళలకు టికెట్ ఇవ్వాలి

రాయచూరు రూరల్: కాంగ్రెస్ పార్టీ లోక్‌సభ ఎన్నికల్లో మహిళలకు టికెట్ ఇవ్వాలని ఆ పార్టీ మహిళా అధ్యక్షురాలు నాగవేణి పాటిల్ డిమాండ్ చేశారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ...పార్టీ అధిష్టానంపై ఒత్తిడి తెచ్చి ఎస్టీ రిజర్వేషన్ జాబితాలో ఉన్న రాయచూరు, బళ్లారి జిల్లాలు మహిళలకు కేటాయించాలన్నారు.

తల్లీ బిడ్డ అదృశ్యం

హుబ్లీ: మహిళా సంఘాలలో చేసిన అప్పుల విషయానికి ఘర్షణ పడి ఇంటి నుంచి బిడ్డతో పాటు భార్య అదృశ్యమైందని భర్త ఫిర్యాదు చేశాడు. స్థానిక నేకార నగర గణేష్ కాలనీ జయశ్రీ, ఐదేళ్ల బాలుడితో వెళ్లి పోయింది. ఈ నెల 5న సంఘంలో చేసిన అప్పు విషయమై ఘర్షణ పడిన జయశ్రీ దీన్నే మనసులో పెట్టుకొని ఇంటిలో ఎవరికి చెప్పకుండా కుమారుడిని తీసుకొని కనిపించకుండా పోయిందని భర్త సాగర పోలీసులకు ఫిర్యాదు చేశారు.

స్టాక్ మార్కెట్ పేరుతో లక్షల వంచన

హుబ్లీ: ఆన్‌లైన్ మోసాల గురించి తరచూ వార్తలు వస్తున్నా అమాయకులు జాగృతం కావడం లేదు. తాజాగా ఓ వ్యక్తి పెద్ద మొత్తంలో నష్టపోయాడు. స్థానిక కేశవపుర చంద్రహాస బాధితుడు. వివరాలు...ఆన్‌లైన్ ట్రేడింగ్ ఇన్‌వెస్ట్‌మెంట్ పేరుతో చంద్రహాసకు ఒక సందేశం వచ్చింది. సైబర్ కేటుగాళ్లు చంద్రహాసను వారి గ్రూప్‌లో చేర్పించుకున్నారు. అనంతరం షేర్లను కొనుగోలు చేసి విక్రయిస్తే ఎక్కువ లాభాలు వస్తాయంటూ నమ్మించారు. వారు సూచించిన ఖాతాలకు బాధితుడు రూ. 71 లక్షలకు పంపించాడు. అనంతరం మోసగాళ్ల ఫోన్ స్విచాఫ్ కావడంతో వంచన గ్రహించి నగర సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పాత్రికేయులకు డీవీ గుండప్ప ఆదర్శం

కోలారు: నేటి పాత్రికేయులకు డివి గుండప్ప ఆదర్శమని పాత్రికేయుల సహకార సంఘం అధ్యక్షుడు కెఎస్ గణేష్ తెలిపారు. ఆదివారం నగరంలోని పాత్రికేయుల భవనంలో నిర్వహించిన గుండప్ప జయంతి కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గుండప్ప పాత్రికేయుల సంఘాన్ని ప్రారంభించడమే కాకుండా పాత్రికేయుడిగా కూడా పని చేశారని, పొట్టకూటి కోసం పాత్రికేయ వృత్తిలోకి వచ్చానని చెప్పుకున్న గుండప్ప ఎన్నడూ నైతిక విలువలను వదులుకోలేదన్నారు. డీవీజీ రచించిన వృత్త పత్రిక అనే రచన నేటికి అజరామరమన్నారు. సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్‌కె చంద్రశేఖర్ మాట్లాడుతూ... సంఘం ఆధ్వర్యంలో ప్రతి ఏటా గుండప్ప జయంతిని నిర్వహిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీ మునిరాజు మాట్లాడుతూ...గుండప్ప చూపించిన మార్గంలో నడుస్తామన్నారు. కార్యక్రమంలో సహకార సంఘం ఉపాధ్యక్షుడు అబ్బణి శంకర్, సీనియర్ పాత్రికేయుడు ఎంజి ప్రభాకర్ పాల్గొన్నారు.

దేశ నిర్మాణంలో న్యాయవాదుల పాత్ర మహత్తరం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: సదృఢ భారత దేశ నిర్మాణంలో న్యాయవాదుల పాత్ర ఎంతో మహత్తర మైనదని హైకోర్టు న్యాయమూర్తి ఎస్‌పి సందేష్ తెలిపారు. ఆదివారం నగరంలోని న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో కొత్త చట్టాలపై న్యాయవాదులకు మార్గదర్శనం చేసి మాట్లాడారు. న్యాయవాదులు నిరంతర అధ్యయనం చేసుకోవాలని, అప్పుడే న్యాయవాద వృత్తిలో రాణించడానికి సాధ్యమవుతుందని తెలిపారు. కొత్త చట్టాలు, తీర్పులు వచ్చినప్పుడు వాటిని క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. న్యాయవాదుల పరిషత్ సభ్యుడు ఎస్ హరీష్ మాట్లాడుతూ... కోలారు న్యాయవాదుల సంఘం అత్యంత క్రియాశీలంగా ఉండి న్యాయవాదుల ఘనతను పెంచడానికి అవసరమైన కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. దీనిని న్యాయవాదులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సెషన్స్ న్యాయమూర్తి జిఎ మంజునాథ్, న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎం మునేగౌడ పాల్గొన్నారు.

రైతులు, మహిళల అభివృద్ధే లక్ష్యం


కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న దృశ్యం

కోలారు: రైతులు, మహిళల అభివృద్ధే తమ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కొత్తూరు మంజునాథ్ తెలిపారు. శనివారం తాలూకాలోని రివార్డు జలానయన పథకం కింద సుమారు రూ. 6.42 కోట్ల అభివృద్ధికార్యక్రమాలను ప్రారంభించి మాట్లాడారు. ప్రభుత్వం వివిధ పథకాలను ప్రజలకు అందిస్తోందన్నారు. గ్రామ పంచాయతీలలో అభివృద్ధి కార్యక్రమాలకు నిధుల కొరత లేదన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ అనిల్‌కుమార్, వ్యవసాయ శాఖ జాయింట్ డైరెక్టర్ సుమ తదితరులు పాల్గొన్నారు. ఇదే సమయంలో లబ్ధిదారులకు హక్కు పత్రాలు, వ్యవసాయ పనిముట్లను అందించారు.

19న నగరంలో రక్తదాన కేంద్రం ఏర్పాటు


మాట్లాడుతున్న జోషి

రాయచూరు రూరల్: నగరంలో రోటరీ కాటన్ ఉత్తర వలయం చారిట్రబుల్ ట్రస్ట్, జన సేవా ప్రతిష్టాన ఆధ్వర్యంలో ఈనెల 19న రక్తదాన కేంద్రం ఏర్పాటు చేయనున్నట్లు సేవా ప్రతిష్టాన అధ్యక్షుడు త్రివిక్రం జోషి పేర్కొన్నారు. ఆదివారం విలేకరుల సమావేశంలోమాట్లాడారు. రోటరీకాటన్ ఉత్తర వలయం అధ్యక్షుడు గుంటూరు డా.రవి వడ్లమని రక్తదాన కేంద్రాన్ని ప్రారంభిస్తారన్నారు. నగరంలో ఐఎంఏలో ఉందని, ప్రజలకు అత్యవరం సమయంలో రక్తదానం చేయడానికి జన సేవా ప్రతిష్టాన సిద్దంగా ఉంటుందన్నారు. రక్తం ప్రతి జీవికి అవసరమనే విషయాన్ని గమనించి రక్తదాన కేంద్రం ప్రారంభించనున్నామన్నారు. సమావేశంలో రంగలింగన గౌడ, శివ గిరిష్, రామ్‌రావ్ తదితరులు పాల్గొన్నారు.

యువ కవులకు మార్గదర్శి శరణయ్య స్వామి


పుస్తకాలను విడుదల చేస్తున్న హనుమాన్

రాయచూరు రూరల్: యువ కవులకు శరణయ్య స్వామి మార్గదర్శి అని సీనియర్ సాహితీవేత్త వీర హనుమాన్ అన్నారు. ఆదివారం కన్నడ భవనంలో జిల్లా, తాలుకా కన్నడ సాహిత్య పరిషత్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ విచారాలపై రాసిన పుస్తకాలను విడుదల చేసి మాట్లాడారు. కవితలు సమాజహితంతో ఉండాలన్నారు.

అకాడమీ, ప్రాధికార నియామకాల్లో అన్యాయం


మాట్లాడుతున్న మేటి

రాయచూరు రూరల్: ప్రాధికార, అకాడమి నియామకాల్లో కల్యాణ కర్ణాటక ప్రాంత ప్రజలకు తీవ్ర అన్యాయం జరిగిందని కళాకారులు అణ్ణప్ప మేటి, మారుతిలు ఆవేదన వ్యక్తం చేశారు. ఆదివారం విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. కల్యాణ కర్ణాటక ప్రాంతంలోని కళాకారులను గుర్తించకుండ ఇష్టం వచ్చిన వారికి పదవులు కేటాయించడాన్ని ఖండించారు. పేరుకు మాత్రమే కళ్యాణ కర్ణాటక ప్రాంతంలోని వారిని సభ్యులుగా చేశారని అధ్యక్ష పదవులను దక్షిణ ప్రాంతం వారికి ప్రాధాన్యత ఇవ్వడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు.

టెంపో - ద్విచక్ర వాహనం ఢీ

- ఇద్దరు యువకుల దుర్మరణం

కోలారు: ద్విచక్ర వాహనాన్ని టెంపో ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన ఆదివారం బంగారుపేట తాలూకా బెంగనూరు గ్రామం వద్ద చోటు చేసుకుంది. బంగారుపేట పట్టణం సిద్దార్థ నగర్‌కు చెందిన ముత్తు (26), మండ్య జిల్లాకు చెందిన రవి (30) మృతులు. వీరిద్దరు బంగారుపేట పట్టణంలోని బెంగనూరు గ్రామం వద్ద ఉన్న గార్మెంట్స్ ఫ్యాక్టరీలో పనిచేస్తున్నారు. పని ముగించుకుని బైక్‌పై తిరిగి వస్తున్న సమయంలో ప్రమాదం చోటు చేసుకుంది. బంగారుపేట పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

లోక్ అదాలత్‌లో 21,972 కేసుల పరిష్కారం


అర్జీలను పరిశీలిస్తున్న న్యాయమూర్తి

కోలారు: జిల్లా కోర్టులో నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో 21,973 కేసులు రాజీ చేసుకోవడం ద్వారా పరిష్కరించుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా సెషన్స్ న్యాయమూర్తి జిఎ మంజునాథ్ మాట్లాడుతూ... జాతీయ లోక్ అదాలత్ అత్యధిక కేసులను పరిష్కరించడం సంతోషంగా ఉందని, ఇందులో 79 క్రిమినల్ కేసులు, 301 చెక్ బౌన్స్ కేసులు, 16 కుటుంబ వ్యాజ్యాలు, ఇతర సివిల్ కేసులు 379 పరిష్కరించారు. లోక్ అదాలత్‌కు సహకారం అందించిన న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఎం మునేగౌడ, కార్యదర్శి భైరారెడ్డి, పదాధికారులకు జిల్లా న్యాయ సేవా ప్రాధికార సభ్యుడు సునీల్ ఎస్ మొసమని కృతజ్ఞతలు తెలిపారు.

ఆస్తి వివాదం, సోదరులపై దాడి

హుబ్లీ: ఆస్తి వివాదానికి సంబంధించి సోదరులపై దాడి చేసిన ఘటన స్థానిక ఏపీఎంసీ నవనగర్ పరిధిలో చోటుచేసుకుంది. గోకుల్ రోడ్డు కేహెచ్‌బీ కాలనీ మహమ్మద్ సిద్దికి, మహమ్మద్ అలీలపై వారి సొంత అన్న మైనుద్దీన్ దాడి చేశారు. ఏపీఎంసీ యార్డులోని అంగడిని కబ్జా చేసే ఉద్దేశంతో కావాలనే దాడి చేసినట్లు బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.